
బాలగోపాల్ మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటు

వీక్షణం


రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక : 11 హైదరాబాద్ 100 నవంబర్ 2009 పేజీలు : 68 రు. 10


- ☆ ఫోకస్ : ప్రజా జీవన స్థితిగతులు - రావలసిన మార్పులు
- ☆ రాష్ట్రంలో వరదలు - పాలనా వైఫల్యం
- ☆ మాణిక్యాపురం కరవు వ్యథ
- ☆ ఆపరేషన్ గ్రీన్‌హంట్ అసలు కారణం
- ☆ ముంచుకొస్తున్న మహామాంద్యం
- ☆ కె. బాలగోపాల్ 1987 వ్యాసం



మీరు - నేను
ఆర్థికం
వి. హనుమంతరావు



స్టీఫెన్ కింజర్
ఓవర్‌త్రో
కుట్రాజకీయం
అమెరికా దుర్మార్గాల శతాబ్ది
తెలుగు : కొణతం దిలీప్



FIFTY YEARS
OF
ANDHRA PRADESH
1956-2006
Editors
R.S. Rao
V. Hanumantha Rao
N. Venugopal
Centre for Documentation, Research and Communication

వీక్షణం 100

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

నవంబర్ 2009
సంపుటి : 7
సంచిక : 11

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

పాలకుల రంగు బయటపెడుతున్న వరద

సెప్టెంబర్ చివరలో ఎగువరాష్ట్రాలలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ కురిసిన భారీ వర్షాలు కృష్ణ, తుంగభద్ర నదులలో గత వంద సంవత్సరాలలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున వరదకు దారితీశాయి. అలాంటి అసాధారణమైన వరద వస్తుందని ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం అలసత్వం వల్ల, నిర్లక్ష్యం వల్ల ఆ వరద బీభత్సం ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేసింది. తుంగభద్ర మీద సుంకేశుల ఆనకట్ట తెగిపోయింది. కృష్ణ మీద శ్రీశైలం ఆనకట్ట మీదినుంచి వరద ప్రవహించి, ఆనకట్ట తెగిపోతుందా అన్న అనుమానం రెండురోజులు సాగింది. మహబూబ్‌నగర్, కర్నూలు, నల్లగొండ, గుంటూరు, కృష్ణా జిల్లాలలో వరద విలయతాండవం చేసింది. అనేక చోట్ల కరకట్టలు తెగిపోయాయి. కాలువలు, చెరువులు గండ్లు పడ్డాయి. గ్రామాలు, పట్టణాలు రోజుల తరబడి నిలువెత్తు నీటిలో మునిగిపోయాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ఐదు వందల గ్రామాలు, పట్టణాలు వరద తాకిడికి గురికాగా పదిహేను లక్షల మంది ప్రజల జీవనం అతలాకుతలమయింది. ఎంత మంది ప్రజలు చనిపోయారో, ఎన్ని పశువులు గల్లంతయ్యాయో ప్రభుత్వం చెపుతున్న లెక్కలను రెట్టింపుగానో, మూడు రెట్లుగానో చదువుకోవలసి ఉంటుంది. మొత్తం మీద వరదలవల్ల ఇరవైవేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లిందనీ, నాలుగువేల కోట్లరూపాయల పంటలు మునిగిపోయాయనీ ప్రభుత్వం ప్రకటించింది. ఒకవైపు కేంద్రాన్ని అడిగేటప్పుడు ఇంతింత పెద్ద అంకెలు చెపుతూనే, బాధితుల దగ్గరికి వచ్చేసరికి మాత్రం సహాయ పునరావాస చర్యలలో చేయవలసినదానిలో పదోవంతు కూడ చేయడం లేదు. ఈ ఆధునిక యుగంలో, ప్రతి విషయం గురించి అత్యంత సూక్ష్మమైన వివరాలతో సహా సమాచారం కుప్పలు తెప్పలుగా దొరుకుతున్నప్పుడు వాతావరణ మార్పులు, భారీ వర్షాలు, వరద ముంపు వంటి సాధారణ అంశాలను పట్టించుకోకపోవడం, బాధిత ప్రజానీకానికి సహాయ చర్యలు అందించడంలో, సమయానికి పునరావాసం కల్పించడంలో అలక్ష్యం పాటించడం, వరద తీసిన మూడు వారాలకు కూడ కనీసం పారిశుధ్యపనులయినా సక్రమంగా జరపకపోవడం, కొంపాగోడూ కోల్పోయి అన్నార్తులుగా మారిన లక్షలాది ప్రజానీకానికి అవసరమయిన వసతులు కల్పించకపోవడం వంటి పరిణామాలు పాలకులు ప్రజల కష్టాలపట్ల కనీస సానుభూతి చూపలేని నిర్దాక్షిణ్య దశకు చేరుకున్నారని చూపుతున్నాయి. నిజానికి వరదలలో ప్రకృతి కారణాలుగా కనబడుతున్నవి కూడ పాలకుల రాజకీయార్థిక విధానాల ఫలితమే. లాటిన్ అమెరికాలో అతివిలువైన అటవీ సంపదను కొల్లగొట్టుకుపోయిన బహుళజాతి సంస్థలవల్ల వర్షాకాలం సమయానికి రాకపోవడం, ఒక్కసారిగా అనూహ్యంగా వరదలు రావడం అనే పరిణామాలు తలెత్తాయని ఇదివరకే అధ్యయనాలున్నాయి. భారతదేశంలో కూడ పర్యావరణ మార్పులవల్ల, తప్పుడు పర్యావరణ, రాజకీయార్థిక విధానాల వల్ల రుతుపవనాల క్రమబద్ధత మారిపోయింది. వందల ఏళ్లుగా కచ్చితంగా సాగుతున్న రుతుపవనాల రాకపోకలు మారిపోయాయి. నైరుతి రుతుపవనాలు ఈ సారి నెలన్నర ఆలస్యమయ్యాయి. తిరోగమన దిశలో రావలసిన ఈశాన్య రుతుపవనాలు రెండువారాలు ముందే తమ ప్రభావం చూపాయి. అందువల్ల వర్షాకాలం మొదలయిన తర్వాత ఐదువారాలు దుర్భిక్షం ఏర్పడి, హఠాత్తుగా వరదలు ముంచెత్తాయి. వాతావరణంలో ఇటువంటి అనూహ్య మార్పులు వస్తున్నాయని ముందే తెలిసినా, ఇతర దేశాల అనుభవాలు ఉన్నా, ఆ ఉత్పాతాన్ని ఆపడానికి పాలకుల దగ్గర కనీస ఆలోచనలు, పథకాలు లేవు. సరిగ్గా ఉత్పాతం జరిగిన తర్వాత బాధితులను ఆదుకోవడానికి విస్తృతమైన సాధన సంపత్తి ఉన్న పాలకులకు, రాజ్యాంగ బద్ధమైన పాలనా బాధ్యతలు కాకపోయినా, కనీసం మానవ సహజమైన సానుభూతి, సహాయ దృష్టి కూడ కరవయ్యాయి. వీక్షణం సంపాదక బృందం రెండువారాల తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా రాజోళి, అలంపురంలకు వెళ్ళి చూస్తే, సహాయం, పునరావాసం, అన్నీ కోల్పోయినవారికి అన్నవస్త్రాలు అందించడం, తాత్కాలిక ఆశ్రయాలయినా కల్పించడం, ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించడం లాంటి పెద్దపనులు అలా ఉంచి రెండడుగుల పైన మేట వేసిన దుర్గంధపూరితమైన బురద కడిగే కనీసమైన పని అయినా చేయని దుస్థితి ఉంది. అసలు ప్రజల కన్నీళ్ల పట్ల కనీస మానవస్పందన ఉన్న పాలకులు, అధికారవర్గం ఉన్నారా అని అనుమానం కలిగే పరిస్థితి ఉంది. సహాయం అందినచోట్ల కూడ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, దైన్యంలో ముంచే విధంగా అందింది. ఇవాళ్టి పాలకుల ఎజండాలో ప్రజలు లేరని, ప్రజాసమస్యలను దీర్ఘకాలికంగా గాని, తాత్కాలికంగా గాని పరిష్కరించాలనే కనీస ఆలోచనలు కూడ పాలకుల దృష్టిలో లేవని వరదలు మరొకసారి తెలియజెపుతున్నాయి. వీ

ఆదివాసుల మీద పాలకుల ప్రత్యక్ష యుద్ధం

దేశం మధ్యభాగంలోని దండకారణ్యం నుంచీ, తూర్పు ప్రాంతంలోని అడవుల నుంచీ మావోయిస్టులను నిర్మూలించడానికనే పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా ప్రాంతాలలో వేలాది మంది సైనిక, అర్ధసైనిక బలగాలను దించుతున్నాయి. భారత వాయుసేన సహాయం కూడ తీసుకుంటామని ప్రకటిస్తున్నాయి. నవంబర్‌లో ప్రారంభించి దేశవ్యాప్తంగా మావోయిస్టులను అణచివేసే బృహత్తర కార్యక్రమం చేపట్టబోతున్నారని వార్తలు వస్తున్నాయి. ప్రజాప్రత్యామ్నాయంగా నాలుగు దశాబ్దాల కింద నక్సల్బరీ లో ప్రారంభమై ఇవాళ దేశవ్యాప్తంగా విస్తరించిన విప్లవోద్యమం గురించి 'దేశం ఎదుర్కొంటున్న ప్రధాన ఆంతరంగిక సమస్య' అని ప్రధాని మన్మోహన్ సింగ్ మూడు సంవత్సరాల కింద అన్నప్పటి నుంచీ ఆ ఉద్యమం మీద కేంద్రబలగాల దాడి ఎక్కువయింది. లాల్‌గఢ్ ఉద్యమ వార్తల తర్వాత అది మరింత పెద్ద ఎత్తున సాగుతోంది. రెండు నెలలుగా మన్మోహన్ సింగ్, కేంద్ర హోంమంత్రి చిదంబరం యుద్ధ పరిభాష మాట్లాడుతున్నారు. మేధావి వర్గం నుంచీ, ప్రజాస్వామిక వాదుల నుంచీ విమర్శలు వచ్చిన తర్వాత యుద్ధ పరిభాష మార్చారు గాని యుద్ధ కార్యక్రమాలే కొనసాగిస్తున్నారు. ఇది అంతర్యుద్ధం తీవ్రతరమవుతున్న సూచన. ఈ అంతర్యుద్ధానికి ప్రభుత్వాలు ఏయే ఏర్పాట్లు చేసుకుంటున్నాయో ప్రచార సాధనాలలో బహిరంగంగానే వస్తోంది. దేశంలో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలుగా గుర్తించిన భూభాగాలను ఏడు చర్యా క్షేత్రాలుగా గుర్తించి రెండు సంవత్సరాలలో ఈ ఏడు ప్రాంతాలపైన ఎటువంటి దాడులు చేయాలో, కొత్త సైనిక, అర్ధ సైనిక బలగాలను ఎలా నియామకాలు జరిపి ఎలా శిక్షణ ఇవ్వాలో, అందుకు ఎన్ని నిధులు కేటాయించాలో ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికల గురించి పత్రికలు రాస్తున్నాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని యు పి ఎ ఈ పథకాన్ని రచించగా, ఈ ప్రాంతాలలోని రాష్ట్రాలను పాలిస్తున్న భారతీయ జనతాపార్టీ, బిజూ జనతాదళ్, లెఫ్ట్ ఫ్రంట్ వంటి పార్లమెంటరీ ప్రతిపక్షాలు కూడ దానికి మద్దతు ఇస్తున్నాయి. ఈ ప్రయత్నమంతా అంతిమంగా అపారమైన ఖనిజవనరులున్న దండకారణ్య, తూర్పు అరణ్య ప్రాంతాలను బహుళజాతి సంస్థలకు, ప్రపంచీకరణ శక్తులకు అప్పగించే ప్రయత్నం. ఆ అర్థంలో ఇది బహుళజాతి సంస్థలకూ ప్రజలకూ మధ్య యుద్ధం. భారతప్రజానీకపు వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెట్టడం కోసం అటువైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగుతున్నాయి. ఇటు ప్రజలు, వారి తరఫున విప్లవోద్యమం ఉన్నాయి. విప్లవోద్యమాన్ని నిర్మూలించి, ప్రజలను భయోత్పాతంలో ముంచి బహుళజాతి సంస్థల దోపిడీకి మార్గం సుగమం చేయడానికే ఈ యుద్ధం జరుగుతోంది. అటో ఇటో పాల్గొనకపోయినా, కనీసం ఈ యుద్ధాన్ని నివారించాలని, ప్రజలను బలిచేయగూడదని, దేశ సంపదలు దేశంలోని శ్రమజీవులకే చెందాలని, భారత సార్వభౌమత్వాన్ని కాపాడాలని అయినా ఎలుగెత్తడం మధ్యతరగతి బుద్ధిజీవుల బాధ్యత.

అమెరికా అధ్యక్షుడికి నోబెల్ శాంతి బహుమానం

అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామాకు ఈ సంవత్సరపు శాంతి బహుమానం ఇవ్వాలని నోబెల్ బహుమతుల కమిటీ నిర్ణయించడం వివాదాస్పదమవుతోంది. అంతర్జాతీయ దౌత్యసంబంధాలకూ ప్రజల మధ్య సహకారానికీ ఆయన చేసిన దోహదానికి ఈ బహుమానం ఇస్తున్నామని నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటించింది. అతి క్లిష్టమైన అంతర్జాతీయ సమస్యలను కూడ చర్చల ద్వారా, సంప్రదింపులద్వారా పరిష్కరించాలని ఒబామా అన్నారని, అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి ప్రయత్నిస్తున్నారని ఈ కమిటీ ప్రకటించింది. ఒబామా అధ్యక్ష పదవిలోకి వచ్చి ఇప్పటికి ఇంకా తొమ్మిది నెలలు నిండలేదు. ఈ బహుమతి ప్రతిపాదన కమిటీ తన తుది నిర్ణయం చేసేటప్పటికి ఆయన పాలన మొదలయి పన్నెండురోజులు మాత్రమే అయిందని సమాచారం. ఇప్పటికే అనుకూలంగానూ ప్రతికూలంగానూ చర్చ జరుగుతోంది. నోబెల్ బహుమానాల పట్ల గౌరవం ఉన్నా లేకపోయినా అది ఒక ముఖ్యమైన అంతర్జాతీయ సూచికగా భావిస్తూ ఈ చర్చ జరుగుతోంది. ఒబామాను వ్యక్తిగా, నల్లజాతి ప్రతినిధిగా చూసేవారు ఈ బహుమానాన్ని ఒకరకంగా చూస్తున్నారు. నోబెల్ బహుమానాల చరిత్రలో నల్లజాతివారికి, ఆఫ్రో అమెరికన్లకు వచ్చిన బహుమానాలు చాల తక్కువ. గత నూటపది సంవత్సరాలలో ఎనిమిది వందల మందికి బహుమానాలు అందితే, నల్లవారికి అందినవి పన్నెండు మాత్రమే. నల్లజాతివారు ప్రతిభావంతులు కారనే దురభిప్రాయానికి ఇది సూచన. అందువల్ల ఈ ప్రతిష్టాత్మకమైన బహుమతి ఒబామాకు దక్కడం సరయినదేనని అనుకునే వారు ఉన్నారు. కాని ఒబామా ఇవాళ కేవలం నల్లజాతి వ్యక్తి మాత్రమే కాదు. చరిత్రలోకెల్లా అత్యంత దుర్మార్గమైన అమెరికన్ సామ్రాజ్యవాద విధానాల నిర్వాహకుడు. ప్రపంచవనరులన్నీ తనకే దక్కాలని, ప్రపంచమార్కెట్లన్నీ తన గుప్పెట్లోనే ఉండాలని అనుకునే అమెరికన్ పాలకవర్గాల కోరికలను తీర్చే ప్రభుత్వాధినేత. దేశాల మధ్య చిచ్చుపెట్టి ఆయుధాలు అమ్ముకుంటూ, ఆయుధాల అమ్మకం మీద ఆధారపడుతూ, ప్రపంచాన్ని బెదిరించడానికి తానే స్వయంగా యుద్ధాలకు దిగుతున్న యుద్ధోన్మాద రాజకీయాల నిర్వాహకుడు. తాను అధికారంలోకి వచ్చేనాటికి కొనసాగుతున్న అఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధాలను రెంటినీ ఆపివేయకపోవడం మాత్రమే కాదు, అఫ్ఘనిస్తాన్‌కు అదనపు బలగాలను పంపుతున్న ఒబామాను శాంతి చిహ్నంగా చూడడం ప్రపంచ శాంతి అనేమాటకే అవమానం. ఇంతకాలంగా యుద్ధాన్ని మాటల్లో వ్యతిరేకిస్తూ వచ్చిన డెమొక్రటిక్ పార్టీ నాయకుడిగా ఒబామా ఆ మాటలకు కూడ కట్టుబడడం లేదు. కొన్ని డజన్ల దేశాలలో ఇప్పటికీ అమెరికన్ సైనిక బలగాలు తిష్టవేసి ఉన్నాయి. అనేక దేశాల సైనిక బలగాలకు శిక్షణ ఇవ్వడం, సంయుక్త విన్యాసాలు జరపడం చేస్తున్నాయి. ఇతరదేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నాయి. ఆయా దేశాలలో ప్రజా ఉద్యమాలను అణచడానికి సహాయం చేస్తున్నాయి. లాటిన్ అమెరికా, పశ్చిమాసియా దేశాలలో స్థానిక ప్రజా ఆకాంక్షలను భగ్నం చేయడానికి అన్ని కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికన్ పాలకవర్గాలు ప్రపంచప్రజల ప్రధాన శత్రువు స్థానంలో గత రిపబ్లికన్ పాలన సమయంలో, బుష్ పాలనా కాలంలో ఎలా ఉన్నాయో అలానే ఉన్నాయి. ఆ విధానాలను వ్యతిరేకిస్తూ అధికారంలోకి వచ్చిన ఒబామా ఆ విధానాలలో ఏ ఒక్కదానినీ మార్చలేదు సరిగదా, కనీసం మారుస్తాననే దిశగా ప్రయత్నాలు కూడ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చూస్తే ఈ శాంతి బహుమానం అమెరికా అధ్యక్షుడికి అందడం అనుచితం. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : ప్రజా జీవన స్థితిగతులు - రావలసిన మార్పులు 10

కూడు, గూడు, గుడ్డ, ఆదరణ కరువైన, తగినంతగా లేని ఈ మనుషులు ఎలా జీవిస్తున్నారు? ఈ స్థితిలో జీవితంతో పెనుగులాడుతున్న మనుషులు తమ బతుకు గురించి ఏం ఆలోచిస్తున్నారు? ఆ జీవితం మారాలనే కోరిక, మారుతుందనే ఆశ వారిలో ఉన్నాయా లేవా? ఆ బతుకు ఎలా మారాలనుకుంటున్నారు? ఆ మార్పు ఎలా వస్తుందనుకుంటున్నారు? ఆ మార్పు కోసం తాము ఏమి చేయాలనుకుంటున్నారు? ఇతరులు ఏమి చేయాలనుకుంటున్నారు? వారి నిరాశా నిస్పృహలకు మూలాలేమిటి? ఆ నిరాశను పోగొట్టి వారిని క్రియాశీలంగా తమ బతుకు మార్చుకునే దారిలో నడపడం సాధ్యం కాదా? లాంటి అనేక ప్రశ్నలకు జవాబులు కనిపెట్టడం మీదనే మన సమాజ పురోగతి ఆధారపడి ఉన్నది. సమాజం తనలో తాను జరుపుకోవలసిన ఈ అంతస్సంభాషణను వీక్షణం ఒక వాహికగా కొనసాగించదలచింది.

❖ కొత్త పుస్తకాలు / సి.డి.లు			6
❖ పాఠకుల వీక్షణం			7
❖ ప్రాంతీయం			8
❖ సంస్మరణ	బాలగోపాల్ కు జోహార్లు!!		9
❖ వర్తమానం	వరదలు - పాలకుల వైఫల్యం	- పులుగుజ్జు సురేష్	19
❖ వర్తమానం	మాణిక్యాపురం మట్టి మనుషుల వ్యథ	- ఎం. కోదండరాం, పిట్టల రవీందర్	21
❖ వర్తమానం	ప్రాజెక్టులు - రాజకీయ ప్రయోజనాలు	- నాగోబా	23
❖ విధానవిమర్శ	చీకటి నుంచి మరింత చీకట్లోకి	- వి. హనుమంతరావు	25
❖ సంస్మరణ	జోగారావు		27
❖ వర్తమానం	ఎవరి ప్రయోజనాలకీ గ్రీన్‌హంట్ ?	- ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు	28
❖ ఆర్థిక సంక్షోభం	ముంచుకొస్తున్న మహామాంద్యం	- అరవింద్	30
❖ పర్యావరణం	వాతావరణం - క్యోటో ఒప్పంద రాజకీయాలు	- కె. నరేంద్రమోహన్	35
❖ తెలంగాణ - ఆకాంక్ష	'జన తెలంగాణ' రాష్ట్రం ఏర్పాటు	- టి. శ్రీరామమూర్తి	38
❖ ఆర్థికరంగం	నయా ఉదారవాదం - సంక్షోభంలో ఆర్థికరంగం	- ఆర్.వి. రమణమూర్తి	39
❖ ఆర్థిక రంగం	మాంద్యం నుంచి తేరుకోవడం నిజమేనా?	- ఇ.ఎస్. బ్రహ్మచారి	42
❖ విధానవిమర్శ	భారతదేశంలో సహకార సేద్య విధానం	- వి. చలపతిరావు	46
❖ విధానవిమర్శ	దళితులను దగా చేస్తున్న కాకినాడ సెజ్	- నక్కా హేమా వెంకట్రావ్	47
❖ సామాజికాంశం	నేటి సమాజంలో యువతీ, యువకులు	- కడియాల సుబ్బనాచారి	51
❖ పరిశీలన	ఆంధ్రప్రదేశ్‌లో మానవాభివృద్ధి	- గుండేటి రమేశ్	52
❖ సినిమా - సాహిత్యం	రెండు సినిమాలు - ఒక నవల	- పి.వి. రమణ	55
❖ శాస్త్రవిజ్ఞానం	ఆలోచనలు, అవగాహన	- డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్	58
❖ నేర్చుకుందాం	చారిత్రక దృక్పథం	- కె. బాలగోపాల్	60
❖ దేశీయం			64
❖ అంతర్దేశీయం			65
❖ అసహజ మరణాల సూచి		- రాంకి, వై. రామచంద్రం	66

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.


– సర్క్యులేషన్ మేనేజర్
9949391028















- **ప్రజాహిత డిక్షనరీ - తెలుగు-సంస్కృతం-ఇంగ్లీష్ -** వాసిరెడ్డి భాస్కరరావు - ప్రజాహిత ప్రచురణలు - 222 పేజీలు, 1/8 డెమీ, రు. 110, ప్రతులకు : విశాలాంధ్ర పుస్తక కేంద్రం, ప్రజాశక్తి పుస్తక కేంద్రం, బుక్‌బర్డ్, హనుకొండ
- **పక్షులు** (పద్యకావ్యం), **సముద్రం నా పేరు** (వచన కవితా సంకలనం), **ఈ నగరం జాబిల్లి** (గజల్ లక్ష్య లక్షణాలను చెప్పే గీతికావ్యం) శేషేంద్ర - గుంటూరు శేషేంద్ర శర్మ మెమోరియల్ ట్రస్ట్ - 155 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; నవోదయ బుక్‌హౌస్; నవయుగ బుక్ హౌస్
- **ఈద్ ముబారక్ - ప్రగతిశీల ముస్లిం కవిత్వం** - షేక్ కరీముల్లా - ముస్లిం రచయితల సంఘం - 100 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : షేక్ కరీముల్లా, 21-36, పెద్ద మసీదు బజారు, వినుకొండ - 522647, గుంటూరు జిల్లా; ఫోన్ : 08646-275084, సెల్ : 9441502990; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **అందని చందమామ** - డా. కాసుల లింగారెడ్డి - శైలి పబ్లికేషన్స్ - 63 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: డా. కాసుల లింగారెడ్డి, ప్లాట్ నెం. 63, సరస్వతి నగర్, చింతలకుంట, ఎల్.బి.నగర్, హైదరాబాద్ - 500 74; ఫోన్ : 040 - 24112211, సెల్ : 9703432211
- **నాయకుడంటే కాన్షీరామ్ (జీవితం-ఉద్యమం)** - బహుజన కెరటాలు ప్రచురణలు - 82 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : కడియం నాగమణి, ప్రచురణకర్త, బహుజన కెరటాలు, C/o.ఎస్.ఆర్. పల్నాటి, రాజగృహ, 4/15, ఆర్.టి.సి. స్టాఫ్ కాలనీ, సత్యన్నారాయణ పురం, ఒంగోలు - 2, ప్రకాశం జిల్లా; సెల్ : 9849944170
- **అడవితల్లి ఒడి నుంచి అసెంబ్లీకి - లాంగ్‌మార్చ్** - కోలపూడి ప్రసాద్ - కళింగ బుక్‌ట్రస్ట్ ప్రచురణ - 44 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : కళింగ బుక్‌ట్రస్ట్, 4-60-9/2, లాసన్స్ బే కాలని, నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, పెదవాల్తేర్, విశాఖ - 17; నవోదయ బుక్‌హౌస్; దిశ పుస్తక కేంద్రం; నవయుగ బుక్‌హౌస్; ప్రజాశక్తి బుక్‌హౌస్; విశాలాంధ్ర బుక్‌హౌస్; తెలుగు బుక్‌హౌస్
- **అసలు విషయం - వ్యవస్థను మార్చడం** - కవితా సంపుటి - తక్కోలు మాచిరెడ్డి - కడప జిల్లా అభ్యుదయ రచయితల సంఘం - 74 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు: డా. తక్కోలు మాచిరెడ్డి, 5/39-2, ముత్తరాసు పల్లి, కడప - 516 002; విశాలాంధ్ర బుక్‌హౌస్; ప్రజాశక్తి బుక్ హౌస్
- **వాలెంటైన్** - నడమల గంగాధర రెడ్డి - 196 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు : నడమల గంగాధర రెడ్డి, 2/855-19, వై.ఎస్.ఆర్. నగర్, ప్రొద్దుటూరు - 516 360, కడప; సెల్ : 9347535916; నవరత్న బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవోదయ, నవయుగ, ఠాగూర్ పుస్తక కేంద్రాలు
- **గాయపడ్డ అక్షరం** - కవిత్వం - కుంచే నాగ సత్యనారాయణ - 68 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : కె. నాగ సత్యనారాయణ, గవర్నమెంట్ హై స్కూల్, కపిలేశ్వరపురం, తూర్పు గోదావరి జిల్లా
- **దీప ఖడ్గం** - కవిత్వం - పెన్నా శివరామకృష్ణ - పాలపిట్ట బుక్స్ - 99 పేజీలు, 1/8 డెమీ, రు.30, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయశ్రీ రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ - 500 036



వీక్షణానికి చేయూత...

పత్రిక నాలుగు కాలాలు నడవాలనే లక్ష్యంతో వీక్షణం ప్రకటనకు స్పందించి మాకు వెయ్యి రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించిన మిత్రులు **వి. మధుసూదన్‌రెడ్డి** (హైదరాబాద్) గారికి కృతజ్ఞతలు. – సం.

వీక్షణం అక్టోబర్ 2009 సంచికలో 8వ పేజీ 'ప్రాంతీయం' అనే శీర్షికలో 'ప్రమాదంలో ముఖ్యమంత్రి మృతి' అంశంలో పొరపాటు దొర్లింది. అందులో 'మళ్లీ 2009 ఎన్నికలలో కాంగ్రెస్ విజయానికి (వై.ఎస్.ఆర్.) కీలకపాత్ర వహించి మే 20న రెండవసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఆగస్ట్ 2న (సెప్టెంబర్ 2 బదులు) ఆయన అకాల మరణంతో ఆర్థిక శాఖ మంత్రి కె. రోశయ్య రాష్ట్ర 15వ ముఖ్యమంత్రిగా ఆగస్ట్ 3న (సెప్టెంబర్ 3 బదులు) పదవీ బాధ్యతలు చేపట్టారు అని వచ్చింది'. దీనిని గమనించగలరు.

– వెంగల వీరస్వామి
హుజూరాబాద్

వీక్షణం సకాలంలో రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతూ, జాతీయ, అంతర్జాతీయ వర్తమాన అంశాలతో ఆకట్టుకుంటోంది. ఏమాత్రం వీలైనా జి.కె., క్విజ్ గాని, వైజ్ఞానిక పజిల్స్ వంటి శీర్షికలు ప్రారంభిస్తే బావుంటుందని మా భావన.

– నేమాన సుభాష్ చంద్రబోస్
శ్రీకాకుళం

మీరు నా కాపీతోపాటు గురుదక్షిణ ఫౌండేషన్‌కు కాంప్లిమెంటరీ కాపీ పంపుతున్నారు. మొదటిసారి పొరపాటున రెండుసార్లు పోస్టింగ్ జరిగిందేమో ననుకున్నాను. ఆ భావం సరికాదనిపిస్తుంది. ప్రతిసారి రెండు కాపీలొస్తున్నవి. బహుశా గురువులపై అభిమానంతో గురుదక్షిణ పేరున గూడ ఒక పత్రిక పంపుతున్నారేమో అని అనిపిస్తుంది. నేను స్వయంగా తెప్పిస్తున్న పత్రిక చాలు. మా వాళ్లకు ఇలాంటి పత్రికలు చదివే అలవాటు గాని, ఆ భావజాల సారూప్యతలు గాని తక్కువ. ఆ కాపీ కూడ నా వద్దే ఉండిపోవలసి వస్తోంది. చదివే వారు ఉంటే నా కాపీ చదువుతారు. పత్రికా నిర్వహణలో ఉన్న (ముఖ్యంగా వీక్షణంలాంటివి) (నాకు) అనునిత్య ఇబ్బందులు అనుభవైక సత్యాలు. ఒక కాపీకెంత ఖర్చు, శ్రమ మాట వదలండి. కనక మీరు నా పేరనున్న కాపీ పంపుతే చాలు. ఈ ఉచిత కాపీ మరొక సమరశీల, ప్రగతిశీల ఉద్యమకారునికెవరికైనా పంపితే మన రచనలకు సార్థకత కొంతవరకైనా సిద్ధిస్తుంది. అన్యదా తలచకండి. ఒక కాపీ చాలు. 'వీక్షణం' తీక్షణంగా వెలుగొందాలని ఆశిస్తూ.

– సూర్యదేవర వేంకటనారాయణ
ఖమ్మం

అక్టోబర్ సంచికలో చైనా పరిణామక్రమాలపై శల్య పరీక్ష చేసే రీతిన ప్రచురించిన వ్యాసాలు విశ్లేషణాత్మకంగా ఉన్నాయి. సందర్భోచిత 'ఫోకస్' ఎంపికలో 'వీక్షణం' మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

– కె.బి.
హైదరాబాద్

వరవరరావు గారు మాక్స్‌వెల్ ప్రచురించిన 'ఇండియన్ చైనా వార్' అనే పుస్తకాన్ని మన ప్రభుత్వం నిషేధించిందని రాశారు. 20 జూన్ 2008 ఫ్రంట్‌లైన్‌లో ఎ.జి. నూరాని రాసిన '1962 అన్‌టోల్డ్ స్టోరీ' వ్యాసంలో ఈ పుస్తక ప్రస్తావన వచ్చింది. నిషేధ విషయం అందులో లేదు. నెవిల్ మాక్స్‌వెల్ 'టైమ్స్' విలేకరిగా 1959 ఆగస్టులో ఇండియా వచ్చారు. 1967 మధ్యలో లండన్ వెళ్లిపోయారు. ఇండియా చైనా యుద్ధానికి సంబంధించిన పలు విషయాలను భారత ప్రభుత్వ పౌర, సైనిక అధికారుల సహకారంతో అధికారిక పత్రాల నుండి సేకరించాడు. ఇండియా, చైనా సరిహద్దు గురించిన అనేక చారిత్రక గ్రంథాలను, వ్యాసాలను ఆయన అధ్యయనం చేశాడు. రెండు సంవత్సరాలు శ్రమించి 1970లో ఆ పుస్తకాన్ని ప్రచురించాడు. ఇది మన దేశంలో లండన్‌లోని జోనాథన్ కేఫ్ లిమిటెడ్ వారి ఏర్పాటుతో ప్రచురించబడింది. జెయికో పబ్లిషింగ్ హౌస్, బాంబేవారు దీనిని 1970 సెప్టెంబర్‌లో మొదటి ముద్రణగాను, నవంబర్‌లో రెండవ ముద్రణగాను, 1971 జనవరిలో మూడవ ముద్రణగాను ప్రచురించారు.

సరిహద్దు తగాదా ఏనాడో సులభంగా పరిష్కారమై ఉండేది. నెహ్రూ గర్వాతిశయం ఇందుకు అవరోధమయింది. రాజకీయ తప్పటడుగు, కొందరు సైనికాధికారుల ఆలోచనాలేమి, రెచ్చగొట్టబడిన జాతీయ దురభిమానం – యుద్ధానికి దారితీసాయి. వేలాది సైనికులు ఒట్టి పుణ్యానికి బలయ్యారు. ప్రజాధనం బూడిద పాలయింది. అంతర్జాతీయ సమాజంలో దేశ ప్రతిష్ఠ అడుగంటింది. ఈ యుద్ధం నెహ్రూ నడ్డి విరిచింది. ఆయన మానసికంగా కుంగిపోయాడు. ఆరోగ్యం క్షీణించి 1964 మే లో చనిపోయాడు. నలభై ఏళ్లు గడిచినా ఈ పుస్తకం ఆసక్తిగా చదివిస్తుంది. దీన్ని సంక్షిప్తంగానైనా తెలుగులోకి తెస్తే చాలామందికి ఉపయోగకరంగా ఉంటుంది. నేడు ఈ పుస్తకం అవసరం ఎంతైనా ఉంది. యాభై ఏళ్ల సుదీర్ఘ కాలం గడిచినా సరిహద్దు సమస్య తెమలలేదు. అరవై ఏళ్లుగా కాశ్మీరు రగులుతూనే ఉంది. ఈశాన్య రాష్ట్రాలలోనూ అదే పరిస్థితి. ఈ వ్యవస్థ ఇలాగే కొనసాగితే ఇంకో వందేళ్లు గడిచినా అవి అలా మండుతూనే ఉంటాయి. పార్టీలు భిన్నమైనా పాలకుల విధానంలో తేడా ఉండదు. యుద్ధం, ఆయుధాలు ఓ పెద్ద వ్యాపారం.

చాలా ఏళ్లు కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఒకే పార్టీ (కాంగ్రెస్) అధికారంలో ఉండినా అంతర్రాష్ట్ర జలవివాదాలు అలానే ఉండిపోయాయి. తమ దేశంలోని రాష్ట్రాల మధ్య వివాదాలు పరిష్కరించని పాలకవర్గాలు ఇతర దేశాల తోటి తగాదాలను పరిష్కరించుకుంటాయనుకోవడం అమాయకమవుతుంది.

– వి. వెంకటరెడ్డి
ఇంటేపల్లె, కడప

తెలుగు కవిత్వం అనేక ప్రాపంచిక పరిణామాలకు స్పందిస్తూనే ఉంది. అందులో గత ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా తెలుగు వచన కవితా రంగంలో విశిష్ట స్థానాన్ని పొంది, నిరంతర సాహిత్య పాఠశాలగా వెలుగొందుతూ రజతోత్సవాల్ని పూర్తిచేసుకున్న 'ఎక్స్‌రే' జాతీయ స్థాయి అవార్డుకు కవితలను ఆహ్వానిస్తోంది. ప్రధాన అవార్డుకు ఎంపికైన కవితకు ఐదు వేల రూపాయల నగదుతో పాటు జ్ఞాపిక, సత్కారం ఇవ్వబడతాయి. మరో పది కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు ఇవ్వబడతాయి. చారిత్రక వికాసాన్ని క్రమ పద్ధతిలో పదిలపరిచే ఈ ప్రయత్నంలో కవులు పాల్గొని సహకరించగలరు. కవితా వస్తువు, పరిధి విషయాల్లో కవికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. సుదీర్ఘ కవితలు పరిశీలించబడవు. డిసెంబర్ 25న విజయవాడలో జరిగే సభలో ఈ అవార్డులు బహుకరించబడతాయి. కవితలు పంపేవారు కచ్చితంగా ఎక్స్‌రే చందాదారులై ఉండాలి. సంవత్సర చందా రు. 75. చందా ఎక్స్‌రే పేర మనీ ఆర్డర్ చెయ్యాలి. పేరు, చిరునామా కవితపై కాకుండా హామీపత్రంపై మాత్రమే రాయాలి. కవితలు నవంబర్ 30 తేదీలోగా ఎక్స్‌రే ఆఫీసుకు పంపాలి.

– కొల్లూరి, ఎక్స్‌రే అధ్యక్షులు

చందాలు, కవితలు పంపాల్సిన చిరునామా : ఎక్స్‌రే, పి.బి. నెం. 340, డోర్ నెం. 28-15-2, కొల్లూరి టవర్స్, దాసు వారి వీధి, అరండల్‌పేట, విజయవాడ -2 .

వీక్షణంకు చందాలు, వీక్షణం పబ్లికేషన్ పుస్తకాల కోసం మీరు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు కట్టడానికి వీలుగా
వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101002175,** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

మానవ హక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 2, 3 తేదీల్లో గొర్రెపాటి నరేంద్రనాథ్ ప్రాంగణం, అనంతపురంలో జరిగాయి. మొత్తం ఇరవై జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మతోన్మాదం వల్ల దేశంలో ఎన్నో అనర్థాలు చోటు చేసుకున్నాయని సభల్లో పలువురు వక్తలు తమ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను గాలికొదిలిన పాలకులు విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. సెజ్‌ల పేరిట భూముల అప్పగింతపై ఉద్యమించాలని అన్నారు. ప్రపంచీకరణను సమర్థంగా ఎదుర్కోనిదే హక్కుల రక్షణ పోరాటాలు ఫలించవనే వాస్తవాన్ని ఉద్యమకారులు గ్రహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల్లో వేదిక కొత్త కమిటీని ఎన్నుకొంది.

చచ్చాక సాయం చేస్తారా?

అక్టోబర్ 1న రాష్ట్రంలో సంభవించిన వరదలు ఐదు జిల్లాలను అతలాకుతలం చేశాయి. కర్నూల్, మహబూబ్‌నగర్, కృష్ణా, నల్గొండ, గుంటూరు జిల్లాల్లో 87 మండలాల్లోని 565 గ్రామాలు ఈ వరద తాకిడికి గురయ్యాయి. ముఖ్యమంత్రి అక్టోబర్ 11న చేపట్టిన పర్యటనలో వరద బాధితులు అడుగడుగునా ఆయనను నిలదీశారు. 'చచ్చాక సాయం చేస్తారా?' అంటూ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. 'వాహనం ఎక్కి వెళ్లిపోవడం కాదు, మా ఇళ్లల్లోకి వచ్చి చూడండి, మా బాధలు తెలుస్తాయని' నిరసన వ్యక్తం చేశారు.

ఫ్రీజోన్‌కు వ్యతిరేకంగా పోరాటం

పోలీసు శాఖకు సంబంధించి హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా పరిగణిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిలువరించడానికి ఏ రకమైన మిలిటెంట్ పోరాటాలైనా చేస్తామని టి.ఆర్.ఎస్. అధ్యక్షుడు కె.సి.ఆర్. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అక్టోబర్ 15న పొలిట్‌బ్యూరో సమావేశానంతరం ప్రకటించారు. అలాగే అక్టోబర్ 16న ఫోరమ్ ఫర్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన మేధావుల విస్తృత సమావేశంలో తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా పేర్కొనడానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని తీర్మానించారు.

రాజకీయ వేధింపులకు అధికారిణి బలి

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం వ్యవసాయ అధికారిణి బి. రాజేశ్వరి (25) హైదరాబాద్‌లోని డి.ఆర్.డి.ఒ. అపోలో ఆస్పత్రిలో అక్టోబర్ 18న తెల్లవారుజామున కన్నుమూశారు. ఉద్యోగ నిర్వహణలో తలెత్తిన రాజకీయ వేధింపులకు, ప్రజా ప్రతినిధుల ఆగడాలకు ఆమె అక్టోబర్ 15న ధన్వాడలోని తన స్వగృహంలో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానిక ఎం.ఎల్.ఎ., మండలాధ్యక్షురాలు, జడ్.పి.టి.సి. సభ్యుల వేధిపులే తన ఆత్మహత్యకు కారణమని ఆమె తన మరణవాగ్మూలంలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దీనికి తీవ్ర నిరసన వ్యక్తమయింది.

జీవిత ఖైదీల విడుదలలో వివక్ష

రాష్ట్ర జైళ్లలో ఏళ్ల తరబడి మగ్గుతున్న 940 మంది జీవిత ఖైదీలను విడుదల చేస్తూ ప్రభుత్వం అక్టోబర్ 1న ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో 28 మహిళా ఖైదీలు ఉన్నారు. వీరిని అక్టోబర్ 2న విడుదల చేశారు. ఈ విడుదలకు కొన్ని షరతులు విధించారు. ఇలా విడుదల చేసిన వారిలో మావోయిస్టు ఖైదీలకు అవకాశం ఇవ్వలేదు. 15 ఏళ్లకు పైగా జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న మావోయిస్టు ఖైదీలు టివిబి గణేశ్, సముద్రాల మల్లేశ్, శీలం రమేశ్‌ల విడుదలను స్క్రీనింగ్ కమిటీ నిరాకరించింది.

జి.ఎస్. భార్గవ మృతి

ప్రముఖ పాత్రికేయుడు జి.ఎస్. భార్గవ (84) ఢిల్లీలోని ఆయన స్వగృహంలో సెప్టెంబర్ 22న మరణించారు. కొన్నాళ్లుగా ఆయన గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. స్వస్థలం కృష్ణాజిల్లా మచిలీపట్నం. ఆయన స్వాతంత్ర్యానికి పూర్వమే 'ఫోరమ్' అనే పత్రికను నడిపారు. ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు హైదరాబాద్‌లో రెసిడెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. హిందుస్థాన్ టైమ్స్, ట్రిబ్యునల్ పత్రికలలోను ఆయన పనిచేశారు. మనదేశంలో అవినీతిపై అధ్యయనం చేసి వాటిని పుస్తక రూపంలో తెచ్చారు. భారతదేశంలో పత్రికా రచనపై ఒక గ్రంథంతో పాటు పలు పుస్తకాలు రచించారు. జర్నలిజంలోని నిబంధనలను నిక్కచ్చిగా పాటించేవారని, నిష్పక్షికంగా రాసేవారని ఎడిటర్స్ గిల్డ్ తన సంతాప తీర్మానంలో పేర్కొంది.

కరవుకు అందిన సాయమెంత?

రాష్ట్రంలో తీవ్రమైన కరవు పరిస్థితులు ఉన్నాయని, ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి 9,747.2 కోట్ల రూపాయల అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. వాస్తవానికి ఖర్చు పెట్టింది 85.5 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే రాష్ట్ర ప్రభుత్వం వేసిన అంచనాల్లో 0.9 శాతం మాత్రమే. విపత్తు సహాయ నిధిగా అందిన డబ్బులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చెయ్యలేదు. కరవు ప్రకటించిన తరువాత అనేక రోజులపాటు గెజిట్‌లో ప్రచురించకపోవడమూ సహాయక చర్యల్లో జరుగుతున్న తాత్సారానికి, ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనం.


స్థానికులకే అవకాశాలు కలిగించాలి

తెలంగాణ ఉద్యోగుల సంఘం అక్టోబర్ 2న జరిపిన సర్వసభ్య సమావేశంలో జోనల్ విధానం ద్వారా తీవ్ర నష్టం జరుగుతోందని, దీన్ని సరిదిద్దడానికి తెలంగాణలోని పది జిల్లాలను ఒకే జోన్‌గా పరిగణిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాలని, ఉద్యోగ నియామకాల కోసం ముల్కి నిబంధనల ప్రాతిపదికన స్థానికతను నిర్ణయించాలని కోరారు. తెలంగాణేతరులను వెనక్కి పంపి ఆ ఖాళీలలో తెలంగాణ ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు.

అక్టోబర్ 2009 సంచికలో ప్రాంతీయం పేజీలో 'ప్రమాదంలో ముఖ్యమంత్రి మృతి' శీర్షికన అచ్చయిన అంశంలో ఆగస్ట్ అని ఉన్న చోటల్లా సెప్టెంబర్‌గా సరి చూసుకోగలరు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. – సం.

బాలగోపాల్‌కు జోహార్లు !!

మానవ హక్కుల వేదిక నాయకుడు, 1983 నుంచి 1997 దాకా రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమానికి బలాన్ని సంతరింపజేయడంలో అపారమైన కృషి చేసిన అప్పటి పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి, రాజకీయార్థిక, తాత్విక, సాహిత్య అంశాలపై, సమకాలీన పరిణామాలపై అసంఖ్యాకమైన రచనలు చేసిన రచయిత, ఉపన్యాసకుడు, అనువాదకుడు, తెలుగు జాతి గర్వించదగిన మేధావి డా. కందాళ బాలగోపాల్‌కు వీక్షణం వినమ్రంగా జోహార్లు పలుకుతోంది. 1980 నుంచి మూడు దశాబ్దాల పాటు సామాజిక జీవనంలో ఎన్ని అవరోధాలు ఎదురయినా లెక్కచేయకుండా ఆయన నిర్వహించిన పాత్ర ఆదర్శ ప్రాయమైనది. ఆ కృషిలో భాగమైన సామాజిక పరిశీలన, సమాజం గురించి సమాజానికి విశ్లేషించి చెప్పడం, ప్రజా ఉద్యమాలను సమర్థించడం వంటి కర్తవ్యాలను వీక్షణం తన కర్తవ్యాలుగా భావిస్తోంది.



అనేక కేసులు, కనీసం నాలుగు సార్లు హత్యా ప్రయత్నాలు, కిడ్నాప్, నిరంతరం వేధింపులను లెక్కచేయకుండా సాగిన ఆయన ప్రజా ఉద్యమ భాగస్వామ్యం అసాధారణమైనది. 1952 జూన్ 10న మధ్యతరగతి విద్యాధిక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన బాలగోపాల్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి బి.ఎస్‌సి., వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి గణితశాస్త్రంలో ఎం.ఎస్‌సి, గణాంక శాస్త్రంలో పిఎచ్.డి చేసి, ఢిల్లీ ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్‌లో పోస్ట్ డాక్టొరల్ పరిశోధన చేస్తూ మధ్యలో వదిలేసి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం గణితశాఖలో లెక్చరర్‌గా చేరారు. పెచ్చురిల్లిన పోలీసు నిర్బంధం వల్ల ఆ ఉద్యోగం కూడ నాలుగు సంవత్సరాలలోనే వదులు కోవలసి వచ్చింది.

వరంగల్ ప్రజాఉద్యమాలతో కలిసి నడుస్తూ ఆయన రచయితగా, ఉపన్యాసకుడిగా, పౌరహక్కుల కార్యకర్తగా ఎదిగారు. రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ఎన్నో వేల మందిని ప్రభావితం చేశారు. 1980ల ప్రారంభం నుంచీ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ పౌరహక్కుల ఉల్లంఘన జరిగినా దాన్ని ఖండించి, ప్రపంచం దృష్టికి తీసుకువచ్చి, చట్టపరమైన పోరాటాలను, ప్రజా పోరాటాలను నిర్మించడంలో, బలపరచడంలో ఆయనకు ఆయనే సాటి అన్నట్టుగా పనిచేశారు. గత ముప్పై సంవత్సరాలలో ఆయన వెళ్లని బాధిత ప్రాంతాలు, ఆయన కలుసుకోని బాధితులు వేళ్ల మీద లెక్కపెట్టేంత తక్కువ అంటే అతిశయోక్తి కాదు. ఇతర రాష్ట్రాలలోని హక్కుల ఉల్లంఘనలను కూడ ఆయన అంతే తీవ్రంగా పట్టించుకున్నారు. గత కొంతకాలంగా న్యాయవాద వృత్తిలో వందలాది అణగారిన వర్గాల, కార్మికుల, ఆదివాసులు కేసుల పనితో తలమునకలుగా ఉన్నప్పటికీ వారానికి రెండురోజులు ఆయన హక్కుల ఉల్లంఘన జరిగిన ప్రాంతాలకు వెళ్లి బాధితులను కలుసుకునేవారు.

గత ముప్పై సంవత్సరాలలో ఆయన వివిధ ప్రజా సమూహాల ముందు కొన్ని వేల ఉపన్యాసాలు ఇచ్చి ఉంటారు. విస్తారమైన సమాచార పరిజ్ఞానం, నిశితమైన విశ్లేషణ, అందరికీ తెలిసిన విషయం మీదనే కొత్తవెలుగులు ప్రసరింపజేయడం, ఆ సమస్యకు తగిన కర్తవ్యబోధ చేయడం, ప్రజా ఉద్యమాలను సమర్థించడం ఆయన ఉపన్యాసాలలో ఉండేవి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాఉద్యమాల గురించి బయటి ప్రపంచానికి తెలియజెప్పే ఉద్దేశ్యంతో ఆయన ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీకి దాదాపు ఎనభై వ్యాసాలు రాశారు. తెలుగులో, ప్రజాతంత్ర వారపత్రిక, ఆంధ్రజ్యోతి దినపత్రికలలో కాలమ్స్‌తో సహా, కొన్ని వందల వ్యాసాలు రాశారు. ఇప్పటికి ఒక ఇంగ్లిషు వ్యాస సంకలనంతో సహా ఆయన స్వతంత్ర రచనలు ఆరు పుస్తకాలు, అనువాదం ఒక పుస్తకం అచ్చయ్యాయి.

వ్యక్తిగత జీవితంలో నిజాయితీ, నిరాడంబరత్వం, కష్ట సహిష్ణుతలకు ఆయన నమూనాగా నిలిచారు.

ఆయన ముప్పై సంవత్సరాల ప్రజాజీవితంలో మొదటి పదిహేను సంవత్సరాలు మార్క్సిజం ప్రభావంతోను, తర్వాతి పదిహేను సంవత్సరాలు మార్క్సిజం మీద అసంతృప్తితోను సాగాయి. మార్క్సిజం మీద తాత్విక దృక్పథం గాను, మార్క్సిస్టుల ఆచరణ తోను అసంతృప్తి మొదలయిన తర్వాత చేసిన రచనలలో ఆయన కొన్నిసార్లు ఆమోదించ డానికి వీలులేని వైఖరులు తీసుకున్నారు. పౌరహక్కుల అవగాహనను విస్తరించడంలో భాగంగా ఉద్యమ నిర్మాణాల పట్ల అసహనపు వ్యాఖ్యలు చేశారు. తన అవగాహన మీద చర్చ జరిగి దాన్ని ఎక్కువమంది ఆమోదించనప్పుడు సంస్థనుంచి బయటికి వెళ్లిపోయి మరొక సంస్థను నిర్మించి దాన్ని పది సంవత్సరాలలో బలోపేతం చేశారు.

ఆయన జీవితాన్ని, కృషిని, ఆలోచనలను – వాటి అనుకూల అంశాలతోను, ప్రతికూల అంశాలతోను – సమ్యగ్ దృక్పథంతో మదింపు వేసి ఆయన నుంచి తెలుగునాట ప్రజా ఉద్యమకారులు, ఉద్యమ అభిమానులు, ప్రజాస్వామిక వాదులు నేర్చుకోవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ✦

వీక్షణంలో కె. బాలగోపాల్ వ్యాసాలు

1. భారత్ – పాకిస్తాన్ మైత్రి : స్పష్టతలేని వైఖరి (నవంబర్ 16–30, 2003); 2. కృష్ణ నీటి జగడం – కొన్ని వాస్తవాలు, ఒక అభిప్రాయం (అక్టోబర్ 1–15, 2003); 3. పర్సనల్ చట్టాలు : ఏకీకరణ కాదు, ప్రజాస్వామీకరణ జరగాలి (ఆగస్ట్ 1–15, 2003); 4. మతోన్మాద ఫాసిజానికి ముసుగు (ఏప్రిల్ 1–15, 2004); 5. కాషాయ రాజకీయాలు (ఫిబ్రవరి 1–15, 2004); 6. ఆంధ్రప్రదేశ్‌లో హక్కుల అణచివేతకు ప్రతిస్పందనే అలిపిరి (జనవరి 16–31, 2004); 7. ఎవరికి సంకేతాలు పంపడానికి మహమ్మద్ అఫ్జల్‌ను ఉరితీయాలి? (సెప్టెంబర్ 2006); 8. జల రాజకీయాలు – ప్రాంతీయ అసమానతలు (జూలై 2007)

ప్రజా జీవన స్థితిగతులు రావలసిన మార్పులు

ఇది వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక నూరవ సంచిక. ప్రత్యామ్నాయ ఆలోచనలకు వేదికగా నిలుస్తున్న ఈ పత్రిక, 2003 జనవరిలో 'ప్రజాపక్ష సమీక్ష' అనే పేరుతో పక్షపత్రికగా ప్రారంభమై, సాంకేతిక కారణాలవల్ల వీక్షణంగా, మాసపత్రికగా మారి, 99 సంచికలు పూర్తి చేసుకుని 100వ సంచికను చేరుకున్నది. తెలుగు ప్రత్యామ్నాయ పత్రికల చరిత్రలో ఒక పత్రిక నిరాటంకంగా సాగి నూరవ సంచికకు చేరడం ఒక ముఖ్యమైన సందర్భమే. ఈ సందర్భంగా ఈ సంచికలో ప్రజాజీవితం – వివిధ పార్శ్వాలు – మార్పు ఆకాంక్షలు అనే ఇతివృత్తంతో విభిన్న రంగాల ప్రజాజీవితాన్ని యథాతథంగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నాం. మన సమాజంలో మొత్తంగా ప్రజా జీవితం, ముఖ్యంగా అట్టడుగు ప్రజల జీవితం, కచ్చితంగా ఎలా ఉన్నదో మనకు స్పష్టంగా తెలుసునా అనే ప్రశ్నకు జవాబు వెతకాలని ఈ ప్రయత్నం.

ప్రజా జీవితం మెరుగుపడాలనీ, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు సమసి పోవాలనీ కోరుకునే వాళ్లు ఎందరో ఉన్నారు. కాని అలా కోరుకునే వాళ్లలో విభిన్న దృక్పథాలున్నాయి. తమ మార్గం మాత్రమే ప్రజాజీవిత సమస్యలకు ఏకైక పరిష్కారమనే అభిప్రాయాలు ప్రతిఒక్కరికీ ఉన్నాయి. తమ మార్గం కాక మిగిలిన మార్గాలన్నీ తప్పుదారులేననే సంకుచిత భావాలున్నాయి. తరతరాలుగా మన సమాజంలో ఉన్న అంతరాలు, విభేదాలు, వైవిధ్యం ఈ భావాలకు తోడవుతున్నాయి. అందువల్ల ఈ సమాజంలో ఎవరి జీవితం కష్టాల నుంచి విముక్తి కావలసి ఉన్నదో వారు ముక్కముక్కలుగా చీలిపోయి ఉన్న స్థితి మన కళ్ల ఎదుట కనబడుతోంది. ఎవరి పరిష్కారాలు, ప్రయత్నాలు, పోరాటాలు వారికి ఉన్నప్పటికీ, వాటి మధ్య సమన్వయం, సహకారం, ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఐక్యత అవసరమనే దృక్పథం కూడ చాల వరకు లోపిస్తోంది. ఈ పరస్పర దూషణల ఘర్షణలో పడి అసలు ఒక బృందం మరొక బృందపు జీవితం ఎట్లా ఉన్నదో తెలుసుకునే ప్రయత్నం కూడ చేయడం లేదు. ఎవరికి వారికి వారి బృందం సమస్యలే అంతిమంగా, వాటి పరిష్కారమే తక్షణ కర్తవ్యంగా కనబడుతోంది. ఈ రొదలో పాలకవర్గాలు ప్రయోజనం పొందుతున్నాయి. ఒక బృందం మీదికి మరొక బృందాన్ని రెచ్చగొట్టి, తమ పబ్బం గడుపుకుంటున్నాయి.

ఈ స్థితి మారాలంటే, అన్ని ప్రజాసమూహాల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణి, ఒకరి సమస్యలపట్ల మరొకరికి అవగాహన, సహానుభూతి, ఒకరి పోరాటానికి మరొకరి మద్దతు చాల అవసరం. అది దీర్ఘకాలం పట్టే, సంక్లిష్టమైన, సంఘటిత నిర్మాణం అవసరమైన కర్తవ్యం కావచ్చుగాని, కనీసం సామాజిక స్థితిని, ప్రజాజీవన వాస్తవ దృశ్యాన్ని తెలుసుకోవడం తక్షణం ఎవరయినా చేయగలిగిన పని. రాజకీయార్థిక సామాజిక పత్రికగా వీక్షణం ప్రజాజీవితపు వాస్తవస్థితిని ఆలోచనాపరుల ముందుకు యథాతథంగా తేవడం తనవంతు బాధ్యతగా భావిస్తోంది.

ఒక్కసారి మన చుట్టూ ఉన్న సహస్రవృత్తుల శ్రమజీవులను పరికించండి. నిజంగానే వేలాది వృత్తులలో, జీవనోపాధులలో, ఉద్యోగాలలో, నిరుద్యోగాలలో అత్యధికభాగం ప్రజలు దుర్భరమైన బతుకు ఈడుస్తున్నారు. వారి శ్రమ ఫలితం వారికి అందడం లేదు. అపారమైన సమాజ సంపదలో వారి భాగం వారికి అందడం లేదు. వారిలో అత్యధికులు కనీసం మానవ గౌరవంతో జీవించే పరిస్థితి లేదు. వారిపేరుమీద సాగుతున్న పాలన వారిని మరింత దారిద్ర్యంలోకీ, దోపిడీ లోకీ, పీడనలోకీ నెట్టే రాజకీయార్థిక విధానాలను అమలు చేస్తోంది.

ఏ పూటకాపూట భిక్షం ఎత్తుకుని జీవించవలసిన దుస్థితిలో ఉన్నవారి దగ్గరినుంచి, పట్టణాల మురికివాడల నివాసులు, చిన్నచిన్న ఉద్యోగాలు, వృత్తులతో చాలీచాలని బతుకులు గడుపుతున్నవారు (హమాలీలు, సఫాయి కార్మికులు, రిక్షా కార్మికులు, తోపుడుబళ్లవాళ్లు, పనిమనుషులు, వగైరా), గ్రామీణ నిరుపేదలు, ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, ఆదాయవనరులులేని కుటుంబాల వారు, ఒంటరి స్త్రీలు, అనాథ పిల్లలు, వృద్ధులు మొదలయిన వివిధ జీవనరంగాల వ్యక్తులు మనచుట్టూ అనేక మంది ఉన్నారు. వీరిలాంటి అనేక మంది గురించి తెలుసుకుని సమాజానికి తన గురించి తనకు తెలియజెప్పే ప్రయత్నం చేయవలసి ఉంది.

కూడు, గూడు, గుడ్డ, ఆదరణ కరువైన, తగినంతగా లేని ఈ మనుషులు ఎలా జీవిస్తున్నారు? ఈ స్థితిలో జీవితంతో పెనుగులాడుతున్న మనుషులు తమ బతుకు గురించి ఏం ఆలోచిస్తున్నారు? ఆ జీవితం మారాలనే కోరిక, మారుతుందనే ఆశ వారిలో ఉన్నాయా లేవా? ఆ బతుకు ఎలా మారాలనుకుంటున్నారు? ఆ మార్పు ఎలా వస్తుందనుకుంటున్నారు? ఆ మార్పు కోసం తాము ఏమి చేయాలనుకుంటున్నారు? ఇతరులు ఏమి చేయాలనుకుంటున్నారు? వారి నిరాశా నిస్పృహలకు మూలాలేమిటి? ఆ నిరాశను పోగొట్టి వారిని క్రియాశీలంగా తమ బతుకు మార్చుకునే దారిలో నడపడం సాధ్యం కాదా? లాంటి అనేక ప్రశ్నలకు జవాబులు కనిపెట్టడం మీదనే మన సమాజ పురోగతి ఆధారపడి ఉన్నది. సమాజం తనలో తాను జరుపుకోవలసిన ఈ అంతస్సంభాషణను వీక్షణం ఒక వాహికగా కొనసాగించదలచింది.

ఉన్ననాడు ఇంత తింటున్నం. కలోగంజో కల్గింది తింటున్నం. లేన్నాడు పస్తులుంటున్నం. ఇసుగు పుడ్తుంది మా బతుకుపైన. చేద్దాం అంటే పనిలేదు. ఒకయాల దొరికిన పూట గడ్తలేదు. రేట్లు బాగా పెరిగినవి. ఏది కొనచ్చేటట్టు లేదు. మా జీవితాలు ఇంతే. జనం పెరుగుతుంద్రు, మా బాధలు పెరుగుతున్నవి. మమ్మల్ని పట్టించుకునే వాళ్లు ఎవరూ లేరు. రోగం అచ్చి సచ్చినా మా వైపు ఎవులు రారు. పేదరికం మా శాపంగానే అనుకుంటున్నాం. ఒకప్పటి జీవితానికి ఇప్పటి జీవితానికి బాగా తేడా ఉంది. మునుపు సుఖం అచ్చినా, దుఖం అచ్చినా చెప్పేటోళ్లం, ఇచారం చేసుకునేటోళ్లం. గదిప్పుడు లేదు. ఎవల సంచాన వాళ్లు పోతుంద్రు. ఎవల సంచాన వాళ్లు బతుకుతుంద్రు. ఉన్నోనికి బాగా పెరుగుతుంది. లేనోడు లేక సస్తుండు. మా జీవితాలు బాగా ఉండాలనే మేం కోరుకున్నా మాకు ఆశ తీరదేమోననిపిస్తుంది. ఎవెరెక్కి ఎవ్వరు దిగినా మాకష్టం మేం చేసుకునుడే. కష్టం చేసినా మాకు ఈ బతుకు పైన భరోసాలేదు. అందరోలే మా పిల్లల్ని సదివించి పెద్ద ఉజ్జోగాలు చేయించాలనే కోరిక ఉన్నా, మాకు ఇంటిల్లిపాది పనికి పోయినా అప్పుడప్పుడు పస్తులు తప్పుతలేవు. ఎవనికి వాడు కుప్పేసుకోవడం, ఎవరి సంచాన వాడు బతకడం, పక్కోడు సచ్చినా పట్టించుకోని ప్రజల మధ్యన మేమున్నందుకు మా బోటోళ్లు బతుకుతున్నందుకు సిగ్గుపడ్తున్నాం.

నర్సవ్వ
కూలీ, మంచిర్యాల

(సేకరణ : సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి, మంచిర్యాల, ఆదిలాబాద్)

కొడుకా ఏం జెప్పాల. ముందున్న బతుకే మంచిగుండేది. అప్పుడు అందరూ దగ్గరుండేటోల్లు. ఇప్పుడు అందరూ దూరమైంద్రు. సుక్కవొడంగనే లేసేదాన్ని. పోరగండ్లకు అండి, శేర్నర ఆకు గత్రిచ్చి బీడీలు జేసుకొని పొద్దుగూకే వరకు బీడీలు కట్టలు కట్టి మాపు బెడుతుంటి. అన్ని వస్తువలు అగ్గ ఉండే, ఇప్పుడన్ని పిరమైనయి. పప్పుల ధరలు పెర్గిపాయె, కంట్రోలు బియ్యం ధర పెర్గిపాయె, నాకు ఒక్కదానికి అచ్చే బియ్యం నెలకు నాలుగు కిలోలే. నాకున్న ఇద్దరు కొడుకులు ఏరవడి, ఓడిపెండ్లంతోని ఆడుండవట్టిరి. ఆడికి ఈడికి నేను బరువైపోతి. నాకేమీ శాతగాకుంటాయె. ఇప్పుడు ఐదునూరు బీడీలు ఒర్దికి జేత్తే ఎన్ని పైసలస్తయి. నాకేమన్న అవి మొదలైతయ. అప్పుడు అందరు దగ్గరండంగ శాతనైంది. చెత్తల శక్తి ఉండే బీడీలు బాగా జేస్తుంటి. పైసలు బాగ అస్తుండే, ధరలు తక్కుండే, పొరగండ్లకు అన్ని అవి ఇవి కొనిస్తుంటి. ఇప్పుడు నన్ను ఒక్కోడు సూసుడులేదు. ఓడి సంసారాన్ని ఆడు సూసుకుంటున్నరు. నా గతేమో గిట్లయింది. పెద్దోడు ఏరవడి దూరమైనప్పుడు పాణం మంచిగ లేకపోతే, నా మెడ గుండ్లు తాకట్టు పెట్టి ఆడికి దవాఖానల సూపిస్తిని. నాకు ఆడి పాణం మంచిగయినంక గుండ్లు జేపిస్తనన్నడు. ఇప్పడికీ సేపియ్యలేదు. నేను సచ్చిన నోట్లె పెడుదమన్న ఒక్క గుండు లేదు. చిన్న పోరడు బీడీ కార్ఖాన్ల చిన్నప్పుడి నుండి పని చూస్కుంట బట్టి వెట్టేకాడ జీతం గుదిరె. ఆడికి, అక్క ఇంతనో అంతనో దగ్గరుండి సింగం జేసే. ఆడికి ముగ్గురు పిల్లలయిరి. ఆడి సంసారము ఆడికైంది. ఇగ నన్నోల్లు జూస్తరు. ఒక్క చిన్నపోరి అట్లు, ఇట్లు ఒక్కోడి చేతుల పెడితి కష్టమో నష్టమో దాని సంసారంకు అది బతుకున్నది. చిన్నప్పటి నుంచి నాకు కష్టాలే. ఏదో బాధలు బడుతున్న బతుకున్న. ఎట్లయితే గట్లయితది. నన్ను ఓడు జూడడు. సత్తె ఓడన్న గూంజేత్తడు. నాకు చేసుకున్నోడు చిన్నప్పుడేవాయే. పుట్టినోల్లతోని సుఖం లేదు. నా బతుకు ఒక్కదాన్ని, ఉన్నది గిట్ల. ఎన్ని కష్టాలన్నా పడాల. ఏంజెయాల?

చిన్న లింగవ్వ
బీడీ కార్మికురాలు,
విద్యానగర్, నిజామాబాద్

నా బతుకు దోవ జెప్పాలంటే శానా ఉంది. ఇప్పుడున్న దానికి అప్పటి బతుక్కు జమీన్ ఆస్మాన్ ఫరకున్నది. అప్పుడు అదే కుట్టుడు ఇప్పుడు అదే కుట్టుడు. కని అప్పుడు బర్కతుండె. యాడికింత రడీమేడ్లు బట్టలు అచ్చినయో మా గిరాకీ వన్నది. కుట్టుగూలి అప్పుడు తక్కునే ఉండే, ఇప్పుడు ధర ఎక్కువే కాని, మనం దినే వస్తువుల ధరలు పెర్గిపోయె. గిరాకులు తక్కువాయె. పాతబట్టలు గుడితే, మంచి మాటకు చెల్లిపాయె. ఓలన్న పాత బట్ట తెచ్చి కుట్టివెట్టు మంటే మొఖం జూడవద్దది. ఇంతకు ముందు ఊళ్లే ఉన్నప్పుడు, ఎరం బెడుతుంద్రి, అడ్లు మక్కలు వసూలు జేస్తుంటిమి. ఊరిడిసి ఈ నిజాంబాద్‌కు ఎప్పుడైతే అచ్చినమో అప్పడి నుంచి అన్ని మారిపోయినయి. నాకు పుట్టిన పోరగండ్లు అందరూ ఆడోల్లే. కిందికో మీదికో అందరికి లగ్గాలు జేస్తి, ఇప్పుడు శాతగా కుంటయింది. మూడు నాలుగు రోజులకోటి పైంటు గుడితే ఏం బతుకుతం. ఎంతయినా ముందటికి ఇప్పటికి బాగా మారింది. నాకు కొడుకులు లేరు. ఎనకాముందు ఓళ్లులేరు. నా పెండ్లం నేను ఇద్దరమే. నా ఆడపిల్లలకు లగ్గాల జెయ్యదల్గి, సగం కోటరమ్ముకున్న, సగం ఇంట్లోనే ఇప్పుడుంటున్న. అప్పుడు ధరలు తక్కువనే ఉండే. ఇప్పుడు ధరలు బాగా పెర్గినయి. ఎప్పడిదప్పుడే ఉంటది. ఏమైన ఈ కాలం బతుకుడు కష్టమైపోయింది. నాకు మా సేటు బట్టలు బడితేనే కుట్టదల్గి ఇస్తడు. అవి పైంట్లస్తనే, నేను పైంటి మేకర్ని. నాతోని, టేలర్ల పనిజేసేటోల్లకు కూడ సేటు జూడ వద్దది. ఇగ గిట్లనే అట్లనో ఇట్లనో ఎల్లదియాల.

రాజయ్య
దర్జీ
దుబ్బ, నిజామాబాద్

(సేకరణ : ఎం. నర్సయ్య, ఆదర్శనగర్, నిజామాబాద్)

యవుసం పని ఎట్లా చేయాల, ఏ మందు వాడాల, ఏ విత్తనం ఏయాల అని ఆలోచిస్తం. మనకు ఏమి సహాయం ఇస్తలేరు. లోను ఇస్తలేరు. నూతులిచ్చిండ్లు కని కరెంట్ లేదు, మోటర్ లేదు. మలాస ఏండ్లు అయితున్నయి. ఊట్నూర్ పోయినం. బజెట్ అచ్చిందన్నరు కని ఇయ్యలే. పన్నేండేండ్లయినయి కని ఇస్తలేరు. పదమూడు నూతులున్నయి. అవి కూలిపోతున్నయి. కరెంటు మోటరు ఇస్తే ఏమన్న సెయ్యచ్చు. ఇపుడు పత్తులు ఎండిపోతున్నయి. కొత్తలునోల్లు మోటర్లు ఏసిండ్లు. డబుల్ నూతులున్నగాని, నా పేరు మీద మోటరు మంజూరైంది. ఇస్తలేరు. బాకీ ఉన్నవన్నరు. కట్టిచ్చుకున్నారు. ఇయ్యలేదు. మాకైతే ఒక్కటే కంబ

పడుతడి. పికినర్ (స్ప్రింక్లర్), నౌజల్ (12)లు పైపులు (25) ఇస్తమన్నరు. అవి కూడ ఇయ్యలే. కొత్త ఇండ్లు ఇస్తమన్నరు. ఇయ్యలే. అవి కూడ పెండింగ్‌లున్నయి. సహాయం ఇస్తే ఏమన్న చెయ్యచ్చు. గవర్నమెంట్ సాతియ్యాల కదా? నీళ్ల సౌకర్యం కరెంట్ మోటర్లు అవి ఇస్తనే మనకు నడుస్తయి. వానతోటి ఏమి పండుతది? బాకేమి కడుతం. పొలాలు కూడ చెయ్యచ్చు. సెలకల ఇపుడు కొందరు చేస్తున్నరు. మావూరికి రోడ్డుకావాలి. బియ్యం కోటా అంకోలికాడున్నది. ఆటోలో పోతున్నం. నాలీలు, మోర్ల సౌకర్యం లేదు. గలీజున్నది.

రాయిసిడం రావుజీ
బుర్నూరు, ఆదిలాబాద్

ఏది గొన్న ఇబ్బంది. ముప్పై నలభై రూపాల సక్కరి. అన్నీ పిరం. ఉండడానికి ఇళ్లు లేదు. అప్పులు పప్పులు తెచ్చుకొని తినడం ఉన్నది. గవర్నమెంట్ సహాయం అందుతలేదు. కూలీ దొరికిననాడు తినుడు, లేనినాడు పస్తులు. పత్తులు ఎళ్లుడు ఇయ్యేడు లేటైంది. పత్తేరుడు పోతే కూలీ అస్తది. ఇయ్యేడు కాలం మంచిగ లేదు.

అనసూయ
కూలీ, ఆదిలాబాద్

దొరికిన నాడు కైకిలి, సేండ్లపని చేస్తం. ముందటికన్న ఇపుడు మస్తు కష్టం ఉన్నది. సేద్దాం అంటే పని దొరుకుత లేదు. సక్కరి అస్తలేదు. మంచినూనే ఇస్తలేరు. ఆరు లీటర్లు ఇచ్చేది మూడు లీటర్లు మంటనూనే ఇస్తున్నరు. పప్పులు, ఉప్పులు లేవు. బియ్యం 12 కిలోలు సరిపోతలేవు. 12 కిలోలు ఎన్ని రోజులొస్తయి. కమస్కమ్ 35 కిల్లోలు ఇయ్యాల. నెలకు ఒక మనిషికి 4 కిలోలు ఇస్తే ఎన్ని రోజులస్తయి. ఏమి తింటడు. పైసలకే ఇస్తున్నరు. పుక్కెమైతే ఇస్తలేరు కదా? 25 కిలోలుంటే 12 చేసింద్రు. లబలబ మొత్తుకున్న ఇననే లేదు. ఇచ్చినోళ్లకైతే 35 కిలోలు ఇస్తున్నరు. 4,5 కారట్‌లు ఇచ్చిండ్లు. అమ్ముకొని సన్న బియ్యం తింటున్నరు. ఓట్లు ఏసినంక కడుపు మీద కొట్టద్దు ఈపు మీద కొట్టాల. సర్కారు భూమిల పోను ఏమి సర్కారు. అన్నీ పిరం. అన్నం దొరకకపోతే ఎంతమంది చస్తరో! నేను పనిచేసి ఒక్కదాన్ని కుటుంబం నడిపిన. సిసిఐ కాడి నుంచి గడ్డికోస్కచ్చి, గడ్డి అమ్మి పోషించిన. అపుడు అచ్చే పది ఇరవై రూపాయలు ఆనందంగా బతికినం. ఇయ్యాల ఏమి కొనాలన్న పిరమే. గడ్డి కొనతందుకు పశువులు కూడ తక్కెనయి. కాలం మునుపటి కాలం కాదు. ఓట్లేసిన సర్కారు. ఏట్ల ముంచుతున్నది. ధరలైతే పిరమైనాయి. ఎట్ల బతకాల, కూలీ చేసుకున్నోళ్ల బతుకులు ఎపుడు మారుతయి.

లక్ష్మి
కుమ్మరివాడ, ఆదిలాబాద్

చాలా దుర్భర పరిస్థితులున్నయి. చాయ్ తాగడానికి వీలు లేని పరిస్థితి. మిడిల్ క్లాస్ పరిస్థితి దారుణం. జీవితం వేస్ట్ అనిపిస్తున్నది. బియ్యం కొనాలంటే భయమవుతున్నది. గవర్నమెంట్ నడుస్తున్నది. ఎవరికి సహాయం చేస్తున్నదో అర్థమైతలేదు. దోచుకోడానికే ఉన్నట్లున్నది. అధికార్లను చూస్తే అసహ్యమవుతున్నది. దొంగలు, వ్యవస్థ కుళ్లిపోయిందనిపిస్తుంది.

ఠాకూర్ రాణా ప్రతాప్‌సింగ్
పాన్ టేల, ఆదిలాబాద్

(సేకరణ : బి. వేణుగోపాల్ రెడ్డి, ఆదిలాబాద్)

మాది పెదపెంకి గ్రామం. నాకు ఇద్దరు పిల్లలు. నాకేమీ ఆస్తి లేదు. 'కూలాడితే కుండాడుతుంది' (అంటే కూలీ పని ఉంటేనే అన్నం దొరుకుతుందని అర్థం.) లేకపోతే పస్తే. మాకు ఎరిగి వచ్చిన దగ్గర నుండీ అదే సంగతి. నాకు ఎవరి సహాయమూ లేదు. నా జీవితం మారితే బాగుంటుందని అనుకుంటున్నాను. ఎలా మారుతాదో మీకే తెలియాలి. ఏ ఆస్కారం లేదు. తల్లీ, తండ్రీ గడించిందీ ఏమీలేదు. గవర్నమెంటు వాళ్లు నాకేమీ ఉపకారం చేయలేదు. కోటా కార్డు, పని బుక్కు ఉంది. జీవితం మారుతుందని ఊహించుకుంటున్నాను. కష్టపడితే మారుతాదని అనుకుంటున్నాను. ఏ పార్టీ వచ్చినా మాకు మార్పు లేదు. పిల్లలు చదువుతున్నారు. వారు బాగుపడితే అప్పుడు నా జీవితం బాగుపడొచ్చు. గవర్నమెంటు వాళ్లు వ్యాపారానికి డబ్బు రూపంలో సాయం చేస్తే జీవితం బాగుపడుతుంది. మా ఆవిడ పని చెయ్యలేదు. ఇలాగే కష్టపడుతూ ఉంటే బతకడానికీ తప్ప జీవితం బాగుపడదు.

కర్రి సాంబమూర్తి
వ్యవసాయ కూలీ
పెదపెంకి, బలిజపేట మండలం, విజయనగరం జిల్లా

నాకు భార్య నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసేసాను. నా జీతం మీదే మా జీవితం సాగుతుంది. నాకు జీతం నెలకు రెండు వేలు. మా నాయన తలమారీ ఉద్యోగం చేసేవాడు. అదే నాకు వచ్చింది. జీతం పెరిగితే జీవితం బాగుపడతాది. కనీసం ఒక కూలీ వాడికి రోజుకి ఇచ్చిన డబ్బులైనా మాకు ఇవ్వడం లేదు. భూమి ఇస్తే బాగుంటుంది. రేషన్‌కార్డు, ఇల్లు గవర్నమెంటు ఇచ్చింది. అది ఒక ఆధారం. అపుడు గవర్నమెంటంటే భయముండేది. ఇపుడేవళ్లకీ భయం లేదు. లంచాలు ఎక్కువైనాయి. మన కష్టం మనకు బలవ్వాలి తప్ప ఎవలూ ఏమీ చేయరు. జీవితం మారాలంటే దేముడు చూడాలి. బాబు ఎం.ఎస్‌సి. చదువుతున్నాడు. వాడికి ఉద్యోగం వస్తే మా జీవితాలు బాగుపడతాయని ఆశ. భూములు దళితులకిచ్చినా నిలబెట్టుకోవడం లేదు. పేదల బతుకులు ఎలా మారతాయో మాకు తెలియదు.

పెంకి నారాయణ
తలమారి
పెదపెంకి, బలిజపేట మండలం, విజయనగరం జిల్లా

నాకిద్దరు పిల్లలు, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. గ్రామంలో పువ్వులు అమ్ముకొని బతుకుతాము. కష్టపడితే కద్దు లేకపోతే లేదు. మాకెవులూ రక్షించే వాళ్లు లేరు. నాలుగైదు సంవత్సరాలయింది ఇల్లు వచ్చి. పూర్తి చేయలేకపోయాను. మాకేమీ లేదు. గవర్నమెంటు ఏమీ ఇవ్వలేదు. పువ్వులమ్మితే రూపాయి వస్తాది, లేకపోతే లేదు. వ్యాపారంకి

లోను లాంటిది ఇస్తే బాగుంటుంది ఏమీ సంపాదించలేదు. పిల్లల చదువులు పూర్తయి ఉద్యోగాలు చేస్తే అప్పుడు బాగుంటుందని అనుకొంటున్నాను. పొదుపు సంఘంలో చేరాను. దానివల్ల లాభం లేదు. అప్పు తెచ్చి అప్పులు తీర్చుకోవడమే, వ్యాపారానికేమీ ఇవ్వలేదు. కొడుకు హాస్టల్‌లో ఉన్నాడు. తెలుగుదేశం, కాంగ్రెస్ ఏదైనా ఒక్కటే. నా వ్యాపారం నాకు కూడు పెడుతోంది. ఒకరిద్దరు గ్రామంలో రైత్వారు అప్పుడప్పుడూ సాయం చేస్తుంటారు.

కుక్కల సరోజిని

పువ్వుల చిల్లర వ్యాపారి, దళిత మహిళ,

పెదపెంకి గ్రా, బలిజపేట మం, విజయనగరం జిల్లా

(సేకరణ : డి. సుధాకర్, విజయనగరం జిల్లా)

మాది కరీంనగర్ జిల్లా కోహెడ మండలంలో శనిగరం గ్రామం. మాది చిందు మాదిగ కులం. వృత్తిరీత్యా మేము మాదిగ వారిని రంజింప చేసి మా కళా విధానంతో వారి దగ్గర అడుక్కొంటాం. వెనకట మేం ఊరు ఊరు తిరుక్కొంటూ అడుక్కొనే వాళ్లం. ఇప్పుడు కూడ అడుక్కొంటూ ఉన్నం కాని అప్పటిలెక్క ఇప్పుడు ఆటలు ఎవ్వలు సెప్పుత లేరు. అప్పుడు ఎవలో ఒకలి వాళ్లింట్ల ఉండి, ఆ ఊరిలో ఆటలు ఆడేవాళ్లం. ఆటలంటే యక్షగాణ నాటకాలు. మేం ఆడే నాటకాలు భక్త ప్రహ్లాద, మైరావణ లాంటివి. ఎనకట మేం నాటకాలు ఆడేటప్పుడు చాలా మంది జనం వచ్చి రాత్రి నుంచి పొద్దుగాల దాకా సూచేవాళ్లు. ఇప్పుడు జనం అట్లలేరు. అందరు సినిమాల దిక్కే ఎగబడ్డరు. మా ఆటలు సూసేటోళ్లు ఎవలూ లేరు. దాంతో మేమే ఆటలు ఆడడు తగ్గించినం. బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చి తక్కువ జీతానికే పని చేసుకొంటున్నాం. నేడు ధరలు చాలా పెరిగిపోయినవి. పెరిగిన ధరలతో బతకడం కష్టమవుతోంది. మాకు ఇల్లు కూడా లేదు. ఇల్లు లేకనే ఇక్కడికి వచ్చి బతుకుతున్నాం. మా ఊళ్లో మాకు ఇల్లు కట్టుకోడానికి ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జాగ ఇచ్చారు. అప్పుడు మేం బేస్‌మెంటు కట్టి ఉంచాం. ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లు వచ్చినవట. కట్టుకొనేటందుకు మా దగ్గర పైసలు లేవు. దానితో మా ఇల్లు అక్కన్నె పడి ఉంది. మాకు ఇంటిస్థలం మా ఊళ్లో రోడ్డుకు దగ్గర వచ్చింది. దానితో మా ఊళ్లో ఉండే మాదిగోళ్లు నీవు ఊరవతల ఇల్లు కట్టుకోవాలే. మాతోని కట్టుకో వద్దని అంటూ మాతోని లొల్లిపెట్టుకొంటున్నారు. మునుపటి లెక్కనే ఇప్పుడు కూడా అంటుడు, ముట్టుడు ఎక్కువగా ఉంది. మునిపటిలాగ ప్రేమ, ఆప్యాయతలు లేవు. మా జీవితాలు మారుతయనే నమ్మకం మాకు మాత్రం లేదు. ప్రభుత్వం ఈ మధ్య కళాకారులకు పింఛన్లు ఇచ్చిందట. అవి మా దాకా చేరనేలేదు. అధికారులు లంచాలు తీసుకొని ఆ పింఛన్లు ఇస్తున్నరట. మాకు లంచాలు ఇచ్చే స్తోమత లేదు. రోజు రోజుకు బతకడమే గగనమైపోయింది. రెక్కలు ముక్కలు చేసుకొని పని చేసినా బతకలేని పరిస్థితి ఉంది. ఎప్పుడు మా బతుకులు బాగు పడుతాయో, ఏమో?

గడ్డం లక్ష్మి

అలియాబాద్ గ్రా, శామీర్‌పేట మం, రంగారెడ్డి జిల్లా

(సేకరణ : జి. యాదగిరి, రంగారెడ్డి)

ఇల్లు గడవడం చాలకష్టంగా ఉంది. నాలుగు ఇళ్లు తిరిగి బట్టలు దండి గుంజి తేనే కాలం గడుస్తుంది. మా బతుకులు పూట బత్తెం పుల్లల వెలుగులా ఉంది. నాకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు. ముగ్గురు పిల్లలకి పెళ్లిళ్లు చేసాను. వయస్సు మీద పడుతున్నా చూసేవారు లేక ఇంకా బట్టలు గుంజుతున్నాను. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాను. సంవత్సరం మొత్తం ఒక్కొక్క రైతు ఇంటి బట్టలు గుంజితే రెండు పుట్టులు ధాన్యం ఇస్తున్నారు. ఈ ధాన్యాంతో ఎలా బతకాలి? పిల్లల్ని ఎలా పెంచాలి? ఇప్పుడు బజార్‌లో బియ్యం ధరలు ఆకాశానికి అంటుతున్నాయి. కిలో కోటా బియ్యం 22 రూపాయలు అమ్ముతున్నారు. మిగత వస్తువులు కొన్నా భయమేస్తోంది. నాకు ఇంత వరకు పింఛను రాలేదు. బ్యాంకు రుణం ద్వారా కనీసం ఇస్త్రీ పెట్టే కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం అంత చేస్తున్నా పథకాలు అందడం లేదు. ఆ పథకాలు మాకు అందితే పిల్ల తల్లులం అందరం సుఖంగా ఉంటాం. నోరు ఉన్న వాళ్లకే ఊరు, పేరు, పథకాలు తప్ప మాలాంటి వారికి ఎటువంటి ఉపయోగం లేదు. కనీసం మాకు తినడానికి తిండి, ఉండడానికి నీడ ఇస్తే ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం. డ్వాక్రా సంఘంలో చేర్చుకోవాలి. పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలి.

జి. అప్పమ్మ

చాకలి

వెంకయ్యపేట గ్రా, ఆముదాలవలస మం, శ్రీకాకుళం జిల్లా

పూర్వం రాగులు, జొన్నలు తినేవాళ్లం. ఇప్పుడు కడుపు నిండా పట్టెడు అన్నం తినాలంటే బియ్యం కొనటం చాలా కష్టంగా ఉంది. నా తెల్లకార్డుపై నెలకు 12 కిలోల బియ్యం ఇస్తున్నారు. అవి మా తల్లి పిల్లలకి పది రోజులు వస్తున్నాయి. మిగతా 20 రోజులు బియ్యం కొనుక్కోవడం కష్టంతో కూడుకున్న పని. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నాం. వేటకు వెళ్లి పక్షులు పడితే అవి అమ్మితే రోజుకు యాభై, అరవై రూపాయలు వస్తున్నాయి. ఖాళీ సమయంలో బుట్టలు, తట్టలు అల్లుతున్నాం. ఇప్పటివరకు ఇల్లు కూడా లేదు. చెరువు గట్టుపై చిన్న పూరిపాక వేసుకొని జీవిస్తున్నాం. మాలాంటి వారికి ఉపాధి చూపిస్తే బతకగలం. లేదంటే మేము ఉన్నంతకాలం ఇలాగే ఉంటుంది. ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన బాగుంటుంది. పింఛను కూడా ఇవ్వడంలేదు. ఇంట్లో ఇద్దరి భార్య భర్తలకు కనీసం నెలకు నాలుగు వందల రూపాయలు అయినా వచ్చును.

బి. వీరయ్య

ఎరుకుల వారు

బొడ్డేపల్లిపేట గ్రా, ఆముదాలవలస మం, శ్రీకాకుళం జిల్లా

(సేకరణ : ఆర్. రామారావు, శ్రీకాకుళం)

ఓట్లు వేస్తున్నాం. రాజ్యాలు మారుతున్నాయి. ముప్పై ఏళ్ల నుంచీ నా రిక్షా బతుకు మారలేదు. తెల్లకార్డుకు, ఆసుపత్రికెళ్లినా అన్నిటికీ డబ్బులు అడుగుతారు. బియ్యం ఇస్తన్నరు అనుకుంటే కందిపప్పు పెంచేశారు. పప్పుచారు కూడా చేసుకోలేక పోతున్నామయ్యా. నా జీవితంలో మంచిరోజులు వస్తాయని నమ్మకం లేదు. డబ్బున్నోళ్లు ఇంకా

పెద్దోళ్లవుతున్నారు. మా కుటుంబాలేమో రోడ్డున పడుతున్నాయి. పిల్లలకు చదువులేదు. మంచి కూడులేదు.

నరసయ్య
రిక్షా పుల్లర్, కంచికచర్ల, కృష్ణా జిల్లా

తాపీ పని చేసి చేసి ఒళ్లు నలిగిపోతంది. రాత్రయ్యేసరికి నొప్పులు మర్చిపోవడానికి తాగాల్సి వస్తోంది. ఒకరోజు పనుంటే ఒకరోజు ఉండదు. కష్టపడదామన్నా పని దొరకదు. ముసలి అమ్మా, నాన్నను పోషించాలి. పెళ్లి చేసుకోవాలి. సంతోషం లేని జీవితం. చదువుకున్నోళ్లకే ఉద్యోగం లేదు. మాకు పని ఎక్కడ దొరుకుద్ది. ఇక్కడ ఏ ఫ్యాక్టరీలు లేవు. వానొస్తే పనుండదు. మంచిగా సంపాయిం చాలని ఉంది. రోజూ పని ఉంటే బాగుండు. మా గురించి ఎవరూ పట్టించుకోరు.

చిన్నారావు
తాపీ మేస్త్రి
నందిగామ, కృష్ణా జిల్లా

టీచర్ ఉద్యోగం చేస్తున్నా జీతం చాలదు. అన్నీ కొనవలసిందే గదా. మార్కెట్‌కు వెళితే వంద రూపాయలకు ఏమీ రావు. పిల్లలకు ఫీజులు, వైద్యం ఖర్చులు అన్నీ పోను మిగిలేది ఏముంది. ధరలు తగ్గిస్తామంటారు ఎలక్షన్స్ అయిపోగానే అన్నీ పెంచేశారు. అన్నీ అబద్ధాలు. ఏ వాగ్దానాలు నెరవేర్చరు. జీవితం అంటే విసుగొస్తుంది. ఒకరి జీతం సరిపోయే రోజులు కావివి. కొంతమంది బాగా సంపాయిస్తున్నారు. అంతా మాయగా ఉంది. నాయకులు పదవుల కోసం తన్నుకుంటున్నారు. ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

వెంకటేశ్వర్లు
టీచర్, నందిగామ, కృష్ణా జిల్లా

(సేకరణ : బి. రమేష్‌బాబు, రైతుపేట, నందిగామ, కృష్ణా జిల్లా)

చెప్పుకుంటే ఏ లాభం. మా రోజులు అలా ఉండే. అప్పటికి ఇప్పటికి సానా పరాకు ఉంది. ఇప్పుడున్న దినుసులప్పుడు లేదు. ఇప్పటి ధరలు లేవు. అప్పటి మనుషులు లేరు. అప్పుడు అంటే నాలుగు పైసలు కనబడతాయని ఇంటింటి రాజలము పని చేసేటోల్లం. సబ్బండా కులాలు మంచినీళ్ల కుండలు పండగలకు బోనాల కుండలు, గేళాలు, కాగుడు గుండలు, కుడిది గుండలు, దూపారి చిప్పులు, కాద ముంతలు, పొయ్యిలు, శివరాత్రికి కంచుల్లు, అరొక్కటి తీసుకుపోదురు. కారుకు ఇన్ని వడ్లు, జొన్నలు, మక్కలు పండిన కూరగాయలు పండినా మాకు ఇత్తురు. ఇప్పుడు అట్లా లేదు. అందరు సలువల బోనాలు చేత్తాంద్రు. ఇని రోజులాలే నాకు చాతనయిత లేదు. మా ముసలిదానికి పెంచిన్ అత్తది. ఇన్ని బియ్యం అత్తాయి. అవి చాలినా సాలకున్నా. కుసోబెట్టి చాధలనుకున్నా కొడుకు పది సంవత్సరాల కింద సారా తాగి చచ్చిపోయిండు.

వీరయ్య
కుమ్మరి, కరీంనగర్
(సేకరణ : ఎల్. సంతోష, కరీంనగర్)

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థే మూలం. ఇప్పటికీ డెబ్బై శాతం ప్రజలు గ్రామాలలోనే జీవిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా వ్యవసాయరంగాన్ని మార్చవలసిన అవసరాన్ని గుర్తించింది. అందుకోసం ప్రభుత్వ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి పెద్దపీట వేసింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచినపుడే గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులలో అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావించి హరిత విప్లవాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఆకుపచ్చని విప్లవం వ్యవసాయరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దీనివల్ల దేశీయ విత్తనాల స్థానంలో అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను, సేంద్రీయ ఎరువుల స్థానంలో రసాయన ఎరువులు, క్రిమి సంహారకాల మందులను, చెరువులు, కుంటలు, బావుల స్థానంలో బోరు బావులను, నదీ పరివాహక ప్రాంతాలలో ప్రాజెక్టులను ప్రవేశపెట్టింది. ఇవన్ని మార్కెట్‌తో ముడిపడి ఉన్న అంశాలు కనుక వ్యవసాయ ఉత్పాదకాలు అన్ని వాణిజ్య సరుకులు అయినాయి. అప్పటివరకు స్వయం పోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో సంవృద్ధిగా పంటలు పండించి సంతృప్తిగా జీవించే రైతాంగంతో పాటు అన్ని కుల వృత్తుల వారికి ఫలసాయం పంపిణీ జరిగేది. తిండి గింజలకు కొరత ఉండేది కాదు. పల్లెలు పచ్చగా ఉండేవి.

హరిత విప్లవం ఆరంభానికి ముందు 'వస్తు మార్పిడీ విధానం' అమలులో ఉండేది. ఈ విధానం వల్ల గ్రామీణులకు నిత్యావసరాలు ఏదీ అవసరం ఉన్నా వారికి పండిన పంటలను ఇచ్చిపుచ్చుకొని వారి అవసరాలను తీర్చుకొనేవారు. కిరాణ దుకాణం వెళ్లి వర్తకునికి పండిన పంటను ఇచ్చి వాళ్లకు కావలసిన సరుకులను పొందే విధానం అమలులో ఉండడం వల్ల డబ్బు అవసరం లేకుండా వస్తు మార్పిడి ద్వారానే జీవించేవారు. దీనివల్ల ప్రజల మధ్య సత్సంబంధాలు ఏర్పడి కులవృత్తుల మధ్య సమన్వయం, సహకారం ఏర్పడేవి.

ఎప్పుడైతే పైరు పచ్చ విప్లవం ప్రారంభమైనదో గ్రామీణ విధ్వంసం మొదలై 1991లో నూతన ఆర్థిక విధానాల ద్వారా భారతదేశంలోనికి ప్రవేశించిన ప్రపంచీకరణతో విధ్వంసం మరింత వేగవంతమైంది. దీనివల్ల వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత వృత్తులు, కుల వృత్తులు నాశనమయ్యాయి. ఈ విధ్వంసంలో భాగంగా పేద, మధ్యతరగతి రైతుల జీవనం మరింత సంక్షోభంలో చిక్కుకుంది. వారంతా పట్టణాలకు వలస వెళ్లి కూలీలుగా అభద్రతతో జీవిస్తున్నారు. మధ్యతరగతి వారు కూలీపని చేయలేక ఆత్మాభిమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతుల ఆత్మహత్యలు కేవలం ఆ కుటుంబానికి మాత్రమే కాకుండ వ్యవసాయ రంగ సంక్షోభానికి, గ్రామీణ జీవన విధ్వంసానికి, సామాజిక, రాజకీయ, ఆర్థిక విచ్ఛిన్నానికి మొత్తంగా ప్రజాజీవన స్థితిగతులకు దర్పణం పడుతోంది. ఈ సంక్షోభానికి కారణం పాలకుల పరాధీన ఆర్థిక, రాజకీయ ప్రపంచీకరణ విధానాల ఫలితమే. ఎందుకంటే అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు వాళ్ల రైతులకు అధికశాతం సబ్సిడీలు ఇచ్చి రేట్లను పూర్తిగా తగ్గించి అక్కడి రైతులను ప్రోత్సహిస్తుంటే, ఇక్కడ మాత్రం ప్రైవేటీకరణ విధానాలకు పట్టం గడుతూ సబ్సిడీలు తగ్గించి కరెంటు, ఎరువులు, విత్తనాల రేట్లు పెంచుతున్నారు. దీనివల్ల రైతుకు

పెట్టుబడి పెరిగి పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక వ్యవసాయం జూదంగా మారుతోంది. వ్యాపారులు, దళారులు మాత్రం ధాన్యాన్ని నల్లబజారుకు తరలించి, అక్రమ నిల్వలకు పాల్పడి కృత్రిమ కొరతను సృష్టించి, అధిక ధరలకు అమ్మడం వల్ల ఇటు వినియోగదారులకు పెరిగిన ధరల వల్ల కొనుగోలు శక్తి తగ్గుతోంది. దీనివల్ల ఇటు ఉత్పత్తి దారులైన రైతులకు మద్దతు ధర లభించక అటు వినియోగదారులకు ధరలు అందుబాటులో లభించక రేట్ల అంతరాలు పెరిగి ప్రజలు బాధపడుతున్నారు. దీని ప్రభావం వల్ల పేద, మధ్యతరగతి, ఉద్యోగ వర్గాల జీవన విధానంలో ప్రతికూలమైన మార్పు వచ్చింది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమైన తరువాత పేద, మధ్యతరగతి వర్గాలు గ్రామాల నుండి పట్టణాలకు వలస వెళ్లడం జరిగింది. దీంతో పెరిగిన పట్టణీకరణ వల్ల చిన్న చిన్న వృత్తుల, చిరువ్యాపారుల మధ్య పోటీ ఏర్పడి బతుకులు భారమైనాయి. ఇంకొక పక్కన బడా పెట్టుబడి దారులు, బహుళజాతి సంస్థలు షాపింగ్ మాల్స్, ఫ్రెష్‌లు, మెట్రో మార్కెట్‌ల పేరుతో పెద్దపెద్ద వ్యాపార సంస్థలను ఏర్పాటు చేయడం వల్ల చిన్న వ్యాపారస్తులు, గల్లీలలో సంచరిస్తు, పళ్లు, కూరగాయలు అమ్ముకొని జీవించేవారు పెట్టుబడిదారీ, కార్పొరేట్ పోటీకి తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నారు.

రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలతోపాటు, పట్టణాలు, గ్రామాల మధ్య ఆర్థిక అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పట్టణాలు వ్యాపార, వాణిజ్య కేంద్రాలుగా మారి వెలిగిపోతుంటే, గ్రామాలు మాత్రం పంటల పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గి వ్యవసాయరంగం వెలవెల పోతోంది. పట్టణాలలో ముఖ్యంగా వాణిజ్య మండలాలు, పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. పని గంటలతో ప్రమేయం లేకుండా శ్రామికులను బానిసలుగా భావించి, బంధించి పని చేయించుకోవడం సర్వసాధారణమై పోయింది. మరోవైపు గ్రామాల నుండి దగ్గరి పట్టణాలకు, నగరాలకు వచ్చే దినసరి కూలీల సంఖ్య పెరిగిపోతోంది.

పర్యావరణంలో వచ్చిన మార్పులు కూడ ప్రజల జీవన స్థితిగతులను ప్రభావితం చేస్తోంది. వన నిర్మూలన వల్ల వాతావరణం కలుషితమై వర్షాలు పడక పంటలు పండక కరువు కాటకాలు ఏర్పడి రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనికి తోడు ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో ప్రభుత్వం ప్రైవేట్ భూములను, అటవీ, సాగుకు సంబంధించిన భూమిని వేల ఎకరాలు పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అమ్మడం వల్ల పర్యావరణ సమతుల్యతకు నష్టం జరుగుతోంది. దీనివల్ల ఆహార ఉత్పత్తికి ఆటంకం ఏర్పడి అధిక ధరలకు కారణం అవుతోంది. ఇంకొక పక్క సింగరేణి ఓపెన్ కాస్ట్ వల్ల బొగ్గు ఉత్పత్తి పెరిగినప్పటికి, గని కార్మికుల సంఖ్య తగ్గడం వల్ల మిగిలిన వారికి ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతోంది. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల వల్ల వేలాది ఎకరాల భూమి పనికి రాకుండా పోతుంది. కొన్ని గ్రామాలతోపాటు ప్రజలు నిరాశ్రయులైపోతారు.

ప్రకృతి సమతుల్యత దెబ్బతినడం వల్ల అతివృష్టి, అనావృష్టితో గాలి, నీరు, నేల కాలుష్యమై భయంకరమైన అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వీటి నివారణకు ప్రకృతి పరిరక్షణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. దీనిలో భాగంగా నేలను సంరక్షించడం, వృక్ష సంపదను ప్రోత్సహించడం, ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులను నియంత్రించడం, పునరుద్ధరించబడిన వనరులను పరిమితంగా వినియోగించడం, మొత్తంగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించ వలసిన ఆవశ్యకత ఉంది.

అంతర్జాతీయంగా ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం వల్ల ఆర్థిక మాంద్యం ప్రజల మీద ముఖ్యంగా ఉద్యోగస్తుల మీద, నిరుద్యోగ యువత మీద ప్రభావం చూపింది. ఐ.టి.తోపాటు అనేక కంపెనీలలో పని చేసే ఉద్యోగస్తుల సంఖ్యను తగ్గించడం వల్ల ఉన్న ఉద్యోగం ఊడిపోయి కొందరు, అప్పటివరకు సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపినవారు తిరిగి సాధారణ జీవన సరళికి అలవాటు పడలేక మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గత పంచవర్ష కాలం నుండి ప్రభుత్వం కొన్ని ప్రజోపయోగ కార్యక్రమాలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగానే జాతీయ పనికి ఆహార పథకం, రెండు రూపాయలకు కిలో బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, విద్యార్థులకు ఫీజు రాయితీలు, పంటలకు ఉచిత కరెంట్, రైతులకు రుణమాఫీ వంటి స్వాగతించవలసిన సంక్షేమ పథకాలు. ఇలాంటి పథకాలను కొనసాగిస్తూ వీటికి సమాతరంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవలసిన అవసరం ఉంది. ఎందుకంటే సంక్షేమ పథకాలు అన్ని తాత్కాలిక ప్రయోజనాలు, ఫలితాలు ఇస్తాయి. అభివృద్ధి పథకాలు అయినటువంటి సాగు, తాగు నీటి వసతి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి ఉత్పాదకతనూ పెంచే పథకాలను ప్రవేశపెట్టినట్లైతే అవి శాశ్వతమైన ఫలితాలను ఇస్తాయి. దీనితో కొనుగోలు శక్తి పెరిగి ప్రజల జీవన స్థితిగతులలో మార్పు వస్తుంది.

కావున ప్రభుత్వం ఉత్పాదక రంగాలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తిని పెంచినపుడు, ఉత్పత్తులు అందరికి అందుబాటులోకి వచ్చినపుడు తాత్కాలిక ఫలితాలనిచ్చే సంక్షేమ పథకాలపైన ప్రజలు ఆధారపడడం తగ్గుతుంది. అప్పటి వరకు సంక్షేమం, అభివృద్ధి ఈ రెండింటినీ రెండు కళ్లుగా చూడవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా ఈ పథకాలకు సంబంధించి నిధుల కేటాయింపులో అవినీతి, అక్రమాలు, లంచగొండి తనం లేకుండా పారదర్శకంగా నిధులను సద్వినియోగపరచి, జవాబుదారీ తనంతో ఉండవలసిన అవసరం ఉంది. ప్రైవేటీకరణ విధానాలను ప్రోత్సహించకుండా ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాలి. పబ్లిక్ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు అమ్మకుండా భూములు, నీళ్లు, అడవులు, ఖనిజ సంపద బహుళజాతిపరం కాకుండా వాటి పైన ప్రజలకే హక్కు కల్పించాలి.

ఏదేమైనప్పటికి ప్రపంచీకరణ విధానాలను పక్కకు పెట్టి, మన ప్రజలకు ఉపయోగకరమైన, వారి జీవన స్థితిగతులను మెరుగు పరిచే విధానాలను ప్రవేశపెట్టినప్పుడే మన ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది. ఈ విషయంలో ప్రజలు ఎక్కువ శ్రద్ధ వహించాలి.

– బోరెడ్డి మధుసూదన్‌రెడ్డి
సిద్ధిపేట్, మెదక్

మాది కడప జిల్లా వేంపల్లె. బాగా బతికి చెడినోళ్లం. అక్కడ వ్యవసాయం సాగక ఇక్కడికి వచ్చి పని చేసుకొంటున్నాం. వారంలో రెండు రోజులు మాత్రమే మాకు పని దొరుకుతోంది. రెగ్యులర్‌గా పని ఇచ్చే వాళ్లు లేరు. మేం గొల్లోల్లం. నాకు ఇద్దరు ఆడ పిల్లలు. పెళ్లిళ్లు అయినాయి. మట్టి తవ్వుడు, బిల్డింగ్‌లు కూలగొట్టుడు ఇదే పని. నీళ్లు మొయ్యాలి, సిమెంట్ కలపాలి, ఇసుక మొయ్యాలి, వాళ్ల సామాను కూడా మేమే మొయ్యాలి. మేస్త్రీలతో సమానంగా పని చేస్తం. మేస్త్రీకి, పారగానికి తేడా లేకుండా కూలీ ఇవ్వాలి. అడుగడుగునా పని దగ్గర ప్రమాదమే ఉంటది. బాగ లేకపోతే గవర్నమెంట్ ఆసుపత్రికి పోతం.

దేవరింటి జయశంకర్
ఉప్పర పని, హైదరాబాద్

నాలుగు సంవత్సరాల క్రితం భార్యా భర్తలం ఇక్కడికి పనికి వచ్చాం. ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురు పెళ్లిళ్లు అయినాయి. కాన్పులు చేసి ఇక్కడికి వచ్చాం. ఉన్న ఊళ్లో ఇళ్లు అమ్ముకున్నాం. మాకు రేషన్ కార్డు లేదు. ఇక్కడ మాణిక్యేశ్వరనగర్‌లో ఉంటున్నాం. పెద్దిళ్లకు కిరాయి ఇవ్వలేక కరెంట్ లేని ఒక గదిలో ఉంటున్నాం. చిన్నామెకు ఎక్కువ కట్నం ఇచ్చినామంటు పెద్దల్లుడు, రెండో అల్లుడు కొట్లాట పెట్టుకుని దూరమయ్యారు. ఇల్లు కట్టుకోవాలని అప్పు చేశాం. ముసలోళ్లం ఇద్దరం ఇక్కడే ఉంటున్నాం. బాగున్న రోజు పనిచేసుకుంటం. మెత్తబడిన రోజు ఇంట్లోనే ఉంటం. ఊళ్లో ఉన్నప్పుడు బస్టాండ్‌లో పండ్ల బండి పెట్టుకుని అమ్ముకునే దాన్ని. అప్పుడు బాగానే ఉండేది. పెద్దాపరేషన్ చేయించు కున్నప్పుడు వ్యాపారం దెబ్బతిన్నది. పక్కనున్న అంగళ్లు పెరిగాయి. నా వ్యాపారం పోయింది. పాతికేళ్ల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పోతున్నం. వ్యవసాయం పని ఉన్నప్పుడు ఊళ్లోనే ఉంటాం. బియ్యం కార్డులు కూడా దుడ్లకు అమ్ముకుంటున్నారు. ఇప్పుడు ఊరికి పొయ్యే పరిస్థితి లేదు. బాగా లేకున్నా, వయసు అయిపోయినా ఏ బస్టాండ్‌లోనో అడుక్కు తింటాం గాని, వాళ్ల కాడికి మాత్రం పోం. ఇదో యాదే పని చేస్తాం గాని ఒకరింటికి మాత్రం పోము సామి.

అల్లం కొండమ్మ
సి బెలగళ్, కర్నూల్

వారం రోజుల నుంచి మా అమ్మాయి కనిపిస్తలేదు. అక్టోబర్ 5న రేషన్ షాప్ కెళ్లి బియ్యం తెచ్చిపెట్టింది. తరువాత ఎటు వెళ్లిందో తెలియడం లేదు. మా అమ్మాయిని వెత్తుక్కుంటూ హైదరాబాద్‌కు వచ్చాం. కనబడగానే వెళ్లిపోతాం. మా పాపకు పదహారు సంవత్సరాలు. మాది మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల. సిటికి వచ్చి కొద్దిగా పని చేసుకుని ఊరు వెళ్లిపోతా ఉంటం. ఉప్పర పనికి వెళ్తం. ఇప్పుడయితే పాప కనబడితే చాలు.

పానకంటి గౌరమ్మ
జడ్చర్ల, మహబూబ్‌నగర్

హైదరాబాదులోనే పుట్టినం. మా అమ్మా నాయనా అందరూ మొదటి నుంచి ఇక్కడే ఉన్నారు. ఉప్పర పనికి పోయేటోళ్లు. కూరగాయల అమ్ముకునేటోళ్లు. నా భార్య బాసన్‌లు తోమనీకి పోతది. మాకు నలుగురు పిల్లలు. ఒక అమ్మాయి చనిపోయింది. ఇంక ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లోడు ఉన్నారు. నాకు నాలుగు వేలు జీతం వస్తది. భార్యకు వెయ్యి రూపాయలు వస్తయి. హైదరాబాద్ కార్పొరేషన్‌లో పదేళ్ల బట్టి ఈ కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తున్నం. అదివరకు ఉప్పర పనికి పోయేవాణ్ని. ఎంప్లాయ్‌మెంట్ కార్డు లేదు. మా డ్యూటి ఉదయం అయిదు గంటల నుంచి మూడు గంటల వరకు. పని చేసే దగ్గర లేకపోతే జీతం ఇయ్యరు. అయిదు నుంచి మూడు వరకు ఉండి మధ్యలో కొద్దిసేపు కనబడకున్నా గానీ ఆబ్సెంట్ ఏస్తరు. ఆదివారం సెలవు లేదు. రాని రోజు 130 రూపాయలు కట్ అవుతయి. మాకు సంఘాలేమీ లేవు. మీ లాంటి వాళ్లు వస్తేనే మా గురించి అడిగి రాసుకుంటరు. ఏమైనా అడిగితే ఇష్టమైతే రండి కష్టమైతే మానేయ్యండి అంటరు. గుత్తేదారు లేదు. సూపర్‌వైజర్ లేదు. ఏదైనా జరిగితే మేమే చూసుకోవాలి. అప్పటి జమానాలో అమ్మ, నాయన భోలక్‌పూర్‌లో వేసుకున్న గుడిసె ఉంది. కరెంట్ లేదు. అయ్య చనిపోయిండు. పాయఖానాకు కూడా మేం బయటకు వెళ్లాల్సిందే. ఏ ప్రభుత్వం వచ్చినా గరీబోళ్లకి ఏమీ చెయ్యలేదు. పైన ఆదాయం ఏమీ ఉండదు. మా తాతల ఆస్తులు ఏమీ లేవు గనుకనే రోడ్ల మీదికి వచ్చినం. మాకు పర్మనెంట్ చేయాలి. బట్టలు, సబ్బులు, మాస్క్‌లు అన్నీ ఇయ్యాలి. ఇ.ఎస్.ఐ. కోసం డబ్బులు తీసుకుంటున్నారు. కాని కార్డ్ ఎప్పటికి ఇస్తరో తెల్వదు.

మోహన్
జి.ఎచ్.ఎం.సి. చెత్త ఎత్తే కార్మికుడు
భోలక్‌పూర్, హైదరాబాద్

జి.ఎచ్.ఎం.సి. లోయర్ ట్యాంక్‌బండ్ ఏరియాల 200 మంది లేబర్, 120 మంది డ్రైవర్లు పని చేస్తున్నం. ప్రతి ఆరు నెల్లకు కాంట్రాక్టరు మారుతాడు. మేము రాత్రి పదకొండు నుంచి రెండో రోజు సాయంత్రం ఐదు దాకా పని చేస్తం. లేబర్ రాకపోతే మమ్మల్నే పని చేయమంటరు. మాకు నాలుగు వేల ఐదు వందల జీతం ఇస్తరు. పదిహేను వందలు ఇంటి కిరాయికి పోతది. ఆరోగ్యాలకీ, పిల్లల చదువులకీ సరిపోతలేదు. పదిహేను సంవత్సరాల నుండి పనిచేస్తున్నం. పర్మనెంట్ చేయట్లేదు. ఈ చెత్త పని చేసి చేసి నాకు ఆస్తమా వచ్చింది. ఏ పని చెప్పినా చెయ్యాలి. స్వైన్ ఫ్లూ ఉన్నప్పుడు కూడా ఒక్క రోజే మాస్క్ ఇచ్చినారు. మేం చేసే చెత్తపనిలో అన్ని రకాల కులపోళ్లు ఉన్నారు. పర్మనెంట్ చేయమని నాలుగు రోజులు ట్రక్కులు ఆపాం. కమిషనర్ మా చేతిలో లేదు, సి.ఎం.ను అడగాలన్నాడు. ఆ తర్వాత మా గురించి పట్టించుకోలేదు. మేం ఇబ్బంది పడినా పిల్లలు బాగుండాలని కష్టపడుతున్నాం. ఇంటి దగ్గర ఆడోళ్లు కూడా పని చేస్తున్నారు. అయినా జరుగుతలేదు. ఈ రోజు ఖర్చులకి, మాకొచ్చే రోగాలకి మా జీతం పది వేలు ఇచ్చినా సరిపోదు. వర్కర్లకు కూడా జీతాలు పెంచాలి.

మాధవరెడ్డి
జి.ఎచ్.ఎం.సి. ట్రక్ డ్రైవర్
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్

మా సొంతూరు జొన్నగిరి, కర్నూలు జిల్లా. మెహదీపట్నంలో కిరాయికి ఉంటున్నాం. నాకు పెళ్లయి ఐదేళ్లయింది. నాకు ముగ్గురు

చిన్నపిల్లలు. నాకో చెల్లెలు ఉంది. అయిదెకరాల భూమి ఉంది. వ్యవసాయం నడవక వచ్చేసినాను. చెల్లెలు అమ్మా నాన్నా ఊళ్లోనే ఉంటున్నారు. మేం బోయోళ్లం. ఇక్కడ చెత్త నుంచి ప్లాస్టిక్ ఏరుకుని కేజీ లెక్కన అమ్ముతాను. రోజుకి 100, 150 వస్తాయి. నాలుగు సంవత్సరాల నుంచి ఈ పని చేస్తున్నాను. నెలకో, రెణ్నెళ్లకో ఊరుకి పోతాను. ప్రభుత్వం నుండి ఏమీ లేదు. ఎక్కడా ఏ పని దొర్కుతలేదు.

సుధాకర్
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్

అంబర్‌పేట శ్మశానానికి అంతా హిందూవులే వస్తారు. ఇప్పుడు స్థలాలు అమ్మడం లేదు. బొంద పెట్టడం లేదు. జాగ లేక ముస్లింలు కూడా సమాధి తవ్విన చోటే మళ్లీ తవ్వుతున్నారు. కాటికాపరి (బేగరి) పనికి మాలోల్లు వస్తారు. మా అన్న చేస్తడు. చిన్నప్పటి నుంచి ఇక్కడ కబ్జా కాకుండా కాపాడుకుంటున్నాం. ఇక్కడ మా నాలుగు వంశస్తులు పని చేశారు. చింతభట్ల, యాచారం మా సొంతూరు. శ్మశాన స్థలం ఏడెకరాల దాకా ఉంది. ఈ శ్మశానం మీద ఆధారపడి ఇంతకు ముందు నాలుగు కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు పన్నెండు కుటుంబాలు ఉన్నవి. చాలా శ్మశానాలు కబ్జా అయినాయి. గవర్నమెంట్ శ్మశాన వాటికలు లేవు. రోజు ఆరేడు శవాల నుంచి ఇరవై ఇరవై అయిదు శవాల దాకా వస్తాయి. ఇక్కడే ఉండి ఉండి మురికి మొత్తం జీర్ణం అయిపోయింది. అన్ని రోగాల వాళ్లు ఉంటారు. మాకు ఆరోగ్యానికి ఇబ్బంది అయితే ప్రైవేట్ హాస్పిటల్ లోనే చూపించుకుంటాం. నగరం జనాభా పెరిగింది. శవాలు వచ్చేవి కూడా పెరిగినాయి. చిన్న పిల్లలు, ఆక్సిడెంట్‌లో చనిపోయిన వాళ్లు, కాల్చుకుని అర్ధాంతరంగా చనిపోయినోళ్ల శవాలు వచ్చినప్పుడు మాకు కూడా కన్నీళ్లు వస్తాయి. ఈ పనికి తప్పనిసరిగా తాగాలి. బేగరి పనిచేసేవాళ్లకి పిల్లనివ్వడానికి ఇష్టపడరు. శ్మశాన వసతులు పెంచడానికి ప్రభుత్వం చొరవ చూపించాలి. చనిపోయిన వాళ్ల పేర్లు, వయసు, ఏ కారణంతో చనిపోయారో వంటి వివరాలతో 1954 నుంచి మా దగ్గర రికార్డులు ఉన్నాయి. సంపాదన అడికాడికి సరిపోతోంది. ఎంత చేసినా మురికి పనేగా. మా వృత్తి ఇదే కాబట్టి తప్పక చేస్తున్నాం.

శ్రీనివాస్
కాటికాపరి, అంబర్‌పేట్, హైదరాబాద్

రాజోళి, అలంపూర్ వరదబాధితులు

కట్టుబట్టలతో పోయినాం. మా పరిస్థితి ఘోరంగా ఉంది. ఎందుకు బతికినామా అనిపిస్తుంది. ఊరుకవతల చలికి, గాలికి అవస్థ పడతా బతుకుతున్నాం. ఎందుకూ ఈ బతుకులు? వరదలోనే పోయుంటే బాగుండు అనిపిస్తుంది. తల్లి కడుపు నుంచి అవతల పడినట్లు మిగిలినం. పంటలు, వ్యాపారం అన్ని పోయినాయి. ఎట్లా బతకాలో తెలియడం లేదు. ఇక్కడ ఎస్.సి. కాలనీలో మూడువందల ఇళ్లు ఉంటాయి. పదిహేను వందల జనాభా ఉంటుంది. రేషన్ కార్డులు ఉన్నవారికి సహకారం అందుతుంది. అన్ని కులాల వారికి నష్టం జరిగింది. నేసే వాళ్లకు ఎక్కువ నష్టం జరిగింది. మగ్గాలు అన్నీ పోయినయి. సాలోల్ల నాగమ్మ, కుంటి తిమ్మారెడ్డి చనిపోయినారు. పది రూపాయలు ఉన్నోనికి పది రూపాయలు, వందల రూపాయలు ఉన్నోనికి వంద రూపాయలు నష్టపోయింద్రు. వరద గురించి మాకు చెప్పలేదు. డ్యాం తెగుతదని అనుకోలేదు. ఊళ్లోకి నీళ్లు ఉదయం వచ్చాయి కాబట్టి మనుషులం మిగిలాం. అదే రాత్రి వస్తే నిద్రలోనే పోయేటోళ్లం. కింద పడిన తువాలు కూడా తీసుకొనేకి సమయం లేదు. నిండు గర్భిణీ బురదలో ప్రసవం అయ్యింది. అట్లే బిడ్డను తీసుకపోయింద్రు. అట్లే ముగ్గురికి కాన్పులు అయినాయి. వరద వచ్చిన మూడు రోజుల దాకా మమ్మల్ని అడిగే దిక్కేలేదు. ముండ్లదిన్నే, పెద్ద తాండ్రపాడు, వడ్డేపల్లి గ్రామాల వాళ్లు మాకు అయిదు రోజులు అన్నం వండి పెట్టారు. అందరూ అడిగి పోయేటోళ్లే. మా అందరికి ఎత్తయిన జాగాల ఇల్లు కట్టియ్యాలి. మీరు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోండి. మా పరిస్థితి ఘోరం.

రేపల్లె ప్రభాకర్
వ్యవసాయ కూలీ,
రాజోళి గ్రా, వడ్డేపల్లి మం, మహబూబ్‌నగర్ జిల్లా

మాకు ఆరు మగ్గాలు ఉండేవి. నాలుగు సీకో, రెండు కాటన్ మగ్గాలు. మొత్తం అన్నీ పోయాయి. పాప పెళ్లికి తెచ్చిన బంగారం కూడా పోయింది. ఊళ్లో సగం మందిమి చేనేత పని మీదే బతుకుతున్నాం. ఒక్కొక్క మగ్గం అరవై వేల నుంచి లక్ష రూపాయలు విలువ చేస్తుంది. అక్టోబర్ 1 రాత్రి ఏడు ఎనిమిది గంటలకు దండోరా వేయించినారు. రెండో తారీకు ఉదయం నుంచి ఊరు ఖాళీ చేసాం. ఈ చేనేత పని మీద ముస్లింలు, కుర్మోల్లు, చాకలోల్లు, తురకల శాలీలు, పద్మశాలీలు చాలా మంది బతుకుతున్నారు. రైతుల కయినా కొద్దిగా సహాయం అందిందేమో గానీ మాకెటువంటి సహకారం అందలేదు.

ఖాజా అబ్దుల్ అహ్మద్
చేనేతకారుడు
రాజోళి గ్రా, వడ్డేపల్లి మం, మహబూబ్‌నగర్ జిల్లా

మా చేనేత సొసైటీకే రెండు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. రాజోళీలో చేనేత కార్మికులు యాభై శాతంపైగా సొసైటీకి పనిచేస్తున్నారు. రాజోళీ చేనేత సహకార సంఘంలో ఒక్కొక్కరివీ నలభైవేల దాకా డబ్బులు దాచుకున్నారు. వరదలో అన్ని రికార్డులు, కాయితాలు, దారాలు, పట్టు చీరెలు బురద పాలైనాయి. ఇప్పుడు సొసైటీకే దిక్కులేదు. మా పరిస్థితి ఇంక ఎట్ల ఉంటదో. రోజుకు ఐదు వందలు కూలీ ఇస్తామన్నా బురద తీసి శుభ్రం చేసే వాళ్లు లేక మేమే శుభ్రం చేసుకుంటున్నాం. చేనేత వాళ్లు పోతే సగం ఊరు ఖాళీ అయిపోతది. బురద తీయడానికే ఇరవై అయిదు వేలు అడిగినారు. మొత్తం నేసేవాళ్లు కురవోళ్లు, పద్మశాలీ, తొగట. మిగిలిన కులాల వాళ్లు కూడా నేత పనిచేసేవారే ఎక్కువ మంది ఉన్నారు. మెయిన్ రోడ్డుకున్న కంప్యూటర్ దుకాణాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, కిరాణా దుకాణాలు ఇలా 90 శాతం ఊరు మునిగిపోయింది. మొత్తం పనికి రాకుండా అయింది. షెడ్డు కావాలి. మగ్గం, పరికరాలు కావాలి. ఇళ్లన్నీ కూలిపోయాయి. జరి, మగ్గాలు ఓంద్రు పేరుకుపోయి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. చేనేతలకు

ఇళ్లు భద్రంగా ఉంటేనే బతకడానికి వీలైతది. అది తప్ప మాకేమీ ఆధారం లేదు. మళ్లీ ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో మాకు ఇళ్లు కట్టియ్యాలి.

శ్రీనివాసులు
ప్రొడక్షన్ ఇంఛార్జ్, రాజోళి చేనేత సహకార సంఘం
రాజోళి గ్రా, వడ్డేపల్లి మం, మహబూబ్‌నగర్ జిల్లా

రాజోళి గ్రామంలో ఎనిమిది వేల మంది ఓటర్లు ఉన్నారు. ఎక్కువ చేనేత పనివారు. ముస్లిం కుటుంబాలు, ఎస్.సి., తెలుగోళ్లు, బెస్తవారు జనాభాలో ఎక్కువగా ఉన్నారు. ముంపుకు గురైన ఇళ్లన్నీ పడిపోయాయి. 1992లో వచ్చిన వరదలకు ఎస్.సి. కాలనీలో కొంతమేర మునిగిపోగా, వారికి కట్టి ఇచ్చినవి మాత్రం ఇప్పుడు మిగిలాయి. ఇసుకమట్టి, ఒండ్రు పొలాల్లో పేరుకుపోయింది. జరి, మగ్గాలలో ఒండ్రు పేరుకుపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి. చేనేత వాళ్లు అందరు రోడ్డున పడ్డారు. ఇళ్లు భద్రంగా ఉంటేనే వాళ్లు బతకడానికి వీలైతది. అది తప్ప వాళ్లకింకేమీ ఆధారం లేదు. పైరు ఎక్కడ వేసినారో లేదో తెలియకుండా పోయింది. గ్రామ శివారు ప్రాంతాల్లో ముంపు పొలాలు కూడా వంకలు పారి పంటలు పోయాయి. గవర్నమెంట్ ఇప్పటికి ఎనిమిది వేల రూపాయలు, ఇరవై కేజీల బియ్యం ఇచ్చింది. వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు వీలైన సహాయం అందిస్తున్నాయి.

ఆనందబాబు
వార్డ్ మెంబర్,
రాజోళి గ్రా, వడ్డేపల్లి మం, మహబూబ్‌నగర్ జిల్లా

మాకు ఇల్లు కావాలి. స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలి. మేము ఇక్కడ గవర్నమెంట్ ప్లాట్‌లలో డేరాలు వేసుకొని బతుకుతున్నాం. నీళ్లు, కరెంట్ లేవు. వాళ్లు వచ్చి లేపితే పోతాం. నీడ కోసం మాకెక్కడ నివాసం లేక ఇక్కడ వేసుకున్నాం.

వీసన్న
రాజోళి గ్రా, వడ్డేపల్లి మం, మహబూబ్‌నగర్ జిల్లా

అన్ని కులాల వాళ్లు, మతాల వాళ్లు కలిసే ఉన్నాం. రోజూ సహాయం ఒకరికి అందుతది, ఒకరికి అందదు. దీపం లేదు, ఏమీ లేదు. పురుగు పుట్ర కరిచినా దిక్కులేదు. మాకు వసతులు ఊర్లో ఉన్నట్టు ఇక్కడ ఎట్లా ఉంటది. వరద ప్రభుత్వం బాధ్యతే. నీళ్లు వచ్చే ముందు చెబితే ఉపయోగం ఏముంది. పగలు కాబట్టి సరిపోయింది. పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో వేస్తున్నాం. పుస్తకాలన్నీ కొట్టుకుపోయినాయి. పిల్లల చదువుకు ఆగమయిపోయినై. ఎట్ల చేయాలో ఏమో, ఎక్కడ నాకర్థం అయితలేదు. బియ్యం కూడా అందరికీ అందుతలేదు.

అచ్చన్న
రాజోళి గ్రా, వడ్డేపల్లి మం, మహబూబ్‌నగర్ జిల్లా

వరద శుక్రవారం సాయంత్రం వచ్చింది. ఇక ఎవరికి వాళ్లు పట్టించుకోకుండా పరుగెత్తారు. ట్రాక్టర్లు, బండ్లు అన్నీ కొట్టుకుపోయాయి. మూడు రోజులు నీళ్లలో ఉన్నాం. అన్ని రకాల ప్రజలు నష్టపోయారు. ఎటువంటి సహాయం అందలేదు. కాని, రేషన్ కార్డుకు ఎనిమిది వేల రూపాయలు, ఇరవై కేజీల బియ్యం ఇచ్చారు. అయిదు లీటర్ల కిరోసిన్ ఇచ్చారు. జ్వరాలతో, రోగాలతో జనం అవస్థపడుతున్నారు. రెండు వారాలు అవుతుంటే ఒక్క మెయిన్‌రోడ్ మీద ఉన్న బురద పక్కకి తోసారు. లోపల వీథుల్లో ఏమీ జరుగతలేదు. దగ్గర దగ్గర ఊళ్లకు బంధువుల ఇళ్లకు పోయి ఎవరి తిప్పలు వారివి అన్నట్టు ఉన్నారు. రాజకీయ నాయకులు వస్తున్నారు, పోతున్నారు. ఏమీ చేస్తలేరు. 90 శాతం ఇళ్లు నాశనమైనాయి. పాత మిద్దెలు, ఇళ్లు కూలినాయి. గవర్నమెంట్ బాగా ఆదుకోవాలి. రైతులకు విత్తనాలు ఇచ్చి రుణాలు మాఫీ చెయ్యాలి.

సుంకన్న
ఆటో డ్రైవర్,
అలంపూర్, మహబూబ్‌నగర్ జిల్లా

చెప్పుకుంటే ఏమైతది సాబ్, చెప్పాల్సి వచ్చింది కాబట్టి చెబుతున్నాం. ఎవరు పట్టించుకుంటారు. కలెక్టర్ నిర్లక్ష్యం వల్ల జరిగింది. ఇళ్లు, స్కూళ్లు, పిల్లల చదువులు అన్నీ మునిగిపోయాయి. శ్రీశైలం వల్లనే ఇదంతా జరిగింది. అప్పుడు చంద్రశేఖరరెడ్డి చెబితే గడియారం రామకృష్ణ వినలేదు. మా కష్టం మాకు దక్కలేదు. మీ దయ, మా అదృష్టం సార్. దాన్యం ఆగమయింది. బట్టలు ఆగమయ్యాయి. స్థలం చూపెట్టాలి. ఇల్లు చూపెట్టాలి. ఇంతవరకు ఇటువంటి వర్షం రాలేదు. ఊరి చరిత్రలో ఇదే మొదటిసారి. నీళ్లు తాగడానికి లేవు. ఇక శుభ్రం చేసుకోవడం మాట సరేసరి. ఇల్లు శుభ్ర చేయడానికే పదిహేను ఇరవై వేలు అవుతాయన్నరు. వాళ్లు ఇచ్చిన ఎనిమిది వేలు ఏమిటికి సరిపోతాయి. నీళ్లు అయిదు కిలోమీటర్లు పోయి తెచ్చుకోవాలి. కలిసికట్టుగా ముఖ్యమంత్రిని అడిగినం. ఆలోచిస్తం, చేస్తం అన్నారు, కాని ఇంతవరకు ఏమీ చెయ్యలేదు. రోగాలకు డాక్టర్లు లేరు. ఉన్న డాక్టరు ఇల్లు కూడా మునిగిపోయింది. తిండి దొరుకుతలేదు. తాగడానికి నీళ్లు లేవు. వండుకోవడానికి స్టవులు లేవు. రోజు ముప్పై కిలోమీటర్లు కర్నూలు వెళ్లి రావాలి.

షరీఫ్
అలంపూర్, మహబూబ్‌నగర్ జిల్లా

మా ఊళ్లో మూడు వందల గడపలు ఉంటయి. రెండు వందల ఎకరాల పంట నష్టపోయింది. ఎం.ఆర్.ఒ. ఆఫీస్‌కి వెళ్లి అడిగినాం. రెండు రోజుల్లో వస్తామన్నరు. రెండు వారాలైనా రాలేదు. మేమంతా వ్యవసాయం మీద ఆధారపడి బతికేవాళ్లం. మా పంట అంతా మునిగిపోయింది కాబట్టి నష్టపరిహారం కావాలి. కందులు, మొక్కజొన్న, బుడ్డలు, పొద్దుతిరుగుడు అన్నీ పంటలు పోయాయి. ఎలాగైనా మాకు న్యాయం జరిగేలా చూడండి. మా కష్టాలు మీ పేపరు మొదటి పేజీలో పెద్ద అక్షరాలతో రాయండి.

సావిమియా
గుండిమల్ల, అలంపూర్ మం, మహబూబ్‌నగర్ జిల్లా

(సేకరణ : రాంకి, రాము, శేఖర్ వీక్షణం బృందం) వీ

సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించామని చెప్పకునే పాలకులు వరద బాధితులను ఆదుకోవడంలో చూపించిన నిర్లక్ష్యం, వివక్ష, వైఫల్యాలను వివరిస్తున్నారు **పులుగుజ్జు సురేష్**

వరదలు - పాలకుల వైఫల్యం

సెప్టెంబర్ చివర్లో మొదలైన వర్షం, అక్టోబర్ రెండవ తేదీ నుండి వరదగా మారి రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ముంపుకు గురిచేసింది. రోజుల కొద్ది ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయారు. జల ప్రళయం ఎన్ని కుటుంబాలను బలితీసుకుంటుందోనని భయాందోళనకు గురికాక తప్పలేదు. రాష్ట్రమంతటా విషాదం నెలకొంది. మానవ అవసరాల కోసం నిర్మించుకున్న వివిధ రకాల నీటి ప్రాజెక్టులు ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నాయన్న భయం పట్టుకుంది. ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఆతృతతో జనమంతా టి.వి.ల ముందు కూర్చుని చూసారు. రెండు రాత్రులు – ఏం జరుగుతుందో చెప్పడానికి నిపుణులు కూడా ఊహించలేని సందిగ్ధంలో పడ్డారు. ఈ జలప్రళయం మరొక కొత్త సంద్రాన్ని తీసుకువచ్చిందా అన్నంత నీరు భూభాగాన్ని కప్పివేసింది. ఇప్పటికి బతికి ఉన్న వారందరూ అమరులు, అజేయులని అనాల్సిందే.

దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే మహబూబ్‌నగర్ జిల్లా వరద తాకిడికి గురయిందంటే ఎవరూ నమ్మలేని, ఊహించని నిజం. వరదలంటే గుర్తుకువచ్చేది కోస్తా తీర ప్రాంతం. మన రాష్ట్రంలో 1030 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం ఉంది. తొమ్మిది జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ముఖ్యపట్టణాలు, చారిత్రక ప్రదేశాలు, ప్రధాన రైలు మార్గాలు, జలమార్గాలు ప్రధాన పరిశ్రమలు ఉన్నాయి. తుఫానులు, వరదలు వచ్చినప్పుడల్లా నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు గల తీరప్రాంతం మాత్రమే ముంపునకు గురయ్యేది. ఎప్పుడన్నా ఒకసారి ఖమ్మం, చిత్తూరు జిల్లాలకు తాకిడి ప్రభావం కనిపించేది. ఈసారి మాత్రం తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలలో వరద ప్రభావం ఉగ్రరూపం దాల్చింది. ఇది సహజంగా సంభవించిన ప్రకృతి వైపరీత్యం కాదు, పూర్తిగా మానవ తప్పిదమేనని నిపుణులు పరిశీలిస్తే అందుతున్న అంచనా. ఏది ఏమైనా గత వందేళ్లలో ఇటువంటి వరదను చూడలేదని ప్రజల అభిప్రాయం.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించడానికి ప్రధాన కారణం పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే. ఇటువంటి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారీ నష్టం జరుగుతుంది. ప్రాణ, ఆస్తి నష్టాలు, మౌలిక వసతులపైన ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వ్యక్తిగత ఆస్తులతోపాటు, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతింటాయి. ప్రత్యక్షంగా కనిపించేది కొంతయితే, పరోక్షంగా కనిపించనిది మరెంతో ఉంటుంది. లెక్కల రూపంలో చెప్పడం సులభం కాదు. ఇళ్లు కూలిపోవడం, కరెంటు స్తంభాలు పడిపోవడం, రోడ్లు, కట్టలు తెగిపోవడం, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడం, రవాణా స్థంభించడం వంటివి భౌతికంగా కనిపిస్తాయి. కనిపించకుండా అనేకం ఉంటాయి. ప్రజల మానసిక ఆందోళనలు, కాలుష్యం, పర్యావరణంపై పడే ప్రభావం, ఆరోగ్యం క్షీణించడం వంటివే కాకుండా మరెన్నో ఉంటాయి.

సహజంగా వచ్చే ప్రకృతి వైపరీత్యాలను ఆపలేం. కానీ కొన్ని సందర్భాలలో, ప్రత్యేక పరిస్థితులలో తీవ్రతను తగ్గించవచ్చును. తీవ్రత స్థాయిని నియంత్రించడం మానవ సాధ్యమే. భూకంపాలు, తుఫానులు వంటి వాటిని రాకుండా ఆపలేం కానీ, వాటి వలన సంభవించే ప్రమాదాలను తగ్గించుకోవచ్చును. కొన్ని రకాల పద్ధతులు మెలకువతో వ్యవహరిస్తే ప్రజలకు కలిగే నష్టాలు కొంతవరకు తగ్గించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌కి చాలా పెద్ద వరద చరిత్ర ఉంది. గత 110 సంవత్సరాలలో 75 తుఫానులు రాష్ట్రాన్ని గజగజ వణికించాయి. వీటిలో 1977 నవంబర్‌లో సంభవించిన 'ఉప్పెన' 1990, 1996లలో వచ్చిన తుఫానులతోపాటు 2009 అక్టోబర్ మొదటివారంలో సంభవించిన వరదలు పెద్దవిగా చెప్పవచ్చు. ఇవి కాకుండా 1998లో గుజరాత్, 1999లో ఒరిస్సా రాష్ట్రాలు తుఫాను తాకిడికి గురయ్యాయి.

ప్రకృతి వైపరీత్యాల వలన 1977 నుంచి 1996 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో 13,563 మంది ప్రాణాలు కోల్పోయారు. 57,45,304 పశువులు మరణించాయి. 43,35,568 నివాసాలు ధ్వంసమయ్యాయి. నివాసాలు, పశువులకు బాగా నష్టం జరిగింది. తుఫానుల నుండి పరిరక్షించుకునేందుకు అవసరమైన సమగ్ర ప్రణాళిక లేదు. భారతదేశంలో ఏడాదికి సగటున ఐదు వేల మంది ప్రాణాలు కోల్పోవలసి వస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన తుఫానులలో 1977లో సంభవించిన 'ఉప్పెన' ప్రపంచదేశాలను ఆంధ్రవైపు తిప్పింది. అందుకు కారణం అందులో 9,941 మంది ప్రాణాలు కోల్పోవడం. 34 లక్షల మంది నిర్వాసితులు కావడం. 10,14,800 ఇళ్లు కూలిపోవడం. 4,31,786 పశువులు చనిపోవడం వంటివి ప్రపంచ ప్రజలను కదిలించింది. ఇంతటి భారీ నష్టానికి కారణం ప్రకృతి మాత్రమే కాదు, మానవ తప్పిదమూ ప్రధాన కారణం. విపత్తులు, తుఫానుల నుండి రక్షణ కోసం 1969లో

'సైక్లోన్ డిస్ట్రెస్ మిటిగేషన్ కమిటీ'ని భారత ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి డా. పి. కోటేశ్వరం అధ్యక్షులుగా ఉన్నారు. 49 సిఫారసులతో 1971లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక 1977 వరకు కూడా బుట్టదాఖలయ్యింది. అమలుకు నోచుకోలేదు. నివేదిక సమగ్రతను గురించి చర్చించడం కంటే అమలులో జాప్యం, పట్టించుకోక పోవడం, అవసరాన్ని గుర్తించకుండా నిర్లక్ష్యం చేయడం, వల్లనే అంతటి ఘోర ప్రమాదం నుండి బయట పడలేకపోయాం.

2009లో కూడా అదే జరిగింది. కొందరి రాజకీయ నాయకుల ప్రయోజనం కోసం వ్యవస్థ నిర్వహణపై రాజకీయ ప్రభావం జొప్పించడం వలన మహబూబ్‌నగర్, కర్నూలు, నల్గొండ, కృష్ణా, గుంటూరు జిల్లాలు ప్రమాదం నుండి తప్పించుకోలేకపోయాయి. ప్రకృతి చూపిన కరుణకు ప్రజలందరూ సంతోషించాలి. ఎడతెరపి లేకుండా వర్షం కురిసినప్పటికీ గాలి లేకుండా ప్రకృతి అదుపులో ఉంచుకోవడం వలన అతిపెద్ద భారీ ప్రమాదం నుండి బయటపడగలిగాం. గాలితో కూడిన తూఫాను వచ్చి ఉంటే ప్రమాదం ఏ పాటిదో మనం ఊహించలేం. మానవ తప్పిదం నుండి తప్పించుకోవడానికి ప్రయత్నాలు బలంగా జరుగుతున్నాయి. వరద తీవ్రతను గురించి కేంద్ర జలసంఘం తమకు తెలుపలేదని రాష్ట్ర అధికారులు తప్పించుకో చూస్తున్నారు. వారు చెప్పకుంటే వీళ్లు పర్యవేక్షించాలి కదా? అది ఎక్కడా జరగలేదు. భారీగా వస్తున్న వరదకు ప్రజలు అప్రమత్తమై, మీడియా ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం కథనాల ఫలితమే ప్రాణ నష్టం తగ్గించుకోవడానికి కారణమయ్యింది. వరద ముంపుకు గురయిన జిల్లాలలో సుమారు రెండుకోట్ల జనాభా ఉంది. నాలుగోవంతు ప్రజలు ముంపుకు గురయ్యారు. ప్రమాదంలో ఉన్నవారిని రక్షించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు నామమాత్రమే అనడానికి అనేక అనుభవాలు ఉన్నాయి. వరద తీవ్రతకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేయడంలో విఫలమయింది. జూరాల, శ్రీశైలం, తుంగభద్ర, సుంకేసుల డ్యాంల గేట్లు తెరుచుకోలేదు. సుంకేసుల డ్యాం గేట్లు కొట్టుకుపోవడం ఎవరి తప్పిదంగా భావించాలి. నిర్వహణ, పర్యవేక్షణ కరువైనందునే, సుంకేసుల డ్యాంలో సుక్క నీరు లేకుండా సముద్రం పాలయ్యాయి.

వానల్లో వరదలకు బాధితులు నిర్వాసితులై ఏడుస్తుంటే రాష్ట్ర ప్రజలు అనేకమంది స్వచ్ఛందంగా విరాళాలు అందించారు. ఈ విరాళాలను సమన్వయం చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం ఏమీ పట్టించుకోలేదు. ఎంతోకొంత తోటి మనుషులకు చేతనైనంత సహాయం చేద్దామనుకుని బాధిత ప్రాంతాలకు వెళ్లిన వారికి నిరాశ మిగులుతున్నది. ప్రతిచోట పాలనా యంత్రాంగం ఉంది. ప్రత్యేక బృందాలను కూడా నియమించారు. కానీ వచ్చే సహాయాన్ని ప్రజలకు అవగాహనపరచి, చైతన్యం చేసి, బాధితులందరికీ న్యాయం జరిగే విధంగా చూసే యంత్రాంగం ఏ ఒక్క చోట కూడా కనబడలేదు. వరద ప్రభావం నుండి బయట పడుతున్నామని తేరుకుంటుండగానే ధరలు వెక్కిరించ సాగాయి. వ్యాపారులకు లాభార్జనే ప్రధానం కానీ ప్రజలతో సంబంధం లేదని నిరూపించారు. కిలో బియ్యం వంద, పాల ప్యాకెట్ నలభై ఈ విధంగా, సిమ్‌కార్డు పది రూపాయలది ముప్పై రూపాయలకు అమ్మి దోచుకున్నారు. సహాయం అందక అల్లాడిపోయేవారు కొందరయితే అన్ని రకాల సహాయాలను వారే అనుభవించేవారు మరికొందరు పుట్టుకొచ్చారు. అనేక చోట్ల దొంగతనాలు జరిగాయి. చుట్టు ముట్టిన నీటినుండి బయటకు తెచ్చే పడవలు, మరపడవలు వేలాది రూపాయలు డిమాండ్ చేశాయి. డబ్బు లేని వారి దగ్గర తాళిబొట్టు తీసుకోవడానికి కూడా వెనుకాడలేదు.

వరదల నుండి బయటపడ్డామని అనుకుని ఇళ్లలోకి పోదామను కుంటే, బురదతో నిండి, విషపురుగులు, కళేబరాలు దర్శనమిచ్చాయి. ముంపు ప్రాంతాలకంటే, ఒడ్డున ఉన్నవారికి ప్రభుత్వం వరద సహాయం అందించింది. ఎంతో సాంకేతిక పరిజ్ఞానం సాధించామని చెప్పుకుంటున్న మన రాష్ట్రంలో బాధితుల వివరాలకు సంబంధించిన సమాచారమే లేదు.

ఏది ఏమైనప్పటికీ ఎటువంటి విపత్తు నుంచి అయినా ఎదుర్కొని ప్రాణాలు రక్షించుకోవాలంటే ప్రభుత్వంతో పోరాటంతో పాటు ప్రజలు కూడా సంసిద్ధం కావలసిన అవసరం ఉంది. వరద ముంపు ప్రాంతాలను గుర్తించి, ఆపద నుండి రక్షణ దళాలు, విపత్తు సహాయనిధి, నిర్వహణ దళం, ప్రభుత్వంతో వ్యాజ్యమాడే దళాలు, ఎత్తయిన ప్రదేశాలు గుర్తించడం, సామూహిక భవనాల నిర్మాణం, ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవడం, విపత్తుల నుండి రక్షించుకునేందుకు చేయవలసిన పద్ధతులను శిక్షణ తీసుకోవడం – ప్రజలు తమకు తామే జాగరూకతతో వ్యవహరించడం ఎంతయినా అవసరం.

ప్రభుత్వం అనేక సందర్భాలలో స్పందిస్తుంది. జాగ్రత్తగా పర్యవేక్షిస్తుంది కూడా. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రయాణించిన హెలికాప్టర్ కనబడనపుడు అమెరికా రాడార్ సహాయం కోసం విజ్ఞప్తి చేసారు. వేలాది మంది సైన్యాన్ని అడవుల్లోకి దింపారు. కానీ లక్షలాది మంది ప్రజలు వరద ముంపులో ఉంటే వచ్చిన ప్రభుత్వ స్పందన ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. సాఫ్ట్‌వేర్ రంగం కుప్పకూలిపోతే కొన్ని వేల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతే భారత ప్రభుత్వం వారి పక్షమే నిలబడింది. విపరీతమైన ప్రచారం కూడా లభించింది. వేలాది మంది ప్రజలు, ఆదివాసులు విషజ్వరాలతో అకాల మరణం చెందుతుంటే వారికోసం వచ్చిన స్పందన ఎంత? స్వైన్ ఫ్లూతో ఒరిగిన పది ఇరవై మంది కోసం వచ్చిన స్పందన ఎంత? కోట్లాది మంది పేదలు తమ ఉపాధుల నుండి బలవంతంగా నెట్టివేయబడి అత్యంత ప్రమాదకర పరిస్థితులలో పనులు చేస్తుంటే వారిపట్ల వచ్చిన స్పందన ఎంత? ఈ విధంగా అనేక సమస్యలతో సతమతమవుతూ ఉంటే ప్రభుత్వం బహుళజాతి సంస్థల పక్షాన చేస్తున్న కృషి నుండి – ప్రజల కోసం ఆలోచించే రోజు వచ్చేది ఎప్పుడో?

2009 శాసనసభ ఎన్నికలలో ఎం.ఎల్.ఎ.లు 5–7 కోట్లు ఖర్చు పెట్టారు. ఓట్ల కోసం చేసిన ఖర్చులో 10 శాతమైన ప్రజల కోసం వెచ్చించాలన్న ఆలోచన రాలేదు. పార్లమెంట్ సభ్యులది మరీ విచిత్రం. ప్రభుత్వ నిధి ఎం.పి.ఎల్.ఎ.డి.ఎస్. ని తమ విరాళంగా ప్రకటించు కోవడం విడ్డూరంగా ఉంది. వీ

కరవుతో అల్లాడుతున్న ప్రజల పరిస్థితి పట్టించుకోని నాయకుల దివాళాకోరు రాజకీయాలను ఎండగడుతున్నారు **ఎం. కోదండరాం, పిట్టల రవీందర్**

మాణిక్యాపురం మట్టి మనుషుల వ్యథ

వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వరంగల్లు జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నుండి అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యుడు డాక్టర్ తాటికొండ రాజయ్య పలుమార్లు ప్రకటించి వార్తల్లోని వ్యక్తిగా మారారు. ఈ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఓటమిపాలైన తర్వాత మొదటిసారిగా ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇదే జిల్లా శాయంపేట అసెంబ్లీ స్థానం నుండి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొంది, నాలుగు మాసాల క్రితం మొదటిసారి మంత్రిగా మారిన కొండా సురేఖ కూడా జగన్ ముఖ్యమంత్రి కానిపక్షంలో తమ పదవికి రాజీనామా చేసే నిర్ణయంలో ఎలాంటి రాజీకి ప్రసక్తే లేదని పదేపదే ప్రకటిస్తున్నారు. భారీ నీటిపారుదల శాఖా మంత్రిగా మళ్లీ పదవీ బాధ్యతలు చేపట్టిన పొన్నాల లక్ష్మయ్య వరద సహాయక ప్రవాహ ఉధృతిలో తలమునకలయ్యారు. ఈ ముగ్గురు ముఖ్యనేతలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను చక్కబెట్టేందుకు మాత్రం సమయం దొరకడంలేదు. ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రాంతాలలో కనీస సహాయక చర్యలు ప్రారంభించని రోశయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సైతం వీరికి నోరు పెగలడంలేదు.

తెలంగాణ పల్లెల్లో కరవు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు తెలంగాణ విద్యావంతుల వేదిక, వరంగల్లు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాలను పర్యటించినప్పుడు ఆందోళన కలిగించే అనేక అంశాలు పరిశీలనలోకి వచ్చాయి. గ్రామంలోని ప్రతిఇంటినీ పలకరించడానికి ఈ అధ్యయన బృందంలో జనగామ డివిజన్‌లోని అనేకమంది ఉపాధ్యాయులు పాలుపంచుకున్నారు. జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడటం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నియోజకవర్గం పరిధిలోని లింగాల ఘన్‌పూర్ మండలం మాణిక్యాపూర్ గ్రామం భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్నది. ఈ ఊళ్లో అన్ని కుటుంబాలకు అంతో, ఇంతో సాగుభూమి ఉన్నది. గ్రామం మొత్తంలో కూలీ పనిపై ఆధారపడిన కుటుంబాలు ఇటీవలి కాలం వరకూ పట్టుమని పది కూడా లేవు. సాగునీటి సౌకర్యంలేక, భూగర్భ జలాలుపూర్తిగా అడుగంటిపోయి, బోర్లు పనిచేయకపోవడంతో సాగు విస్తీర్ణం సగానికి పడిపోయింది.

ప్రధాన పంట వరిసాగు విస్తీర్ణం ఐదువందల ఎకరాలనుండి 240 ఎకరాలకు పడిపోయింది. నాట్లు వేసిన తర్వాత కనీస నీరు అందక అది కూడా పూర్తిగా ఎండిపోయింది. రైతులు ప్రతి ఎకరానికి సగటున 15వేల రూపాయలు ఖర్చు చేశారు. మూడు వందల ఎకరాల విస్తీర్ణంలో వేసిన పత్తి కూడా నిలువలేదు. ఇందుకు ఎకరానికి 8 నుండి 10వేల రూపాయల పెట్టుబడి నష్టపోయారు. ఎకరానికి ఆరువేల రూపాయల ఖర్చును భరించి 100ఎకరాల్లో వేసిన నువ్వుల పంటకూడా పాడయిపోయింది. 20 ఎకరాల్లో వేసిన కంది, 10 ఎకరాల్లో వేసిన మొక్కజొన్న, తదితర పంటల పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇదే. వీటికి కూడా ఎకరానికి ఆరువేల రూపాయల చొప్పున ఖర్చు చేశారు. మాణిక్యాపురం గ్రామంలో ప్రతి రైతు కూడా కనీసం రెండు బోర్లు వేసినవారే.ఒక్కొక్క బోరు వేయడానికి సగటున 20వేల రూపాయల ఖర్చు అవుతుంది. 250 అడుగుల లోతువరకు బోరు వేసినా నీరందని దుష్టాంతాలే ఈ గ్రామంలో అధికంగా ఉన్నాయి. ప్రతి రైతుకూ ఒక వ్యవసాయబావి ఉన్నది. కేవలం 24గంటల వ్యవధిలోనే మూడు బోర్లు వేసినా ఆశలు చిగురించని అనుభవం ఈ గ్రామానికి చెందిన చౌదరిపల్లి రోశయ్యకు ఉంది.

ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒగ్గు కళాకారుడు, 77ఏండ్ల వయసున్న చుక్కా సత్తయ్య ఇదే గ్రామానికి చెందిన 25ఎకరాల ఆసామి. బోరుబావిని విజయవంతం చేసుకోవడం కోసం 1983 నుండి ఈయన ఒక పోరాటమే చేస్తున్నారు. గడచిన 25సంవత్సరాల కాలంలో చుక్కా సత్తయ్య 36 బోర్లు వేసారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేశారు. కానీ ఏ ఒక్కటీ విజయవంతంగా మిగలలేదు. నీరు పడింది కూడాలేదు. ఇప్పటికే ఆయన తొమ్మిది వ్యవసాయబావులను తవ్వించారు. వాటిల్లోనూ నీటి ఊట కనిపించడంలేదు. జీవితం ముగిసేలోగా కనీసం ఒక్కసారైనా తన 25 ఎకరాల భూమిమొత్తాన్ని సాగులోకి తీసుకురావాలని తపన చెందుతున్నాడు. ఈ కల ఫలించకపోయినా సరే … ఇందుకోసం ఇంకో 14 బోర్లు వేసి రికార్డుల్లోకైనా చేరుతానని అంటున్నాడు.

ఇదే గ్రామానికి చెందిన 70ఏళ్ల చౌదరిపల్లి సోమయ్యదీ ఇంచుమించుగా ఇదే పరిస్థితి. ఈయన 30 ఎకరాల సాగుభూమి ఉన్న ఉమ్మడి కుటుంబానికి యజమాని. ఈ సీజన్‌లో నాలుగు ఎకరాల్లో వరి, ఏడు ఎకరాల్లో దోసతోట, నాలుగు ఎకరాల్లో పత్తి వేసారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా మిగిలిన 15 ఎకరాలు బీడుగా ఉంచారు. రెండు

ఎకరాల విస్తీర్ణంలో వరి పూర్తిగా ఎండిపోయింది. పత్తి పంట ఆదిలోనే ఆరిపోయింది. తోటను పశువుల మేతకు వదిలివేసారు. ఈ భూమిని సాగుచేసుకోవడానికి ఇప్పటికే ఆరుసార్లు బోర్లు వేసారు. అన్నీ 'ఫెయిల్' అయిపోయాయి. నీరులేక ఎండిపోగా మిగిలిన రెండు ఎకరాల వరిపంటను వ్యవసాయబావితో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం కుటుంబపోషణకన్నా పనికివస్తుందన్న ఆశతో ఆ కుటుంబం ఎదురుచూస్తోంది. ఈ సీజన్‌లో 15ఎకరాల సాగుకోసం చౌదరిపల్లి సోమయ్య కుటుంబం 50వేల రూపాయలను పెట్టుబడి పెట్టింది. ఈ కుటుంబం ఇప్పటికే భరిస్తున్న లక్షరూపాయల అప్పుకు అదనంగా మరో 50వేలు తోడయ్యింది.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ ఊరికి ఎలాంటి సాగునీటి వనరులు లేవు. ఫలితంగా గ్రామం మొత్తం తమ సాగునీరు, తాగు నీటి అవసరాలకు భూగర్భ జలాలపైననే ఆధారపడవలసి వస్తున్నది. మొత్తం 220 కుటుంబాలున్న మాణిక్యాపురం గ్రామంలో రెండువందలకుపైగా వ్యవసాయ బావులున్నాయి. గ్రామంలో రైతులు ఇప్పటివరకూ వేసిన బోర్ల సంఖ్య కనీస అంచనాలకు కూడా అందడంలేదు. వీటిని లెక్కించడానికి కాకతీయ విశ్వవిద్యాలయం నుండి చరిత్ర, గణితశాస్త్రాలకు సంబంధించిన ఉమ్మడి పరిశోధకుల బృందాలు రంగంలోకి దూకాల్సిందేనని గ్రామంలోని యువకులు జోకులు పేల్చుతున్నారు. ప్రస్తుతం కేవలం ఐదు బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ బోర్ల పరిసరాల్లో ఉన్న బావులు ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీవాళ్లు ఇటీవల వేసిన ఎనిమిది బోర్లలో కేవలం రెండు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. 'సాగునీరు ఎట్లాగూలేదు, కనీసం తాగు నీరు కూడా లేకపోతే మేమెట్లా బతకాలి, మా పశువులను ఎట్లా దక్కించుకోవాలి?' అని ఆ గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రతి కుటుంబానికీ పాడిపశువులు ఉన్నాయి. వాటికి మేత లేదు. తాగేందుకు నీరు లేదు. వర్షాలు కురిసిన కాలంలో సంక్రాంతి వరకు పచ్చిగడ్డి, ఆ తర్వాత సీజన్‌లో వరిగడ్డి పశువులకు ఉపయోగించేవారు. కానీ కాలం కలిసిరాకపోవడంతో, వర్షాలు లేకపోవడంతో, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో పాడి పశువులను కాపాడుకుని, మిగిలిన పశువులను కబేలాలకు తరలిస్తున్నారు.

తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో మాదిరిగానే మాణిక్యాపురం గ్రామంలోనూ వ్యవసాయ పెట్టుబడి ఇక్కడి రైతాంగానికి ఒక గుదిబండగా మారిపోయింది. సహకార బ్యాంకులో సాంకేతిక కారణాలు చూపి రైతులందరికీ సభ్యత్వం ఇవ్వడంలేదు. ఈ గ్రామంలో దాదాపు 130 సభ్యులు ఉంటే అందులో కేవలం 60మందికి మాత్రమే వ్యవసాయ రుణాలు అందజేసారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వారికి మాత్రమే సొసైటీ రుణాలు అందుతున్నాయి. రైతుల పలుకుబడి శక్తినిబట్టి ఎకరానికి ఐదు నుండి 20వేల రూపాయల వరకు ఇస్తున్నారు. మిగిలిన రైతులు అనివార్యంగా జనగామ పట్టణంలోని షావుకార్లు (వడ్డీ వ్యాపారులు), అడ్తిదార్లదగ్గరనే తమకు అవసరమైన పెట్టుబడిని రుణాలుగా తెచ్చుకుంటున్నారు. ఈ రుణాలు కూడా విత్తనాలు, ఎరువులు, పురుగులమందుల రూపంలోనే అందిస్తున్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పంట దిగుబడులను తిరిగి ఈ వ్యాపారులకే కట్టబెట్టవలసి ఉంటుంది. అందువల్ల ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు రైతులకు అందేందుకు అవకాశంలేదు. వడ్డీ రేటు 24 నుండి 36శాతం కట్టాల్సివస్తున్నది. ఈ సీజన్‌లో పంటలు ఎండిపోవడంతోపాటుగా సాగుపై పెట్టుబడికోసం తీసుకువచ్చిన అప్పులు అదనంగా రైతుకుటుంబాలను బాధిస్తున్నాయి. కరువు పరిస్థితులతో నిమిత్తం లేకుండా అప్పులు చెల్లించాలంటూ కొందరు షావుకార్లు చేస్తున్న ఒత్తిళ్లు ఇక్కడి రైతు కుటుంబాలను మానసికంగా మరింత కృంగదీస్తున్నాయి.

రోశయ్య ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించడంతో తమకు ప్రభుత్వం నుండి పంటనష్టం అందుతుందేమోనని రైతులు ఇంతకాలంగా ఎంతో ఆశతో ఎదురు చూశారు. కానీ ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నాయకులంతా అకస్మాత్తుగా వచ్చిన వరదలపై దృష్టి నిలపడంతో తమను ఆదుకునే వారు ఎవ్వరూ లేరనే నిరాశ వారిని ఆవహించింది. గతంలో ఈ గ్రామంలో ఎవ్వరూ కూలీకి వెళ్లని పరిస్థితి నుండి ఇవ్వాళ్ల సుమారు 300మంది రైతులు మాణిక్యాపురం నుండి సైకిళ్లపైనా, ఆటోలపైనా, మరికొందరు కాలినడకన కూడా సమీపంలోని జనగామ పట్టణానికి కూలీ కోసం ప్రతిరోజూ వలస వెడుతున్నారు. కూలీపనులకు వెడుతున్న వారిలో మహిళల సంఖ్యకూడా గణనీయంగానే ఉన్నది. బతుకుదెరువు కోసం ముంబాయి వెళ్లినవారి సంఖ్య కూడా ఇటీవలి కాలంలో పెరుగుతున్నది. రెక్కల కష్టంతో తమకు అవసరమైన దినుసులు పండించుకుని ఇతరులమీద ఆధారపడకుండా బతికిన రోజులను వారిప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రెండు రూపాయలకు కిలో బియ్యం కొనుక్కొని పూట గడపాల్సి వస్తున్నదని వాపోతున్నారు. తమ పొలాలను వదిలి పలుగు, పారలతో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లాల్సి రావడాన్ని ఈ గ్రామ ప్రజలు అవమానంగా భావిస్తున్నారు. ఇట్లాంటి దుస్థితి తమ జీవితకాలంలో ఎన్నడూ చూడలేదని గ్రామంలోని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలు వర్షాలు కురిసినా, కేవలం ఈ ఏడాది మాత్రమే వర్షాలు రాకపోతే ఇంతటి కరువు ఎందుకు ఎదురవుతుందో తమకు అర్థం కావడం లేదని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. భూగర్భ జలాలు ఇంతగా అడుగంటి పోవడానికి కారణాలను కూడా వారు తెలుసుకోలేక పోతున్నారు. వీరి అనుమానాలను నివృత్తి చేయవలసిన వ్యవసాయ శాఖగానీ, నీటిపారుదల శాఖగానీ ఇంతవరకూ కనీసం ఈ గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు.

తాము ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఇంతవరకూ ఈ గ్రామాన్ని సందర్శించలేదని, అయినా జగన్‌ను ముఖ్యమంత్రి చేయడం కోసం ఆయన ఆత్మహత్య చేసుకోవాలని తాము కోరుకోవడం లేదని, తమను ఈ కరువునుండి రక్షించడానికి ఏదైనా ప్రయత్నం చేస్తే సంతోషిస్తామని గ్రామ ప్రజలందరూ వేడుకుంటున్నారు. జిల్లా మంత్రి కొండా సురేఖ కూడా జగన్ కోసం కాకుండా జిల్లా ప్రజల సంక్షేమం కోరి రాజీనామాకు సిద్ధపడితే చరిత్రలో నిలిచిపోతారని కూడా వారు అభిప్రాయపడుతున్నారు. అధికారకాంక్షతో అట్టుడికిపోతున్న ఇట్లాంటి రాజకీయ నాయకులకు మాణిక్యాపూర్ గ్రామ ప్రజల ఆవేదనను అర్థం చేసుకునే అవకాశం ఎప్పటికైనా లభిస్తుందా ? ☐

ఆనకట్టల నిర్వహణ వంటి సాంకేతిక అంశాలలోకి కూడా రాజకీయ ప్రయోజనాలు, వర్గ ప్రయోజనాలు, ఒత్తిడులు చోటు చేసుకోవడంతోనే ఇంత తీవ్రమైన వరద నష్టం సంభవించిందని విశ్లేషిస్తున్నారు **నాగోబా**

ప్రాజెక్టులు - రాజకీయ ప్రయోజనాలు

అక్టోబర్ 2న సంభవించిన కృష్ణా వరద ఉత్పాతం ప్రకృతి ప్రకోపమా? మానవ తప్పిదమా అన్న అంశంపై రాష్ట్రంలో చర్చ సాగుతోంది. సెప్టెంబర్ 30 నుండి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో ముఖ్యంగా కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసాయి. ఈ వర్షపాతం వలన రాబోయే వరదను అంచనా వేసి ముందుగానే రాష్ట్ర ప్రభుత్వానికి బులెటిన్‌ల రూపంలో అందజేస్తామని సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ ఎ.కె. బజాజ్ స్వయంగా ప్రకటించారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం వల్లనే కృష్ణానది వరదను నియంత్రించ లేకపోయిందని ఆయన భావన. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వర్గాలు బజాజ్ వాదనలని తీవ్రంగా పరిగణించాయి. సి.డబ్ల్యు.సి. నుండి తమకు ఎలాంటి నివేదికలు అందలేదని ప్రకటించాయి. బజాజ్‌పై ప్రధానమంత్రికి ఫిర్యాదు చేస్తామని సాక్షాత్తు ముఖ్యమంత్రి రోశయ్య ప్రకటించారు. రాష్ట్రంలోని ఇంజనీర్లు కూడా ప్రకృతి ప్రకోపం కంటే కూడా మానవ తప్పిదాలే కృష్ణా వరద బీభత్సానికి కారణంగా తేల్చారు. మొత్తం మీద నీటిపారుదల ఇంజనీర్లు శ్రమించి శ్రీశైలం, నాగార్జున సాగర్, కృష్ణా బ్యారేజ్‌లను డ్యాం బ్రేక్ నుండి కాపాడగలిగినా శ్రీశైలం ఎగువన, బ్యారేజ్ దిగువన తీర ప్రాంతాలను వరద ముంపుకు గురికాకుండా ఆపలేకపోయినారు. దీంట్లో వీరి పాత్ర ఎంత? ప్రభుత్వం పాత్ర ఎంత? ప్రకృతి ప్రకోపం ఎంత? ఈ విషయాలను అర్థం చేసుకోవాలంటే సెప్టెంబర్ 30 నాటికి శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల స్థితిగతులను తెలుసుకోవాలి. అవి ఎందుకోసం నిర్మించారో తెలుసుకోవాలి. వాటిని ఏ విధంగా వాడుకుంటున్నారో తెలుసుకోవాలి.

నాగార్జునసాగర్ ప్రాజెక్టును బహుళార్థక ప్రాజెక్టుగా నిర్మించారు. సాగునీరు, విద్యుదుత్పత్తి, వరద నియంత్రణ మొదలైనవి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి పొందే ప్రయోజనాలు. నాగార్జునసాగర్ జలాశయం 408 టి.ఎం.సి.ల నీటిని నిల్వ చేయగలదు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్.ఆర్.ఎల్.) +590 అడుగులు. కనిష్ఠస్థాయి నీటిమట్టం+ 510 అడుగులు.

మొదట శ్రీశైలం ప్రాజెక్టును వంద శాతం విద్యుత్ ఉత్పత్తి కోసమే నిర్మించారు. జలాశయం నిల్వ సామర్థ్యం 308 టి.ఎం.సి.లు. పూర్తిస్థాయి నీటిమట్టం + 885 అడుగులు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1540 మెగావాట్లు. కాలక్రమంలో మద్రాస్‌కు తాగునీటిని సరఫరా చేసే ఒప్పందంపై ఎన్.టి.ఆర్. ప్రభుత్వం సంతకం చేసిన తర్వాత తెలుగుగంగ కాలువ పథకం రూపకల్పన జరిగింది. మద్రాస్‌కు సరఫరా అయ్యే 15 టి.ఎం.సి.ల తాగునీటిలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు చెరి 5 టి.ఎం.సి.ల నీటిని శ్రీశైలం జలాశయం నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తెలుగుగంగ కాలువకు మళ్లించేందుకు ఒప్పందం జరిగింది. జూలై నుండి అక్టోబర్ దాకా నెలకు 3.75 టి.ఎం.సి.ల నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా తరలించాలి. మద్రాస్‌కు తాగునీటి ప్రాజెక్ట్‌ను ఆసరాగా చేసుకొని తర్వాతి కాలంలో తెలుగుగంగ కింద ఆయకట్టుకు, శ్రీశైలం కుడి కాలువ పథకం, హంద్రీనీవా, గాలేరునగరి, వెలిగొండ, శ్రీశైలం ఎడమగట్టు కాలువ మొదలైనవి శ్రీశైలం జలాశయం నుండి నీటిని వినియోగించుకునేందుకు పథకాలు తయారయినాయి. ఇవి గాక కృష్ణానదిపై నెట్టెంపాడు, కల్వకుర్తి భీమా ఎత్తిపోతల పథకాలు కూడా రూపొందాయి. వీటిల్లో శ్రీశైలం కుడి గట్టుకాలువ పథకం, భీమా ఎత్తిపోతల పథకాలకు తప్ప వేటికీ నికర జలాల కేటాయింపులు లేవు. కృష్ణా డెల్టా వ్యవస్థను ఆధునీకరించి తద్వారా నీటిని ఆదా చేసుకొని శ్రీశైలం కుడి గట్టు కాలువకు 19 టి.ఎం.సి.ల నికర జలాలను ప్రభుత్వం సాధించగలిగింది. శ్రీశైలం జలాశయాల నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 15+19=34 టి.ఎం.సి.ల నీటిని మాత్రమే సాగునీటికి, తాగునీటికి తరలించాలి. అంతకు మించి మరే ఇతర అవసరాల కోసం శ్రీశైలం జలాశయం నుండి నీటిని తరలించడానికి చట్టం వీలు కల్పించలేదు.

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రీశైలం జలాశయం ప్రాధాన్యతలను, నిర్వహణకు సంబంధించిన రూల్సుని పొందుపరుస్తూ 15 జూన్ 1996న జి.ఒ. నెం. 69ని ప్రభుత్వం జారీ చేసింది. ఇవ్వాళ్టి పరిస్థితిని విశ్లేషించడానికి ఈ జి.ఒ.ల చరిత్రను తెలుసుకోవాలి. ఈ జి.ఒ. ప్రకారం శ్రీశైలం జలాశయం కనిష్ఠ నీటి మట్టం (మినిమమ్ డ్రా డౌన్ లెవల్ - ఎం.డి.డి.ఎల్.) +834 అడుగులు. జలాశయం మట్టం +834 ఉన్నపుడు జలాశయం నుండి విద్యుత్ ఉత్పత్తికి కూడా నీటిని వాడుకోకూడదని జి.ఒ.లో స్పష్టం చేశారు. అత్యవసరమని ప్రభుత్వం భావిస్తే కేవలం తాగునీటికి మాత్రం +834 అడుగులు లేదా అంతకు తక్కువ మట్టం ఉన్న నీటిని విడుదల చెయ్యవచ్చునని సూచించింది. శ్రీశైలం ప్రాధాన్యతలు జి.ఒ. 69లో ఈ విధంగా ఉన్నాయి -

1) మద్రాస్‌కు 15 టి.ఎం.సి.ల తాగునీటి సరఫరా
2) హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరా

3) కుడివైపు విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి
4) కృష్ణా బ్యారేజ్ కింద, నాగార్జున సాగర్ కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరా
5) నాగార్జునసాగర్ వద్ద విద్యుత్ ఉత్పత్తి. (కృష్ణా బ్యారేజ్ కింద ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా)
6) శ్రీశైలం కుడిగట్టు కాలువకు సాగునీటి సరఫరా
7) తెలుగుగంగ ఆయకట్టుకు సాగునీటి సరఫరా
8) శ్రీశైలం ఎడమగట్టు కాలువకు సాగునీటి సరఫరా

పై ప్రాధాన్యతలను గమనించినపుడు మద్రాస్, హైదరాబాద్ నగరాలకు తాగునీటిని, కృష్ణా బ్యారేజ్ కింద, నాగార్జున సాగర్ కింద ఆయకట్టు అవసరాలు తీరిన తర్వాత మాత్రమే తెలుగు గంగ, కుడిగట్టు కాలువ, ఎడమ గట్టు కాలువలకు నీటిని విడుదల చెయ్యాలని ప్రభుత్వం భావించినట్లుగా అర్థమవుతుంది.

ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయినాక సెప్టెంబర్ 2004లో జి.ఒ. నెం. 107 జారీ అయ్యింది. ఈ జి.ఒ.లో అత్యంత వివాదాస్పదమైన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. అదేమిటంటే శ్రీశైలం జలాశయం కనిష్ట నీటి మట్టాన్ని +834 అడుగులనుండి +854 అడుగులకు అంటే 20 అడుగులు పెంచేసింది. జి.ఒ. 69 కనిష్ట నీటి మట్టం చేరినాక శ్రీశైలం నుండి నీటి విడుదల ఆపివేయాలని సూచిస్తే జి.ఒ. 107లో మాత్రం కనిష్ఠ నీటి మట్టం +854 అడుగుల తర్వాత కూడా ప్రభుత్వం నీటి విడుదల ఆదేశించవచ్చునని స్పష్టం చేసింది. కనిష్ట నీటి మట్టాన్ని ప్రభుత్వం అమాంతం 20 అడుగులు ఎందుకు పెంచిందో, దాని వెనుక మర్మమేమిటో అప్పటికి ఎవ్వరికీ అర్థం కాకున్న 13 సెప్టెంబర్ 2005న జారీ అయిన జి.ఒ. నెం. 170 ద్వారా ప్రభుత్వ దురుద్దేశ్యం స్పష్టమైంది. ఏకపక్షంగా అత్యంత మార్మిక పద్ధతిలో జారీ అయిన జి.ఒ. 170లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా పంపే నీటి ప్రవాహాన్ని 11500 క్యూసెక్కులనుండి 40 వేల క్యూసెక్కులకు పెంచుతూ ఆదేశాలిచ్చింది. పాత హెడ్ రెగ్యులేటర్‌ను అట్లాగే ఉంచి 40 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో మరో హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణం ప్రభుత్వం చేపట్టింది. రెండూ కలిపితే మొత్తం 51,500 క్యూసెక్కులు పోతిరెడ్డిపాడు ద్వారా తరలించే వీలుంది.

జి.ఒ. నెంబర్ 170 జారీతో ప్రభుత్వం జి.ఒ. 69లో శ్రీశైలం ప్రాధాన్యతలు తారుమారు అయిపోయినాయి. జి.ఒ. 170తో వై.ఎస్. సాధించుకున్న ప్రయోజనమేమిటి? కనిష్ఠ నీటి మట్టం చేరిన తర్వాత కూడా పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని విడుదల చెయ్యొచ్చు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సిల్‌లెవల్ +841 అడుగులు. కనుక 854 నుండి 841 అడుగుల వరకు 13 అడుగుల జలాశయం నీటిని ప్రభుత్వం ఆదేశిస్తే నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల చెయ్యొచ్చు. కృష్ణకు వరద వచ్చే రోజులు 90 నుండి 30కి తగ్గిపోయిందని పేర్కొంటూ 30 రోజుల్లోనే 40 వేల క్యూసెక్కులను తరలించేందుకు రెగ్యులేటర్‌ని డిజైన్ చేశారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ రెగ్యులేటర్‌ని డిజైన్ చేసినప్పుడు వరద రోజులు 90గా నిర్ధారించారు. జలాశయం ఒక్కటే. అయితే పోతిరెడ్డుపాడు రెగ్యులేటర్‌కు వరద రోజులు 30 అయితే ఎడమగట్టు కాలువకు 90 రోజులు ఎట్లానో ప్రభుత్వం చెప్పదు. రోజుకు 4 టి.ఎం.సి.ల చొప్పున నెలకు 120 టి.ఎం.సి.లు తరలించుకుపోవచ్చు. దీనివల్ల ఎక్కువగా నష్టపోయేది తెలంగాణేనని ఆనాడు తెలంగాణ ఇంజనీర్లు, ఉద్యమకారులు వాదించారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమ కరువు ప్రాంతాలకు తరలిస్తే తప్పేమిటని ఆనాడు ప్రభుత్వం పోతిరెడ్డిపాడు వ్యతిరేకులను ప్రశ్నించింది. అసలు ఏది వరద నీరు? ఏది కాదు? వరద నీటిని ఎట్లా తరలిస్తారో చెప్పండి అంటే ప్రభుత్వం అటువంటి రూల్సు ఇప్పటికీ రూపొందించలేదు. పోతిరెడ్డిపాడుపై విమర్శలను బేఖాతరు చేస్తూ నిర్మాణం కొనసాగిస్తోంది ప్రభుత్వం. అయితే జి.ఒ. 69లో రూపొందించిన ప్రాధాన్యతలను అనుసరించి విశ్లేషించినపుడు శ్రీశైలం దిగువన నాగార్జునసాగర్ కుడి ఎడమ కాలువలకు 261 టి.ఎం.సి.లు, కృష్ణా డెల్టాకు 181.20 టి.ఎం.సి.లు నికరంగా వదిలిన తర్వాతనే మిగులు జలాలు ఏమైనా ఉంటే రాయలసీమ ప్రాజెక్టులకు గానీ, తెలంగాణ ప్రాజెక్టులకు గానీ తరలించవచ్చు. కాని పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచిన తర్వాత ఎన్ని హామీలిచ్చినా ప్రాధాన్యతను తుంగలోతొక్కి పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని దౌర్జన్యంగా తరలించి తీరుతారు. ఇటువంటి దౌర్జన్యాలు రాజోలిబండ డైవర్షన్ స్కీంలో రుజువైంది కూడా. సరే. వరద జలాలనే తరలించుతారు అనుకున్నప్పటికీ, వరద జలాలను మొదట కేటాయించవలసింది బేసిన్‌లో ఉన్న నెట్టంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ప్రాజెక్టులకే గానీ బేసిన్ బయట ఉన్న వాటికి కాదు.

పైన వివరించిన వాస్తవాల నేపథ్యంలోంచి ప్రస్తుత వరద బీభత్సాన్ని విశ్లేషిద్దాం. ఈ సంవత్సరం రుతుపవనాలు ఘోరంగా నిరాశపర్చినాయి. వర్షాకాలంలోనే కరువు విలయతాండవం చేసే పరిస్థితి ఏర్పడింది. ఆగస్ట్ చివరి వారం నుండి సెప్టెంబర్ మొదటి వారం వరకు అల్పపీడనం ప్రభావం వలన రాష్ట్రంలో వర్షాలు కురిసినాయి. కృష్ణా బేసిన్‌లోని జలాశయాల్లోకి తాగునీటికి సరిపడా నీరు వచ్చి చేరింది. మళ్లీ నెల రోజులకు మరొక అల్పపీడనంతో కృష్ణా బేసిన్‌లోనే వంద సంవత్సరాలకు ఒకసారి కురిసే వర్షపాతం నమోదయ్యింది. మంత్రాలయంలో అక్టోబర్ 2న ఉదయం నమోదయిన వర్షపాతం 32 సెంటిమీటర్లు అని అధికారులు వెల్లడించారు. ఈ వర్షపాతంలో శ్రీశైలం డ్యాంకి చేరిన వరదనీరు 25 లక్షల క్యూసెక్కులుగా ఉందని అధికారులు అంచనా వేశారు. శ్రీశైలం డ్యాం నుండి అత్యధికంగా 13.5 లక్షల నీటిని మాత్రమే బయటికి పంపించే ఏర్పాటు ఉంది. అవుట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో రెండింతలు ఎక్కువగా ఉండడంతో శ్రీశైలం జలాశయం మట్టం 896 అడుగులకు పెరిగి ఎగువన కర్నూలు, అలంపురం, మంత్రాలయం, రాజోళి తదితర తీరప్రాంత పట్టణాలు, గ్రామాలు కృష్ణా నదిలో మునిగిపోయాయి. కింద కృష్ణా బ్యారేజ్ దిగువన 10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చెయ్యడంతో అనేక లంక గ్రామాలు, కరకట్టలు తెగి అనేక గ్రామాలు జలమయం అయినాయి.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇంజనీర్లకు వరద నియంత్రణ సాధ్యం కాకనా? సెప్టెంబర్ 30న శ్రీశైలంలో నీటి మట్టం +884.50 అడుగులు. అంటే పూర్తిస్థాయి నీటిమట్టానికి అర అడుగుల తేడానే ఉంది. అదే సమయంలో నాగార్జునసాగర్ నీటి మట్టం +537 అడుగులు. అంటే పూర్తిస్థాయి నీటి మట్టానికి 53 అడుగులు తక్కువన్నమాట. 150 టి.ఎం.సి.ల నీటి నిల్వచేసే జాగా నాగార్జున సాగర్‌లో ఉందన్నమాట. నాగార్జునసాగర్‌ని ఖాళీగా ఉంచి సాగర్

ప్రైవేట్ రంగం సమర్థతను ఇన్నాళ్లూ వెనకేసుకొచ్చిన ప్రభుత్వం వారి అసమర్థత గురించి ఏమి జవాబిస్తుందని ప్రశ్నిస్తూ, విద్యుత్ రంగ విధానాలలోని లోపాలను ఎత్తిచూపుతున్నారు **వి. హనుమంతరావు**

చీకటి నుంచి మరింత చీకట్లోకి

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా రోజుకు 12 గంటలిస్తామన్నారు. తర్వాత తొమ్మిదన్నారు. ప్రస్తుతం ఏడు గంటలంటున్నారు. అది కూడా సాధ్యం కావడం లేదు. ఇప్పుడు వరదలొచ్చాయి. విద్యుదుత్పాదన కేంద్రాలు కొన్నింటిని మూసేశారు. కరెంటు తీగలు తెగిపోయాయి. ఆ ప్రజలు దీపాల వెలుగు ఎపుడు చూస్తారో తెలియదు. విద్యుత్‌రంగంలో పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉంది. ఇలాంటి పరిస్థితి ఏదో మన రాష్ట్రానికే పరిమితం కాలేదు. దేశం మొత్తం మీద ఇదే పరిస్థితి. ఆ తానులో ముక్కయిన ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉండదు కదా. దేశంలో విద్యుత్‌రంగం పోకడలు చూస్తే ఇప్పటి ప్రభుత్వాలు ఇలాగే కొనసాగితే మన పరిస్థితి ఇక బాగుపడనట్టే. ప్రధాని మన్మోహన్ సింగ్ అణు విద్యుదుత్పాదనపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. అమెరికా ఒత్తిడికి లొంగి ఒప్పందాలపై సంతకం పెట్టేశారు. పెట్టిన తర్వాత కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి అన్నట్లు, మెరికలు వేసి మొండి చెయ్యి చూపిస్తున్నారు. రాష్ట్ర సముద్ర ప్రాంతంలో గ్యాస్ నిల్వలు మస్తుగా ఉన్నాయి. ఇదిగో మీ ఇళ్లల్లోకి గ్యాస్ వచ్చేస్తుందని నోరూరించారు. గ్యాస్ సరఫరా లేక నిర్మాణం పూర్తి చేసి పనికి సిద్ధంగా ఉన్న విద్యుత్ కేంద్రాలు పనిచేయడం నిలిచిపోయాయి. కాగా ప్రస్తుతానికి థర్మల్, జల విద్యుత్ కేంద్రాలే మనకు దిక్కు. ప్రపంచంలోకల్లా అత్యంత వేడిమినిచ్చే సూర్యశక్తి మన దేశంలోనే లభ్యమవుతున్నా, దానిని వినియోగించుకొనే దిక్కులేదు. అలాగే గాలిమరలు కూడా. ఈ ప్రత్యామ్నాయ విధానాల గురించి ప్రచారార్భాటాలు ఎక్కువ, ఫలితం పరిమితం.

ప్రణాళికా సంఘం విద్యుదుత్పత్తిని పెంచడానికి ప్రణాళికలు తయారు చేస్తోంది. ఇదిగో, ఇన్ని వేల కోట్లు కేటాయించాం అంటుంది.

ఆయకట్టుకు ఖరీఫ్‌కు నీళ్లివ్వకుండా ఎండబెట్టి శ్రీశైలం మాత్రం పూర్తిగా నింపి ఉంచడంలో ప్రభుత్వం ఆంతర్యం ఏమిటి? విచిత్రం ఏమిటంటే 10 సెప్టెంబర్ 2009న శ్రీశైలం స్పిల్‌వే రెండు గేట్లను సాగు నీటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెరిచి సాగర్‌కు నీటిని విడుదల చేసి వెనుదిరిగిన వెంటనే గేట్లు మూసివేయబడినాయి. ఎవరి అదృశ్యహస్తం ఈ చర్యకు కారణమైంది?

కనీసం 30 సెప్టెంబర్‌న వర్షపాతాన్ని గమనించి అయినా శ్రీశైలం నుండి గరిష్ఠస్థాయిలో నీటిని వదిలే ఏర్పాటు చేసి ఉంటే అక్టోబర్ 2 నాటికి శ్రీశైలం జలాశయంలో వరదని నిలుపుకొనేందుకు కొంత జాగా ఏర్పడి ఉండేది. వరద ముంపు తీవ్రత కొంత మేరకైనా తగ్గి ఉండేది. అట్లా జరగని కారణంగా ప్రకృతి ప్రకోపానికి మానవ తప్పిదం తోడై వరద బీభత్సం ద్విగుణీకృతం అయ్యింది. శ్రీశైలం జలాశయంపై నిర్ణయాధికారం ఇంజనీర్ల చేతులోంచి రాజకీయ నాయకుల చేతుల్లోకి మారడంతో ఈ పరిస్థితి దాపురించింది అన్నది సర్వత్రా వ్యక్తమవుతున్న అభిప్రాయం. నిజానికి వరద నియంత్రణ ఇంజనీర్లకు అసాధ్యం ఏమీ కాదు. వరద నియంత్రణకు, గేట్ల నిర్వహణకు సంబంధించిన మాన్యువెల్స్ అన్ని ప్రాజెక్టులకు తయారు గానే ఉంటాయి. రుతుపవనాలు మొదలుకాగానే అన్ని ప్రాజెక్టుల్లో ఫ్లడ్ మానిటరింగ్ యూనిట్లు పని చేయడం ప్రారంభిస్తాయి. నివేదికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. అయితే నిర్ణయాధికారాలు సెక్రెటేరియట్‌లో నాన్ టెక్నికల్ వ్యక్తుల చేతుల్లో, రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడంతో ఇంజనీరు నిస్సహాయులుగా మిగిలి పోతున్నారు. సరైన సమయంలో, సరైన నిర్ణయాలు చేయలేకపోతున్నారు. చంద్రబాబు హయాంలో కూడా ఇటువంటి దుర్ఘటన జరిగి విద్యుత్ కేంద్రం నీట మునిగిపోయింది.

సెప్టెంబర్ 30 వరకు శ్రీశైలం నింపి ఉంచాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? విశ్లేషిస్తే పోతిరెడ్డిపాడు నుండి నీటిని తరహలించేందుకే అన్నది స్పష్టమవుతోంది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నింపి ఉంచామని ప్రభుత్వం నమ్మబలుకుతున్నా నాగార్జునసాగర్ ఆయకట్టును, కృష్ణా డెల్టాను విద్యుత్ ఉత్పత్తికోసం ఎండగట్టడం సమంజసమా అన్న ప్రశ్నకు ప్రభుత్వం నుండి సమాధానం లేదు.

ఇవ్వాళ ఇంజనీరింగ్ నిపుణులు ముక్తకంఠంతో చెబుతున్నది ఏమిటంటే సాంకేతికాంశాల్లో ఇంజనీర్లకే నిర్ణయాధికారం వదిలిపెట్టాలి. 2002లో జరిగిన దుర్ఘటన, 2009లో జరిగిన దుర్ఘటన నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠాలు ఇవి. ఇంజనీర్లను వారి విధులను వారిని నిర్వర్తించడం ఇవ్వాళ పాలకవర్గాలు నేర్చుకోవలసిన గుణపాఠాలు. రాజకీయ ప్రయోజనాల కోసం రిజర్వాయర్ల నిర్వహణ లాంటి పూర్తిస్థాయి సాంకేతికాంశాలను వారే నియంత్రించాలనుకోవడం వల్ల ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి. పాలకులు మితిమీరిన జోక్యంతో నిర్ణయాధికారాలు తమ చేతుల్లోకి తీసుకున్న ఫలితంగా లక్షలాది మంది ఇవ్వాళ వర్ణించనలవి కాని కడగండ్ల పాలయినారు. దీనికి ప్రభుత్వానిదే అంటే రాజకీయ వ్యవస్థదే బాధ్యత కాని అధికారవర్గంలో భాగమైన ఇంజనీర్లది కాదు. వీ

కాని దాని పని ప్రణాళికా రచనకే పరిమితం. అమలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉంది. కాని నిధులేవి? ఈ నేపథ్యంలో దేశంలో విద్యుత్ రంగం పనితీరు పరిశీలిద్దాం.

ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రభుత్వానికి చేతనైనది ఒక్కటే; ప్రైవేటీకరణ, ప్రపంచ బ్యాంక్. మొదటిది ఎపుడో ప్రారంభమైంది. అయితే ఈ ప్రైవేట్ రంగం కూడా పెట్టుబడులకు జాతీయ బ్యాంకుల మీద అంటే మీరూ నేను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకొన్న నిధుల నుంచి కొంత భాగం, విదేశీ కంపెనీలతో చేతులు కలిపి నిర్మాణం చేయడం, నేరుగా ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తెచ్చుకోవడం. గత వారమే ప్రపంచబ్యాంక్ ఎటువంటి షరతులు లేకుండా దేశంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు ఒక బిలియన్ డాలర్ల రుణం ఇవ్వడానికి నిర్ణయించింది. ఇంత ఉదారంగా ప్రకటించిందంటే, బ్యాంకు వద్ద పోగుపడిన డబ్బు అడిగే వారే లేకపోయి ఉండవచ్చు.

సౌరశక్తితో సాంప్రదాయేతర పద్ధతిలో విద్యుత్పత్తి ప్రస్తుతం చాలా ఖరీదైనది. గాలిమరల ద్వారా విద్యుదుత్పత్తి ప్రస్తుతానికి లాంఛనంగానే జరుగుతోంది. ఈ రెండింటి విషయంలో పెద్ద ఎత్తున పెట్టుబడితో పరిశోధన చేస్తే ఖర్చు తగ్గించవచ్చు. మొత్తం మీద చూస్తే విద్యుత్ రంగంలో కారు చీకటిలో కాంతిరేఖ కూడా కనపడటం లేదు. కొద్ది సంవత్సరాల క్రితం వరకూ స్కూటర్ కావాలంటే నెలల తరబడి క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. అలాగే టెలిఫోన్ కావాలంటే కూడా పరిస్థితి అలాగే ఉండేది. ఇపుడవి ఇబ్బడి ముబ్బడిగా లభిస్తున్నాయి. అలాగే విద్యుచ్ఛక్తికి కూడా మంచిరోజులు ఎపుడు వస్తాయా అని ఎదురు చూడాల్సిందే.

విద్యుత్ రంగంలో వైఫల్యాలను సాధించడంలో కేంద్ర ప్రభుత్వానికి నూటికి నూరు మార్కులివ్వవచ్చు. ఈ వైఫల్యం ఈ సంవత్సరమో, గత సంవత్సరమో మాత్రమే కాదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఎనిమిదవ ప్రణాళిక నుంచి ఏ ఒక్క ప్రణాళికా కాలంలోనూ లక్ష్య సాధనకు యోజనాల దూరంలోనే ఉంది.

ప్రణాళిక	లక్ష్యం	సాధన	శాతం (మె.వా.)
8వ	30538	16423	53.8
9వ	40245	19119	47.5
10వ	41110	21180	51.5
11వ (ఆగస్ట్ 2009 వరకు)	33349	1690	50.6

మూలం : సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ

ప్రణాళిక నుంచి ప్రణాళికకు అదనంగా లక్షించే విద్యుదుత్పాదన ఎలా తగ్గుతూ వచ్చిందో పది, పదకొండు ప్రణాళికల మధ్య చూడవచ్చు. అలా తగ్గించిన లక్ష్యాన్ని కూడా చేరుకోలేక పోవడం గమనించవచ్చు. స్థూల జాతీయాదాయం ఒక శాతం పెరిగితే, విద్యుత్ డిమాండ్ 1.2 శాతం పెరుగుతుందని, జనరల్‌గా అదనపు విద్యుదుత్పాదన లక్ష్యం స్థూల జాతీయాదాయాల పెరుగుదల కన్నా 20 శాతం అధికంగా ఉండాలని నిపుణులు చెబుతారు. స్థూల జాతీయాదాయం పెరుగుదల 9 శాతం సాధించాలంటే, దేశంలో ప్రాథమిక శక్తి (ప్రైమరీ ఎనర్జీ) సరఫరా 2003-04 స్థాయి కన్నా నాలుగైదు రెట్లు ఉండాలని శాస్త్రజ్ఞులంటున్నారు. కాని పట్టిక చూస్తే 8-9 ప్రణాళికల మధ్య అదనపు విద్యుదుత్పాదన శక్తి లక్ష్యం 9707 మెగా వాట్లు అయితే, 10-9 ప్రణాళికల మధ్య 869 మెగావాట్లకు తగ్గింది. 10వ ప్రణాళిక కన్నా 11వ ప్రణాళిక లక్ష్యం 7761 మెగావాట్లు మేరకు పడిపోయింది. అలాగే లక్ష్య సాధనలో కూడా ఈ తగ్గుదల వరసగా 2690 మెగావాట్లు, 2061 మెగావాట్లు, 4280 మెగావాట్లుగా చూడవచ్చు. ఈ విషయంలో బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు దొందూ దొందే. ఈ లెక్కన వినియోగదారులకు మిగిలింది దింపుడు కళ్లం ఆశే.

విద్యుచ్ఛక్తికి డిమాండ్ రోజంతా ఒకలాగుండదు. కొన్ని కొన్ని వేళల్లో డిమాండ్ తగ్గుతుంది. సాయంత్రం నుంచి డిమాండ్ పెరుగుతుంది. అలాగే వేసవి, వర్షా, శీతాకాలాల్లో పెరుగుదల, తరుగుదల ఉంటుంది. అలా పెరిగిన సమయాల్లో కూడా సరఫరా నిరంతరంగా సాగితే, విద్యుదుత్పాదన సంతృప్తికరంగా ఉందని భావించవచ్చు. పీక్ డిమాండ్ మాట అలా ఉంచి, మామూలు డిమాండ్ మేరకు సరఫరాకే దిక్కులేదు. పీక్ డిమాండ్ ఎంత, సరఫరా వాస్తవంలో ఎంత అనే సమాచారాన్ని కేంద్ర విద్యుచ్ఛక్తి అథారిటీ కొన్ని గణాంకాలు సేకరించగా, ఏ ఒక్క సంవత్సరంలోనూ పీక్ డిమాండ్ మేరకు పూర్తిగా సరఫరా చేసిన పాపాన పోలేదు.

పీక్ డిమాండ్‌తో పోలిస్తే సరఫరాలు (మెగావాట్లు)

కాలం	లోటు
9వ ప్రణాళిక ఆఖరు వరకు	10293
2002-03	9945
2003-04	9508
2004-05	10254
2005-06	11468
2006-07	13897
2007-08 (ఏప్రిల్-డిసెంబర్)	15831

పదకొండవ ప్రణాళిక ఆరంభం నాటికి స్థాపిత శక్తి 14500 మెగావాట్లు కాగా, ఆ ప్రణాళిక పూర్తి అయ్యేవరకు 78577 మెగావాట్లు అదనపు విద్యుదుత్పత్తి చేయాలనేది ప్రణాళిక లక్ష్యం. కాని ఈ లక్ష్యం సాధించగలమనే నమ్మకం ఆ సంఘానికే లేదు. ఇందుకు కావాల్సిన నిధులు ప్రతి ఏడాది యాభై నుంచి అరవై బిలియన్ డాలర్లు. ఇంత పెట్టుబడిని ఈ ప్రభుత్వం తలకిందులుగా తపస్సు చేసినా సాధ్యంకాదు. ఈ ప్రణాళికలో ప్రారంభించాలనుకొన్న విద్యుదుత్పాదక ప్రాజెక్టులకు ఇంకా నిధుల సేకరణే (ఫైనాన్షియల్ క్లోజప్) పూర్తికాలేదు. కేంద్ర ప్రభుత్వ ఎకనమిక్ సర్వే ప్రకారం 2007-08లో 16335 మెగావాట్లు అదనపు విద్యుదుత్పాదన శక్తి లక్ష్యానికి గాను తర్వాత 12039 మెగావాట్లకు తగ్గించగా, సాధించింది 9263 మెగావాట్లు మాత్రమే. మంచం కోళ్ల కథ గుర్తొస్తుంది కదూ? పోనీ, 2008-09లో నైనా సాధించామా? లక్ష్యం 11,061 మెగావాట్లు సాధన 7530 మెగావాట్లు. ముందు సంవత్సరంతో పోలిస్తే లక్ష్యాన్ని తగ్గించారు, సాధించిందీ తగ్గింది. ఈ లెక్కన 11వ ప్రణాళిక లక్ష్యమూ కొండెక్కినట్లే. పోనీ, సాధించిన మేరకు వినియోగదారులకు అందుతుందా? ఇక్కడో మెలిక ఉంది. ఒక ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేస్తే, ఆ ప్రాజెక్ట్ స్థాపిత శక్తి ఎంత ఉందో, అంతా అందుబాటులోకి వచ్చినట్లు చాటింపు వేస్తుంది. కాని వాస్తవం వేరు. దానికో నిర్వచనం ఉంది. అదే మానిటర్డ్ కెపాసిటీ. అంటే స్థాపిత శక్తి ఎంత మేరకు అందుబాటులోకి, ఆచరణలోకి

పడాల జోగారావు

కవి, రచయిత, శ్రీకాకుళం కథా నిలయం మిత్రులలో ఒకరు పడాల జోగారావు (59) అక్టోబర్ 10 రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. మందస కో-ఆపరేటివ్ సొసైటీలో గుమస్తాగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన జోగారావు గత ఇరవై ఐదు సంవత్సరాలుగా శ్రీకాకుళం జిల్లాలో ప్రజా ఉద్యమాలన్నిటితో సన్నిహితంగా ఉన్నారు. చాలా కాలం విప్లవ రచయితల సంఘంలో సభ్యుడుగా కొనసాగారు. నిరంతర అధ్యయన శీలిగా రాష్ట్రంలోని ప్రముఖ రచయితలు ఎందరితోనో ఆయన సుదీర్ఘమైన లేఖా సంభాషణలు జరుపుతుండేవారు. ఆయన రాసిన ఎన్నో కవితలు, కథలు, సమీక్షలు అచ్చయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ కో-ఆపరేటివ్ సొసైటీలో ప్రజాజీవితాన్ని నిశితంగా పరిశీలించిన అనుభవాలను కథలుగా మలచాలని మిత్రులతో పంచుకుంటుండే వారు. కుటుంబంలో ఆర్థిక సమస్యలు, కలతలు ఉన్నప్పటికీ జిల్లాలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమ, సాహిత్య కార్యకలాపాలలో క్రియాశీలమైన భాగస్వామ్యం పంచుకునేవారు. కథా నిలయం సమీపంలోనే నివసించడం వల్ల కూడా ఆ సాహిత్య కార్యక్రమాలన్నిటిలోనూ భాగం పంచుకునేవారు. గత కొంతకాలంగా మానసిక ఘర్షణకు లోనవుతు నిరాశా నిర్లిప్తతలను మిత్రుల దగ్గర వ్యక్తం చేస్తూనే, వాటి నుంచి బయటపడి పూర్తికాలం రచనకు కేటాయిస్తానని వాగ్దానం చేస్తుండే వారు. శ్రీకాకుళం జిల్లాలో వీక్షణం చందాదారులను చేర్పించడం, వీక్షణాన్ని ప్రచారం చేయడం తన బాధ్యతగా ఎంచుకున్నారు. వీక్షణం సంపాదకవర్గ సభ్యులు శ్రీకాకుళం వెళ్లినప్పుడు తన ఇంట్లోనే ఆతిథ్యం ఇచ్చేవారు. నైరాశ్యాన్ని అధిగమించలేని ఏ బలహీన క్షణంలోనో ఆత్మహత్యను ఒక నిరసన రూపంగా ఎంచుకున్న జోగారావుకు వీక్షణం జోహార్లు తెలియజేస్తోంది. వీ

వచ్చిందో, దానిని మానిటర్డ్ శక్తి అంటారు. ఉదాహరణకు ఈ నిర్వచనం ప్రకారం 2008-09లో అదనపు విద్యుదుత్పాదన శక్తి సాధించింది 7530 మెగావాట్లు కాదు. వాస్తవంలో వినియోగంలోకి వచ్చింది 3454 మెగావాట్లు మాత్రమే. కాగా ఉత్పాదక శక్తి గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసేటపుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

విద్యుచ్ఛక్తి అంటే మన ఇంట్లో లైట్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, వీథుల్లో దీపాలు మాత్రమే మనకు గుర్తుకొస్తాయి. కాని దేశం ఆర్థిక వ్యవస్థే విద్యుత్ సరఫరా మీద ఆధారపడి ఉంది. పొలాల్లో పంటలు, పరిశ్రమల్లో ఉత్పత్తి విద్యుత్ సరఫరా మీదే ఆధారపడి ఉంది. ఈ రెండింటి మీదే మన స్థూల జాతీయాదాయం పెరుగుదల ఆధారపడి ఉంది. కాగా మౌలిక సౌకర్యాల కల్పనలో విద్యుచ్ఛక్తి ఒక కీలక సౌకర్యం. అలాంటి కీలకావసరాన్ని అంతే కీలకమైన ఉత్పత్తి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి కదా. కాని వినియోగ విలాస వస్తువుల ఉత్పత్తికి, అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులకు, (గ్రామాలకు విద్యుత్ సరఫరా కన్నా వీటికి కరెంట్ సరఫరాయే ప్రాధాన్యం!) నిరంతరాయంగా సరఫరా చేస్తుంటే ఈ ప్రభుత్వం ఏ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఉత్పత్తి పెరిగితే అంటే, ఆర్థిక పరిస్థితి పుంజుకోవాలంటే, స్థూల జాతీయాదాయం పెరగాలి.

ఉదాహరణకు మన జిడిపి 2006-07లో 9.73 శాతం పెరిగిందంటే, ఆ సంవత్సరంలో అదనపు విద్యుచ్ఛక్తి 92.04 శాతం పెరిగిందని, 2008-09లో విద్యుదుత్పత్తి -62.72 కు తగ్గటంతో జిడిపి 6.7 శాతానికి పడిపోయిందని 2008-09 ఎకనమిక్ సర్వే చెబుతోంది. అవే సంవత్సరాల్లో విద్యుదుత్పత్తి 7.29 శాతం నుండి 2.69 శాతానికి పడిపోయింది. కాగా విద్యుత్ రంగంలో వైఫల్యం అంటే ఆర్థికాభివృద్ధి వైఫల్యం అవుతుంది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం పూర్తి చేయడానికి అయిదు లక్షల కోట్ల పెట్టుబడి కావాలి. ఈ ప్రాజెక్టుల నిర్మాణం ఒక పక్క తాబేటి నడకన నడుస్తుంటే, సూపర్ మెగా ప్రాజెక్టులనే స్వర్గానికి అధికారులు నిచ్చెనలు వేస్తున్నారు. థర్మల్ కేంద్రాల నిర్మాణం అంటే బొగ్గు కావాలి. మన దేశంలో బొగ్గు లభ్యత ఎంత క్లిష్టంగా ఉందంటే టాటా లాంటి కంపెనీ ఇప్పటికే 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసుకుంటున్నాయని, ఇక మీదట దిగుమతుల మీద ఆధారపడబోమని, అంటే కొత్తగా థర్మల్ కేంద్రాలు నిర్మించబోమని చెప్పడమే. ప్రభుత్వరంగం సమర్థత గురించి ప్రైవేట్ రంగం కథలు చెబుతారు. ఇపుడు ప్రైవేట్ రంగమే చేతులేత్తేస్తుంటే, మన భవిష్యత్ అంధకారంగా కనపడుతోంది.

ఒక లక్ష మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పాదన చేయాలంటే రోజూ 10 లక్షల టన్నుల బొగ్గు కావాలి. దేశంలో లభ్యమయ్యే బొగ్గు నుసి ఎక్కువగా ఉంటుంది. ఈ నుసిని తగ్గించే యంత్రాలు విస్తారంగా ఏర్పాటు చేయాలి. ఈ లెక్కన 11వ ప్రణాళిక లక్ష్యాన్ని నిలువు లోతున పాతెయ్యాల్సిందే. విద్యుదుత్పత్తి కేంద్రాలను మేము స్థాపిస్తామంటే మేము స్థాపిస్తామని 37 అప్లికేషన్లు వచ్చాయి. మాకు బొగ్గు సరఫరా చేయండంటున్నారు. బొగ్గు గనుల తవ్వకానికి కొన్ని కంపెనీలకు కొన్ని గనులు కేటాయిస్తే వాళ్లు పనే ప్రారంభించలేదు. 2017 నాటికి 350 గెగావాట్ల (గెగా అంటే లక్షలు) విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయడం ఎలా సాధ్యం? కొన్ని రాష్ట్రాల్లో వారి అవసరాన్ని మించిన విద్యుదుత్పాదన జరుగుతోంది. కొరత ఉన్న మన లాంటి రాష్ట్రాలు వారి వద్ద నుంచి యూనిట్ ఎనిమిది రూపాయలు కూడా చెల్లించి కొనుక్కోవాల్సి వస్తోంది. విద్యుచ్ఛక్తి ఒక వ్యాపార వస్తువైపోయింది. విద్యుత్ యంత్రాలు నడపడానికి ఇంజనీర్లు, నిపుణత్వం గల కార్మికులు కావాలి. కాని ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థల్లో పనిచేసేవారిని హెచ్చు జీతాల ఆదాయం ఎరగా వేసి ప్రైవేట్ రంగం గెద్దల్లా తన్నుకుపోతున్నాయి. కాగా సాంకేతిక నిపుణుల కొరత ప్రభుత్వరంగ సంస్థలను వెన్నాడుతోంది. ఇన్ని ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వానికి ప్రైవేట్ రంగం మీద ఎనలేని మమకారం. ప్రభుత్వరంగం కూర్చొంటే లేవలేని పరిస్థితిలో, అయినా విద్యుదుత్పత్తి చేయడం ప్రభుత్వం బాధ్యత కాబట్టి, ప్రైవేట్ రంగాన్ని అనుమతించిందంటే పోనిలే అనుకోవచ్చు. అలాంటపుడు ప్రైవేట్ వ్యక్తిగత సంస్థలు విద్యుదుత్పత్తి చేసినపుడు, వారి అవసరాలు పోను మిగతా శక్తి మొదట ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేయాలని నిబంధన విధించి దేశావసరాల కొరతను ఆమేరకు అధిగమించవచ్చు. కాని ఇటీవల ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించి వారి విద్యుత్ మిగులును ప్రభుత్వానికే దాఖలు పరచకుండా ఎవరికైనా అమ్ముకోవచ్చునని పచ్చ జెండా ఊపడం బాధ్యతగల ప్రభుత్వం చేయాల్సిన పనేనా? వీ

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆదివాసి సంఘాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు నిరసన వ్యక్తం చేస్తున్నారు

ఎవరి ప్రయోజనాలకీ గ్రీన్‌హంట్ ?

ప్రభుత్వం నక్సలైట్ల పేరిట చేపట్టబోతున్న దాడులు రక్తపాతానికి, అన్యాయానికి వేదిక కానున్నాయి. దేశంలోని ప్రధానమైన అటవీ ప్రాంతాలలో, ఆదివాసి ప్రాంతాలలో ప్రభుత్వం చేపట్టబోతున్న మిలిటరీ దాడులను ఆదివాసులు, అటవీ ప్రాంత వాసులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పది రాష్ట్రాల నుంచి కలిసి ఏర్పడిన బతుకుదెరువు ఆత్మగౌరవ ప్రచార జాతీయ ఐక్య వేదిక తీవ్రంగా ఖండించింది. పైకి చెబుతున్న మావోయిస్టుల అణచివేత పేరుతో చేపట్టబోతున్న ఈ దాడి వెనుక అసలు ఉద్దేశం అన్ని రకాల హక్కులను, అసమ్మతిని, ప్రతిఘటనా పోరాటాలను అణచివేసి, గందరగోళానికి గురిచేసి ఇక్కడి ప్రకృతి వనరులను, ఖనిజ సంపదను దోచుకోవడమే లక్ష్యంగా ఉన్నాయని ఈ ఐక్య వేదిక పేర్కొంది. అనుభవంలో ఎదురైన పరిణామాలు ఇవన్నీ నిజమని తేలుస్తున్నాయి.

ప్రభుత్వం వినిపిస్తున్న వాదన ఏమంటే 'మావోయిస్టులపై దాడి ద్వారా ఈ ప్రాంతాలలోని 'పాలనాశూన్యత' ను నివారించి ప్రభుత్వం పనిచేసే విధంగా చేయడం' కానీ ఇది పూర్తిగా తప్పుదారి పట్టించడమే. ఈ ప్రాంతాలలో భారత ప్రభుత్వం చాలా చురుకుగా ఉంది. చాలా సందర్భాలలో తన క్రూరమైన హింసాయుత పద్ధతుల్తో. దీనికి ఉదాహరణగా చెప్పుకోవాలంటే అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాలలో నివసించే మూడు లక్షల కుటుంబాలను ఇక్కడి నుంచి పారద్రోలి అటవీ భూములను స్వాధీనం చేసుకున్నారు. చట్టాలకు ఎటువంటి గౌరవం లేదు. రాజ్యాంగం కల్పించిన రక్షణ, హక్కులు ఈ ప్రాంతంలోని ఆదివాసులకు నిరాకరించారు. నీళ్లు, అడవులు, భూములు (జల్, జంగల్, జమీన్) పై ఆదివాసుల హక్కులను తీవ్రంగా ఉల్లంఘించారు. పోలీసు హింస, అఘాయిత్యాలు, జైల్లో బంధించడాల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వం లేకపోవడంలోనే ఇన్ని ఆకృత్యాలు జరుగుతుంటే ప్రభుత్వం ఉంటే ఇంకెన్ని దుర్మార్గాలు జరుగుతాయోనని ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. దీని అర్థం ఉన్న పాలన కాస్తా మిలిటరీ పాలనగా మారి ప్రజాస్వామ్య ఉల్లంఘనే జరగబోతోందని వారు అభిప్రాయపడుతున్నారు.

మన దేశంలో ఇవాళ నడుస్తున్న ఉద్యమాలన్నీ ప్రజాస్వామిక పాలన కోసం, ఆత్మగౌరవం కోసమే తప్ప అభివృద్ధిపై యుద్ధం కాదు. నిజమైన అర్థంలో అభివృద్ధి అనేది స్థానిక ప్రజలకు వనరులపై, ఉత్పత్తిపై స్వయం నిర్ణయాధికారాన్ని బలపరిచే లక్ష్యంతో ఉండాలి. తరతరాలుగా ఆదివాసులు అటువంటి హక్కుల కోసమే పోరాడారు. మారుతున్న పరిస్థితులలో ప్రజాసంఘాలు ఈ హక్కుల పరిధిని విస్తృతపరిచే లక్ష్యంతో కొత్త చట్టాలు, విధానాల కోసం పోరాడుతున్నాయి. ఇంతకు ముందున్న కనీస వేతనాల చట్టం, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకునే చట్టం, భూసంస్కరణలు, వడ్డీవ్యాపార నియంత్రణ చట్టంతో పాటు పంచాయితీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం, అటవీ హక్కుల చట్టం, పని హక్కు, ఆహార హక్కు వంటి చట్టాలు సాధించుకున్నారు. వారి జీవించే హక్కు, బతుకుదెరువు, భూములు, అడవులపై స్వయం నియంత్రణల కోసం న్యాయబద్ధంగా పోరాడే అవకాశం సాధించుకున్నారు. నిజంగా అభివృద్ధిని సాధించాలనే తపన ప్రభుత్వానికి ఉంటే మొదట ఆదివాసులకు ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘనలను మానుకోవాలి. వనరులపై హక్కులతో సహా కోరుకుంటున్న వసతులు, అభివృద్ధి వారి నిర్ణయాధికారంగా ఉండాలి. అయితే నామమాత్రంగా కల్పించిన హక్కులు కూడా కాలరాశారు. రాజ్యాంగమే ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించే ప్రణాళికలు రూపొందించాలి. మిలిటరీ దళాలతో అభివృద్ధిని అందిస్తామనడం అసంగతం, హాస్యాస్పదం.

ఈ యుద్ధం బడావ్యాపారుల, దేశ విదేశీ పెట్టుబడిదారుల ఆకాంక్షలను ఈడేర్చడానికే గాని 'దేశ భద్రత' కోసం కాదు – నిజంగానే భద్రత కోసం తపన ఉంటే ప్రభుత్వం మైనింగ్ మాఫియాలను, అటవీ మాఫియాలను, నేర స్వభావ ముఠాలను, సాల్వాజుడుం వంటి ప్రైవేట్ సైన్యాలను నిలువరించడానికి తన బలగాలను పంపించాలి, కాని అలాంటి వాళ్లకు కళ్లెం వేయకపోగా, ప్రభుత్వమే వారికి కావలసిన సహకారం అందిస్తోంది. ఎప్పుడైనా జీవనాధారం కోల్పోయి బతుకు దెరువు కోసం పోరాడుతున్నవారు, అడవులు కోల్పోయినవారు, భవిష్యత్తు కోల్పోయి ఉద్యమాలు చేస్తున్న వారిని రక్షించడానికి ప్రభుత్వం రక్షణ దళాలు పంపించిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించుకుంటే, లేదు అనేదే జవాబు. సంపదలు పోగుచేసుకునే బడా వ్యాపారుల లూటీకి ప్రజలను వారి వనరుల నుంచి బేదఖలు చేయడానికి తప్ప భద్రతా దళాలకు వేరే లక్ష్యం లేదు. మైనింగ్, మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్, భూ కబ్జాదారులకు మరిన్ని లాభాలు కలిగించడాన్నే ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధిగా దుష్ప్రచారం చేస్తున్నారు. జీవ వైవిధ్యాన్ని

నాశనం చేసి, ప్రజలను వారి నేల నుంచి విస్థాపన గావించే అటవీ ప్రాజెక్టుల పేరిట అంతర్జాతీయ, ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున గుప్పిస్తున్నారు. అంతర్జాతీయ దోపిడీకి తలుపులు బార్లా తెరుస్తూ మైనింగ్ కోసం, ఖనిజాల కోసం అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలకు భూములు అప్పగించడానికి యుపిఎ ప్రభుత్వం వేగంగా ఒప్పందాలు చేసుకుంటోంది. అయితే అడవులు, భూమి, నీళ్లు, ఖనిజ వనరులు ఎక్కడ ఉన్నాయి అని ప్రశ్నించుకుంటే, అవి గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఆ ప్రజలంతా మావోయిస్టుల నాయకత్వంలోనో, వేరు వేరు ప్రజాస్వామిక ఉద్యమాల నాయకత్వంలోనో, స్పాంటేనియస్‌గా పోరాడుతున్న బృందాలుగానో, వారికి తోచిన విధంగా పోరాడుతున్న వారిగానో ఉన్నారు. వారంతా తమ ఆవాసాల కోసం, వనరుల రక్షణ కోసం, బతుకుదెరువు కోసం ఈ విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. మావోయిస్టుల మీద అణచివేత వెనక దాగి ఉన్న అసలు వ్యూహం అన్ని రకాల పౌర ఉద్యమాలను అణచివేయడానికి, మరింత అధికార దుర్వినియోగానికి, మరింత దుర్మార్గానికి, అన్యాయం చేయడానికి ఉద్దేశించినదే.

మిలిటరీ దాడుల ద్వారా మావోయిస్టులను గానీ, ఎటువంటి ప్రజా ఉద్యమాలను గానీ అణచలేమని ప్రభుత్వానికి బాగా తెలుసు. సాయుధ దళాలకు ఎవరు మావోయిస్టులో, ఎవరు కాదో ఎలా తెలుస్తుంది? వివేచనలేని అణచివేత అమాయకుల ఊచకోతకు, రక్తపాతానికి, మొరటు గెరిల్లా పద్ధతులకు దారితీస్తుంది. భారతదేశ చరిత్రలో కాశ్మీర్ నుంచి నాగాల్యాండ్ వరకు భద్రతా దళాలతో సాగించిన అణచివేత ఫలితాలు మనకు తెలిసినవే. ఎవరిని రక్షించడానికి లక్షలాది దళాలను, ఆయుధాలను, సామగ్రిని ఈ ప్రాంతాల్లో మోహరిస్తున్నారు. వేరే ఏవో ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని చేస్తున్నది కాకపోతే సైన్యంతో ఈ ప్రాంతాన్ని ఎందుకు నింపేస్తున్నారు? ఎవరిని రక్షించడానికి, ఎవరికి సేవచేయడానికి ఇవన్నీ చేస్తున్నారు?

ప్రభుత్వం తన విధాన నిర్ణయాలలో భాగంగానే పౌర సమాజం లోకి మావోయిస్టులు, వారి సానుభూతిపరులు చొచ్చుకుపోతారనే భయాన్నీ, హిస్టీరియానీ వ్యాప్తి చేస్తోంది. ఎటువంటి ప్రతిఘటనను అయినా, అసమ్మతిని అయినా నక్సలైట్ ముద్రో, మావోయిస్టు ముద్రో వేసి అణచివేయడంలో ప్రభుత్వానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. మావోయిస్టు రాజకీయాలు తెలిసినవే. వారి పనుల్లో రహస్యమైనవి ఏమైనా ఉంటే వ్యక్తుల గుర్తింపుకు సంబంధించినవీ, వారి మిలిటరీ వ్యూహాలకు సంబంధించినవే. మేం పని చేసే ప్రాంతాల్లో మావోయిస్టులు మా కార్యక్రమాల్లో చొరబడతారేమోననే భయాలేమీ మాకు లేవు. మా సంస్థలు భిన్న వైఖరులను తీసుకుంటూ ఉంటాయి. వాళ్ల వైఖరులూ స్పష్టమే. కొన్నిసార్లు మేం బహిరంగంగానే వారితో కొట్లాడుతాం. మావోయిస్టుల పేరిట పత్రికల్లో భీతికొల్పే వార్తలను ప్రచురించి, వివిధ రూపాల్లో వ్యక్తమవుతున్న ప్రజల న్యాయమైన ఆకాంక్షలను, ప్రశ్నించడాన్ని, ప్రజా వ్యతిరేకతను, ప్రజాస్వామిక నిరసనను, అసమ్మతిని అన్ని రకాలుగా అణచివేయడానికే ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది.

అంతిమ విశ్లేషణలో దేశంలోని కార్మికులు, రైతులు, ఆదివాసులు, దళితులు, ఇతర అణచివేయబడ్డ వర్గాల ప్రజలు శాంతి న్యాయాలను ప్రజాస్వామిక ఉద్యమాల ద్వారానే సాధించుకోగలరు. ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రజాస్వామిక వాతావరణం ఉండాలి. ఏదైనా ఒక ప్రాంతాన్ని యుద్ధ మండలంగా ఎవరు మార్చినా ఆమోదయోగ్యం కాదు. ప్రత్యేకించి అటవీ ప్రాంతాల్లో ఈరోజు శాంతి నెలకొనాలంటే విభిన్న రాజకీయ శక్తుల మధ్య నిజాయితీతో కూడిన చర్చలు ఒక్కటే పరిష్కారం. అది జరగాలంటే మొదట ఈ భయోత్పాతాన్ని సృష్టించబోతున్న దాడిని వెంటనే ఆపాలి. నిజంగానే ప్రభుత్వానికి ప్రజలను, వారి హక్కులను పరిరక్షించాలనే చిత్తశుద్ధి ఉంటే దాని చర్యలు చట్టం, న్యాయం, ప్రజాస్వామ్యాలకు అనుగుణంగా ఉండాలని – భారత్ జన్ ఆందోళన్, నేషనల్ ఫ్రంట్ ఫర్ ట్రైబల్ సెల్ఫ్ రూల్, జంగల్ అధికార్ సంఘర్ష సమితి (మహారాష్ట్ర), ఆదివాసీ మహాసభ (గుజరాత్), ఆదివాసీ జంగల్ జనజీవన్ ఆందోళన్ (దాద్రా – నగర్ హవేలి), జంగల్ జమీన్ జన్ ఆందోళన్ (రాజస్థాన్), మధ్యప్రదేశ్ జంగల్ జీవన్ అధికార్ బచావో ఆందోళన్, జనశక్తి సంఘటన్ (ఛత్తీస్‌ఘఢ్), పీపుల్స్ అలయన్స్ ఫర్ లైవ్‌లీహుడ్ రైట్స్, ఛత్తీస్‌ఘఢ్ ముక్తిమోర్చా, ఒరిస్సా జన్ సంఘర్ష మోర్చా, కాంపెయిన్ ఫర్ సర్వైవల్ అండ్ డిగ్నిటీ (ఒరిస్సా), ఒరిస్సా జన్ అధికార్ మోర్చా, ఆదివాసీ ఐక్య వేదిక (ఆంధ్రప్రదేశ్), కాంపెయిన్ ఫర్ సర్వైవల్ అండ్ డిగ్నిటీ (తమిళనాడు), భారత్ జన్ ఆందోళన్ (జార్ఖండ్) – సంఘాలు తమ ఉమ్మడి ప్రకటనలో తెలిపాయి.

భారత ప్రధానికి బహిరంగ లేఖ

మావోయిస్టుల అణచివేత పేరుతో ప్రభుత్వం ఒక పథకం ప్రకారం సైనిక, పారా మిలిటరీ బలగాలతో చేపట్టదలచిన దాడి మాకు ఆందోళన కలిగిస్తోంది. ఆదివాసీ ప్రాంతాలు, వారి జనాభా అధికంగా ఉండే ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో భారత ప్రభుత్వం దాడులకు వ్యూహాలు చేస్తోంది. మావోయిస్టు తిరుగుబాటుదారుల ప్రాబల్యం నుంచి ఈ ప్రాంతాన్ని విముక్తి చేయడం తన లక్ష్యంగా ప్రకటించింది. కాని ఈ చర్య వలన ఈ ప్రాంతాల్లోని పేద ప్రజానీకపు మావన హక్కులకు తీవ్ర విఘాతం కలగనుంది. లక్షలాది మంది జీవితాలు, బతుకుదెరువు ప్రమాదంలో పడనున్నాయి. పెద్ద ఎత్తున విస్థాపనకు గురై దీనావస్థకు నెట్టివేయబడతారు. భారత దేశ పేద పౌరుల పట్ల చేపట్టబోతున్న ఈ వేట ఎటువంటి సత్ఫలితాలను ఇవ్వదు సరికదా, ఇది చాలా దుర్మార్గమైన చర్య.

ఇప్పటికే ఈ విషయం ఛత్తీస్‌ఘఢ్, పశ్చిమ బెంగాల్‌ల అనుభవంలో తేలిపోయింది. పారా మిలిటరీ బలగాలు, ప్రభుత్వ కనుసన్నలలో, అండదండలతో తిరుగుబాటు దారులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రైవేట్ సైన్యాల చేతుల్లో ఇప్పటికే సామాన్యులు వందల సంఖ్యలో చనిపోగా, వేలాది మంది విస్థాపనకు గురయ్యారు.

1990ల ప్రారంభం నుంచే నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా పేదరికపు కోరల్లో చిక్కుకుని, దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న దేశంలోని ప్రజలలో అత్యధికంగా ఆదివాసులు మరింత అణచివేతకు

(మిగతా 63వ పేజీలో...)

అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక సంక్షోభపు లోతుపాతులను వివరిస్తూ మన దేశంపై అది కలిగించిన, కలిగించనున్న ప్రభావాన్ని విశ్లేషిస్తున్నారు **అరవింద్**

ముంచుకొస్తున్న మహామాంద్యం

అమెరికాలో సెప్టెంబర్ నెలలో ఐదు ప్రధాన మదుపు బ్యాంకులు కుప్పకూలిన తర్వాత, అతి పెద్ద బ్యాంక్ సిటి కార్డ్ దివాలా తీసిందనీ, ప్రభుత్వం దాన్ని బెయిల్ అవుట్ (రక్షించిందనీ) చేసిందనీ వార్తాపత్రికలు నివేదించాయి. అంతే కాకుండా జనరల్ మోటార్స్, ఫోర్డ్, క్రిస్లర్‌లనే మూడు అతిపెద్ద కార్ల కంపెనీలు పతనం అంచుల్లో ఉన్నాయని అదే నివేదిక తెలిపింది. ఈ కంపెనీలూ, బ్యాంకులే అమెరికా ఆర్థిక వ్యవస్థకూ, ద్రవ్య వ్యవస్థకూ మూలస్తంభాలుగా ఉన్నాయి. ఏకకాలికంగా ఈ నెలలోనే ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు గత ఆరు నెలల కాలంలో రుణాత్మక వృద్ధిరేటును చవి చూసినట్లు నివేదించాయి. యూరప్, జపాన్, అమెరికా, రష్యాలు ఇప్పటికే ఆర్థిక తిరోగమనం (రిసెషన్)లో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్‌మార్కెట్ల పతనం కొనసాగుతూనే ఉంది. బద్దలవుతున్న అమెరికా గృహాల బుడగ, 1930ల మహా ఆర్థిక మాంద్యం నాటి నుండి ఎన్నడూ చూడని విధంగా ప్రపంచ ఆర్థిక, ద్రవ్య వినాశనంగా మారుతూ ఉంది. అంత పరిమాణం గల సంక్షోభం గత 80 సంవత్సరాల్లో ఎప్పుడూ రాలేదు.

ఆఖరి సందర్భంలో సంక్షోభంలో చిక్కుకున్న ఆర్థిక వ్యవస్థల్ని బయటకు లాగటానికి దాదాపు రెండు కోట్లకుపైగా ప్రజల ప్రాణాల్ని బలిగొన్న ప్రపంచయుద్ధం జరిగింది. ఈసారి బాగా ఆకర్షణని (గ్లామర్‌ని) రంగరించుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ ప్రజలకు ఏ బహుమానం ఇస్తుంది? ఇది వేరే రకమైన మారణహోమమా?

అటువంటి చివరి సంక్షోభ కాలంలో అమెరికా లాంటి దేశం కూడా 1930లలో ఆకలి యాత్రల్ని చూడాల్సి వచ్చింది. మనం హిట్లర్, ముసొలినీ లాంటి రాక్షసుల్ని, ఫాసిస్టు ఉగ్రవాద విజృంభణను చూశాం. అప్పట్లో పెట్టుబడిదారీ సంక్షోభంతో పెనవేసుకున్న బీభత్సాన్ని తిప్పికొట్టటానికి ప్రపంచ ప్రజలకు సహాయపడిన సోవియట్ రష్యా ఉంది. నేడు మనకటువంటిదేమీ లేదు.

2003లో ప్రపంచ వ్యాప్తంగా పర్యటించిన 'ప్రపంచవ్యాప్త వ్యవస్థాగత సంక్షోభ అప్రమత్తత' నివేదిక ఇలా పేర్కొంది – 'మనం ఇప్పుడు నిస్సంకోచంగా చారిత్రక దృష్టాంతం లేని యుగంలోకి అడుగిడుతున్నాం. అనేకసార్లు మన పరిశోధకులు వక్కాణించినట్లే గత రెండు సంవత్సరాల్లో, ఆధునిక ఆర్థిక వ్యవస్థ గురించి చేసే ఎటువంటి పోలికైనా సరే భ్రాంతికరంగా ఉంటుంది. ఇది 1929 సంక్షోభాన్ని పునర్నిర్మాణం చేయటం కాదు. 1970ల ఇంధన సంక్షోభాల పునరావృత్తం కాదు. లేదా 1987 స్టాక్ మార్కెట్ సంక్షోభమూ కాదు. ఇది నిజంగా ప్రపంచవ్యాప్త వ్యవస్థాగత సంక్షోభం. చెప్పాలంటే ఈ గ్రహాన్ని ప్రభావితం చేసే సంక్షోభం. గత రెండు దశాబ్దాల్లో దేనిమీదైతే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల పునాదులు సంఘటితపర్చబడ్డాయో అటువంటి దాన్ని ప్రశ్నించే సంక్షోభం.' లుగానో (ఎల్.యు.జి.ఎ.ఎన్.ఒ) నివేదిక ప్రకారం, ఇది 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు, స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ'ల గురించిన రహస్య పరిశోధనా డాక్యుమెంట్. ఇది ప్రధానంగా గ్లోబల్ శక్తులచే అధికారికంగా నియమించబడిన 'వర్కింగ్ గ్రూప్' అనే పేరుతో రాశారు. రాబోయే సంక్షోభం నుంచి పాశ్చాత్య నాగరికతను కాపాడే ఏకైక మార్గం జనాభాను తీవ్రంగా తగ్గించడం. వేరే మాటల్లో చెప్పాలంటే, అశేష జనావళిని సమూలంగా తుడిచిపెట్టడం, జాతి నిర్మూలనం.

ఇది మితిమీరిన భయానక ప్రతిస్పందన కావచ్చు. అయినా, ఇది గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో, రెండో ప్రపంచ యుద్ధం అసంఖ్యాక ప్రజల ప్రాణాల్ని హరించడంలో మహామాంద్యం తరువాత ఏర్పడిన వాస్తవ పరిష్కారం. యదార్థమేమిటంటే, బూర్జువా వ్యవస్థాపన చెంత దీనికి పరిష్కారం లేదు. ముంచుకొస్తున్న ఉపద్రవానికీ, అంతర్ విస్ఫోటకానికి కేంద్ర బిందువు అమెరికాయే అయి ఉండటంతో దీని ప్రకంపనలు ప్రపంచవ్యాప్తంగా ఉంటాయి. ఏ దేశం కాని లేదా ఏ వ్యక్తి కాని దీనికి గురికాకుండా ఉండలేరు. అమెరికా ఆర్థిక వ్యవస్థతో ముడిపడిన దేశాలన్నీ, భారతదేశంతో సహా, తీవ్ర నష్టానికి గురవుతాయి.

గృహాల బుడగ, సబ్‌ప్రైమ్ సంక్షోభం బద్దలవడంతో ఏర్పడిన అమెరికాలోని సంక్షోభం చలనశీలతను మనం పరిశీలిద్దాం.

అమెరికాలో ఇళ్ల ధరలు గణనీయంగా తగ్గడం, వాటికి సంబంధించిన తనఖా చెల్లింపుల లోపాలు, ఆస్తుల్ని బ్యాంకు స్వాధీనం చేసుకోవటాల (ఫోర్ క్లోజర్స్) మూలంగా కొనసాగుతున్న ద్రవ్య సంక్షోభమే సబ్‌ప్రైమ్ (ఉప ప్రధాన) తనఖా సంక్షోభం. ఇది యావత్ ద్రవ్య మార్కెట్ల, ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలపైన ఆటుపోట్ల ప్రభావాన్ని సృష్టించింది. విలువ రూపంలో ఇళ్ల ధరలకు సంబంధించిన మదుపులు గణనీయంగా క్షీణించి, కీలకమైన ద్రవ్య సంస్థల, ప్రభుత్వం స్పాన్సర్ చేసిన సంస్థల ఆరోగ్యానికి ఎసరుపెట్టాయి. ద్రవ్య సంస్థలు లావాదేవీలని కఠినతరం చేయడం వల్ల వ్యక్తిగత, వ్యాపార ఖర్చుల (అంటే ద్రవ్యత్వం) కోసం అందుబాటులో ఉన్న నిధులు తగ్గిపోయాయి. 20వ శతాబ్దంలో

మూలాలు కలిగి ఉన్న ఈ సంక్షోభం 2007, 2008లో ఇంకా అత్యంత ప్రస్ఫుటంగా, ప్రపంచ ద్రవ్య వ్యవస్థలో వ్యాప్తి చెందుతున్న బలహీనతల్ని బహిర్గతపరుస్తూ వివిధ దశల గుండా పయనించింది.

కొనుగోలుదారునికి చెందిన ఎటువంటి సెక్యూరిటీ లేకుండా ఆస్తి కొనుగోలు కోసం ఇచ్చే రుణాల్ని సబ్‌ప్రైమ్ తనఖాలంటారు. 1994లో కేవలం ఐదు శాతంగా (35 బిలియన్ డాలర్లు) ఉన్న ఈ రుణాలు 2006 నాటికి భారీగా 20 శాతానికి (600 బిలియన్ డాలర్లు) చేరుకున్నాయి.

ఈ డిమాండ్ ఇళ్ల ధరలు పెరగటానికీ, వినియోగదారు వ్యయాన్ని పెంచడానికీ ఆజ్యం పోసింది. 1997-2006 మధ్య అమెరికాలో ఇళ్ల ధరలు 124 శాతానికి పెరిగాయి. కొంతమంది ఇళ్ల యజమానులు గృహాల బుడగలో తాము అనుభవించిన పెరిగిన ఆస్తి విలువను తక్కువ వడ్డీ రేట్లకి తమ ఇళ్లకు పునరార్థిక సహాయం కోసం ఉపయోగించు కున్నారు. వినియోగ వ్యయం కోసం నిధులనుపయోగించ డానికి కలపబడిన విలువ ఆధారంగా సెక్యూరిటీ తనఖాలు గైకొంటారు. ఆదాయంలో అమెరికా గృహ రుణాలు 2007లో 130 శాతానికి పెరిగాయి. ఇవే కిందటి దశాబ్దంలో 100 శాతానికి పెరిగాయి. అమెరికన్లు వాళ్లు ఆర్జించిన దానికంటే ఎక్కువగా సంవత్సరానికి 800 బిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. 2008లో అమెరికాలో సగటున ఒక కుటుంబం 13 క్రెడిట్ కార్డులు కలిగి ఉంది. అందులో 40 శాతం బాలెన్సు (ఖాతా నిలవ) తోనే కొనసాగాయి. 1970లో 6 శాతంగా ఉన్న నిలవ నుంచి పైకి పెరిగింది.

రియల్ ఎస్టేట్‌లోని సట్టా వ్యాపారం దీనికి తోడయ్యింది. 2006లో కొనుగోలుచేసిన ఇళ్లు (1.65 మిలియన్ యూనిట్లు) మదుపు ఉద్దేశాల కోసం కొన్నవే కాగా, అదనంగా 14 శాతం (1.07 మిలియన్ యూనిట్లు) విశ్రాంతి గృహాల కోసం కొన్నవి. 2005లో ఇవి రెండూ వరసగా 28 శాతం, 12 శాతంగా ఉన్నాయి. వేరే మాటల్లో చెప్పాలంటే, దాదాపు కొనుగోలు చేసిన 40 శాతం (రికార్డు స్థాయి) ఇళ్లు ప్రాథమిక నివాసం కోసం కానివి.

అమెరికాలో గృహాల బుడగ పేలిపోవడంతో, సబ్‌ప్రైమ్ పైనా, సర్దుబాటయ్యే తనఖాల రేటు (ఎ.ఆర్.ఎం. - అడ్జస్టెబల్ రేట్ మార్ట్‌గేజస్. అంటే మార్కెట్‌పై ఆధారపడ్డ వడ్డీరేట్లు) పైనా అధిక డీఫాల్టులుండటంతో, రమారమి 2005-06లో ఈ సంక్షోభం మొదలైంది. సంక్షోభానికి ముందు ప్రభుత్వ విధానాలు అత్యధిక రిస్క్ (నష్టభయం) ఉన్న రుణాల మంజూరుకు ఊతమిచ్చాయి. ఇంకా సులభతరమైన తొలి నిబంధనల్లాంటి రుణ ప్రోత్సాహకాల్లో పెరుగుదల, ఇళ్ల ధరల్లో పెరుగుతున్న దీర్ఘకాలిక ధోరణి, ఇంకా అతిసానుకూలమైన షరతులతో శీఘ్రగతిన పునరార్థిక సహాయం పొందవచ్చనే నమ్మకంతో రుణ గ్రహీతలు క్లిష్టమైన తనఖాలు కుదుర్చుకోవడానికి ప్రోత్సాహాన్నిచ్చాయి. ఏదేమైనా, ఒకసారి వడ్డీరేట్లు పెరగగానే, అమెరికాలో అనేక చోట్ల ఇళ్ల ధరలు 2006-07లో మధ్యస్తంగా తగ్గడం ప్రారంభించాయి. దీనివల్ల పునరార్థిక సహాయం పొందటం కష్టమైంది. వడ్డీరేట్లపై ఉన్న సులభతరమైన తొలి నిబంధనలు, తిరిగి చెల్లించే గడువు అయిపోవడం తో డీఫాల్టులు, ఫోర్‌క్లోజర్సు (అంటే ఆస్తుల్ని బ్యాంకు స్వాధీనం చేసుకోవడం) నాటకీయంగా పెరిగాయి. ఇళ్ల ధరలు పైకెగసి పోతాయన్న ఆశలు నిరాశయ్యాయి. పైగా ఎ.ఆర్.ఎం. వడ్డీరేట్లు ఇంకా హెచ్చు స్థాయిలో పునర్నిర్మించింది. 2006లో అమెరికాలో శరవేగంగా పెరిగిన ఫోర్‌క్లోజర్స్ 2007, 2008 లలో ప్రపంచవ్యాప్త ద్రవ్య సంక్షోభానికి కారణమయ్యాయి. 2007లో దాదాపు 1.3 మిలియన్ల అమెరికా గృహ ఆస్తులు ఫోర్‌క్లోజర్స్‌కు గురయ్యాయి. ఇది 2006 నుండి 2007 వరకు 79 శాతం పెరిగింది.

మొత్తంగా మిగిలిపోయిన (ఔట్‌స్టాండింగ్) తనఖాల విలువ, నివాస గృహాల కొనుగోలు నిమిత్తం కుటుంబాలు రుణపడినవి, 2006 ఆఖరు నాటికి 9.9 ట్రిలియన్ అమెరికన్ డాలర్లుండగా, 2008 మధ్యంతరానికి ఇది 10.6 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగింది. మరో విధంగా చెప్పాలంటే, ఆ 15 నెలల్లో 10 లక్షల మంది ప్రజలు తమ ఇళ్లను పోగొట్టుకున్నారు.

పైపైకి ఎగిసిపోతున్న గృహ సంక్షోభాన్ని అవగాహన చేసుకోవడానికి, ఈ గృహ తనఖాల్ని ద్రవ్యసాధనాలుగా తిరిగి ప్యాకేజి చేసి, ప్రపంచవ్యాప్తంగా ఇతర బ్యాంకింగ్, బీమా కంపెనీలకు డెరివేటివులుగా విక్రయించారని మనం తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. తనఖా ఆధారిత సెక్యూరిటీలనబడే (ఎం.బి.ఎస్. - మార్ట్‌గేజ్ బాక్డ్ సెక్యూరిటీస్) ద్రవ్య ఉత్పత్తులు (ఫైనాన్షియల్ ప్రాడక్ట్స్) తనఖా చెల్లింపుల నుంచి, ఇళ్ల ధరల నుంచి తమ విలువను రాబట్టుకుంటాయి. ఈ ఉత్పత్తులే అమెరికా గృహ మార్కెట్‌లో మదుపు చేయటానికి ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్య సంస్థలకు, మదుపుదార్లకు అవకాశం కల్పించాయి. ప్రధాన బ్యాంకులు, ద్రవ్య సంస్థలు రుణాలు తీసుకొని ఎం.బి.ఎస్.లలో, అంటే తనఖా ఆధారిత సెక్యూరిటీల్లో భారీగా మదుపు చేసి, 17 జూలై 2008 నాటికి దాదాపు 435 మిలియన్ డాలర్లు నష్టపోయినట్లు నివేదించబడింది.

తత్ఫలితంగా ఏర్పడిన సెక్యూరిటీలనే తనఖా ఆధారిత సెక్యూరిటీలనీ (ఎం.బి.ఎస్.లు), అనుసంగికమైన రుణబాధ్యతలు లేక తనఖా రుణనియమ పత్రం (కొలెటరలైజ్డ్ డెట్ ఆబ్లిగేషన్స్ - సి.డి.ఒ.లు) అనీ అంటారు. ఎం.బి.ఎస్., సి.డి.ఎస్.లకు వాడే ప్రత్యేకమైన పదం తనఖా ఉమ్మడి నిధులు. ఇప్పుడు అత్యధికమైన అమెరికన్ తనఖాలు 'తనఖా ఉమ్మడి నిధుల' ఆధీనంలో ఉన్నాయి. 2008 మధ్యంతరానికి మిగిలి ఉన్న 10.6 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల నివాసయోగ్య తనఖాల్లో 6.6 ట్రిలియన్ డాలర్లు తనఖా ఉమ్మడి నిధుల కింద, 3.4 ట్రిలియన్ డాలర్లు సాంప్రదాయ డిపాజిటరీ సంస్థల కింద ఉన్నాయి.

ఎం.బి.ఎస్., సి.డి.ఒ.ల్లోని మదుపుదార్లు పరపతి నష్ట భయాన్ని తొలగించుకోడానికి 'పరపతి లోపాల బదలాయింపులను' కొనుగోలు చేయడం వల్ల బీమా చేయగలుగుతారు. తనఖా డీఫాల్టులు పెరిగే కొద్దీ, సి.డి.ఎస్.లను జారీ చేసేవాళ్లు తమ ప్రత్యర్థి పక్షాలకి చెల్లించవలసి ఉండే మొత్తం పెరిగిపోయింది. సి.డి.ఎస్.లను జారీచేసినవాళ్లు తమ నిబద్ధతల్ని కాపాడుకుంటారేమోనని మదుపుదార్లు ఆశ్చర్యపోవటం వల్ల ఇది వ్యవస్థ అంతటా అనిశ్చితిని సృష్టించింది. స్వాప్స్ మార్కెట్‌లో నష్టాలు 50 ట్రిలియన్ డాలర్లదాకా ఉండొచ్చని అంచనా వేశారు.

సంక్షోభ కారణంగా ప్రపంచ స్టాక్‌మార్కెట్లపై ఫలితాలు

ఆశ్చర్యకరంగా ఉన్నాయి. 1 జనవరి 2008, 11 అక్టోబర్ 2008 మధ్య అమెరికా కార్పొరేషన్‌లలో స్టాకులున్న (షేర్లు లేదా వాటాలున్న) సొంతదార్లు 8 ట్రిలియన్ డాలర్ల నష్టానికి గురయ్యారు. తమ హోల్డింగుల విలువ రూపంలో 20 ట్రిలియన్ డాలర్ల నుండి 12 ట్రిలియన్ డాలర్లకు క్షీణించాయి. ఇతర దేశాల్లో ఈ నష్టాలు దాదాపు 40 శాతం ఉన్నాయి. స్టాక్ మార్కెట్‌లు నష్టాలు చవిచూడడం, గృహాల విలువలు క్షీణించడం ఆర్థిక వృద్ధికి ఇంజను లాంటి వినియోగదాయ వ్యయాన్ని ఇంకా తగ్గించాయి.

ప్రపంచవ్యాప్తంగా ద్రవ్య సంస్థలు ఆగస్ట్ 2008 నాటికి 501 బిలియన్ అమెరికన్ డాలర్ల కంటే మించిపోయిన సబ్‌ప్రైమ్ సంబంధిత నష్టాల్నీ, వాటి ధరల పతనాన్నీ గుర్తించాయి. ఈ మొత్తం 2 నుండి 3 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. ఫెడరల్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్.డి.ఐ.సి.) వల్ల బీమా పొందిన 8,353 అమెరికన్ బ్యాంకుల లాభాలు కిందటి సంవత్సరంతో పోల్చితే 2007 నాల్గవ త్రైమాసికంలో 35.2 బిలియన్ డాలర్ల నుండి 646 మిలియన్ డాలర్లకు (అంటే 89 శాతం) తగ్గాయి. దీనికి కారణం రుణాల చెల్లింపుల్లో లోపాలు (డీఫాల్టులు), రుణ నష్టాలకు సంబంధించిన నిబంధనలు పెరగటమే. 1990 నాటి నుండి నేటి వరకు బ్యాంకుల త్రైమాసిక పనితీరులో ఇది అధ్వాన్నమైంది. 2007 అంతటా ఈ బ్యాంకులు దాదాపు 100 బిలియన్ డాలర్లు ఆర్జించాయి. 2006లోని 145 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయి లాభం నుంచి 31 శాతం తగ్గుదలయింది. 2008 కి ముందటి సంవత్సరంతో పోల్చితే 2008 మొదటి త్రైమాసిక కాలంలో లాభాలు 35.6 బిలియన్ డాలర్ల నుండి 19.3 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

105 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎచ్.ఎస్.బి.సి. బ్యాంకు వాటా ధరల పతనంతో 2007 ఫిబ్రవరిలో ద్రవ్యరంగం ఈ సంక్షోభ ఫలితాల్ని అనుభవించడం ప్రారంభించింది. మొట్టమొదటిగా ప్రధానమైన సి.డి.ఒ.లు లేదా ఎం.బి.ఒ.లను కూడగట్టుకొన్న ఎచ్.ఎస్.బి.సి. బ్యాంకు నష్టాల్ని ఇంకా తెలియజేయాల్సి ఉంది. 2007లో కనీసం 100 తనఖా కంపెనీల్ని మూసివేయటం, తమ కార్యకలాపాల్ని విరమించుకోవడం లేదా విక్రయించడం జరిగింది. మెరిల్ లించ్, సిటీ గ్రూప్ సి.ఇ.ఒ.లు (ముఖ్య కార్య నిర్వాహక వర్గ అధికార్లు) ఒక వారంలోపుగా తమ పదవులకి స్వస్తి పలకాలనే ఒత్తిడికి గురయ్యారు. అత్యున్నత స్థాయి మేనేజ్‌మెంట్లు దీని బారినుంచి తప్పించుకోలేక పోయాయి. అనేక సంస్థలు విలీన వ్యవహారాల్ని చేపట్టాయి.

మహా సెప్టెంబర్ – అక్టోబర్ 2008 పతనం

ఇదొక డొమినో ప్రభావం (రుణదాతలు, రుణగ్రహీతలు, మదుపుదార్లుగా ప్రతి సంస్థ అనేక మార్కెట్లతో, అనేక సంస్థలు ఒక్కొక్క దానితో అనుబంధితమై, బహిర్గతమై ఉంటాయి. అనేక రిస్కులున్న వ్యవస్థ క్రమబద్ధంగా పనిచేసినంతకాలం ఏమి ఇబ్బంది ఉండదు. కాని ఎటువంటి వైఫల్యమైనా ఏర్పడితే అది అనేక మార్కెట్లను అనేక స్థాయిల్లో ప్రభావితం చేస్తుంది. దీన్నే డొమినో ప్రభావం లేదా అంతుచిక్కని ప్రభావం అంటారు – సి.పి.) మొదట గృహాల బుడగ పేలిపోవటం తనఖాలో మదుపు చేసిన బ్యాంకుల పతనానికి దారితీసింది. తనఖా సంబంధిత ద్రవ్యసాధనాల్లో భారీగా మదుపు చేసిన ద్రవ్య సంస్థలు కుప్పకూలాయి. పరపతి మార్కెట్, ద్రవ్యత్వం క్షీణించటంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి, 'వాస్తవ' (తయారీ లేదా మ్యాన్యుఫ్యాక్చరింగ్) ఆర్థిక వ్యవస్థ పతనం మొదలయ్యింది.

14 సెప్టెంబర్ 2008 న మదుపు బ్యాంకైన 'లేమాన్ బ్రదర్స్' పతనమవటంతో ద్రవ్య తిరోగమనం తీవ్రరూపం దాల్చింది. అమెరికా ద్రవ్య వ్యవస్థ నిర్మాణానికి మూలస్తంభమైన లేమాన్ బ్రదర్స్ 1844లో స్థాపితమై, 639 బిలియన్ డాలర్ల ఆస్తులతో, 25,000 మంది ఉద్యోగులతో పనిచేస్తూ ఉంది. దీని తర్వాత ఐదు ప్రధాన అమెరికా బ్యాంకులు కుప్పకూలి ఒక్క రాత్రికే అదృశ్యమయ్యాయి. లేమాన్ బ్రదర్స్ విచ్ఛిన్నమైంది; బేర్ స్టెయిన్స్‌ను (2008 మార్చిలోనే కుప్పకూలింది), 1914లో స్థాపితమైన మెరిల్ లించ్‌ను బ్యాంకులు స్వాధీనం చేసుకొన్నాయి. 1824లో స్థాపితమైన మోర్గాన్ స్టాన్లీ, 1869లో నెలకొల్పబడిన గోల్డ్‌మాన్ శాక్స్‌లు రెగ్యులర్ బ్యాంకులుగా మారిపోయాయి. మోర్గాన్ స్టాన్లీ వాటా పెట్టుబడిలో 20 శాతాన్ని జపాన్ మిట్ సుబిషి బ్యాంక్ కైవసం చేసుకొంది. 1919లో నెలకొల్పబడిన ఎ.ఐ.జి. (అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూప్) అతి పెద్ద అమెరికన్ బీమా కంపెనీ 16 సెప్టెంబర్‌న దివాలా అంచుల్లో ఉంది. 85 బిలియన్ డాలర్ల సహాయంతో అమెరికా ప్రభుత్వం దీన్ని బెయిల్ అవుట్ చేసింది.

ఇప్పటికే సెప్టెంబర్ 2008 వరకు 81 కార్పొరేషన్‌లు దివాలా కోసం అమెరికా దస్త్రంలో ఉన్నాయి. ఇందులో అమెరికా చరిత్రలోనే అతిపెద్దదైన లేమాన్ బ్రదర్స్ ఉంది. జూలై 2008లోనే 32 బిలియన్ డాలర్ల ఆస్తులతో, అమెరికాలో అతిపెద్ద రుణదాత అయిన ఇండి మాక్ బ్యాంక్ వైఫల్యంతో అమెరికా అతిపెద్ద తొమ్మిదో దివాలాను కనులారా వీక్షించింది. సెప్టెంబర్ మొదట్లో ఎం.బి.ఎస్.ల్లో ఐదు ట్రిలియన్ డాలర్ల పేరుకుపోయిన మిగులుతో ప్రభుత్వంతో స్పాన్సర్ చేయబడి 1970లో ఏర్పడిన ఫ్రెడ్డీ మాక్, ఫానిమాయె తనఖా ఏజెన్సీలు మొట్టమొదటగా దివాలా ప్రకటించుకొని ప్రభుత్వంచే జాతీయం చేయబడ్డాయి. సెప్టెంబర్ ఆఖరులో 307 బిలియన్ డాలర్ల ఆస్తులు కలిగిన అతిపెద్ద 9వ బ్యాంకైన వాషింగ్‌టన్ మ్యూచువల్ దివాలా తీయబడి చౌకధరకి జెపి మోర్గాన్‌కి అమ్ముడుపోయింది. అక్టోబర్ మధ్యలో మరో ప్రధాన అమెరికా బ్యాంక్ వాఛోవియా బ్యాంక్ (1879లో నెలకొల్పబడింది) అమెరికా రాష్ట్రాల్లో అతిపెద్ద పొదుపు, రుణ మొత్తాల సంస్థ పతనమై వెల్స్‌ఫార్గోకు అమ్ముడుపోయింది.

అమెరికాలో ద్రవ్య వ్యవస్థ పతనం అమెరికా తనఖా మార్కెట్‌లో భారీగా మదుపు చేసిన యురపియన్ ద్రవ్య వ్యవస్థను బ్రహ్మాండంగా ప్రభావితం చేసింది. మొదటిగా దీని తాకిడికి గురైనవి – గృహ నిర్మాణంలో ప్రత్యక్ష ప్రమేయం కలిగి, తనఖా రుణదాతలుగా పేరొందిన 'నార్తరన్ రాక్', 'కంట్రీవైడ్ ఫైనాన్షియల్' అనే సంస్థలు.

17 ఫిబ్రవరి 2008న బ్రిటిష్ ప్రభుత్వం నార్తరన్ రాక్‌ను జాతీయం చేసింది. అక్టోబర్ మొదట్లో పతనావస్థ నుంచి ఈ బ్యాంక్‌ను

కాపాడటానికి బ్రిటిష్ ప్రభుత్వం 150 బిలియన్ డాలర్లు కుమ్మరించింది. 17 సెప్టెంబర్‌న పతనావస్థలోనున్న స్కాటిష్ బ్యాంకైన ఎచ్.బి.ఒ.ఎస్.ను కాపాడటానికి లోయిడ్స్ దాన్ని స్వాధీనం చేసుకొంది. 29 సెప్టెంబర్‌న యునైటెడ్ కింగ్‌డమ్ (యు.కె.) ప్రభుత్వం బ్రిటిష్ బ్యాంక్ బ్రాడ్‌ఫోర్డ్‌ను బింగ్‌లేలను జాతీయం చేసింది.

స్థానిక ప్రభుత్వాలకే అతిపెద్ద రుణదాతగా ప్రఖ్యాతిగాంచిన డెక్సియా అనే ఒక యురపియన్ బ్యాంక్‌ను రక్షించాల్సి ఉంది. యురపియన్ బ్యాంకుల్లో అతిపెద్దదైన ఒక ఫోర్టిస్ బ్యాంక్‌ను హాలెండ్, బెల్జియం, లక్సెంబర్గ్‌లు చీలికలు పేలికలు చేసి జాతీయం చేశాయి. జర్మనీ 60 బిలియన్ డాలర్లకి తనఖా రుణదాతైన హైపోరియల్ ఎస్టేట్‌ను రక్షించింది. గతంలో పశ్చిమ ఎల్.బి. ని కూడా ఇలానే రక్షించింది. ఇటలీ ఈ భయాన్నుంచి తప్పించుకోవటానికి అతి పెద్ద బ్యాంకైన యూని క్రెడిట్‌లో తన ట్రేడింగ్‌ను విరమించుకోవాల్సి వచ్చింది. ఈ భయాన్ని నివారించడానికి ఐరిష్ ప్రభుత్వం అన్ని బ్యాంకుల డిపాజిటర్లకు గ్యారంటీ కల్పించింది. ఐస్‌లాండ్‌లోని ఆరు ప్రధాన బ్యాంకులు బద్దలయ్యాయి. ప్రభుత్వం ట్రేడింగ్‌ను ఆపివేసి ఒక బ్యాంక్‌ను జాతీయం చేసింది. ప్రభుత్వాలు బ్రిటన్, బెల్జియం, హాలెండ్ బ్యాంకుల వాటాల్ని (స్టేక్స్) కొనుగోలు చేశాయి. జర్మన్ బ్యాంకుల్లోని అన్ని సేవింగ్ ఖాతాలకు గ్యారంటీ కల్పించడానికి జర్మన్ ప్రభుత్వం అసాధారణ చర్యను గైకొంది. అటువంటి చర్యల్నే గ్రీస్, డెన్మార్క్, ఆస్ట్రియాలు చేపట్టాయి. అమెరికా బ్యాంకుల మాదిరిగానే యురపియన్ బ్యాంకులు కూడా తీవ్ర నష్టాలకు గురైనట్లు నివేదించబడింది.

బ్రహ్మాండమైన బెయిల్ అవుట్లు

గతంలో సంభవించిన మహా మాంద్యం లాగ కాకుండా, ఈ సందర్భంలో ప్రభుత్వాలు చిన్నాభిన్నమవుతున్న ద్రవ్య వ్యవస్థకు బాసటగా భారీ మొత్తాల్లో నిధుల్ని కుమ్మరించాయి. ఇది బడా వ్యాపారుల్ని రక్షించటానికి పన్ను చెల్లింపుదార్ల డబ్బుని ఉపయోగించడం తప్ప మరేం కాదు. జాతీయికరణ కోసం దిక్కులు పిక్కటిల్లేటట్లు ఉచ్చారణ చేసిన ప్రైవేటీకరణ మంత్రాన్ని వదిలేశారు. ఇది 'లాభాల ప్రైవేటీకరణ, నష్టాల జాతీయకరణ తప్ప మరేం కాదు.' ఈ నష్టాలు కార్పొరేట్ యజమానుల్ని ఏమి ప్రభావితం చేయవు, దీనవల్ల తీవ్రంగా నష్టపోయేది మాత్రం పొదుపు చేసిన ప్రజలే. అక్టోబర్ ఆఖరు నాటికి అమెరికా, యురపియన్ ప్రభుత్వాలు ప్రకటించిన మొత్తం బెయిల్ అవుట్ ప్యాకేజి భారీగా రెండు ట్రిలియన్ డాలర్లుంది. (2007-08లో 1 ట్రిలియన్ డాలర్లున్న భారతదేశ మొత్తం స్థూల దేశీయోత్పత్తికి ఇది రెండింతలు). సుదీర్ఘ చర్చానంతరం, అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీలు దాదాపు కుప్పకూలడంతో అమెరికా సెనెట్ 700 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజిని (2008-09 సంవత్సరానికి భారత బడ్జెట్ కేవలం 185 బిలియన్ డాలర్లే) ప్రకటించింది. బ్రిటిష్ ప్రభుత్వం 800 బిలియన్ డాలర్ల ప్యాకేజిని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్ 491 బిలియన్ డాలర్లు, జర్మనీ 681 బిలియన్ డాలర్ల ప్యాకేజిని ప్రకటించాయి. ఎ.ఐ.జి.ని రక్షించటానికి 85 బిలియన్ డాలర్లు, ఫానీమాయె, ఫ్రెడ్డీ మాక్‌లను ఒడ్డున వేయడానికి 200 బిలియన్ డాలర్లు వెచ్చించే ప్రణాళికతో అమెరికా బెయిల్ ప్రథమ స్థానంలోకి వచ్చింది. అయితే సమస్యలు పరిష్కారం కావటం లేదు. మనం ప్రెస్‌కి వెళ్లేనాటికి (27 నవంబర్), అమెరికా ప్రభుత్వం 800 మిలియన్ డాలర్లతో కూడిన మరో బ్రహ్మాండమైన ప్యాకేజీని ప్రకటించింది.

అర్థశాస్త్రవేత్తల ప్రకారం ద్రవ్యపర ప్రపంచాన్ని దెబ్బతీసిన భారీ నష్టాల్ని ఇది కనీసంగానైనా తాకలేదు. ఇక పరిశ్రమలు, మాన్యు ఫాక్చరింగ్‌లపై పెరుగుతున్న ప్రభావాన్ని చెప్పాల్సిన పనిలేదు. అమెరికా గృహాల బుడగ మూలంగానే ఏర్పడిన నష్టాలు 3 ట్రిలియన్ డాలర్లని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ సంవత్సర కాలంలోనే తమ విలువని 40 శాతం పోగొట్టుకోవడం, ట్రిలియన్ల కొద్ది డాలర్లు హారతి కర్పూరంలా హరించుకుపోవటానికి దారితీసింది. అయితే అత్యంత హేయమైన నష్టానికి గురైంది సట్టా మార్కెట్‌లోని ప్రధానరంగం డెరివేటివ్‌లే. రెండు దశాబ్దాల క్రితం శూన్యంగా ఉన్న ఈ డెరివేటివ్‌ల మార్కెట్ 2002లో 106 ట్రిలియన్ డాలర్ల నుండి అనూహ్యమైన 531 ట్రిలియన్ డాలర్ల (అమెరికా స్థూల దేశీయోత్పత్తి – జిడిపి కిది 40 రెట్లు ఎక్కువ) స్థాయికి చేరుకొంది. డబ్బు పదే పదే చక్రభ్రమణానికీ, చలామణికీ గురైంది. ఆస్తుల్ని లేదా మదుపుల్ని ఆసరగా పెట్టి రుణాలు స్వీకరించారు. ఇవి మరలా డెరివేటివ్‌ల ద్వారా పైపైకి ఎగసి పెరుగుతున్న రుణాలకు దారి తీశాయి కాబట్టే నిజ ఆర్థిక వ్యవస్థ కంటే ద్రవ్య ఆర్థిక వ్యవస్థ బహుళ విస్తృతి చెందింది. గత ఆరు సంవత్సరాల్లో డెరివేటివ్ మార్కెట్ బుడుగ పెరిగిపోయింది. బహు గొప్పగా పేర్కొనే 'విషతుల్య ఆస్తుల' నష్టాలకు సంబంధించిన అంచనా ఏమీలేదు. అయితే స్వాప్స్ లోని డిఫాల్టులొక్కటే 60 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఐదు సంవత్సరాల క్రితం వారెన్ బఫెట్ (ప్రపంచంలోని అత్యధికమైన ధనవంతుడు) డెరివేటివ్‌ల గురించి ఇలా వ్యాఖ్యానించాడు, 'అశేష జనబాహుళ్యాన్ని తుదముట్టించే ద్రవ్యపర ఆయుధాలు ప్రమాదాల్ని కొనితెస్తూ, ఇప్పుడు నిద్రాణంగా ఉంటూ, శక్తిమంతమైన మరణహేతువులుగా ఉన్నాయి.

కనుక ఇమిడి ఉన్న నష్టాలు అపారమైనవి. ఈ భారీ బెయిల్ అవుట్లు కూడా రుణాలు, నష్టాలు, డీఫాల్టులు వగైరాలనబడే మంచు పర్వతరేణువుని మాత్రమే తాకొచ్చు. ద్రవ్య మార్కెట్‌లోని మందగమనం పారిశ్రామికరంగంపై ఇదివరకే ప్రభావాన్ని చూపడం ప్రారంభించింది. కొన్ని ప్రముఖ కంపెనీలు ఉత్పత్తుల అమ్మకాల్లో తీవ్ర తగ్గుదలనూ, ఇన్వెంటరీల వృద్ధినీ, నష్టాల పెరుగుదలనూ నమోదు చేస్తున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగిత, వేతనాల్లో కోత మార్కెట్లను కుదిస్తూ, అధికోత్పత్తి సంక్షోభాన్ని ఇంకా తీవ్రతరం చేస్తున్నాయి. గనుల్లో, పరిశ్రమల్లో ప్రపంచ (గ్లోబల్) ఉత్పత్తి జనవరి నుండి తగ్గిపోయింది. 2009 మధ్యంతరానికి ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యరంగంలో నాలుగు లక్షల ఉద్యోగాల్ని కోల్పోతాం. మరుసటి సంవత్సరాంతానికి ప్రపంచం 20 మిలియన్ల (రెండు కోట్ల) ఉద్యోగాల్ని పోగొట్టుకొంటుందని అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ – ఐ.ఎల్.ఒ.) వెల్లడించింది. అమెరికాలో కార్లు, ట్రక్కుల అమ్మకాలు 30 శాతం తగ్గిపోయాయి. 2007లో 2.2 మిలియన్లుగా ఉన్న కార్లు, ట్రక్కుల అమ్మకాలు 2008 మొదటి సగంలోనే 0.5 నుండి 1.7 మిలియన్ మధ్యకు పడిపోయాయి. అమెరికాలో అతిపెద్ద ఆటో తయారీ సంస్థలైన

జనరల్ మోటార్స్, ఫోర్డ్, క్రిస్లర్‌లు భారీ నష్టాల్ని చవిచూశాయి. జనరల్ మోటార్స్ (జి.ఎం.) గత సంవత్సరంలో భారీ నష్టాల్ని ఎదుర్కొన్న తర్వాత 2008 మొదటి సగభాగానికి 18 బిలియన్ డాలర్లు పోగొట్టుకుంది. ప్రపంచంలో దశాబ్దాలుగా ఇది అతిపెద్ద కంపెనీ, అదృష్ట శ్రేణిలో ముందుండేది. ఇప్పుడు దివాలా అంచున ఉండి క్రిస్లర్‌తో విలీనం చెందటానికి ప్రయత్నిస్తూ ఉంది.

వస్తువులకు సంబంధించిన అమెరికా బ్రహ్మాండమైన వినియోగదారుగా ఉంది. అనేక దేశాలు తమ ఎగుమతుల కోసం అమెరికాపై ఆధారపడి ఉన్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగించటం తమ మార్కెట్ల కోసం అమెరికాపై ఆధారపడ్డ దేశాల్ని నష్టానికి గురిచేసింది. నిజానికి అమెరికా వినియోగదారులు గత సంవత్సరంలో ఖర్చు పెట్టింది 9.5 ట్రిలియన్ డాలర్లుండగా, ఇదే చైనాలో 1 ట్రిలియన్ డాలర్లు, ఇండియాలో 600 బిలియన్ డాలర్లు వినియోగదార్లు ఖర్చు చేశారు. ఆసియాలో ఎగుమతులు ప్రాంతీయాతీత (పాన్ రీజినల్) స్థూల దేశీయోత్పత్తిలో 40 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ ఎగుమతుల్లో అధికభాగం అమెరికాకు పోయేవే. అనేక సంవత్సరాలుగా సామ్రాజ్యవాద ఆదేశాల్ని శిరసావహిస్తున్న తర్వాత ఈనాడు భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో 40 శాతం దిగుమతులు, ఎగుమతుల నుంచి వస్తుంది. అమెరికా శీఘ్రగతిన ఉద్యోగాల్ని పోగొట్టుకుంటూ ఉంది. ఒక్క సెప్టెంబర్‌లోనే 1,60,000 ఉద్యోగాలు ఊడిపోయాయి. సంవత్సరాల్ని లెక్కలోకి తీసుకుంటే ఇది 7,60,000కు చేరుకుంటుంది. ఇదంతా చైనాతో సహా ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది.

భయభ్రాంతుల్ని చేస్తున్న మాంద్యం

మనం ప్రెస్‌కి వెళుతుండగానే ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ తిరోగమనంలో ఉన్నాయని నివేదికలొస్తున్నాయి.

యూరో (యురపియన్ భాగస్వామ్య దేశాల ఉమ్మడి కరెన్సీ) భాగస్వామ్యం గల 15 దేశాల ఆర్థిక వ్యవస్థ మొట్టమొదటిసారి తిరోగమనంలోకి దిగజారింది. 2008 (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు) ద్వితీయ, తృతీయ త్రైమాసికాల్లో జి.డి.పి. 0.2 శాతానికి పడిపోయింది. తృతీయ త్రైమాసికంలో ఇటలీ జి.డి.పి. 0.5 శాతానికి కుంచించుకుపోయింది. 2008 త్రైమాసికంలో ఐస్‌లాండ్ క్రోనా 40 శాతానికి తగ్గి, 14 శాతం ద్రవ్యోల్బణాన్ని చవిచూసింది. ఈ సంవత్సరంలో ఐస్‌లాండ్ ఆర్థిక వ్యవస్థ దాదాపు 10 శాతానికి కుంగిపోవచ్చు. ఈ సంవత్సరం ప్రథమ త్రైమాసికంలో ఐస్‌లాండ్ ఆర్థిక వ్యవస్థ తన జి.డి.పి.లో 1.5 శాతం మేరకు సంకోచించబడిందని నివేదిక తెలిపింది. జర్మన్ ఆర్థిక వ్యవస్థ ద్వితీయ, తృతీయ త్రైమాసికాల్లో కుంచించుకుపోయి అధికారికంగా తిరోగమనంలోకి చేరింది. ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థ మూడవ, నాల్గవ త్రైమాసికాల్లో 0.1 శాతానికి తగ్గుతుందని భావించడమైంది. ఆ విధంగా అది తిరోగమనంలోకి చేరుకొంటుంది. యు.కె. ఆర్థిక వ్యవస్థ తృతీయ త్రైమాసికానికి 0.5 శాతానికి కుంచించుకుపోయి బాగా దెబ్బతినింది. అక్టోబర్ ఆఖరుకి పౌండు విలువ 1.54 డాలర్లకంటే తక్కువ స్థాయికి పడిపోయింది. 37 సంవత్సరాల్లో ఇది భారీ తగ్గుదల. 1971 నాటి నుండే పౌండ్ బలహీనపడుతూ ఉంది. 800 స్టోర్లున్న అతిపెద్ద రిటైల్ గొలుసు సంస్థ అయిన ఉడ్స్‌వర్త్ దివాలా తీసి, పర్వతంలా పెరిగిపోయిన దాని అప్పుల వల్ల కారుచౌకగా అమ్ముడుపోయింది. మరో గొప్ప సంస్థ మార్క్స్ అండ్ స్పెన్సర్స్ పేరుకుపోయిన నిలవల్ని తొలగించుకోటానికి 20 శాతం మేరకు ధరల్ని తగ్గించింది.

అమెరికా ఆర్థిక వ్యవస్థ తృతీయ త్రైమాసికానికి 0.3 శాతానికి కుంచించుకుపోయింది. కెనడాలో మొదటి రెండు త్రైమాసికాల్లో (2008 జనవరి నుండి జూన్ వరకు) జి.డి.పి. 0.5 శాతం మేరకు తగ్గింది. అతిపెద్ద దివాలాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో తాజాగా అతిగొప్ప అమెరికా బ్యాంక్ అయిన సిటీ కార్ప్స్ చేరింది. దీన్నే ప్రభుత్వం చివరిగా 400 బిలియన్ డాలర్లతో బెయిల్ అవుట్ చేసింది. అమెరికాలో అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటైన డెల్టా ఎయిర్‌లైన్స్ కుప్పకూలగా మరో విమానయాన సంస్థ దీన్ని కొనేసింది. గత రెండు సంవత్సరాల నుంచి నష్టాలను పోగేసుకుంటున్న జనరల్ మోటార్స్ నిరంతర పునర్నిర్మాణ ప్రయత్నాలతో అదే దారిబడుతూ ఉంది. ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యానికి కేంద్ర బిందువుగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ఈ సంక్షోభానికి అంతం అనేది లేదు.

రెండో త్రైమాసికంలో జపాన్ ఆర్థిక వ్యవస్థ 0.7 శాతం మేరకు క్షీణించగా, అమెరికాకు దాని ఎగుమతులు రికార్డు స్థాయిలో భారీగా 21.8 శాతం తగ్గాయి. నవంబర్ 17న జపాన్ ఆర్థిక శాఖ మంత్రి అధికారపూర్వకంగానే దేశం తిరోగమనంలోకి ప్రవేశించిందని ప్రకటించారు. జపాన్ స్టాక్ మార్కెట్ బాగా దెబ్బతిన్నది. నమోదైన జపాన్ కంపెనీల్లో 75 శాతం వాటి ఖాతా విలువ కంటే తక్కువ స్థాయిలో ట్రేడ్ అయ్యాయి.

(ఇంకా ఉంది)

(స్వేచ్ఛానువాదం : **సి. పటేల్**) వీ

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - డిసెంబర్ 2009 : ఇరవై అయిదేళ్ల భోపాల్ దురంతం - బహుళజాతి సంస్థలపై పోరాటం**
- **ఫోకస్ - జనవరి 2010 : చదవవలసిన పుస్తకాలు**
- **తెలంగాణ - కాంగ్రెస్ మోసాల చరిత్ర - ఎం. రాఘవాచారి**
- **తిరోగమన దిశలో నేటి ప్రజా జీవనం - విద్యాభూషణ్**

***పెట్టుబడిదారీ లాభాపేక్ష వల్ల విచ్చలవిడిగా జరుగుతున్న ప్రకృతి వనరుల దోపిడీనీ, తద్వారా ఏర్పడుతున్న పర్యావరణ విధ్వంసాన్నీ వివరిస్తున్నారు* కె. నరేంద్రమోహన్**

వాతావరణం - క్యోటో ఒప్పంద రాజకీయాలు

వీక్షణం మే నెల సంచికలో భూగోళం వేడెక్కడాన్నీ, పర్యావరణ సమతౌల్యానికి పెట్టుబడిదారీ వర్గం సంపద సమకూర్చుకోవడానికి మధ్య ఉండే వైరుధ్యాన్ని పరిచయం చెయ్యడానికి ప్రయత్నించాను. నేపథ్యాన్ని క్లుప్తంగా చెప్పాలంటే కేవలం ఉత్పత్తి సరుకులు – డబ్బు – సరుకులు అన్న పథంలో పయనిస్తే, పెట్టుబడిదారీ విధానం డబ్బు – సరుకులు – డబ్బు+ (ఇక్కడ డబ్బు+ అంటే ముందు పెట్టిన పెట్టుబడి జమ అయిన అదనపు విలవతో కూడుకొన్న మొత్తం) అన్న మార్గంలో పయనిస్తుంది. పెట్టుబడిదారీ పోటితత్వం వల్ల ఈ ప్రక్రియ వేగం పుంజుకుని ఉత్పత్తి, అదనపు విలువ మరింతగా పెరుగుతుంది. అయితే ఈ ప్రక్రియ అప్పుడప్పుడు మాంద్యానికి గురి అవుతూ తిరిగి ప్రక్రియ అంతా పునరావృతం అవుతుంది. తాగినవాడు అరిచి, గొడవ చేసి సొమ్మసిల్లి పడిపోయి, మెలకువ వచ్చిన తరువాత మళ్లీ తాగి గొడవకి దిగినట్లు ఉంటుంది ఇదంతా. ఉత్పత్తిని పెంచుకుని, ఖర్చులను తగ్గించుకునే లాభాల నిరంతర వేటలో సమాజం మీదగానీ, పర్యావరణం పైన గానీ రుద్దగలిగిన ఖర్చులన్నింటినీ 'బాహ్య' ఖర్చులుగా పెట్టుబడిదారీ విధానం పరిగణిస్తుంది. ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం పర్యావరణాన్ని దోచుకుంటుంది. దానిపై యుద్ధానికి దిగుతుంది.

పర్యావరణ వినాశనాన్నే తీసుకుంటే మానవాళిని, ఇతర జీవజాతులను వేధిస్తున్న సమస్యలు కొన్నింటిని చూద్దాం. భూగోళం వేడెక్కడం, ఓజోన్ పొరకు చిల్లు పడడం, జన్యు వైవిధ్యత అంతరించి పోవడం, కొన్ని జాతులు పెద్ద ఎత్తున అంతరించిపోవడం, ఆమ్ల వర్షాలు, అడవులు నరికివెయ్యడం, బాడవ భూముల వినాశనం, ఎడారులు విస్తరించడం, వరద ముప్పు పెరగడం, భూగర్భజలాలు కలుషితం కావడం, అణుపదార్థాలతో కలుషితం కావడం, పురుగు మందుల విషప్రభావాలు, చేపల సంపద తరిగిపోవడం, విషపూరిత వ్యర్థపదార్థాలు, పట్టణాలు కిక్కిరిసిపోవడం... ఈ జాబితా ఇంతటితో అయిపోలేదు. దీనికి మరో వంద సమస్యలను పాఠకులు తేలికగా జోడించగలుగుతారు.

పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం వల్ల పల్లెలకు, పట్టణాలకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడడంతో తీవ్ర జీవావరణ ముప్పు వాటిల్లిందని శాస్త్రజ్ఞులు 19వ శతాబ్దపు ఆరంభంలోనే గుర్తించారు. ఈ సమస్యని గుర్తించిన మొట్టమొదటి వాళ్లలో జస్టిస్ వాన్ లీబిగ్ ఒకరు (చూడండి అతని ఆధునిక వ్యవసాయంపై ఉత్తరాలు). ఆనాటి వ్యవసాయాన్ని భూసారాన్ని దోచుకుని నేల ఎందుకు కొరగాకుండా చేసేదిగా పేర్కొన్నాడు. అతని మాటల్లో : 'అంతే ప్రాంతంలో గతంతో పోలిస్తే ఇప్పటి వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులను, అధిక లాభాలను ఇస్తుందని పేర్కొంటున్నారు. నేను దానిపై వ్యాఖ్యానించదలుచు కోలేదు, దీనిపై దాడికి దిగదలుచుకోలేదు. అయితే ఇది హేతుబద్ధమైన విధానమా, కాదా అన్నది చర్చించాల్సి ఉంది. అధిక దిగుబడులను క్రమేపీ భూమి తన సారాన్ని కోల్పోయి నిస్సారంగా, బీడు భూమిగా మారే పద్ధతుల ద్వారా సాధించినట్లయితే ఇది హేతుబద్ధమైనది కాదని చెప్పాలి. దీని వల్ల వ్యక్తులు మాత్రం లాభాలు దండుకుంటారు.'

ఒకవైపున పల్లెల నుంచి పెద్ద మొత్తంలో ఆహారం, నూలు ఎగుమతి అవుతున్నాయి. ఇంకోవైపున పట్టణాలు వ్యర్థ పదార్థాలతో మునిగి తేలుతున్నాయని లీబిగ్ గమనించాడు. దీనివల్ల భూసారం దెబ్బతింటోందనీ, ప్రత్యేకించి నత్రజనీ, భాస్వరం, పొటాషియం లోపిస్తున్నాయని అతడు గమనించాడు. ఈ మూడు పోషకాలతోనే ప్రధాన రసాయనిక ఎరువులలో అధిక భాగం తయారు కావడం అన్నది యాదృచ్ఛికం ఏమీకాదు.

ఈ సమస్యను ఎదుర్కోటానికి ఇంగ్లండ్ ముందుగా నెపోలియన్ కాలం నాటి యుద్ధ భూముల నుండి పెద్దమొత్తంలో ఎముకలను, పెరు నుంచి (భాస్వరం అధికంగా ఉండే) సముద్ర పక్షుల పెంటను దిగుమతి చేసుకో సాగింది. సముద్ర పక్షుల పెంట ఉన్న దీవులను స్వాధీనం చేసుకోవడానికి ఇంకోవైపు అమెరికా 1856 గ్యానో దీవుల చట్టాన్ని ఉపయోగించింది. ఈ పక్షుల పెంటకి కొరత ఏర్పడినపుడు రసాయనిక ఎరువుల వినియోగం చేపట్టారు. అయితే దీనివల్ల పురుగుల సమస్య ఉధృతమయ్యింది. నదులు, చెరువులు నైట్రేట్లతో కలుషితమయ్యాయి. పర్యావరణ సమస్యలు తీవ్రరూపం దాల్చసాగాయి.

సామాజిక, ఆర్థిక సమస్యలను సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కరించవచ్చన్న ఆలోచనా విధానం ఈ చర్యల వెనకనుంది. ఇప్పటికీ కూడా పర్యావరణ సమస్యల మూలాల్లోకి వెళ్లకుండా, పరిష్కరించకుండా సాంకేతిక పరిష్కారాల కోసం వెతకడమన్న ధోరణే కొనసాగుతోంది. భూగోళం వేడెక్కకుండా ఉండడానికి చూపుతున్న పరిష్కారాలు కూడా మౌలికంగా ఇదే మూసలో ఉన్నాయి.

కొన్ని వివరాలు చూద్దాం. వాతావరణ మార్పుపై అంతర్ ప్రభుత్వ ప్యానెల్ (ఐపిసిసి) 2001లో చేసిన సిఫారసు ప్రకారం ఉష్ణోగ్రతల సగటు పెరుగుదల కనీసం 20 సెంటిగ్రేడ్ కంటే తక్కువగా ఉండాలంటే 2050 నాటికి ప్రపంచం వేడెక్కటానికి కారణమైన వాయువుల విడుదల 60–80 శాతం మేర తగ్గాలి. ఈ వాయువుల విడుదలను

అరికట్టలేకపోతే సముద్రపు నీటిమట్టం ఒక మీటరు వరకు పెరుగుతుందని, వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర ఒడిదుడుకులు సంభవిస్తాయని అది హెచ్చరించింది. ధృవ ప్రాంతాలలో ఉన్న మంచుకొండలు కరగవని అనుకుని సముద్ర నీటమట్టం ఒక మీటరు పెరుగుతుందని ఒక అంచనా వేశారు. ఈ మంచుకొండలే పెద్ద ఎత్తున కరిగితే గాలిలోకి మీథేన్ వాయువు గణనీయ మోతాదులో విడుదలై సముద్రపు నీటి మట్టం 5 మీటర్ల వరకు పెరగవచ్చు. సముద్రపు నీటిమట్టం సగటున ఒక మీటరు పెరిగితే తీర ప్రాంతం 100 మీటర్ల వరకు ముంపునకు గురవుతుంది.

భూగోళం వేడెక్కటం వల్ల జరిగే పరిణామాలు ఇలా ఉంటాయి: సముద్రపు నీటిమట్టం సగటున సంవత్సరానికి 1-2 మిల్లీమీటర్ల చొప్పున పెరగడం, నదులు, చెరువులపై మంచుగడ్డ కట్టే సమయం రెండు వారాల మేర తగ్గడం, ధృవప్రాంతం బయట ఉన్న మంచుకొండలు పెద్ద ఎత్తున కరిగిపోవడం, 1960లతో పోలిస్తే మంచుకింద ఉన్న ప్రాంతం 10 శాతం వరకు తగ్గిపోవడం, ఎల్‌నినో (తీవ్ర తుఫానులు, వరదలు) ఘటనలు గత 20-30 సంవత్సరాలలో మరింత తరచుగా ఎదురుకావడం, ఇవి మరింత తీవ్రరూపం దాల్చడం, వేడి ప్రాంతాల నుండి పక్షులు, చేపలు, పురుగులు వంటివి ఉత్తరార్ధ గోళంలోకి వలసవెళ్లడం మొదలైనవి.

భూగోళం వేడెక్కడాన్ని నివారించడానికి 1992లో ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పునకు చట్రం (యుఎన్ఎఫ్‌సిసిసి) ఏర్పడడంతో మొట్టమొదటి ప్రయత్నాలు మొదలయ్యాయి. భూగోళం వేడెక్కడానికి కారణమయిన కార్బన్ డై ఆక్సైడ్, హైడ్రోకార్బన్ల విడుదలను స్వచ్ఛందంగా తగ్గించుకోవాలని ఇది పేర్కొంది. అయితే స్వచ్ఛందంగా దీనిని సాధించ లేకపోవడంతో 1997లో క్యోటో ప్రోటోకాల్ రూపొందించారు. 2012 నాటికి పైన పేర్కొన్న వాయువుల విడుదల 1990 స్థాయికంటే తగ్గేలా చూడడానికి ఇది చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కాని క్యోటో ప్రోటోకాల్ 2005లో గానీ అమలుకు రాలేదు. అయితే ఈనాటికి కూడా చమురు అధికంగా వాడుతూ, పైన పేర్కొన్న వాయువులను ఎక్కువగా విడుదల చేసే అమెరికా ఈ ఒప్పందం పై సంతకం పెట్టడానికి తిరస్కరిస్తోంది.

ఈ ఒప్పందం తుదిరూపం దాల్చేనాటికి కాలుష్యానికి ప్రధాన కారకులైన దేశాలకు ఒకటి తరువాత ఒకటి మినహాయింపులు ఇచ్చుకుంటూ వెళుతూ చివరకు స్వచ్ఛంద తగ్గింపుల చట్రం కంటే పెద్ద ప్రయోజనకరంగా లేదు. జపాన్ నుంచి వచ్చిన ఒత్తిడి ఫలితంగా 'చట్టపరంగా బద్ధులై' ఉండడాన్ని 'రాజకీయంగా బద్ధులై' ఉండడంగా మార్చారు. తగ్గింపులకు లక్ష్యాన్ని 1990 నాటి స్థాయి కంటే 5.2 శాతం ఎక్కువగా ఉంచారు. అడవులను కార్బన్‌ని పట్టి ఉంచే (సింక్) ప్రాంతంగా గుర్తించారు. తమ లక్ష్యాలను సాధించిన, లేదా దాని నుంచి మినహాయింపు పొందిన దేశాల నుంచి 'కార్బన్ క్రెడిట్లు'ను కొనుక్కునే అవకాశాన్ని అభివృద్ధి చెందిన దేశాలకు కల్పించారు. 2012 తరువాత కాలానికి ఎటువంటి లక్ష్యాలను, ప్రణాళికలను తయారు చెయ్యలేదు.

ఈ ప్రక్రియ అంతటిలో ఏ మాత్రం నిజాయితీ లేదు. 1990కి తీసుకున్న గణాంకాలు సోవియట్ యూనియన్, తూర్పు యూరపు కుప్పకూలిన కాలానికి చెందినవి. ఫలితంగా ఈ దేశాల నుంచి భూగోళాన్ని వేడెక్కించే వాయువుల విడుదల గణనీయంగా తగ్గింది. దాంతో రష్యా, యుక్రెయిన్‌లు తమ కార్బన్ క్రెడిట్లను ఇతర పారిశ్రామిక దేశాలకు అమ్ముకోవచ్చు. యురపియన్ యూనియన్ వేరు వేరు దేశాలుగా కాక ఒక్కటిగా పరిగణింపబడింది. దాంతో తూర్పు జర్మనీలో తగ్గిన వాయువుల విడుదల దానికి క్రెడిట్లుగా మారాయి.

ఈ ఒప్పందం ప్రకారం మూడవ ప్రపంచదేశాల్లో వేడెక్కించే వాయువులను తగ్గించే ప్రాజెక్టులలో కార్పొరేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టడం ద్వారా కార్బన్ క్రెడిట్లను పొందవచ్చు. ఇటువంటి ప్రాజెక్టుల వల్ల ప్రయోజనంతో సంబంధం లేకుండా దాంట్లో పెట్టుబడి పెట్టినందుకు కార్పొరేట్ సంస్థలు కాలుష్యం సృష్టించే హక్కును పొందుతాయి. దండనల విషయానికొస్తే లక్ష్యాలను సాధించడం విఫలమైన దేశాలకు మరింత అధికశాతం తగ్గింపును లక్ష్యంగా ఉంచుతారు. లక్ష్యాలను సాధించడంలో వైఫల్యం చెందిన దేశాలు నష్టపరిహారం చెల్లించాలన్న షరతును ఒదిలేశారు.

దీర్ఘకాలంగా సాగుతున్న ఈ నాటకంలో దారుణమైన విషయం మరొకటి ఉంది. దీనిలోని ప్రతిపాదనలు మహా అయితే ప్రపంచ వ్యాప్తంగా వేడెక్కించే వాయువుల విడుదలను నామ మాత్రంగా తగ్గించే కంటితుడుపు చర్యలు మాత్రమే. ఐపిసిసి మాజీ అధ్యక్షుడు బెర్ట్ బోలిన్ మాటల్లో చెప్పాలంటే - 'వాతావరణంలోకి హరితగృహ వాయువుల విడుదలను అరికట్టడంలో క్యోటో సమావేశం చెప్పుకోదగినది ఏదీ సాధించలేదు. రాబోయే పది సంవత్సరాలలో ఎటువంటి చర్యలూ తీసుకోకపోతే వచ్చే (21వ) శతాబ్దపు తొలి దశకంలో గతంలో మాదిరిగానే వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరుగుతుంటుంది. దేశాల కొత్త సహకారం కుదిరినప్పుడు మాత్రమే సమావేశ లక్ష్యాల వైపు తొలి అడుగు వేసిన వాళ్లం అవుతాం. (సమావేశ లక్ష్యం ఇలా ఉంది: 'వాతావరణ వ్యవస్థలో మానవుల ప్రమాదకర జోక్యాన్ని లేకుండా చేసే స్థాయికి హరితగృహ వాయువుల మోతాదును పరిమితం చెయ్యడం.')

ప్రస్తుత స్థాయి నుంచి 60-80 శాతం తగ్గుదల సాధించాల్సి ఉండగా క్యోటో ప్రోటోకాల్ కేవలం 5.2 శాతం తగ్గింపును లక్ష్యంగా పెట్టుకుంది. దీనిని అమెరికా సమూలంగా తిరస్కరించింది. యూరప్, జపాన్, ఆస్ట్రేలియా దీనికి తూట్లు పొడిచాయి. ఇది పూర్తిగా అమలు అయితే 2100 నాటికి ఉష్ణోగ్రతలో 0.15 సెల్సియస్ సెంటిగ్రేడ్ మాత్రమే తగ్గుదల ఉంటుంది.

చైనా, థాయ్‌లాండ్, భారతదేశం, మెక్సికోలలోని శ్రమ కొట్టాల లోకి పెట్టుబడులు మళ్లుతున్న నేపథ్యంలో మూడవ ప్రపంచం, రష్యా, తూర్పు యూరప్‌ల నుంచి కార్బన్ డై ఆక్సైడ్ విడుదలయి ప్రపంచ స్థాయిలో 58 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. ప్రపంచం వేడెక్కకుండా ఉండడానికి అవసరమయిన 60-70 శాతం తగ్గింపును సాధించాలంటే క్యోటో ఒప్పందం వంటివి కనీసం ముప్పై అయినా అవసరమవుతాయని ప్రిన్స్‌టన్‌లోని నేషనల్ ఓషియానికే అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ కి చెందిన జియోజికల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగశాల డైరెక్టర్ జెర్రీ మాల్‌మాన్ అంటున్నారు.

మానవాళి వినాశనానికి గురయ్యే అవకాశం ఉన్నప్పటికీ చర్యలకు పూనుకోకపోవడానికి కారణం లేకపోలేదు. పరిమిత ప్రకృతి వనరుల

నేపథ్యంలో అపరిమిత ఆర్థిక ప్రగతి సాధించగలమనుకోవడంలోని వైరుధ్యాన్ని గుర్తించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఈ వాస్తవాన్ని గుర్తించినట్లయితే గుత్తాధిపత్య కార్పొరేట్ సంస్థల ప్రస్తుత రాజకీయ – ఆర్థిక ఆధిపత్య ధోరణులకు ప్రత్యామ్నాయాలను నిర్మించవలసి ఉంటుంది. దీనికి పూనుకోవడానికి ఏ ప్రభుత్వమూ సంసిద్ధతను కనబరచలేదు, ఆ సామర్థ్యమూ లేదు.

దీనికి బదులుగా సైన్స్ ఫిక్షన్స్‌ని తలపింపజేసే సాంకేతిక విజ్ఞానాలను ప్రతిపాదిస్తున్నారు. వేడెక్కించే వాయువులను పీల్చి వెయ్యడానికి భూగోళాన్ని రసాయనిక పొరలతో కప్పుతారట. చల్లబరిచి, ఒత్తిడికి గురిచేసిన కార్బన్ డై ఆక్సైడ్‌ని సముద్రంలోకి ప్రవేశపెట్టడానికి ఓడలతో 3 కిలోమీటర్ల పొడవు పైపులను సముద్ర ఉపరితలం మీద లాగుతారట. ఇలాంటివే మరికొన్ని ప్రతిపాదనలు. ఇటువంటి చర్యల వల్ల వేడెక్కించే వాయువులు మరింతగా విడుదల కావటాన్ని అటుంచి, సమస్యను వాతావరణం నుంచి సముద్రంలోకి మార్చడం మాత్రమే అవుతుంది.

మూడవ ప్రపంచ దేశాలకు ముఖ్యమైన మరొక అంశం ఉంది. పర్యావరణానికి హానికరమైన పరిశ్రమలను, వ్యర్థపదార్థాలను బలహీన దేశాలపై రుద్దే సత్తా ప్రపంచ పెట్టుబడికి ఉంది. ఈ ఆలోచన వెనుకనున్న సామ్రాజ్యవాద కుట్రని ప్రపంచబ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త లారెన్స్ సమ్మర్స్ 1991లో రాసిన అంతర్గత ఉత్తరం వెల్లడి చేస్తోంది. ప్రసార సాధనాలకు అందిన ఈ ఉత్తరం పూర్తి పాఠం తప్పకుండా చదవాలి:

తేదీ : 12, డిసెంబర్ 1991 / టు : పంపిణి

నుండి : లారెన్స్ ఎచ్. సమ్మర్స్ – విషయం : జిఇపి

కాలుష్య కారక పరిశ్రమలు : మనలో మనమాట – తక్కువ అభివృద్ధి చెందిన దేశాలకు కాలుష్యకారక పరిశ్రమలను తరలించటాన్ని ప్రపంచ బ్యాంక్ మరింతగా ప్రోత్సహించాలి. దీనికి మూడు కారణాలు ఉన్నాయి –

1. కాలుష్యం వల్ల ఆరోగ్య ఖర్చును, దాని ఫలితంగా సంభవించే మరణం, అనారోగ్యం వల్ల కోల్పోయిన పనిదినాల వేతనాల ఆధారంగా లెక్కగడతారు. ఈ దృష్ట్యా చూస్తే తక్కువ ఖర్చు అయ్యే, అంటే వేతనాలు తక్కువగా ఉండే దేశాలలో ఒక మేరకు కాలుష్యం చెయ్యవచ్చు. విషపూరిత వ్యర్థపదార్థాలను తక్కువ వేతనాలు ఉన్న దేశంలో పడవెయ్యటం వెనక ఉన్న ఆర్థిక సూత్రం బ్రహ్మాండమైంది. దీనిని అమలు చెయ్యటానికి మనం సిద్ధంగా ఉండాలి.

2. తొలి దశలలో కాలుష్యం పెరుగుతున్నప్పుడు ఆ ఖర్చు అంత ఎక్కువగా ఉండదు. తక్కువ జనాభా ఉన్న ఆఫ్రికన్ దేశాలలో చాలా తక్కువ స్థాయిలో కాలుష్యం ఉందన్నది నా అభిప్రాయం. అయితే విచారించదగ్గ విషయమేమిటంటే వ్యాపారానికి సరుకులు ఉత్పత్తి చెయ్యని (రవాణా, విద్యుత్తుత్పత్తి) పరిశ్రమల వల్ల ఎక్కువ కాలుష్యం జరుగుతోంది. అదీ కాకుండా ఘన వ్యర్థపదార్థాలను రవాణా చెయ్యడం చాలా ఖర్చుతో కూడకున్న పని. ఈ కారణంగా వాతావరణ కాలుష్యాన్ని, వ్యర్థపదార్థాలను లాభసాటిగా ఇతర దేశాలకు బదిలీ చెయ్యలేక పోతున్నాం.

3. బాగా సంపన్న ఆదాయం ఉన్నవారు మాత్రమే ఆరోగ్య, రసాస్వాదన (ఈస్థటిక్) దృష్ట్యా స్వచ్ఛమైన వాతావరణాన్ని కోరుకుంటారు. ఒక రసాయనిక మూలం వల్ల పది లక్షలలో ఒకరికి ప్రొస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఈ క్యాన్సర్ సోకే అవకాశం వెయ్యిలో 200 మంది అయిదేళ్ల లోపలే చనిపోయే దేశాలలో కన్న జీవన కాలం అధికంగా ఉన్న దేశాలలో తక్కువ. అదీ కాకుండా గాలిలోకి పరిశ్రమలు వదిలే కాలుష్యం వల్ల మన చూపుకి ఆటంకంగా ఉండే పదార్థాలపైనే అభ్యంతరాలు ఎక్కువ. ఇటువంటి పదార్థాల వల్ల ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చాలా తక్కువ. కాలుష్యం తక్కువగా ఉండే సరుకుల వ్యాపారం సంక్షేమదాయకమే. అయితే ఉత్పత్తి అయిన సరుకులను ఎక్కడికైనా తీసుకు వెళ్లవచ్చుగానీ ఆరోగ్యకరమైన గాలితో వ్యాపారం చెయ్యలేం.

ఈ అంతర్గత ఉత్తరం 1992 ఫిబ్రవరిలో బయటకు వెల్లడైనప్పుడు బ్రెజిల్‌కి అప్పటి పర్యావరణ కార్యదర్శి అయిన జోసె లుటెన్‌బర్గర్ సమ్మర్స్‌కి ఇలా బదులు ఇచ్చాడు: 'మీ వాదన పూర్తి హేతుబద్ధంగా ఉంది. కాని ఇది మొత్తం అసంబద్ధంగా ఉంది. మనం నివసిస్తున్న ప్రపంచం తోటి సాంప్రదాయ ఆర్థికవేత్తలు ఎంతగా పరాయీకరణ చెందారో, వాళ్ల ఆలోచనల రిడక్షనిస్ట్ విధానం, సామాజిక నిర్దయత, అహంకార పూరిత అజ్ఞానం వంటివి ఇది వెల్లడి చేస్తుంది. ప్రపంచబ్యాంక్ మిమ్మల్ని ఉపాధ్యక్షుడుగా కొనసాగిస్తే అది దాని విశ్వసనీయతను కోల్పోతుంది. ప్రపంచబ్యాంక్ మాయమైపోతే మంచిదన్న నా అభిప్రాయాన్ని ఈ ఉదంతం బలపరుస్తోంది.' విచారకరమైన విషయం ఏమిటంటే ఈ ఉత్తరం రాసిన కొద్ది కాలానికే లుటెన్‌బర్గర్ తన పదవిని కోల్పోయారు.

మరి సమ్మర్స్ ఏమయ్యాడు? 2 జూలై 1999న అమెరికా ట్రెజరీకి కార్యదర్శిగా నియమింపబడి క్లింటన్ ప్రభుత్వంలో కొనసాగారు. ఆ తరువాత అతడు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి అధ్యక్షునిగా నియమింపబడ్డారు. జాతీయ ఆర్థిక సంఘానికి డైరెక్టరుగా ఒబామా నియమించారు.

స్వల్పకాలంలో లాభాలు ఆర్జించాలన్న కార్పొరేట్ పెట్టుబడి మొదలుపెట్టిన పర్యావరణ వినాశనాన్ని ఆపడంలో కేవలం సాంకేతిక, చట్టపర చర్యలు సరిపోవని క్యోటో వెల్లడి చేస్తోంది. సుస్థిర ఆర్థిక కార్యకలాపాలకు దశాబ్దాల పాటు దూరదృష్టి అవసరం. ప్రస్తుత చారిత్రక పరిస్థితికి కీలకంగా ఉన్న ప్రైవేట్ యాజమాన్యం, ప్రైవేట్ లాభాపేక్షలను తిరస్కరించకుండా సమాజం, ప్రకృతిలకు మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చలేం. గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానం మానవ సహజ స్వభావం అని కానీ, దీనికి ప్రత్యామ్నాయం లేదని కానీ భావించడానికి కారణాలు ఏమీ లేవు.

'ఒక వ్యక్తిని ఇంకొక వ్యక్తి బానిసగా కలిగి ఉండడం అన్నది ఎంత అసంబద్ధమో, ఒక ఉన్నత సామాజిక – ఆర్థిక వ్యవస్థ ఏర్పడడానికి మనుషులు భూమిని వ్యక్తిగత ఆస్తిగా కలిగి ఉండడం అన్నది అంతే అసంబద్ధం. ఒక సమాజం, ఒక దేశం లేదా అన్ని సమాజాలను కలిపినా కూడా భూమి యజమానులు కాలేరు. తాత్కాలికంగా మాత్రమే వాళ్లు దానిని కలిగి ఉన్నారు, దాని వల్ల ప్రయోజనం పొందుతున్నారు, రానున్న తరాలకు దీనిని మెరుగైన స్థితిలో అందచెయ్యాల్సిన బాధ్యత వీరిపై ఉంది' కార్ల్ మార్క్స్ – పెట్టుబడి సంపుటి 3.

(తెలుగు అనువాదం : **కె. సురేష్**)

పాలకుల కుటిల చర్యలతో ఎస్.ఆర్.సి. సిఫారసులు, రాష్ట్రపతి ఉత్తర్వులు, కమిషన్‌లు నీరుగారిపోయాయనీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ప్రజల సమస్యలకు పరిష్కారమనీ అంటున్నారు టి. శ్రీరామమూర్తి

'జన తెలంగాణ' రాష్ట్రం ఏర్పాటు

ఐదు దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు చేసిన పోరాటాలలో ఐదు వందలమంది అసువులు బాసారు. ఐదు వేల మంది గాయపడ్డారు. జీవితాలు కోల్పోయారు. 1948-51 మధ్య జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మూడు వేలమంది చనిపోయారు. వేల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఈ పోరాటం వెట్టిచాకిరీ నిర్మూలన కొరకు, భూమి కొరకు, భుక్తి కొరకు జరిగిన పోరాటమే. 1948 నాటి విప్లవ పోరాట కాలంలో 'బండెనక బండి కట్టి - పదహారు బండ్లు కట్టి - ఏ బండ్లో వస్తవు కొడకో - నైజాము సర్కారోడా!' అనే పాట ఆనాడు తెలంగాణ పల్లెల్లో మార్మోగింది. మళ్లీ అదే పాట జన తెలంగాణ గుండెల్లో నుండి నేడు వినిపిస్తోంది. అయితే ప్రభుత్వాలే వేరు, ప్రజలు మాత్రం వారు, వారి సంతతీనూ. తెలంగాణ విప్లవమే కామ్రేడ్లను నింగికి తీసుకుని వెళ్లింది. కమ్యూనిస్టులకు చారిత్రాత్మక గుర్తింపునిచ్చింది. వందలాదిమంది నాయకులు అమరులయ్యారు. కానీ నేడు మాత్రం వారి పల్లవిలో తేడా వచ్చింది.

రెండు పెద్ద జీవనదులు 70 శాతం ప్రవహించి, పదకొండు చిన్న నదులు అటూ ఇటూ పొంగుతున్న నేలలో రెండు బహుళార్థ సాధక ప్రాజెక్టులున్న గడ్డమీద ఇంత దుస్థితికి దుఃఖానికి కారణం ఆంధ్రవలస పాలకుల చలువేనని తెలంగాణ ప్రజలంటున్నారు. భాష పేరుతో ఒక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తెలంగాణ భాషను ఛీత్కరించుకుంటున్నారని వారంటున్నారు. 1956 నవంబర్ 1 నడిరేయి దొంగరాత్రి - తెలంగాణ బతుకు తెల్లారిన రోజు అని వారి భావన. అప్పుడు చేసుకున్న పెద్దమనుషుల ఒప్పందం, తమ ప్రజల నాడికి వ్యతిరేకంగా ప్రభువుల మధ్య ఒప్పందం, నిపుణులు చేసిన సూచనలన్నింటినీ నీట ముంచిన ఒప్పందం. పారే నదులున్న భూమిలో బతుకు పారలేదు. తలాపున గోదావరి పారుతున్నా సేను సెలక ఎడారిగా మారింది. 1969 నాటి తెలంగాణ ఉద్యమం హైజాక్ చేయబడింది. నా అన్నవాళ్లే నట్టేట ముంచారు. బుజ్జగింపులు, పదవులు వీలుకాకపోతే అణచివేత విధానాలు ఇవీ పాలకుల ప్రజాస్వామ్యం.

తెలంగాణ చరిత్రను పరిశీలిద్దాం - రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం 1953లో అప్పటి హోం మంత్రి గోవింద వల్లభ పంత్, జస్టిస్ ఫజుల్ అలీ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో మొదట ఎస్సార్సీ నియమించారు. ఈ కమిటీ రాష్ట్రంలోని పలు ప్రాంతాలను పర్యటించి ప్రజలను, నాయకులను కలిసింది. ప్రజల జీవన విధానాలను అధ్యయనం చేసింది. ఇరు ప్రాంతాల ప్రయోజనాల రీత్యా తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ వేర్వేరు రాష్ట్రాలుగా కొనసాగడం మంచిదని సిఫారసు చేసింది. ఇదిలా ఉంటే 1 నవంబర్ 1956న ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి చారిత్రక కారణాల వల్ల ఆంధ్రా తెలంగాణ ప్రాంతాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక వ్యత్యాసాలు నెలకొని ఉన్నాయి. ఆనాటికి తెలంగాణ ప్రాంతం ఆర్థికంగా, సాంస్కృతికంగా వెనుకబడి ఉంది. ఆంధ్రా రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు, వ్యాపారస్తులు, అధికారులు ఆధిపత్యం చెలాయిస్తారనీ, దోపిడీ చేస్తారనీ ప్రజలలో అనుమానాలు ఉన్నందున తెలంగాణ ప్రజల్లో ఉన్న అనుమానాలను దూరం చేయడానికి ఆనాడు తెలంగాణ - ఆంధ్ర రాజకీయ నాయకులు ఒక పెద్ద మనుషుల ఒప్పందం చేసుకున్నారు. తెలంగాణ ప్రజలకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రక్షణ కల్పించడానికి ముల్కీ నిబంధనలు ఏర్పరిచారు. కానీ ముల్కీ నిబంధనలు ఘోరంగా ఉల్లంఘించబడినాయి. పర్యవసానంగా 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముందుకు వచ్చింది. దీనికి ప్రతిస్పందనగా 1972లో జై ఆంధ్రా ఉద్యమం వచ్చింది.

కాంగ్రెస్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణకు ప్రత్యేక రక్షణలు కల్పిస్తూ ఆరు అంశాల కార్యక్రమాన్ని రూపొందించింది. దీనికి అనుగుణంగా రాజ్యాంగంలోని 371డి ప్రవేశపెట్టి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమానతలు నివారించడానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి అనగా కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చారు. భారత రాజ్యాంగానికి ఇదే 32వ సవరణ. ఇది 1 జూలై 1974 నుండి అమలులోకి వచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులో ఒక తెలంగాణకే కాక రాష్ట్రమంతటా ఉద్యోగాలలో స్థానికులకు రిజర్వేషన్ కల్పించారు. విద్యా, ఉద్యోగాలకు సంబంధించి 18 అక్టోబర్ 1975న రెండు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వులు సరిగా అమలు జరగలేదని తెలంగాణ ఉద్యోగ సంఘాలు చేసిన ఆందోళన మేరకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు జి.ఒ. 610 ని 30 డిసెంబర్ 1985న విడుదల చేశారు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వు కాదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించడం జరిగింది. ఈ జి.ఒ. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఐదారు జోన్లకు వర్తిస్తుంది. అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలు ఐదవ జోన్‌గాను, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్గొండ జిల్లాలు ఆరో జోన్‌గా ఏర్పాటు చేశారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘంతో 7 డిసెంబర్ 1985న రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందమే 610 జి.ఒ.

ఈ సంక్షోభానికి మూలాలు పెట్టుబడిదారీ విధానంలోనే ఉన్నాయనీ, ఉత్పత్తితో సంబంధలేని కృత్రిమ పెరుగుదల ఇలాగే కుప్పకూలిపోతుందనీ విశ్లేషిస్తున్నారు **ఆర్.వి. రమణమూర్తి**

నయా ఉదారవాదం - సంక్షోభంలో ఆర్థికరంగం

గత ఆరు నెలలుగా పెట్టుబడిదారీ విధానం నలభైయేళ్లలో ఎన్నడూ ఎదుర్కోని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అమెరికాలో 1930 మినహాయిస్తే ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం 9.5 శాతానికి చేరుకుంది. పది లక్షలకు పైగా ఉద్యోగాలు పోయి ప్రజలు వీథులపాలయ్యారు. ఎనిమిది ట్రిలియన్ల డాలర్లకు పైగా బ్యాంకింగ్ పెట్టుబడులు హరించుకు పోయాయి. 80 శాతం బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఇది అమెరికాలో మొదలైన ప్రపంచీకరణ పుణ్యమా అని ఆ సంక్షోభం ప్రపంచం యావత్తూ పాకింది. యూరప్‌లో తమ ఆర్థిక వ్యవస్థలను రక్షించుకోవడానికి ఆయా ప్రభుత్వాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఏదో కమ్యూనిజమో, ఇస్లామిక్ తీవ్రవాదమో తప్ప, పెట్టుబడిదారీ వ్యవస్థను ఏ శక్తి కదల్చలేదనే విశ్వాసాలకు ఊహించని దెబ్బ తగిలిందనే చెప్పొచ్చు. భారతదేశం ఇంకా చెక్కు చెదరలేదని మన పాలుకులు ఎంత మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించినా పెట్టుబడిదారీ విధాన లోపాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం బహుశా దాని సమర్థకులకు చాలా అవసరం. ఈ సంక్షోభం అసలు ఎలా వచ్చిందో టూకీగా ప్రస్తావించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

సమాజంలోని అన్ని పనులను మార్కెట్లు మాత్రమే సమర్థవంతంగా చేయగలవనీ, ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు నాణ్యతలేని సంస్థలనీ 1970 నుంచి నయా ఉదారవాద సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చింది. దీనికి ఆద్యులు బ్రిటన్‌లోని మార్గరెట్ థాచర్, అమెరికాలో రొనాల్డ్ రీగన్‌లు. ప్రభుత్వరంగ సంస్థలు సూత్రరీత్యా లోపభూయిష్టమైనవనీ, ప్రజలపై పన్నుల భారాన్ని పెంచడం తప్ప సమాజానికి ఎలాంటి సంక్షేమం జరగదనీ థాచర్ – రీగన్ ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని తీవ్రంగా నిందించి, కుదించి ఆయా సంస్థల ప్రైవేటీకరణను 1980 దశకంలో పెద్దఎత్తున చేపట్టారు. పన్నులు తగ్గించి, ప్రజల సొమ్మును పెట్టుబడులకు ప్రోత్సహించి, మార్కెట్ రంగానికి కావల్సినంత స్వేచ్ఛనీయడం ద్వారానే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని నయా ఉదారవాదం నమ్ముతుంది. దీనికి నోబెల్ బహుమతి గ్రహీత మిల్టన్ ఫ్రీడ్‌మన్ పితామహుడుగా చెప్పవచ్చు. ప్రభుత్వరంగం జోక్యం అంటేనే అది ప్రమాదకరమైన సామ్యవాదమనీ, ప్రభుత్వం జోక్యం గానీ, ప్రభుత్వ నియంత్రణ గానీ మార్కెట్లకు పెద్దగా అవసరం లేదనీ అమెరికాలో ఓ ఉద్యమాన్నే సృష్టించారు. ఇది చివరకు యూరప్‌కు, మూడవ ప్రపంచ దేశాలకూ పాకింది. ట్రేడ్ యూనియన్లపై కూడా ఈ ప్రభుత్వాలు విరుచుకుపడ్డాయి. కార్పొరేట్ లాభాలు అప్రతిహతంగా సాగడానికి ట్రేడ్ యూనియన్లు కూడా అడ్డంకి అని 1984లో బ్రిటన్‌లో జరిగిన బొగ్గుగని కార్మికుల సమ్మెను అత్యంత క్రూరంగా అణచివేసిన ఘనచరిత్ర మార్గరెట్ థాచర్‌కే చెందుతుంది. ఈ విధంగా బడా కార్పొరేట్ కాపిటలిస్ట్ వ్యవస్థకు ఐడియలాజికల్‌గా పునఃప్రతిష్ట జరిగింది.

గత నలభై సంవత్సరాలలో పెంపొందిన కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థకు, దాని జూదపూరితమైన నైజానికి మూడు భూమికలు ఉన్నాయని చెప్పుకోవచ్చు. మొదటిది, 1972లో బంగారం – డాలర్

---

18 అక్టోబర్ 1975 తరువాత జోనల్ విధానానికి విరుద్ధంగా 5, 6 జోన్లకు కేటాయించిన ఉద్యోగులను వారి వారి జోన్లకు 31 మార్చ్ 1986లోపు పంపించాలి. రాష్ట్రపతి ఉత్తర్వులు ఇరవై సంవత్సరాలైనప్పటికీ అమలు కాకపోవడంతో 1996 నుండి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం పునరావృతం అయింది.

రాష్ట్రపతి ఉత్తర్వులు, 610 జిఒ తీవ్రంగా ఉల్లంఘించబడిందనే ఆరోపణలపై విచారించడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 20 మే 2001లో గిర్‌గ్లాని అనే ఐఎఎస్ మాజీ అధికారి ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్ నియమించారు. 610 జి.ఒ.లో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగాయని గిర్‌గ్లాని కమిషన్ 30 సెప్టెంబర్ 2004న సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. తన నివేదిక 705 పేజీలతో మూడు సంపుటాలుగా ఉంది. ఉల్లంఘనలు 18 రకాలుగా ఉన్నాయని వివిధ శాఖలలో 126 ఉల్లంఘనలు జరిగాయని, ఆరు అంశాల కార్యక్రమం, రాష్ట్రపతి ఉత్తర్వులు, 610 జి.ఒ.ల మధ్య తేడాను గమనంలోకి తీసుకోలేదని, రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా హైదరాబాద్ నగరాన్ని 7వ ఫ్రీ జోన్‌గా ప్రకటించి ఉద్యోగ నియామకాలు జరిగాయని పేర్కొన్నారు. పాలకవర్గాల దొంగాట – రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన జరిగింది. గిర్‌గ్లాని తన నివేదికలో ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలు సూచించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు పర్యవేక్షణా సంస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేసినా, కమిషన్లు వేసినా, రెండో ఎస్సార్సీ వేసినా ప్రయోజనం లేదు, కాలయాపన మాత్రమే. తెలంగాణ ప్రజలు దగాపడుతూనే ఉన్నారు. నిపుణులతోనూ, మేధావులతోనూ చర్చించి జన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయడమే పరిష్కారం. వీ

స్థిరమారక విలువ వ్యవస్థను అమెరికా ప్రెసిడెంట్ నిక్సన్ రద్దు చేసి విదేశీ మారకపు మార్కెట్‌కు బీజాలు పోశాడు. అంతర్జాతీయ వస్తు వాణిజ్యానికి సహకరించాల్సిన డాలర్ స్పెక్యులేటివ్ మార్కెట్లకు పరుగు తీసింది. దీంతో బ్యాంకులు, కేంద్ర బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు అన్నీ కూడా వాణిజ్యానికి కావల్సిన దానికంటే మార్కెట్‌లో ఒడిదుడుకులకు లోనవుతున్న మారకపు విలువ నుంచి వచ్చే నష్టాలను భరించడానికి డాలర్ రిజర్వులను సమకూర్చుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. సప్లై – డిమాండ్ శక్తులకు అతీతంగా అంతర్జాతీయ విదేశీ మారకపు మార్కెట్ పయనించింది. ఇది చాలా గొప్ప వ్యవస్థ అని ఐ.ఎం.ఎఫ్. దీన్ని అన్ని దేశాలపై బలవంతంగా రుద్దింది. ప్రపంచ దేశాలన్నీ క్యాపిటల్ ఎకౌంట్స్‌ను సరళీకృతం చేసి, అంతర్జాతీయ ప్రవాహాలకు గేట్లు తీశాయి. డాలర్లు లోపలికి ప్రవహించినపుడు సంతోషం, డాలర్లు బయటకు వెళ్లినప్పుడు చతికిలపడడం మొదలైంది. బడాబాబులు బాగుపడ్డారు. ఈ విధంగా ఇది ఆర్థిక వ్యవస్థను ద్రవ్యీకరణ వైపు తీసుకువెళ్లే అస్థిరతకు గురిచేసిన ప్రథమ భూమిక.

ఇక రెండవ భూమిక, 1983 నుంచీ అమెరికన్ ఫెడరల్ బ్యాంక్ ఛైర్మన్ అలెన్ గ్రీన్‌స్పాన్ అమలు చేసిన ద్రవ్యవిధానం, ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకారి ద్రవ్యోల్బణమే అని, దాన్ని నియంత్రించడానికి ఆర్థిక వ్యవస్థలో అతిగా డబ్బు ప్రవహించకూడదని చెప్పి ప్రభుత్వాల ద్రవ్యలోటును తీవ్రంగా తగ్గించి, ముఖ్యంగా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి కూడా మిగలకుండా ప్రభుత్వ ఖర్చులను తగ్గించారు. విద్యా, వైద్య సంస్థలను ప్రభుత్వం పోషించదని మార్కెట్లలో నిధులు వెతుక్కోమని ప్రోత్సహించారు. ప్రభుత్వరంగం నిష్క్రమించిన తర్వాత ఈ డబ్బంతా ప్రైవేట్ రంగానికి అతి తక్కువ వడ్డీ రేట్లకు అందచేయాలని గ్రీన్‌స్పాన్ నమ్మాడు. ఆ దిశగా వడ్డీరేట్లను అత్యంత తక్కువ స్థాయికి తీసుకువెళ్లాడు. కానీ వడ్డీరెట్ల పైన ఆధారపడ్డ బ్యాంకింగ్ వ్యవస్థ దీంతో సంక్షోభంలో పడడం మొదలుపెట్టింది. దీన్నించి గట్టెక్కడానికి బ్యాంకులు అడ్డదారులు తొక్కి, రకరకాలైన ఫైనాన్షియల్ సర్వీసులను టోటల్ బ్యాంకింగ్ పేరుతో ప్రారంభించాయి. వీటిపై కమిషన్‌లు సంపాయించి లాభాలను ఆర్జించే దిశగా బ్యాంకింగ్‌రంగం సిద్ధమయ్యింది. గ్రీన్‌స్పాన్ చూస్తూ ఊరుకున్నాడు. అమెరికాలో ఉన్న ఉత్పత్తి అంతా కూలీరేట్ల ఖర్చులు తగ్గించుకునే దిశగా ఇతర దేశాలకు ఎగుమతి కావడంతో, బ్యాంకింగ్ రంగానికి ఇంకో మార్గం లేక గృహ వినియోగ రుణాలను ఇవ్వడానికి ఎగబడింది. ఉద్యోగం వచ్చిన ప్రతి కుర్రకారుకు వెంటనే బ్రహ్మాండమైన ఇంటినీ, ఓ కారునీ, విలాసవంతమైన జీవితానికి క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలిచ్చి 'అమెరికన్ డ్రీమ్' వైపుకు నడిపించారు. ఇంటికి కావల్సిన రుణాలను తాడు బొంగరం లేని సామాన్యుడికి కూడా పిలిచి కట్టబెట్టి రియల్ ఎస్టేట్ బూమ్‌ను 1990ల నుంచి సృష్టించారు. స్వల్పకాలంలో రియల్ ఎస్టేట్ పెరుగుదల చూపించి ఇదంతా నిజమైన అభివృద్ధిగా అరచేతిలో వైకుంఠాన్ని చూపారు.

సంక్షోభానికి మూడవ భూమిక సెక్యురిటైజేషన్. ఇంకా దీనికి తెలుగులో పదం లేదు. ఎందుకంటే అది అంతా కంగాళీ వ్యవహారం. బ్యాంకులు రుణాలిచ్చి ఇళ్లు కొనుక్కోమని చెప్పి, పెరిగిన క్యాపిటల్ వాల్యూ మీద ఇంకా అదనంగా రుణాలివ్వడం మొదలుపెట్టారు. పైగా రుణాలను వేరే బ్యాంకులకు అమ్మడం మొదలుపెట్టారు. వాటికి ఫైనాన్షియల్ ప్రోడక్ట్స్ అని పేరు పెట్టి వాటికి ఇంత వడ్డీ వస్తుందనీ, ఈ రేట్లో క్యాపిటల్ వాల్యూ పెరుగుతుందనీ వాటికి ఒక ఫ్యూచర్స్ మార్కెట్ సృష్టించారు. ఈ ఫ్యూచర్స్ మార్కెట్ ధరలు పెరగడం చూసి, వాటికి భూమిక అయిన ఇళ్ల విలువలు కూడా పెరగడం మొదలుపెట్టాయి. ఇట్లా ఒక బ్యాంక్ మరో బ్యాంక్‌కు వాటిని అమ్మడం, ఆ ప్రక్రియ ద్వారా మార్కెట్ విలువలను అసహజంగా పెంచుకోవడం చేశాయి. వీటిలో డబ్బు పెట్టడానికి లెమ్మాన్ బ్రదర్స్ లాంటి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు పుట్టుకొచ్చాయి. ఉన్న ఒక్క అసెట్ అయిన ఇళ్లు మీద ఇచ్చిన రుణాలను మళ్లీ ఎక్కువ ధరకు అమ్మే ప్రక్రియకే సెక్యురిటైజేషన్ అని నామకరణం చేశారు. అంతుపట్టని ఫైనాన్షియల్ ప్రోడక్ట్స్‌ని చేసి ఇవన్నీ ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడంతో హౌసింగ్ మార్కెట్‌లో సూపర్ బుడగలు ఏర్పడ్డాయి. క్షేత్రస్థాయిలో బ్యాంకులు కొత్త రుణాలు ఇచ్చిన కొద్దీ ఈ హౌసింగ్ ధరలు ఆకాశంలోకి పెరుగుతూ పోయాయి. ఇంక బ్యాంకులు రెచ్చిపోయి ప్రతి అనామకుడికి రుణాలు ఇవ్వడంతో కథ అడ్డం తిరిగింది. ఈ రుణగ్రహీతలు ఉద్యోగాలు లేక అప్పుకట్టకపోవడంతో బ్యాంకులు ఆ ఇళ్లను స్వాధీనం చేసుకొని వేలం వేయడం చేసింది. ఈ వేలం మొదలుకాగానే, ఇళ్ల రియల్ ఎస్టేట్ విలువలు కొనేవాళ్లు లేక కుదేలుపడ్డాయి. దీన్నే సబ్‌ప్రైమ్ క్రైసిస్ అంటున్నారు. అయితే ఎంత వేగంగా ఇళ్ల విలువలు పడిపోయాయంటే ఒక్క వారంలో అమెరికాలో అత్యంత పెద్దవైన ఎనిమిది ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల 600 బిలియన్ డాలర్ల అసెట్లు పతనమై ఖాయిలా పడ్డాయి. ఈ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు యూరప్, చైనా, జపాన్‌లు కాకుండా ప్రపంచంలో నలుమూలల నుంచి డబ్బు తెచ్చి సెక్యూరిటీ మార్కెట్లలో పెట్టుబడి పెట్టాయి. దీని ఫలితంగా అన్ని దేశాలకు దీని ప్రభావం పాకింది. దీనికి తోడు బ్యాంకింగ్ రంగం సంక్షోభం వల్ల వేలాది ఉద్యోగులు వీథిపాలయ్యారు. దీనికి పర్యవసానంగా అన్ని రంగాల్లో డిమాండ్ పడిపోయింది. హౌసింగ్ రంగం డీలా పడడంతో స్టీల్, సిమెంట్, సర్వీసులు, ఇన్స్యూరెన్స్, రవాణా వగైరా సంస్థలన్నీ కుదేలయినాయి. మార్కెట్లకు తిరుగులేదనీ, ప్రభుత్వాలు లూటీకోరులనీ కోడై కూసిన ప్రైవేట్ సంస్థలు ఆ ప్రభుత్వాల ముందే రక్షించమని క్యూలు కట్టాయి. అయితే అమెరికా ఉత్పత్తి వ్యవస్థను సమూలంగా సంస్కరిస్తేగాని పరిష్కరించబడని జటిలమైన సమస్య ఇది. అమెరికాలో బ్యాంకులన్నీ ప్రభుత్వ రంగానికి అప్పచెప్పాలని చాలా మంది ఆర్థికవేత్తల అభిప్రాయం.

పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభ మూలాలు మరెక్కడోలేవు. అందులోనే ఉన్నాయి. ముఖ్యంగా ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో బ్యాంకులు పెద్ద ఎత్తున పెట్టుబడి సమకూరుస్తాయి. కాని ఉత్పత్తి ప్రాసెస్‌లో నుంచి వెళ్లేవరకు అది ఒక కల్పిత పెట్టుబడి. డబ్బు దానికంతగా విలువనివ్వదు. సమాజంలో వస్తు ఉత్పత్తి ఉంటేనే ఆ వస్తు ఉత్పత్తి మారకపు విలువకి ప్రమాణం. కావల్సినంత వస్తు ఉత్పత్తి జరగకపోతే, అరువు ఇచ్చిన డబ్బు విలువ పునరుత్పత్తి జరగదు. దాంతో వ్యాపారాలు ఖాయిలా పడడం లేదా, ద్రవ్యోల్బణం పెరగడం కానీ జరగవచ్చు. దీన్ని నియంత్రించడానికే సెంట్రల్ బ్యాంకులు ఏర్పడ్డాయి.

అవి ముఖ్యంగా బ్యాంకింగ్‌రంగం శక్తికి మించి రుణాలు ఇవ్వకుండా నియంత్రించే బాధ్యత చేపట్టాయి. కానీ రుణాలు కదలకపోతే బ్యాంకులకు కష్టం. ఖాతాదార్లకు వడ్డీలు కట్టాలి. కాబట్టి అది సెంట్రల్ బ్యాంక్స్ పెట్టిన ఆంక్షల పరిధిలో నడుచుకుంటే వాటికి కావల్సిన లాభాలు రాకపోవచ్చు. అందువల్ల గీసిన గీత దాటి రుణాలు ఇచ్చే తత్వం ప్రైవేట్ బ్యాంకులకు ఉంటుంది. ఈ ఫైనాన్షియలైజేషన్ క్రమంలో ఈ రంగాన్ని నియంత్రించే శక్తిని ప్రభుత్వాలు నయా ఉదారవాద భావజాల పుణ్యమా అంటూ కోల్పోయాయి. అది గృహ రుణాలు కావచ్చు, షేర్ మార్కెట్ కావచ్చు. నిజమైన అభివృద్ధి లేకుండా బూమ్‌లు సృష్టించి, వాటికి పెట్టుబడి ఫైనాన్షియల్ రంగాలు సమకూర్చడం గత ముప్పై ఏళ్లుగా బాగా అలవాటు పడ్డాయి. ఈ అలవాటును అమెరికా అన్ని దేశాలకు అంటకట్టింది కూడా. అందువల్లే ఎక్కడో అక్కడ ద్రవ్య సంక్షోభం వస్తూనే ఉంది. 1982 సౌదర్న్ కోన్ క్రైసెస్, 1984 మెక్సికో చెల్లింపు సంక్షోభం, బి.సి.సి.ఐ. లాంటి బ్యాంకులు ఖాయిలా, 1990లో జపాన్ హౌసింగ్ సంక్షోభం, డాట్‌కామ్ సంక్షోభం, 1997 తూర్పు ఆసియా సంక్షోభం, 2008 నార్దర్న్‌రాక్ బ్యాంక్ ఖాయిలా, 2009 అమెరికన్ ఫైనాన్షియల్ సంక్షోభాలన్నీ ఈ కొత్త ఆర్థిక వ్యవస్థలో భాగమే.

అయితే అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత క్షీణించినా, ఇతర ప్రత్యామ్నాయాలు బలంగా లేకపోవడం వల్ల పూర్తిగా కూలిపోయే అవకాశం లేదు. అమెరికా, చైనా, జపాన్ లాంటి దేశాలకు కట్టాల్సిన (12 ట్రిలియన్ డాలర్లు) కరెంట్ అకౌంట్ లోటు ఎలా పూరిస్తుందో, డాలర్ సార్వజనీనంగా ఉన్న మారకపు స్థాయి పతనం అయితే అమెరికా పరిస్థితి ఏమిటి, అమెరికా తన నిరుద్యోగాన్ని ఏ విధంగా తగ్గిస్తుంది, ఉత్పత్తితో సంబంధంలేని షేరు మార్కెట్లపైనే మళ్లీ ఆధారపడి ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరిస్తుందన్న ప్రశ్నలకు అక్కడ ఆర్థికవేత్తలే సమాధానం చెప్పలేకుండా ఉన్నారు. ఉత్పత్తి నుంచి వినోదం దాకా అంతా ఒక జూదంలాగా చూసి, డబ్బులు కాసి లాభాలు వక్రమార్గాల్లో ఆర్జించే వ్యవస్థను సమూలంగా సంస్కరించే అవకాశాలు ఇప్పట్లో ఉన్నట్లు కనిపించడం లేదు. దానికి ఒక కారణం అమెరికాలో ప్రతి సగటు మనిషికి స్టాక్ మార్కెట్లో డబ్బులు పెట్టి సంపాయించే అలవాటు చేయడం ఒకటి. సగటు వేతనాలు పడిపోయినా, స్టాక్ మార్కెట్‌లో ఎంతో కొంత సంపాయించ వచ్చున్న ఆకాంక్ష. అంతేకాదు 1930 న్యూ డీల్లో లాగా ఏవో పబ్లిక్ వర్క్స్ చేపడితే కూడా ఇప్పుడున్న టెక్నాలజీతో అన్ని ఉద్యోగాలు సృష్టించడం కష్టం. మరొక పక్క అందుకోలేనంత ఖరీదైన వైద్యం, పెరిగిపోయిన హెల్త్ ఇన్స్యూరెన్స్ ఖర్చులు, తలకుమించిన చదువుల ఖర్చులు అన్నిటికి చవకగా వచ్చే విదేశీ శ్రామికులను వాడుకోవడానికి అలవాటైన అమెరికన్ కంపెనీలు – ఒబామా ప్రభుత్వం సంస్కరణ ఎక్కడ మొదలుపెట్టాలో అర్థంకాక సతమతం అవుతోంది. గతవారం ఐ.ఎం.ఎఫ్. ఇంకా ఈ సంక్షోభం లోతులు తాకలేదని చెప్పి బాంబు పేల్చింది.

సామాజిక సందర్భాల్లో ఉన్న లక్షణం ఏంటంటే ఏ ఒక్క సందర్భం మరొక సందర్భాన్ని పూర్తిగా పోలి ఉండదు. 2009లో ఆర్థిక సంక్షోభం, 1930 ఆర్థిక సంక్షోభం లాగానే పూర్తిగ లేదు. పరిష్కారాలు ఆచరణ క్రమంలోనే తెలుస్తాయి. అయితే ఇంత వరకు అర్థం అయిన విషయం మాత్రం పెట్టుబడిదారుల పట్ల పాటించిన నయా ఉదారవాదం తప్పకుండా పెట్టుబడిదారీ వ్యవస్థను వినాశానికి దారి తీసే భావజాలం. ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని గట్టెక్కించడానికి నడుం బిగించక తప్పదు. కాని ప్రభుత్వం ఏం చేయాలి, ఏయే రంగాలను ప్రభుత్వాధీనంలో ఉంచుకోవాలి, అవి ఎలా నడవాలి, పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ఫైనాన్షియల్ సెక్టార్‌ను పూర్తిగా అదుపు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా భారత్ లాంటి మూడవ ప్రపంచ దేశాలు అమెరికన్ మోడల్‌ను చూసి అర్రులు చాపడం ఆపాలి. భారతదేశ ఆర్థిక రంగం బాగానే ఉందని ఆటంకాలు లేని మెజారిటీ ప్రభుత్వం కాబట్టి (నయా ఉదారవాద) సంస్కరణలను ఇంకా ఉధృతంగా చేపట్టాలని బిజినెస్ స్టాండర్డ్ లాంటి పత్రికలు కోడై కూస్తున్నాయి. బ్యాంకింగ్ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ఎక్కువ చేయాలని, కాపిటల్ ఎకౌంట్ లిబరలైజ్ చేయాలని నయా ఉదారవాదులు చెప్తున్నారు. ఇవి చాలా ప్రమాదకరమైన సలహాలు.

బీదా బిక్కికి ఏవో కొన్ని కంటి తుడుపు సంక్షేమ పథకాలు అమలు చేసి, ఇంక మిగతా రంగాలన్నీ బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే అభివృద్ధి మార్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వీడలేదని అర్థం అవుతోంది. రిలయన్స్ సంస్థలు పెట్రోలు చెప్పిన ధరకంటే తక్కువకు ఇమ్మని సుప్రీంకోర్టు చెప్పింది. వెంటనే దాని షేర్ల ధర మరుసటి రోజు పడిపోవడం మనం చూసాం. ప్రజలను ముంచైనా లాభాలు గడించడమే బడా పెట్టుబడిదారుల లక్ష్యం. దాన్ని కట్టడి చేస్తే మార్కెట్లు పడిపోతాయని బెదిరిస్తాయి. ప్రస్తుతం మరొక రియల్ ఎస్టేట్ బూమో, షేర్ మార్కెట్ బూమో పుట్టుకొస్తాయని మార్కెట్ సంకేతాలిస్తోంది. ఒక పక్క పర్యావరణం విధ్వంసం, మరోపక్క విపరీతమైన అసమానతల వల్ల సామాజిక విలువల విధ్వంసాలను పట్టించుకోకుండా భారతదేశం చాలా వేగవంతంగా అమెరికా బాటనే నడుస్తోందన్న విషయం నేడున్న చేదు నిజం. అసమానతలతోనే ఆదాయ రేటు అధికంగా పెరుగుతుందని బూర్జువా ఆర్థిక శాస్త్రం చెపుతుంది. కాని అలాంటి అభివృద్ధి డిమాండ్ లేక సంక్షోభంలో కూడా పడుతుందని అది చెప్పదు. ఎందుకంటే అది కాస్త గుడ్డిది. కనుక మార్కెట్లను ప్రభుత్వం నియంత్రించాల్సిన వైఖరి ప్రజాసంక్షేమానికి పెట్టుబడిదారీ క్షేమానికి కూడా కావాల్సిన మార్గం. మార్కెట్లు ప్రజలను ఇక్కట్లకు గురిచేయకుండా నడిపించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. వీ

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీ ఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడం గాని వీలు కావడం లేదు.

- వై. రామచంద్రం (సర్క్యులేషన్ మేనేజర్) 9949 391028

Email : yatelliram@gmail.com

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం నుంచి తేరుకుంటున్నదని పెట్టుబడిదారీ వ్యాఖ్యాతలు చేస్తున్న విశ్లేషణలను సమీక్షిస్తున్నారు **ఇ.ఎస్. బ్రహ్మాచారి**

మాంద్యం నుంచి తేరుకోవడం నిజమేనా?

(గత సంచిక తరువాయి)

కొన్నిరోజులక్రితం సమ్మర్స్ (ఒబామా జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్) మాంద్యం పోయినట్లేనన్నాడు. స్టాక్‌మార్కెట్ డో జోన్స్ 10 వేలు దాటడమూ, కార్పొరేట్లకు లాభాలు పెరగడమూ అందుకు నిదర్శనం అన్నాడు. ఆయనొక్కడేకాదు మాంద్యం ముగిసినట్లేనని పాలకులూ వారి అర్థికవేత్తలూ ప్రకటనలమీద ప్రకటనలిస్తున్నారు. ప్రతి మాంద్యంలోనూ పాలకులూ వారి ఆర్థికవేత్తలూ ఇదిగోపోతుందనీ, అదిగో పోయిందనీ అనటం మామూలే. ఈసారీ అలాగే. చిగురేస్తోందని 9 నెలలనాడే బెర్నంకే అన్నాడు. అప్పటినుంచీ ఒకరితర్వాత ఒకరు మొగ్గేస్తోందని ఒకరంటే, కాయవుతోందని మరొకరు, కాయేమిటి పండయితే అని ఇంకొకరు. ఇలా ఒకరినిమించి మరొకరు మాట్లాడుతున్నారు.

అయితే జనానికి ఎంతచూసినా కనుచూపుమేర కలుపుమొక్కలే కానొస్తున్నాయి. కోలుకుంటున్నామని ఎంత చెబుతున్నా, ఎంతమంది చెబుతున్నా నమ్మే జనం లేరు. ఎందుకంటే, డోజోన్సూ, కార్పొరేట్ లాభమూ వాళ్లకి సంబంధించినవి కావు. ఈ ఏడాది అమెరికాలో 23 భారీ బ్యాంకులూ, ద్రవ్యసంస్థలూ 14 వేల కోట్ల డాలర్లు ఉద్యోగులకి వేతనాలిస్తున్నాయి. 2008లో 11700 కోట్లు, 2007లో 13 వేల కోట్లు పొందారు. అదే ఇంతకుముందు రికార్డు. ఈ ఏడాది అంతకు పది శాతం మించి సరికొత్త రికార్డ్ రాబోతోంది. ఇది ఒకవైపు. మరొక వైపు, ఈ ఏడాది ఇప్పటిదాకా యజమాన్యేతర ఉద్యోగుల వారం వేతనం సగటున 1.4 శాతం తగ్గింది. దీన్నిబట్టి కొద్దిమందిపైస్థాయి ఉద్యోగులకి పెరుగుతున్నా, కోట్లమందికి ఆదాయం తగ్గుతున్నట్లు తేలుతోంది.

వాళ్లకి ఉద్యోగాలు పోతున్నాయి. పని గంటలు తగ్గి ఆదాయాలు పడిపోతున్నాయి. వేతనాలు తగ్గుతున్నాయి. ఆహారపదార్థాల ధరలు పైకెక్కుతున్నాయి. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగుతున్నంత వరకూ పాలకులు బయట పడుతున్నాం అంటున్నా, జనానికి ఇంకామాంద్యంలో ఉన్నట్లే ఉంటుంది. ఇటీవలి సి.ఎన్.ఎన్. పోల్‌లో నూటికి 86 మంది అమెరికా ఇంకా మాంద్యంలోనే ఉందన్నారు. 1990 మాంద్యం 1991 కల్లా ముగిసిందని అధికారిక ప్రకటన వెలువడింది. అయితే జనం మాత్రం 1993 చివరిదాకా ముగిసిందని అనుకోలేదు.

ప్రపంచం నిరుద్యోగులతో నిండివుంది. సెప్టంబర్ 16న 30 పారిశ్రామిక దేశాలున్న ఒ.ఇ.సి.డి. అధ్యయనం విడుదలైంది. 2010 చివరకి సభ్యదేశాల్లో ఒక కోటి ఉద్యోగాలు పోతాయని తేల్చింది. వీటిని కలిపితే ఈ మాంద్యంలో మొత్తం 2 కోట్లా 50 లక్షలు పోయినట్లు అవుతుంది. ఆగస్ట్ 2009కి నిరుద్యోగం రేటు 8.6. స్పెయిన్‌లో 18.1 శాతం. ఏడాది క్రితంతో పోలిస్తే రెట్టింపయింది. ఒక్క సర్వీస్ రంగంలోనే 20 లక్షలు గల్లంతయ్యాయి. వచ్చే ఏడాది చివరికి నిరుద్యోగం రేటు జర్మనీ 11.8, ఫ్రాన్స్ 11.3, ఇటలీ 10.5, కెనడా 10 శాతాన్ని తాకడం ఖాయమని ఆ అధ్యయనం చెప్పింది. ముఖ్యమైన విషయం ఏమంటే, 15-24 ఏళ్ల యువకులు ఎక్కువమంది పనులు లేకుండా ఉంటారు అనేది. వచ్చే ఏడాది స్పెయిన్‌లో వీళ్ల సంఖ్య 40 శాతం పెరుగుతుంది. ఇటలీలో 25, టర్కీలో 23, ఇంగ్లండ్ అమెరికాల్లో 18 శాతానికి చేరతారు. 2000 నుంచీ యువకులకి, మధ్యవయస్కులకీ ఆదాయాలు బాగాతగ్గాయి. 45-54 ఏళ్ల వాళ్ల ఆదాయం 2000-2008 మధ్య 7700 డాలర్లు పడిపోయింది.

2010 మధ్యకల్లా జర్మనీ నిరుద్యోగులు 10 లక్షలమంది పెరిగి మొత్తం 44 లక్షలమంది అవుతారనీ, రేటు 10.5 శాతం అవుతుందనీ కేంద్ర బ్యాంక్ అంచనా. ఈ మాంద్యం ప్రభావం కొన్ని ఏళ్లపాటు ఉంటుందనీ, సరైన వృద్ధి కొన్ని సంవత్సరాలు చూడబోమనీ ఆర్థికవేత్తలు భయపడుతున్నారు. మాంద్యం ముందు స్థాయి రావాలంటే కనీసం 2013 దాకా ఆగాల్సిందేనని గట్టిగా చెబుతున్నారు.

యూరో వాడుతున్న 16 దేశాలని కలిపి చూస్తే ఆగస్ట్‌కే నిరుద్యోగం 9.6 శాతం ఉంది. ఐరోపా సమాఖ్యలో 2009 తొలి మూడు నెలల్లో 19 లక్షల ఉద్యోగాలు పోయాయి. 2010లో నిరుద్యోగం రేటు 10.9 శాతాన్ని తాకుతుంది. ఇంగ్లండ్‌లో 7.8 శాతం. మొత్తం 24 లక్షలమంది నిరుద్యోగులున్నారు. 16-24 ఏళ్ల యువతలో అయితే 16.6 శాతం.

2010లో అమెరికా నిరుద్యోగం 10 శాతం మించుతుంది. అమెరికాలో 9-11 శాతం మధ్య ఏళ్ల తరబడి ఉంటుందని టైం మాగజీన్ రాసింది. 12 శాతాన్ని తాకి అప్పుడు వెనక్కి తిరుగుతుంది అని రూబిని అంటాడు. ఇది 1980-81 మాంద్యంలో రికార్డ్ 10.8 కన్నా బాగా ఎక్కువ.

ఉద్యోగాలు లేనంత మాత్రాన నిరుద్యోగుల జాబితాలో ఉండరు. ఉద్యోగాల కోసం వెతుకుతుండాలి. అప్పుడే లెక్కకొస్తారు. ప్రయత్నించినా రావనీ వెతకటం మానుకున్న వాళ్లూ ఈ జాబితాలో ఉండరు. ఉద్యోగాలు లేనివాళ్లూ, ఉద్యోగాలకోసం వెతుకుతున్నవాళ్లూ మాత్రమే నిరుద్యోగుల

జాబితాలో ఉంటారు. ప్రయత్నించినా రావని వెతకటం మానుకున్న వాళ్లూ ఈ జాబితాలో ఉండరు. పోతే, ఫుల్‌టైం దొరక్క పార్ట్‌టైంతో సరిపెట్టుకున్న వాళ్ళు ఉద్యోగులకిందికే వస్తారు. ఈరెండు గ్రూపుల వాళ్లనీ నిరుద్యోగులకింద జమకట్టి కార్మికశాఖ నిరుద్యోగం రేటు కడుతుంది. దీన్ని తరచూ నిజ నిరుద్యోగం రేటు అంటుంటారు. ఇది సెప్టెంబర్‌లో 17 శాతానికి చేరింది. దీని ప్రకారం నిరుద్యోగులు మొత్తం 2 కోట్లా 64 లక్షలమంది.

ఐదు రాష్ట్రాలలో నిరుద్యోగం 12 శాతం దాటింది. 14 రాష్ట్రాల్లో 10 శాతాన్ని మించింది. అన్ని రాష్ట్రాలలో ఎక్కువ మిచిగన్‌లో 15.2 శాతం నమోదయింది. ఉద్యోగాలు లేక మిలిటరీలోకి ఎగబడుతున్నారు. అందుకే 1973 నుంచీ ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మిలిటరీ ఖాళీలన్నీ ముందే నిండాయి. 50 లక్షలమందికి పైగా 6 నెలలు మించి పనులకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు.

సగటు నిరుద్యోగ కాలం 24.5 శాతం. 1948లో ఈ లెక్క మొదలెట్టిన నాటి నుంచీ ఇదే ఎక్కువ. సగటు పనివారం 33 గంటలకు తగ్గింది. 1964లో ఈ లెక్కతీయటం మొదలెట్టాక ఇదే అతితక్కువ పనివారం.

జులైలో 1 కోటీ 63 లక్షల కుటుంబాలు అన్నం చీట్లు పొందారు. మొత్తం 3 కోట్లా 59 లక్షలమంది అమెరికన్లు వీటితో బతుకుతున్నారు. ప్రతి పదిమందిలోనూ ఒక్కరన్నమాట. నిరుడికంటే 23.4 శాతం ఎక్కువ.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవాళ్లు 2007లో 12.5 శాతం అయితే 2008లో 15.8 శాతానికి పెరిగారు. 4 కోటీ 74 లక్షలమంది పిల్లలు పేదరికంలో బతుకులీడుస్తున్నారు. ఈ అంకెలుసెప్టెంబర్ 10న సెన్సెస్ బ్యూరో ప్రకటించినవే. 2009లో పోతున్న ఉద్యోగాలను బట్టి చూస్తే 2010 లో నూటికి 25 మంది పిల్లలు పేదరికంలో ఉంటారని హేది షేర్హజ్ (Heidi Shierholz) అంచనా వేశారు.

సొంత ఇల్లు ఏర్పరచుకోవడం అమెరికన్ కల అనటం మామూలు. అందుకోసం ద్రవ్యసంస్థలు విరివిగా అప్పులిచ్చాయి. ఆదాయాలు తగ్గి అనేకమంది తిరిగి చెల్లించ లేకపోయారు. అప్పులిచ్చిన సంస్థలు ఇళ్లని స్వాధీనం చేసుకుంటున్నాయి. నెలనెలకీ ఇవి పెరుగుతున్నాయి జులై, ఆగస్ట్, సెప్టెంబర్ త్రైమాస్యంలో ఉన్నన్ని ఫోర్ క్లోజర్లు ఎన్నడూ లేవు. ఈకాలంలో బ్యాంకులు 9,37,840 నోటీసులు పంపాయని రియాల్టీ ట్రాక్ లెక్కబెట్టింది. నిరుడు ఇదే కాలంలో కంటే 23 శాతం ఎక్కువ. చూసినంత లెక్కా ఈ సమస్యకు పరిష్కారం కనిపించటం లేదంటున్నారు. 4 కోట్లా 63 లక్షల మందికి ఆరోగ్య బీమా లేదు.

నెలనెలా కొత్తగా పనుల్లోకొచ్చే వాళ్లకి నెలకి 1,25,000 ఉద్యోగాలు కల్పించాలి. ఉద్యోగాలు కోల్పోయిన 72 లక్షలమందికి వీళ్లనీ కలిపితే కోటికి పైగా ఉద్యోగాలు కల్పిస్తేగాని మాంద్యం ముందు స్థితి రాదు. ఇది ఇప్పటి లెక్క. ఇంకా పోతూనే ఉన్నాయి కాబట్టి, ఈ అంకె భారీగానే పెరుగుతుంది. అందుకే కొందరు పూర్తిగా కోలుకునేటప్పటికి చాలా ఏళ్లు పట్టవచ్చంటున్నారు. మరి కొందరైతే ఇక ఎప్పటికి పాత పరిస్థితి రానే రాదని గట్టిగా చెబుతున్నారు. ఎక్కువమంది జనం రెండో అభిప్రాయంతో ఏకీభావంతో ఉన్నారు.

1990ల వికాస కాలంలో పదేళ్లపాటు ఏటా 21 లక్షల ఉద్యోగాలొచ్చాయి. ఎంతో బాగా ఉద్యోగాలొచ్చినట్లు. అదే స్థాయిలో వచ్చినా నిరుద్యోగం 5 శాతానికి తగ్గాలంటే 2017 దాకా పడుతుంది. అయితే అలా వస్తాయని ఎవ్వరూ అనడంలేదు. 2011 చివరకి మాంద్యం ముందు స్థాయికి చేరాలంటే ఇప్పటి నుంచీ నెలనెలా 5 లక్షలా 70 వేలు రావాలి. ఇది అయ్యేపనికాదని అందరికీ తెలుసు.

హేది షేర్హజ్ అనే ఆర్థికవేత్త 'అంతకుముందు వర్తకవలయంలో వచ్చిన అన్ని ఉద్యోగాల్నీ తుడిచిపెట్టిన మాంద్యం మహా సంక్షోభం తర్వాత ఇదే' అన్నారు.

ఈ వాస్తవాల్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే, కార్మికులు కోలుకునేందుకు ఎన్నేళ్లు పట్టేదీ చెప్పగలిగే స్థితిలో ఎవ్వరూలేరు. కారణం పోవటం ఎప్పుడు ఆగుతుందో తెలియదు. అసలు ఈ పోయిన ఉద్యోగాలన్నీ వస్తాయా? అంతకు ముందు పొందిన జీతాలు మరల వస్తాయా? ఇవే శ్రామికుల్ని సతమతం చేస్తున్న ప్రశ్నలు.

ఉద్దీపనలు పొద్దాకులూ ఉండవు. ఉత్పత్తి కొద్దిగానేనయినా పెరుగుతున్నది నిజమే. అయితే ఈ వృద్ధి ఉద్దీపన పథకాల వల్ల వచ్చింది. అది రేపో మాపో ఆగిపోతుంది. అప్పుడు కూడా ఇలానే వృద్ధి కొనసాగుతుందనడం కుదరదు.

పరిస్థితులు అనుకున్నదానికన్నా ఎక్కువ మెరుగ్గావున్నాయి. ఉద్దీపన పథకం భేషుగ్గా పనిచేసింది. ఉద్యోగాలు ఇంతకు ముందు నెలల్లో పోయినన్ని పోవటం లేదు. అలా అభిప్రాయపడుతున్నారు గనక ప్రభుత్వం ఉద్యోగకల్పనకు పథకాల్ని పొడిగించక పోవచ్చు. తన మద్దతు నిలిపి వేయవవచ్చు. దాంతో మళ్లీ మరిన్ని ఉద్యోగాలు పోవటం మొదలవుతుంది. ఉత్పత్తి వృద్ధీ తగ్గుతుంది.

దెబ్బతిన్న వాళ్లూ, ఇంకా దెబ్బమీద దెబ్బ తింటూనే ఉన్నవాళ్లూ, ఆస్తులు కోల్పోయిన వాళ్లూ ఖర్చు చెయ్యలేరు. కొద్దోగొప్పో కొలుకున్నా గాని, ముందు ముందేమవుతుందోననే భయంతో డబ్బు దాచుకోడానికి ప్రయత్నిస్తారు. జనం ఖర్చులు తగ్గిస్తే రికవరీ మరీ వెనక్కి తగ్గుతుంది.

ఎగుమతులూ, దిగుమతులూ తగ్గుతున్నాయి. 2008లో ప్రపంచ వాణిజ్యం కేవలం 2.9 శాతం వృద్ధే ఉందనీ, 2009లో ఏకంగా 12.2 శాతం క్షీణిస్తుందనీ. 2010లో వృద్ధి 1 శాతాన్ని మించదని అంచనా. ఇందులో వృద్ధిచెందిన దేశాల ఎగుమతులు 10 శాతమూ, వర్ధమాన దేశాల ఎగుమతులు 2–3 శాతమూ క్షీణిస్తాయి. ఇంత తగ్గటం 65 ఏళ్లలో ఇదే. తూర్పు ఆసియా దేశాలు ఎగుమతుల మీద ఆధారపడ్డాయి. ప్రపంచ వర్తకం తగ్గి ఈ దేశాలు దెబ్బతిన్నాయి. వీటి వృద్ధి 1.5 – 2.5 శాతం ఉండవచ్చు. అయితే అది జనాభా పెరుగదలకంటే తక్కువ.

అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయి. అమెరికా అప్పు 11.9 ట్రిలియన్ డాలర్లు. అంటే ప్రతి అమెరికా పౌరుని మీదా 38,736 డాలర్ల అప్పు వున్నట్లు. సెప్టెంబర్ 28 నుంచీ సగటున రోజూ 388 కోట్లు కలుస్తోంది. అమెరికాకున్నంత అప్పు ఏదేశానికీ లేదు. స్థూల జాతీయోత్పత్తిలో 2008లో 70.5 శాతం పెరిగి. 2009లో 87 శాతానికి పెరిగి 2010లో రెండింతలు అవుతుందని ఐ.ఎం.ఎఫ్. అంచనా. జపాన్ అప్పు ఇప్పటికే ఉత్పత్తికి రెట్టింపు. ఇటలీ అప్పు ఉత్పత్తి ఎంతో అంత. సింగపూర్ పరిస్థితీ ఇంచుమించు అంతే. జర్మనీది ఉత్పత్తిలో 76 శాతం.

ఫ్రాన్స్‌దీ అంతే. ఇంగ్లండ్ అప్పు ఉత్పత్తిలో 60 శాతం. భారతదేశానిది 2008లో 82 శాతం కాగా 2009లో 86.6కు చేరుతుందని అంచనా.

అమెరికా బడ్జెట్ లోటు సెప్టెంబర్ 30 నాటికి 1 లక్షా 40 వేల కోట్ల డాలర్లు. 2009 చివరకి 1లక్షా 70 వేల కోట్లకు చేరుతుందని ప్రభుత్వ అంచనా. 2008లో లోటు 459 బిలియన్లు. 2009లో ఇప్పటికే లక్ష కోట్ల డాలర్లెక్కువ.

యజమానులు ఈ మాంద్యాన్ని తమకనుకూలంగా మలుచు కుంటున్నారు. శ్రమ ఉత్పాదకతని పెంచుతున్నారు. ఒత్తిడిపెట్టి పని చేయిస్తున్నారు. అదే కాలంలో ఎక్కువ సరుకు తయారు చేయిస్తున్నారు. దీనివల్ల సరుకు తక్కువ ఖర్చుతో తయారవుతుంది. కనక లాభాలు పెరుగుతాయి. అయితే ఉద్యోగాలు పెరగవు. ఉత్పాదకత పెరిగే కొద్దీ కార్మికుల సంఖ్య తగ్గిస్తారు. పనివాళ్లని తీసేస్తూనే లాభాలు పెంచుకో గలుగుతారు. ఉదాహరణకి, ఈ ఆగస్ట్‌లో ఫ్యాక్టరీ ఉత్పత్తి పెరిగింది. అదే సమయంలో 65,000 ఫ్యాక్టరీ ఉద్యోగాలు పోయాయి.

2009 రెండో క్వార్టర్లో గంటకి ఒక కార్మికుడు చేసే ఉత్పత్తి 6.4 శాతం పెరిగింది (వార్షిక రేటు). 6 ఏళ్లలో ఎన్నడూ ఇంత పెరగలేదు. తక్కువమందితో ఎక్కువ ఉత్పత్తి చేయిస్తుంటే ఉన్నవాళ్లు పోతారే గాని కొత్తవాళ్లకి అవకాశాలు రావు.

జూన్‌లో 9.5 శాతం ఉన్న నిరుద్యోగం జూలైలో 9.4 కి తగ్గేసరికి ఒబామా ఎగిరి గంతేశాడు. జూలైలో పోయిన ఉద్యోగాలు 3 లక్షలా 4 వేలు. అంతస్థాయిలో పోయినా, తన విధానాలవల్ల మహా పతనం తప్పిందన్నాడు.

'నేను వచ్చినప్పటికంటే ఇప్పుడు సగమే పోతున్నాయి' అన్నాడు. ఆ తర్వాత రెండు నెలలకే (సెప్టంబర్ ముగిసేసరికే) 0.4 పర్సెంటేజ్ పాయింట్లు పెరిగి 9.8 శాతం అయింది. రెండంకెల్లోకి పోతుందనే దాని మీద సందేహాలేం లేవు. కాకపోతే ఆ అంకె పదా పదకొండా పన్నెండా అనే దగ్గరే తేడాలున్నాయి.

ఒబామా సంబరమంతా పరిస్థితులు విషమించటం లేదనికాదు. విషమించే వేగం తగ్గిందనే. మళ్లీ 'ఉద్యోగాలు పోతున్నంతకాలం నిజమైన రికవరీ రానట్లే. పనికోసం వెదుకుతున్న ప్రతి అమెరికన్‌కీ పనిదొరికే దాకా విశ్రాంతి తీసుకోను' అన్నాడు. మరెందుకు ఏం చేస్తున్నాడు?

అన్ని దేశాల పాలకులు ఏం చేస్తున్నారో ఒబామా అదే చేస్తున్నాడు. బ్యాంక్‌లకి లక్షలకోట్లిచ్చాడు. జనానికి 78,700 కోట్ల డాలర్ల ఉద్దీపన పథకం పెట్టాడు. ద్రవ్య సంస్థలకిచ్చిన దాంట్లో ఇది 15వ వంతే. వేలు మాత్రమే ఉండే ద్రవ్యసంస్థలకి లక్షలకోట్లూ, కోట్లాది ప్రజలకి వేలకోట్లా? అని ప్రజలు తప్పుబడుతున్నారు. మాట మాట్లాడితే మహాసంక్షోభం రాకుండా నిలువరించానంటాడు. ఈ మాంద్యం పదును తగ్గించడానికి అసాధారణ చర్యలు తీసుకుంటున్నానన్నాడు. ఆ చర్యలేమిటో చెప్పడు. ఎకానమీ నిలదొక్కుకుంటున్నది కాని నిరుద్యోగం పెరగవచ్చంటాడు. ఉద్యోగాలు కొంతకాలం పాటు పోవచ్చంటాడు. పోకుండా చేయడానికే నాకసరత్తంతా అంటాడు. అన్నాడేగాని డబ్బేమీ ఇస్తాననడు. కొత్త ప్యాకేజీ ఊసైనా ఉండదు.

శ్రామికుల పరిస్థితులు మెరుగుపరుస్తాననీ, ఉద్యోగాలు సరిపడా కల్పిస్తాననీ, అదే ఆరోగ్యకరమైన ఎకానమీకి కొలమానం అనీ అన్నాడు. ఇంతకు ముందు కూడా ప్రజలకి పనులుండేట్లు చూడాలి, సంపన్నులకి పన్నులు తగ్గించడం కాదు అనేవాడు. మాటలు మైళ్లు దాటుతున్నాయి కాని చేతలు అడుగు కదలటంలేదు.

1975లో న్యూయార్క్ నగరం ద్రవ్యసంక్షోభంలో పడింది. సహాయం అడిగితే అప్పటి అధ్యక్షుడు ఫోర్డ్ ఇవ్వనుపొమ్మన్నాడు. ఇవ్వాళ ఒబామా దేశమంతా ఫోర్డ్ విధానాన్నే అమలు చేస్తున్నాడు. బడ్జెట్ లోటుతో సతమతమవుతున్న రాష్ట్రాలకు 3 వేలకోట్ల డాలర్లు మాత్రమే ఇచ్చాడు. ద్రవ్య సంస్థలకిచ్చిన 12 లక్షలకోట్లలో ఇది నాలుగొందలో వంతు. శాతంలో అయితే 0.25. రాష్ట్రాలని ఆదుకోకపోగా, పొదుపు పాటించమని ఉచిత సలహాలిస్తున్నాడు. రాష్ట్రాలు తగ్గించే ఖర్చులేవి? ప్రభుత్వ ఉద్యోగాలు తీసెయ్యడమో, ప్రజలకి కొంత ఊరట కలిగించే సామాజిక వ్యయంలో కోతపెట్టడమో తప్ప మరో మార్గంలేదు. దేన్నెంచుకున్నా జనానికి బాధలు ఇంకా ఎక్కువవుతాయి. న్యూయార్క్ గవర్నర్ లోటు పూడ్చటానికంటూ 8900 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాడు. సెప్టెంబర్‌లో 53 వేల ప్రభుత్వోద్యోగాలు పోయాయి.

మాంద్యం మొదటి నుంచీ చూస్తే, వస్తు తయారీరంగం 16 శాతం క్షీణించింది. ఏప్రిల్ 29న ఒబామాకి 1900 మంది కంపెనీల యజమానులు ఒక బహిరంగలేఖ రాశారు. 100 రోజుల పాలనలో వాళ్ల రంగంలో సంక్షోభం పెరిగిందనీ ప్రభుత్వం పట్టించుకోలేదని రాశారు. బ్యాంక్‌లకి ట్రిలియన్లిచ్చి తమకి మొండిచెయ్యి చూపారన్నారు. తప్పులుచేసి సంక్షోభానికి కారకులైన వాళ్లని కాపాడుతూ, తమని దివాలా దిశకి నెడుతున్నారని వాపోయారు. అమెరికా వాడుకునేదంతా అమెరికాలోనే ఉత్పత్తి చెయ్యకపోవడమే అనర్థానికి కారణమనీ, అప్పుతో తెచ్చే వికాసం భ్రమేననీ హితవు పలికారు.

ప్రజలకిచ్చిన ఉద్దీపన ప్యాకేజ్ ఏ మూలకూ చాలదు. దీన్ని మించినవి కావాలి. ఇది కంటితుడుపు మాత్రమే. ఆర్థిక ఇంజన్ గేర్లు పడటం మొదలైంది అన్నాడు. రాబోయే నెలల్లో ఉద్యోగాలు పోతాయన్నాడు. నిరుద్యోగం రేటు 10 శాతం అవుతుందని ఒప్పుకోక తప్పలేదు. ఉద్యోగాలు లేని రికవరీని ఒబామా ఒప్పుకోనన్నాడు ఒకప్పుడు. కాని ఇప్పుడో? ఉద్యోగాలు భారీగా పోతున్నా రికవరీ అంటూ మాట మార్చాడు. పీఠమెక్కాక పాత వాళ్ల పాటే పాడుతున్నాడు.

రికవరీ అండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్ చట్టం ఫిబ్రవరి 17న వచ్చింది. ఈ ఉద్దీపన పథకం అమెరికా చరిత్రలో లేనంతది. 78,700 కోట్ల డాలర్లది. నిజమే. కాని ఇంతటి మాంద్యమూ 65 ఏళ్ల చరిత్ర ఎరగనిదే. ఇది ఏమూలకని జనం పెదవి విరుస్తున్నారు. అలాగే ద్రవ్య సంస్థల కిచ్చినదీ కనీవినీ ఎరగనిదే. 2008 నవంబర్ నించి 2009 మార్చ్ దాకా నెలకి సగటున 6,70,000 పోయాయి. ఏప్రిల్ నుంచి జూన్ దాకా నెలకి 4,36,000 చొప్పున పోయాయి. ఈ తగ్గుదలని పట్టుకొని ఒబామా ప్రభుత్వం తన 787 బిలియన్ డాలర్ల ఉద్దీపన పథకం ఫలితాలివ్వటం మొదలుపెట్టిందని వాదిస్తోంది. ఈ రికవరీ పథకం లేకపోతే మరీ అధ్వాన్న స్థాయిలో ఉండేదంటున్నది.

ఆయన లక్ష్యం 35 లక్షల ఉద్యోగాలు. అదీ 2010 చివరకి. 2009 ఆగస్ట్ చివరకి ఈ పథకం వల్ల 10 లక్షలొచ్చాయని సెప్టెంబర్‌లో

ప్రకటించారు. జనవరిలో పీఠ మెక్కాక పథకం అమలయినా, నికరంగా 38 లక్షలకి పైగా పోయాయి. అందుకే దీన్ని కంటితుడుపు అనేది.

ఈ పథకంవల్ల నిరుద్యోగం రేటు 8 శాతం దాటదని ఈ ఏడాది మొదట్లో చెప్పారు. ఇప్పటికే అంకెని మించి 9.7 శాతం ఉండడంతో కొందరు ఆర్థికవేత్తలు మరొక ఉద్దీపన పథకం అవసరమంటున్నారు. ఈ వాదనని కార్మిక సెక్రెటరీ హిల్డా ఎల్. సొలిస్ ఒప్పుకోవడం లేదు. ఇప్పుడప్పుడే తొందరపడాల్సిన పనిలేదనీ, ఇంకా ఖర్చుచెయ్యాల్సిన డబ్బు మిగిలేవుందనీ, అది ఎకానమీలోకి చిన్నగా ప్రవేశిస్తుందనీ నమ్మ బలుకుతోంది.

ఒబామా ఆర్థిక సలహాదార్లు ఒక తప్పు అంచనావేశారు. అప్పట్లో 7.2 శాతం ఉన్న నిరుద్యోగం రేటు 2009లో 8 శాతానికీ, 2010లో 9 శాతానికీ చేరవచ్చనుకున్నారు. ఉద్దీపనవల్ల 2009 చివరకి 8 శాతాన్ని తాకుతుందని అంతకు మించదనీ నమ్మకంతో ఉన్నారు. ఇప్పటికే 9.8 శాతం అయి కూర్చుంది. వాళ్ళు అనుకున్నదానికీ అయినదానికీ ఎంతో తేడా ఉంది. ఇందుకు రెండు వివరణలున్నాయి. ఒకటి ఉద్దీపన పని చెయ్యలేదు. రెండు ఇది చాలా చిన్నది, చాలలేదు.

అసలు ఒబామా లక్ష్యమే 35 లక్షల ఉద్యోగాలు. అందులో కొత్తగా వచ్చేవెన్నో, పోకుండా నిలబెట్టేవెన్నో వివరాలు తెలియదు. అవి ఏ స్థాయి జీతాలవో చెప్పలేదు. ఏది ఏమైనా ఇదంతా 2010 చివరకి గాని పూర్తిగా జరగదు. అంటే ఒబామా అన్నట్లే జరిగినా ఇప్పటికే పోయిన 72 లక్షలకి ఇక ముందు పోబోయేవి కలిసి మోపెడవుతాయి. అప్పటికీ పథకం అయిపోతుంది. అందుకనే ఈ 787 బిలియన్ డాలర్ల పథకం ఏమూలకీ రాదని జనం పెదవి విరుస్తున్నారు. పది పన్నెండు లక్షల కోట్లు బ్యాంక్‌లకీ, వాల్‌స్ట్రీట్‌కీ ఇస్తూ తమకివ్వటానికి ఏలినవారికి మనసొప్పటం లేదని కార్మికులు తప్పుబడుతున్నారు. 'బెయిల్ అవుట్ పీపుల్, నాట్ బ్యాంక్స్' అనే నినాదంతో నిరసనలు తెలుపుతున్నారు.

బ్యాంక్‌లకి 1 లక్షా 20 వేల కోట్ల డాలర్లు నగదు ఇచ్చారు. 12 లక్షల కోట్ల రుణగ్యారంటీ ఉంచారు. అంతేకాదు. మొండి బాకీలని కొన్నారు. ఆ బ్యాంక్‌లు లాభాలార్జిస్తున్నాయి. భారీ జీతాలూ బోనస్‌లూ ఇస్తున్నాయి.

వేలసంఖ్యలో మాత్రమే ఉన్న ద్రవ్యసంస్థలకి ట్రిలియన్లిచ్చి లాభాలు పెరిగేట్టు చేస్తూ, కోట్లమంది జనకష్టాలు తీర్చడానికి ఎంగిలిచేతులు విదిలిస్తున్నారు. సెప్టెంబర్ నాలుగో వారంలో జి20 దేశాలు పీటర్స్‌బర్గ్‌లో సమావేశమైనప్పుడు కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శనలు చేబట్టారు.

అమెరికా చేసే దాడులూ, యుద్ధాలూ ఆర్థిక పరిస్థితుల్ని కోలుకోలేని స్థితికి నెడతాయి. ఇరాక్ మీదా, ఆఫ్ఘనిస్తాన్ మీదా దాడులకి లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా కుమ్మరించేందుకు వెనకాడడం లేదు. పాకిస్తాన్‌లో పోరు మొదలుపెట్టారు. దీంతో ద్రవ్యలోటు ఇంకా పెరుగుతుంది.

అమెరికాలో నిరుద్యోగులకు 26 వారాలపాటు భృతి ఇస్తారు. ఈ మాంద్యంలో ఇంకొన్నివారాలిచ్చారు. అయినా 4 లక్షలమందికి ఆగిపోయింది. ఈ ఏడది చివరకి మరో 9 లక్షలమందికి నిలిచిపోతాయి. న్యూయార్క్‌లో 79 వారాలిచ్చారు. పరిస్థితి చక్కబడలేదు కనక అన్ని రాష్ట్రాలలోనూ మరో14 వారాలూ 8.5 శాతం నిరుద్యోగం ఉన్న వాటిలో 20 వారాలూ ఇవ్వాలని డెమొక్రట్లు ప్రయత్నిస్తున్నారు. దీన్ని రిపబ్లికన్లు అడ్డుకుంటున్నారు. ఇదే వస్తే న్యూయార్క్ నిరుద్యోగులు దాదాపు రెండు సంవత్సరాలు భృతితో బతికినట్లే. ఇది మాంద్యం తీవ్రతనీ తెలుపుతుంది. అంతేకాదు ఇది ఇప్పుడప్పుడే వదిలేదికాదనీ స్పష్టం చేస్తుంది.

ఈ కారణాల వల్ల, కోలుకోవటం అంత తేలికకాదు. కోలుకున్నట్లు అనిపించినా నిలబడదు. కొద్దికాలానికే మళ్లీ మాంద్యంలో పడే అవకాశాలే ఎక్కువ. డబల్ డిప్ తప్పదు. ఈమాంద్యం లోంచి మరో మాంద్యంలోకి పోక తప్పదు. అమెరికా ట్రెజరీ సెక్రెటరీ గీత్నర్‌కి సైతం ప్రపంచ ఎకానమీకి డబల్ డిప్ ప్రమాదం పొంచే ఉందనక తప్పలేదు రూబిని డబల్ డిప్ ప్రమాదం ఉందన్నాడు. ఇటీవల మాట్లాడుతూ అందుకు అవకాశాలు పెరిగాయన్నాడు.

స్టిగ్లిట్జ్ రెండు దృశ్యాలు చూస్తున్నాడు. ఒకటి జపాన్ తరహా నలత. రెండు డబల్ డిప్. ఈ రెంటిలో రెండో దానికే అంటే డబల్ డిప్‌కే మొగ్గుచూపాడు.

బెంజమన్ రూత్ అనే లాయర్ 1931లో ఆర్థిక పరిస్థితుల్లో మార్పొస్తోందని గమనించాడు. ఆ జనవరి నుంచీ డైరీ రాశాడు. 1978 చనిపోయాడు. దాన్ని ఆయన కొడుకు ఇటీవలే ప్రచురించాడు. మహా సంక్షోభం విశేషాలు అందులో ఉన్నాయి. 1936 క్రిస్మస్‌కి మాంద్యం వదలినట్లనిపించింది. జనం వెర్రెక్కినట్లు సరుకులు కొన్నారు. దాన్ని చూచి వెలుగొచ్చినట్లేనని అధికారికంగా ప్రకటించారు. అయితే తిరిగి సెప్టెంబర్‌లో మార్కెట్లు కుప్పకూలాయి. అప్పుడాయన ఆ ఆర్థికవేత్తల అంచనాలు ఇప్పుడు మళ్లీ చదువుతుంటే నవ్వొస్తున్నదనీ, అవన్నీ తప్పుల తడకలనీ, వాళ్లెవ్వరూ 1937–39 పతనాన్ని గురించి చెప్పనైనాలేదనీ తప్పుబట్టాడు. ఇప్పటి పరిస్థితీ అదే. కొన్నాళ్ల తర్వాత ఈ పాలక అర్థిక నిపుణుల గురించి రూత్‌లాగే మరొకరు అనవలసి ఉంటుంది.

ఒక అంశం మెరుగైతే, మరొకటి తరుగుతోంది. ఒకనెలలో ఒక మెట్టెక్కితే, మరోనెలలో రెండు మెట్లు దిగుతోంది. రిటైల్ అమ్మకాలు ఆగస్ట్‌లో 2.7 శాతం పెరిగాయి. కాని మళ్లీ సెప్టెంబర్‌లో 1.5 శాతం పడిపోయాయి. కొన్ని చూపించి కోలుకున్నామంటే ప్రయోజనం ఉండదు. పడిపోతున్న అంశాల్ని నిలబెడతాం అనగానే పని జరగదు. దీర్ఘకాలిక పథకాలుండాలి. సరైన పద్ధతులవలంబించాలి. అవి కార్పొరేట్ల కొమ్ము కాసే పాలకులవల్లా, పార్టీలవల్లా కావు.

అమెరికాకి జలుబుచేస్తే, ప్రపంచానికి నిమోనియా వస్తుందంటారు. మరి అమెరికాకే ఏకంగా నిమోనియా వచ్చిందే. ప్రపంచానికేమవుతుందో! చెప్పలేమని అమ్మర్ సియంవాలా అనే ఆర్థికవేత్త తన అసహాయతని వ్యక్తం చేశాడు. చెప్పటం ఇష్టంలేక పోవచ్చు గాని చెప్పలేని విషయమేమీ కాదు.

ఈ ఇరవై నెలల షాక్ ఎలా నిరుద్యోగులమీదా కార్మికుల మీదా పడిందో అలాగే ఇక ముందూ పడుతుంది. అందుకే నిరసనలు. పాలకులు వీళ్లకేమీ పెద్దగాచెయ్యరు. వాళ్ల చూపు పెట్టుబడివైపే ప్రసరిస్తుంది. ఈ వర్గ సమాజంలో, పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు సంఘటిత పోరాటాలు చెయ్యకపోతే పరిస్థితులు మరీ అధ్వాన్న మవుతాయి. ఇదే మార్క్స్ చెప్పాడు. కాలం రుజువు చేసింది. మన స్వానుభవమూ అదే గదా!

(అయిపోయింది) వీ

సంక్షేమ పథకాల 'మానవ ముఖం'తో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చడమే ప్రభుత్వాల అసలు లక్ష్యంగా ఉందంటున్నారు **వి. చలపతిరావు**

భారతదేశంలో సహకార సేద్య విధానం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సహకార సేద్య విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని చూస్తోంది. కాని ఈ విధానం ఈ దేశానికి కొత్తేమి కాదు. ఇందిరాగాంధీ హయాంలో ముఖ్యంగా రాజ్యాంగ మూలసూత్రాలలో 'సోషలిస్ట్ పాటర్న్ ఆఫ్ సొసైటీ' అంశంను చేర్చి, రష్యాలో అమలులో ఉన్న కలెక్టివ్ ఫార్మింగ్ స్ఫూర్తిగా యుగోస్లావియా లాంటి యూరప్ దేశాలలో గల సహకార సేద్య విధానాలను మనదేశంలో కూడా ప్రవేశపెట్టింది. వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ ప్రోత్సాహంతో సహకార సేద్య విధానాన్ని అక్కడక్కడ కొన్ని గ్రామాలలో అమలు చేస్తోంది.

వాస్తవంగా సిద్ధాంత రీత్యా సహకార సేద్య విధానం మంచిది. వచ్చే చిక్కంతా ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేయడంలోనే. దీని కోసం వ్యవసాయ సహకార సంఘాల ప్రమోటర్లకు, మెంబర్లకు మంచి అవగాహన ఏర్పడాలి. దీనికి తోడు సహకార శాఖ అధికారుల సహకారం, మార్గదర్శకత్వం ఉచిత రీతిలో ఉండాలి. ముఖ్యంగా సదరు సంఘాలలో మెంబర్‌షిప్ తీసుకొన్న రైతులు, సమిష్టి వ్యవసాయం కోసం సంఘానికి ఒప్పచెప్పిన తమ కమతాల పై తాము అందరి మెంబర్లతో కలిసి మేనేజ్‌మెంట్ చెప్పిన ప్రకారం సమిష్టి కృషిలో పాల్గొనాలి. ఎవరెవరి సామర్థ్యంను బట్టి సహకార సంఘ మేనేజ్‌మెంట్ ఆదేశాల ప్రకారం పనిచేస్తూ ఉండాలి. పారితోషికంను గాని, ఉత్పత్తిలో భాగస్వామ్యం గాని మేనేజ్‌మెంట్ నిర్ణయం ప్రకారం మసలుకోవాల్సి వస్తుంది. తమ యాజమాన్య హక్కును పక్కకు పెట్టి మేనేజ్‌మెంట్ చెప్పినట్లు చేయడం, చిన్న రైతులైనప్పటికీ భారతీయ రైతులు తమ ఉనికిని కోల్పోవడం వారికి గిట్టదు. వీరికి తమ వ్యక్తిత్వంపై గౌవరం ఎక్కువ. భారతీయ రైతుల మనస్తత్వమే సహకార సేద్య సంఘాలు విఫలం కావడానికి కారణం.

1970 ప్రాంతంలో వరంగల్ జిల్లా నర్సంపేట తాలూకా జల్లి గ్రామంలో సహకార వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని, ఒక్కొక్క రైతుకు ఐదు వేల ఎకరాల చొప్పున ఎలాట్ చేసి, ప్రభుత్వ భూమి ఇచ్చిన రైతులను సదరు జల్లి గ్రామ వ్యవసాయ సహకార సంఘంనకు సభ్యులుగా చేర్చుకున్నారు. ఈ సహకార వ్యవసాయం కొన్ని ఏళ్లు ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచినప్పటికీ, మెంబర్లుగా చేరిన రైతులు సమిష్టిగా పనిచేసి, సమిష్టి లాభాలు పొందడానికన్నా, వారికి ఎలాట్ అయిన ప్రభుత్వ భూమిపై పట్టా హక్కులు పొంది స్వంత వ్యవసాయం కొనసాగించటానికే ఎక్కువ ఆసక్తి చూపారు. చివరకు సహకార సేద్యం ఆ విధంగా ఆగిపోయింది. ఆనాడు ఈ దేశంలో సహకార సేద్యం విఫలం కావడానికి కారణం సహకార శాఖ అధికార్లలో ఉద్యోగాలలో సహకార సంఘాలలో ఉన్న సభ్యులకు తగిన స్ఫూర్తినిచ్చే సామర్థ్యం లోపించడం, దానికి తోడు ఈ శాఖలో గల అవినీతి తోడైంది. ఈనాడు ఎన్నో అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకులు దివాలా తీయడానికి, డిపాజిటర్లు ఇబ్బందుల పాలు కావడానికి సహకార శాఖ పర్యవేక్షణ లోపం, అవినీతి ముఖ్య కారణమన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితిలో సహకార సేద్య విధానం విజయవంతం కాగల నమ్మకం లేదు.

వాస్తవంగా ఈనాడు చిన్న రైతులే పెద్ద రైతుల కన్న ఎకరా దిగుబడిని సాధించడంలో ముందున్నారు. వారికి కావల్సింది సమయానికి విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, అన్నిటి కన్నా ముఖ్యమైన రుణ సౌకర్యం. వీటన్నిటికన్న ముఖ్యమైంది వీరు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇప్పించడం. ఇవేవి తగు సమయంలో సరఫరా చేయలేని ప్రభుత్వం, ఈ విషయంలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ విధానాన్ని ప్రవేశపెట్టడానికి చూస్తున్నట్లు కనపడుతోంది.

ఎనభై శాతం చిన్న రైతులు ఉన్న ఈ దేశంలో ఉత్పత్తి పెరగాలంటే సహకార సేద్యాలను ప్రవేశపెట్టడం కాదు. కరీంనగర్ జిల్లాలోని ముల్కనూర్ రైతు సేవా సంఘం లాంటివి, మహారాష్ట్రలో సాంగ్లీ సహకార సంఘాల లాంటివి కావాలి. ప్రస్తుతం చిన్నరైతులు ముఖ్యమంత్రి ఆశిస్తున్నట్లు ఎక్కువ ఎకరా దిగుబడిని సాధించడానికి వారికి సమయానికి, అంటే సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పనిముట్లు చివరికి నిత్య వ్యవసాయ పెట్టుబడులకు కావలసిన రుణాలు వగైరా కావాలి. అన్నిటి కన్న మిన్నగ రైతులు కష్టపడి పండించిన పంటకు మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధర ఇప్పిచడం ముఖ్యం. రైతులకు సదరు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లలో రైతులు చేసిన పోరాటాలు, ధర్నాల వల్ల ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనబడుతున్నవి.

ఈ ప్రభుత్వం అటు రైతులకు గిట్టుబాటు ధరలు ఇప్పించలేదు, ఇటు వినియోగదారులకు సరుకులు ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకు ఇప్పించలేని పరిస్థితి. మిల్లర్ల, దళారుల ఇష్టారాజ్యం. వారి అక్రమ గోదాంలపై విజిలెన్స్ దాడులు ఎన్ని జరిగినప్పటికీ, ఎన్ని వేల టన్నుల బియ్యం నిలువలు వెలికితీసినప్పటికీ, అక్రమ నిలువదారులు ఒక్క మెట్టు కూడా దిగివచ్చిన జాడలేదు. ధరలు ఏమాత్రం నియంత్రించబడలేదు సరికదా, అవి ఇంకా అధిక స్పీడ్‌తో ఆకాంశవైపు పరుగెత్తుతున్నాయి. ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా శూన్యం.

భూమి ఉన్నవారు కేవలం తమ ఆస్తి పరిరక్షణ కోసం మాత్రమే సెజ్ పోరాటాన్ని నిర్మించలేరనీ, భూమిలేని దళిత రైతు కూలీల ప్రయోజనాలనూ కలుపుకుని ఉమ్మడిగా సాగితేనే ఉద్యమం సాధ్యమవుతుందనీ అంటున్నారు **నక్కా హేమా వెంకట్రావ్**

దళితులను దగా చేస్తున్న కాకినాడ సెజ్

(గత సంచిక తరువాయి)

ప్రభుత్వం ప్రకటించిన పునరావాస విధానం ప్రకారం ఇంటిని సెజ్‌కు అప్పగిస్తున్నపుడు వారి ఇంజనీర్లు తనిఖీ చేసి నిర్ణయించిన రేటు ప్రకారం ఇంటి యాజమానికి నష్టపరిహారం నగదు రూపంలో చెల్లించాలి. సదరు ఇంటి స్థలానికి కూడా విలువ కట్టి చెల్లించాలి. భూమి లేని ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన భూమి, ఇళ్లే దిక్కు. అవి అసైన్డు కింద లెక్క కట్టి సెజ్ యాజమాన్యం ఇళ్ళకు విలువ కట్టి స్థలానికి డబ్బు ఎగ్గొడుతున్నారు. ఈ లెక్కలు కూడా అన్ని కాకి లెక్కలే. సెజ్‌ను ఎదిరిస్తే వారి ఇంటి విలువ మరింత తగ్గుతుంది. ప్రభుత్వ జి.ఒ.లు ఉన్నా, కోర్టు డైరెక్షన్లు ఉన్నా వీరికి పట్టదు. దిక్కు మొక్కు లేని జనం, అడిగేవారు లేరు అని మరింత అన్యాయానికి పూనుకొంటున్నారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉంటే మాత్రమే కాలనీలో ఇళ్లు నిర్మిస్తామన్నారు. పునరావాస కాలనీలోని ఇళ్లు చూస్తే కాంక్రీటు జంగిల్ జ్ఞాపకమొస్తుంది. సాధారణంగా దళితులు నివసిస్తున్న ఇళ్లు పాకలైనా, పెంకుటిళ్లైన చుట్టూ ఉన్న ఉమ్మడి స్థలాన్ని తమ అవసరాలకు వాడుకుంటారు. అగ్గిపెట్టెల్లాంటి పునరావాస కాలనీలో ఉన్న ఇంటిలో రెండు చిన్న గదులు. వంటిల్లు లేదు, దానికి వసతి లేదు. మొండి గోడలతో వున్న ఇంటిలోకి వర్షం, ఎండ ధారాళంగా వస్తాయి. డాబాకు పిట్టగోడ లేదు, ప్రహరీ గోడ లేదు. ఏమైనా ప్రశ్నిస్తే సమాధానం ఒక్కటే, 'దళితుల జీవితంలో డాబా ఇల్లు కట్టుకోవడం సాధ్యమా అని? ఇదే చాలా గొప్ప' అని దబాయింపు.

ఇళ్ల ఎలాట్‌మెంట్ కూడా పాక్షికమే, కుతర్కాల మోసమే. భర్త కోల్పోయిన వారికి ఇళ్ళు ఇవ్వరు. సెజ్ యాజమాన్యం సమాధాన మేమిటంటే, వారు ఎన్నాళ్లు బతుకుతారో తెలియదు. వారు కచ్చితంగా పిల్లల దగ్గర ఉండాలే తప్ప వ్యక్తిత్వం కోసమైనా సరే విడిగా ఉండనవసరం లేదని. అదీ వారి మానవతా దృక్పథం! ఇక 21 సంవత్సరాలు నిండిన వారికి ఉద్యోగం లేకపోయినా, పెళ్లైతే ఉపాధి

ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం వ్యవసాయరంగంలో తమ తప్పిదాలను, వైఫల్యాలను కప్పిపుచ్చడానికి సహకార సేద్య విధానం గురించి ప్రస్తావన తీసుకొచ్చి, ఈ విధానాన్ని ప్రవేశపెట్టడానికి నిశ్చయించింది. కుప్పం సహకార సేద్య విధానం విజయవంతం అయిన జాడలు లేవు. ఆనాడు బాబు ఇజ్రాయిల్ విధానాన్ని నమూనాగా తీసుకొని కుప్పంలో సహకార సేద్య విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఇప్పుడు వై.ఎస్.ఆర్. అదే ఇజ్రాయిల్ విధానాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళదామనుకున్నారు.

వ్యవసాయ రంగంలోనే కాదు ఏ ఇతర ఉత్పత్తి రంగంలో అయినా భారతదేశం ఇతర దేశాల విధానాలను గుడ్డిగా అనుకరించడం సరికాదు. అలా అనుకరించిన విధానాలన్ని విఫలమైనవి. ఆనాడు రష్యాను అనుసరించి స్థాపించిన కొన్ని పబ్లిక్ సెక్టర్ పరిశ్రమలు, ప్రభుత్వ అధికార్ల అవినీతి అసమర్థత, దానికి తోడుగా కార్మికులు విచ్చలవిడిగా అనుసరించిన ట్రేడ్ యూనియన్ విధానాల వల్ల నష్టపడి మూతపడినవి. హైదరాబాద్‌లో మూతపడిన ఐ.డి.పి.ఎల్. అలాంటిదే. పోగా పోగా కొన్ని పబ్లిక్‌రంగ సంస్థలు (పి.ఎస్.యు.) బి.ఎచ్.ఇ.ఎల్.లాంటివి మిగిలినవి. ఇలా మంచిగా నడిచే పి.ఎస్.యు.లలో కూడా ఇప్పుడు డిసెన్వెస్ట్‌మెంట్ ప్రణాళికను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. లాభాలబాటలో నడుస్తున్న కంపెనీలను కూడా ప్రభుత్వం ప్రైవేటైజ్ చేయాలని చూస్తోంది.

1991లో ఆర్థిక సంస్కరణలు ఈ దేశంలో ప్రవేశపెట్టిన దరిమిలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసే ప్రతి అడుగు కార్పొరేట్ సెక్టర్ వ్యాప్తికి అనుకూలంగా ఉన్నవి. ప్రస్తుతం వై.ఎస్. కోరుకున్న సహకార సేద్య విధానం కూడా కార్పొరేట్ వ్యవసాయ విధానానికి బాట వేయడానికే అనడంలో ఏమాత్రం సంశయం లేదు.

ప్రస్తుత పరిస్థితులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారంలో ఉన్న నాయకులు వ్యవసాయరంగాన్ని, వ్యవసాయదార్లను గ్రామాలలో నివసించే ఇతర పేదవర్గాలను సంక్షేమ కార్యక్రమాలతో తృప్తిపరుస్తు, వారిని తమ ఓట్ బ్యాంక్‌గా మార్చుకొని, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి, తదుపరి కార్పొరేట్ రంగానికి సేవ చేయడమే తమ పరమావధిగా పెట్టుకున్నారు. కార్పొరేట్ సెక్టర్‌లో ఉన్న కంపెనీల వ్యాపారం వృద్ధి అయితేనే దేశ జి.డి.పి. పెరుగుతుందని వీరి వాదన. అందుకే, వీరు బలవంతంగా చిన్న, పేద రైతులకు సంబంధించిన వేలాది ఎకరాలు సేకరించి సెజ్‌ల రూపంలో కంపెనీలకు కట్టబెడుతున్నారు. వ్యవసాయ భూములకు నీరు అందించడానికి నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్ట్ లాంటి వాటి నీరును బ్రహ్మణీ స్టీల్ ప్లాంట్‌కు అక్రమంగా తరలించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ఈనాటి వ్యవసాయ రంగ దుస్థితి. కాని ఒకటి మాత్రం నిజం. ఈ దేశపు రైతులు బీదరికాన్ని అయినా అనుభవిస్తారు కాని, తమ కమతాలను కంపెనీలకు ఇవ్వటానికి ఇష్టపడరు. ఇవ్వాళ పశ్చిమ బెంగాల్‌లో అక్కడి చిన్న రైతులు, గిరిజన రైతులు చేసే పోరాట సారాంశం ఇదే. ప్రభుత్వాలు దీనిని గ్రహిస్తే మంచిది.

ప్యాకేజి, ఇళ్లు ఇస్తారన్న ఆశతో మగ పిల్లలకు పెళ్లిల్లు చేస్తున్నారు. స్త్రీలు సెజ్ యాజమాన్యం దృష్టిలో పౌరులే కాదు. ఇదీ వీరి మనువాద దృక్పథం. ఆవాసాలు స్మశానాలుగా మారిన వేళ వలస వెళుతున్న దళిత పీడితవర్గానికి ఎలాంటి గ్యారంటీ లేని ఇళ్లను కేటాయిస్తున్నారే తప్ప వాటి రిజిస్ట్రేషన్ ఇప్పటి వరకు జరగనే లేదు. కట్టడానికి ఉపయోగించిన వస్తు సామాగ్రి కారు చవకైనది. ఇందులో ప్రభుత్వ వాటా కూడా ఉంది. అయినా సరే సెజ్ కనుసన్నల్లో ఉన్న కాంట్రాక్టు వర్గం, అధికార సిబ్బంది ఇంటి నిర్మాణం కోసం వెచ్చించవలసిన దాంట్లో వాటాలు పంచుకొని స్వాహా చేస్తున్నారు. కొబ్బరి, మామిడి తదితర ఫలవృక్షాలకు, హ్యాండు పంపులకు మొదలగు వాటికి నష్టపరిహారం అసలే చెల్లించడం లేదు.

ఏ వాదం చేయనిపని కాకినాడ సెజ్ యాజమాన్యం చేసింది. అదేమిటంటే ఒక ఇంట్లో ఎంతమంది ఉన్నా, (పెళ్ళైన వారు, కానివారు) అంతకు పూర్వం ఎలాంటి ఇంట్లో ఉన్నా సరే వీరికి సంబంధం లేదు. దళితుల ఇష్టాయిష్టాలకు స్థానం లేదు. అంతా ఒకే మూసలో ఉండే ఇళ్ళు. అవే రెండు గదుల డాబాలు. అసలు కులాలు పోయాయని ఎవరన్నారు? ఒక్కసారి ఈ పునరావాస కాలనీలోకి వెళితే మనకు అర్థం అవుతుంది. రాజ్యం ఆధునికత పేరుతో కులవ్యవస్థను ఎలా పునర్‌స్థాపిస్తుందో. ఇక్కడ దళితులకు, బిసిలకు, ఓసిలకు వేరు వేరు వీధులు కేటాయించారు. ఏమైనా మనం ఎదురు ప్రశ్నిస్తే హోమోజినిటి గురించి ఏలినవారు తిరిగి మనల్నే ప్రశ్నిస్తారు. ఒక్క అదేనా వీరు ఏర్పాటు చేయబోయే స్మశానాలు కూడా కులాలవారిగానే.

కాలనీలో మౌలిక సదుపాయాలైన కరెంటు, నీరు కొన్ని గంటలు మాత్రమే ఇస్తున్నారు. కరెంటు కోత ఎందుకంటే రేపటి సెజ్‌లో పెట్టబోయే పరిశ్రమల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పట్నుంచే ప్రజలకు అలవాటు చేస్తున్నారట. ఇంక గొడ్డు, గోదా, కోళ్ళకు స్థలమే లేదు. పశువుల పాకలకు డబ్బును ప్రకటించిన సెజ్ యాజమాన్యం వాటిని ఇవ్వకపోగా కాలనీలో పశుసంపదకు ఎలాంటి సదుపాయాలు కల్పించ లేదు. ఎందుకంటే వాటిని పరోక్షంగా కాలనీలోకి తీసుకురాకూడదు కాబట్టి. దళిత వీధిలోకి వెళితే ఇంటి బయట వంట చేసుకుంటూ, పెంపుడు కోళ్లతో భయం భయంగా బతుకుతున్న స్త్రీలు కన్పిస్తారు. గ్రామాల్లో ఏరుకొని వెంట తెచ్చుకున్న వంట చెరుకు తప్ప వేరే దారి లేదు. ఇక ముందు వంట చెరుకును మార్కెట్లో కొనవలసిందే. దళితవాడలో చనిపోయిన వారికి అంత్యక్రియలు చేయటానికి సరైన స్థల వసతి లేకపోవడం వల్ల మానసికక్షోభకు గురవుతున్న దయనీయమైన పరిస్థితి.

పునరావాస ప్యాకేజిలో మరొక అంశం ఏమిటంటే జీవనభృతిని శ్రామికులు కోల్పోతారు. కాబట్టి 625 రోజుల కూలిని అందచేయాలి. ఇళ్లు అమ్మిన డబ్బు, వేతనాల డబ్బు స్థిరాస్తి సంపాదనకు పెట్టుబడిగా సరిపోవటం లేదు. కూలివర్గంగా ఉన్న దళితులకు తమ ఆదాయం అవసరాలకే అరకొరగా సరిపోగా, ఆరోగ్యం, పెళ్లిళ్లు, చదువుల కోసం చేసిన అప్పులు తీర్చడానికి ఆ మొత్తాల్ని వాడుతున్నారు. మిగిలిన ఏ కొంచెమో వారి జీవితాల్ని దిద్దుకునే పెట్టుబడిగా వాడుకునే అవకాశం లేక చిన్న చిన్న అవసరాలకు మిగిలిన డబ్బును ఖర్చు పెట్టేసు కుంటున్నారు. ఇది కొంత మంది దళితులకు ఉపయోగపడకపోగా స్త్రీలను మరిన్ని కష్టాల్లోకి నెట్టివేస్తుంది. వస్తు వినియోగ సంస్కృతి వారిని ఒక విధమైన వ్యామోహంలో, మత్తులో ముంచేస్తుంది. వచ్చిన డబ్బుతో టివిలు, బైకులు, సెల్‌లు ఇంకా మిగిలిన డబ్బుతో రోజంతా తాగి పనికి వెళ్లకపోతే స్త్రీలే మొత్తంగా కుటుంబ బాధ్యతను ఎత్తుకోవలసి వస్తుంది.

స్థానిక కూలీరేట్లు రోజుకు 200 రూపాయలైతే కనీస దినసరి వేతనం 120 రూపాయలుగా ప్రభుత్వమే ప్రకటించినా, కేవలం 106 రూపాయలు చొప్పున మాత్రమే కూలీ కట్టడం వలన శ్రామికులకు ఎంతో అన్యాయం, దోపిడి జరుగుతోంది. దళిత, పీడిత కులాల్లో ప్రతిఒక్కరు కష్టపడేవారైనా ఉమ్మడి కుటుంబంలో కేవలం ఒక్కరికే ఉపాధి కల్పిస్తామనటం ద్వారా మిగిలిన వారి బతుకుతెరువును దెబ్బ తీస్తున్నారు. దాంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విడదీయలేని భాగమైన ఉమ్మడి కుటుంబాల్ని విచ్ఛిన్నం చేస్తున్నారు. ఇక శ్రామికవర్గానికి చెందిన దళిత స్త్రీలది పనికి వెళ్లనిదే పూట గడవని పరిస్థితి. వారంతా వ్యవసాయ కార్మికులే. వీరు రోజుకు కనీసం 120 నుండి 150 రూపాయలు వరకు తెచ్చుకుంటారు. వేతనాలు మగవారితో పాటు సమానంగా రాకపోయినా భర్తల్ని కోల్పోయిన స్త్రీలు, తమ కుటుంబాలను సైతం పోషించుకుంటున్నారు. అసలే అతి తక్కువ అక్షరాస్యత ఉన్న స్త్రీలకు, ఏ ఆధారం లేని స్త్రీలకు నేడు పునరావాస ప్యాకేజిలో ఉపాధి, ఇళ్ళు, వేతన నష్టపరిహారం లాంటి ప్రతిపాదనలు లేవు. మరి స్వతంత్ర్య భారతదేశంలో స్త్రీలకు ముఖ్యంగా దళిత స్త్రీలకు చోటు లేకపోవడం రాజ్యాంగ సూత్రమైన సమానత్వానికే విరుద్ధం. అయినా సరే లెక్క చేయరు. తరతరాల పితృస్వామ్య ధోరణికి ఇది ఓ మచ్చుతునక మాత్రమే.

ఊరి ఉమ్మడి ఆస్తులైన చర్చిలకు, దేవాలయాలకు, మసీదులకు సరైన ధర కట్టడం గాని, పునరావాస కాలనీలో వాటిని తిరిగి నిర్మించడం గురించి గాని ఇప్పటి వరకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు ఎక్కడ పెడతారో చెప్పని యాజమాన్యం, 'మీ పిల్లల భవిష్యత్తుకే సెజ్‌లనే' ప్రకటనలను ఇవ్వడం హాస్యాస్పదమే కాక వంచన కూడా. దళితుల ఆరాధ్య నాయకుడైన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందో లేదో స్పష్టపరచలేదు. ఉమ్మడి ప్రయోజనాలకు వాడుకొనే కమ్యూనిటీ హాలు నిర్మిస్తారో, లేదో, నిర్మించినా ఎంత స్థలంలో కడతారో ఇప్పటికీ తెలియజెప్పలేదు. పునరావాస కాలనీలో భద్రత లేని కారణంగా దడాలపాలెంకు చెందిన దడాల వెంకటేశు, రాణిల కుమారుడైన ఉదయ్ కిరణ్ ప్రాణాలను కోల్పోయాడు. దానికి సెజ్ యాజమాన్యం ఏ మాత్రం మానవత్వంతో స్పందించలేదు. ఇలా ప్యాకేజిలు వచ్చినా దళితుల పరిస్థితులలో గణనీయమైన మార్పులు లేకపోగా ఉన్న ఊరిని, రైతుల విశ్వాసాన్ని, పనిని పోగొట్టుకొని దళితులు మరింతగా దారిద్ర్యంలోకి మునిగి పోతున్నారు. దళితులకు, భూమికి మధ్య ఉన్న దూరాన్ని వైరుధ్యంగా సెజ్ యాజమాన్యం మలచి రైతాంగ సెజ్ పోరాటానికి వ్యతిరేకంగా వీరిని నిలబెట్టింది. ఇది దళితులకు, వారి అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగకరం కాదు. ఇక ఉపాధి కల్పన పేరిట ఏమి జరుగుతుందో చూద్దాం.

కాలనీలోకి వచ్చిన వారికి ఉపాధి కార్డు పేరిట గుర్తింపు కార్డుని ఇచ్చి ఉపాధి కార్డుగా ప్రతి దళితుడ్ని దగా చేస్తున్నారు. సుమారు 40 మంది యువకులకు శిక్షణ ఇచ్చి శిక్షణకు సంబంధంలేని టాయిలెట్ క్లీనింగ్ కూడా చేయించారని యువకులు చెప్పారు. స్థానికంగా పనులు కల్పిస్తామన్న యాజమాన్యం తమను దూరప్రాంతాలకు పంపి వెట్టిచాకిరీ

చేయించుకున్నారని, అభిమానవంతులైన యువకులు వెనుదిరిగారు. గ్రామాలలోని ప్రజలు పునరావాస కాలనీలకు తరలడం మొదలుకాగానే సెజ్ యాజమాన్యం కొత్త ఎత్తుగడలతో తమ పథకాలు కొనసాగించారు. దళితుల మధ్య పోటీ పెట్టి, వారిలో ఒక రకమైన అభద్రతా భావాన్ని కల్పించి, ఊర్లకు ఊర్లు కదిలేలా చేసిన సెజ్ యాజమాన్యం తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకొని కాలనీలలోకి వచ్చేవారికి వెంటనే ప్యాకేజి ఇవ్వలేమని, ఇంకా రావద్దని కూడా హెచ్చరించారు. దీనికి ఆర్థికమాంద్య ప్రభావం కూడా తోడు కావచ్చు. దళితుల పరిస్థితి యిలా ఉంటే మిగిలిన ప్రజలు కూడా క్రమంగా అభద్రతకు లోనవుతున్నారు. వాస్తవానికి కాకినాడ సెజ్‌ను ప్రారంభిస్తామన్న ఒ.ఎన్.జి.సి. మొదట్లోనే తప్పుకుంది. ఆ తర్వాత జి.ఎమ్.ఆర్., రిలయన్స్ పవర్ ఇలా ఇంకా ఎవరో ఇదమిద్ధంగా తెలియని పరిస్థితి. ఎవరు పోయి, ఎవరు వచ్చినా సెజ్‌లో వాటాలు కలిగిన బడా పెట్టుబడిదారీ వర్గం అంతా కూడా ఆధిపత్య, ప్రాబల్య కులాలదే కాబట్టి దళితులకు న్యాయం జరుగుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది.

సమాజంలో ఉన్నటువంటి భౌతిక వనరులపైన రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికి సమాన హక్కు ఉంటుంది. కాని కొన్ని ఆధిపత్య కులాలే వాస్తవంలో అన్ని హక్కులు అనుభవిస్తున్నాయి. సామాజికంగా అణచివేయబడ్డ కులాల కోసం, వారి హక్కుల్ని కాపాడేందుకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టబడ్డాయి. ఇప్పటి ప్రపంచీకరణ నేపథ్యంలో కంపెనీలు అన్ని బడా గుత్త పెట్టుబడిదారుల (బహుళజాతి కంపెనీల) చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. అప్పుడు సెజ్‌లు విదేశి హస్తాల్లోనో లేక దళారీ స్వభావం గల స్వదేశీ పెట్టుబడిదారుల అజమాయిషీలోనే కేంద్రీకృత మవుతాయి. విదేశీ పెట్టుబడులు, ఎగుమతులు ఆధారిత సెజ్‌లలో సామాజిక అంశమైన రిజర్వేషన్లకు స్థానముండదు. ఇది జగమెరిగిన సత్యం. ఈ పెట్టుబడిదారీ వర్గం రిజర్వేషన్‌లు భారతీయ సామాజిక వైకల్య నిర్మూలనకు అవసరమని గుర్తించగలదా! ప్రభుత్వరంగ సంస్థల లోనే నియామకాలు జరగటం లేదు. ఇక సెజ్‌ల్లోనా? విప్రో లాంటి సంస్థలు ఈ విషయాన్ని బాహటంగానే బయటపెట్టాయి. ఇప్పటికే సామాజికంగా అట్టడుగు వర్గాలు మరింత అధ్వాన్నంగా తయారయి దోపిడికి గురవుతున్నాయి. ధనవంతులు ఇంకా ధనవంతులై, దళితులు మరింత దరిద్రులుగా మిగులుతారు.

దళితులకు ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ల విషయం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. దేశాన్ని గుత్తపెట్టుబడిదారీ వర్గానికి తాకట్టు పెట్టదల్చుకున్న పాలకవర్గానికి దాన్ని శాసించే ఆసక్తి లేదు. ఆ సాహసం చెయ్యదు. ఎల్లప్పుడూ అభద్రతలో ఉంచి విధేయులుగా మార్చే ప్రైవేటు రంగం వాటి నియంతృత్వ ధోరణి వదులుకొని ఎలాంటి హామీలు ఇవ్వటానికి సెజ్ యాజమాన్యం సిద్ధపడటం లేదు. పడదు కూడా.

ప్రతిభ పేరుతో దళితుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా తయారవుతోంది. అసలు ప్రతిభ అంటే పాలకవర్గ అధికార సంబంధాల తో ముడిపడి ఉంటుందన్న విషయం అందరూ గుర్తెరిగిందే. అందుకు ఉదాహరణలు కోకొల్లలు. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలు. వాటి మేనేజ్‌మెంట్ కోటాలు వీటికి మచ్చు తునక. మరి ఏ అధికార సంబంధాలు, డబ్బు లేని దళితులకు ప్రతిభ ఎక్కడ నుండి వస్తుంది? ఎటు చూసినా దళితుల పరిస్థితి మరింత విషమిస్తుంది తప్ప రాణించదు. అనేక విధాలుగా ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతున్న సెజ్‌లు దళితులకు రాయితీలు ఇస్తామన్న ప్రస్తావనే తేలేదు. అసలు ప్రభుత్వమే ఇంతశాతం రిజర్వేషన్లు అనే నిబంధనల వంటి చర్యలు చేపట్టలేదు. ప్రజలకు బాధ్యత వహించవలసిన ప్రభుత్వానికే బాధ్యత లేనప్పుడు లాభాల బాటే ధ్యేయంగా ఉన్న పెట్టుబడిదారీ వర్గానికి వాటి ప్రతిరూపాలైన సెజ్‌లు రిజర్వేషన్ల పట్ల బాధ్యత ఎందుకు వహిస్తాయి? ఇది పాలకవర్గాలు అభివృద్ధి ముసుగులో దళితులకు చేస్తున్న సామాజిక ద్రోహంగా పరిగణించాలి. భారతదేశంలోని యావత్తు సొత్తు, సంపద, వనరులు కొంతమంది సొంతం కాదని, అది జాతి యావత్తు సొత్తని, ముఖ్యంగా దళిత బహుజనులదని రాజ్యాంగం స్పష్టపరచినా శ్రామికవర్గమైన వీరి హక్కులుగా గుర్తించడానికి ఇష్టపడని రాజకీయ నేపథ్యం మనది. ఒకవేళ గుర్తించినా అది నటనకే పరిమితం. ఈ పరిస్థితులలోనే తమ హక్కుల కోసం అస్తిత్వ ఉద్యమాలు పుట్టుకొచ్చాయి.

ఈ రోజున అస్తిత్వ ఉద్యమాల ద్వారా రాజకీయంగా, ఆర్థికంగా బలపడ్డ నాయకులు పాలకవర్గాల కుట్రలో భాగంగా బడా పెట్టుబడిదారీ వర్గానికి కొంతమంది తమ జాతి ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు. కాకినాడ సెజ్ ప్రతిపాదిత ప్రాంతంలోనూ ఇదే జరిగింది.

ఈ దళారీ వర్గం అంబేద్కర్ వారసులుగా ఉన్న దళితులకు అన్యాయం చేస్తూ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. నిజానికి దళిత ఉద్యమాలకు తూర్పుగోదావరి జిల్లా పెట్టింది పేరు. అటు మాల మహానాడు, ఇటు దండోరా ఉద్యమాలు ఇక్కడే ఊపందు కున్నాయి. సింహగర్జనలు, విశ్వరూపాలు మామూలే. ఇక్కడ ఆత్మగౌరవ పోరాటాలకు ఇచ్చిన ప్రాధాన్యత ఆర్థిక అంశాలకు ఇవ్వడం లేదు. దళిత అస్తిత్వ చిహ్నాలకు ఎలాంటి అవమానం జరిగినా దోషులకు శిక్ష పడే వరకు జిల్లానే కాదు రాష్ట్రాన్ని సైతం గడగడ లాడించారు. అలాంటి సందర్భాలలో దళితులలోని ఉపకులాలు అన్ని ఒక్క తాటిపై నిలిచాయి. కాని అదే స్పందన సెజ్‌ల వలన నష్టపోతున్న దళితుల పట్ల రాలేదు. పాలక వర్గాలు కూడా తమ లక్ష్యాలకు అనుగుణంగానే దళిత అభివృద్ధి అంటే ఆత్మగౌరవ పోరాటాల మాదిరిగానే ప్రోత్సహిస్తున్నాయి. అలాంటి సంఘటనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం దన్నుగా ఉంటుందన్న ప్రచారం చేసుకుంటుంది. (నిజానికి చాలా సంఘటనలలో దోషులు దొరికింది లేదు, శిక్షింపబడింది లేదు.) పాలకవర్గాలు ఒక వర్గాన్ని తమ దళారీ వర్గంగా మార్చుకుంటున్నారు. ఈ దళారీవర్గం చేత కులం పేరుతో వారి కన్నుని వారి వేలితో పొడుచుకునేలా దళిత జాతిని మోసగిస్తున్నారు. ఈ దళారీ వర్గం సెజ్ యాజమాన్యం చేతిలో కీలుబొమ్మలు.

దళిత ప్రాతినిధ్యం చట్ట సభలలో లేదా, అంటే రాజకీయ భాగస్వామ్యం అయితే లభించింది కాని అధికార భాగస్వామ్యం ఇంకా లభించలేదు. సెజ్ చట్టాన్ని దానిలో ఉన్న దళిత వ్యతిరేక అంశాలని ప్రశ్నించి ఆ చట్టం అమలు ద్వారా జరిగే జీవన విధ్వంసాన్ని ఎత్తి చూపటానికి వీరి నిర్ణయాత్మక శక్తి చట్ట సభల్లో పరిమితమైంది. ప్రజాస్వామ్యం పేరిట జరుగుతున్న ఈ ప్రక్రియలో ఆధిపత్య కులాల నియంతృత్వ ధోరణికి ఇది మచ్చు తునక. కాగా ఎన్నికల గారడిలో దళితులు ప్రధాన రాజకీయ పార్టీల పావులుగా మారిపోయారు. దళిత ప్రయోజనాలను దెబ్బతీసే పాలకవర్గాల కుట్రను బయట పెట్టటానికి ఎన్నికలు వీరి చేతిలో ఆయుధం కాలేదు. అవసరమైతే ఎన్నికల ప్రక్రియను తిరస్కరించే ధైర్యాన్ని, చైతన్యాన్ని సెజ్ వ్యతిరేక పోరాట కమిటీ కూడా ఇవ్వలేకపోయింది. ఏ పార్టీ అయిన గతి తప్పిన ప్రజాస్వామ్యంలో దళితులకు ఏమీ ఒరగబెట్టదని వీరు గ్రహించారు.

మరొక విషయం గమనించవలసింది ఏమిటంటే రాజ్యాంగం

గ్యారంటీ ఇచ్చిన జీవించే హక్కు, సమానత సిద్ధాంతాలకు మూలమైన అధికరణలు, భౌతిక వనరులపై సమాన ఆధిపత్యం ఇవన్నీ కూడా ఖాతరు చేయకుండా రాజ్యం అమలు పరుస్తున్న నిర్బంధ సెజ్‌ల వలన దళితులు పొట్ట చేతబట్టుకొని ప్రకృతి వనరులతో సంబంధాలు తెంచుకొని తరలిపోతున్నా, దళిత ప్రజా ప్రతినిధులు మౌనంగా ప్రేక్షకపాత్రను వహిస్తున్నారు. ఇక రాజ్యం ఆధిపత్య కులాల, వర్గాల చేతుల్లో దోపిడి సాధనంగా మారినవేళ దళితుల్ని రక్షిస్తుంది అనుకోవడం వట్టి భ్రమ మాత్రమే. దళితుల జీవిత అనుభవాల సారాంశం కూడా ఇదే.

ఒక్కసారి చరిత్రను తిరగేస్తే కనుక ఏ ఉద్యమానికైనా ఆయువు పట్టు దళితవాడలే. అటు విప్లవ పార్టీలకు, స్వచ్ఛంద సంస్థలకు, మత సంస్థల కార్యకలాపాలకు ఆలంబన దళిత పేటలే. కాకినాడ సెజ్‌లో జరిగింది వేరు. మొదట్లో కొన్ని విప్లవ పార్టీలు ప్రవేశించినా ఒక సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ తప్ప కొనసాగలేదు. 2007 ఆగస్ట్‌లో 6 విప్లవ పార్టీలు సెజ్ వ్యతిరేక పోరాట కమిటీగా ఏర్పడినా, దళితులు అందులో భాగస్వాములు కాదు. దళిత గ్రామ కమిటీలు ఏర్పరచలేదు. వలసలు ఆపలేదు. అలాగే కడలి అనే స్వచ్ఛంద సంస్థ పని చేసినా, దళిత సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధను పెట్టలేదు.

అలాగే ఈ రోజున దళితులు సెజ్‌ను ప్రత్యక్షంగా వద్దనకుండా వారిలో మెజార్టీవర్గం పునరావాసం కోసం ప్రయత్నిస్తున్నారు. వీరు దళిత దళారీవర్గాన్ని ఎదిరించి ఎండగడుతున్నారు. ఒకప్పుడు తమ చెప్పుచేతల్లో బతికి, రిజర్వేషన్ల కారణంగా తమ అండదండలతోనే స్థానిక రాజకీయ ప్రతినిధులుగా ఎదిగి తమనే లెక్కచేయడం లేదన్న ధోరణి ఒసి, బిసి నాయకత్వంలో కన్పిస్తుంది. వీరి యజమాని-బానిస సంబంధాలలో సమానత్వ స్పృహ ఉండదు. ఇక దళితులు మిగిలిన కులాలతో పాటు నాయకత్వంలోకి ఎలా ఎదగగలరు. అందుకే ఈ రోజున దళితులు వారి నాయకత్వ శ్రేణులలో ఇమడలేక తమ న్యాయపోరాటాలకై 'కాకినాడ సెజ్ బాధిత అంబేద్కర్ సంఘాన్ని' ఏర్పాటు చేసుకున్నారు. సెజ్‌ను నిలువరించటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. తమ న్యాయమైన డిమాండ్‌ల కోసం సంఘంలో చర్చించి పరిష్కరించాలని పట్టుబడుతున్నారు. ఈ అంబేద్కర్ సంఘం ఏర్పడకుండా సెజ్ యాజమాన్యం తమ దళారీలతో విశ్వప్రయత్నం చేసింది. అయినప్పటికీ గ్రామ కమిటీల నాయకత్వంలో అంబేద్కర్ జయంతిని 'దళిత సెజ్ వ్యతిరేక పోరాట దినం'గా జరుపుకున్నారు. ఎప్పుడైతే దళిత నాయకత్వం మొదలయ్యిందో సెజ్ యాజమాన్యానికి దడపుట్టి 'విభజించు-పాలించు' పద్ధతిలో నాయకత్వశ్రేణిలోని కొంత మందిని బెదిరించి భయపెట్టి దళిత గ్రామాల్ని ఖాళీ చేయించటానికి పూనుకుంటున్నారు. కొందరు నాయకుల చేతులు కూడా తడుపుతున్నారు.

ఇక్కడ శ్యామల అనే దళిత స్త్రీ చేస్తున్న సాహసోపేతమైన పోరాటం గురించి చెప్పవలసిందే. మొత్తం దడాలపాలెం అనే దళిత గ్రామాన్ని సెజ్ యాజమాన్యం ఖాళీ చేయించినా పట్టు వదలని దీక్షతో తన ఇద్దరు కొడుకులతో ఒంటరిగా ఆ గ్రామంలో ఉంటూ న్యాయమైన కోర్కెల సాధనకై పోరాటాన్ని కొనసాగిస్తుంది. గ్రామపంచాయితీ (పొన్నాడ) కరెంట్, తాగునీటి సౌకర్యాలను తీసివేసినా, గ్రామస్తులు ఇళ్లను పడగొట్టుకొని ఈమెని ఒంటరిగా వదిలేసి పోయినా మొక్కవోని ధైర్యంతో సెజ్ యాజమాన్యాన్ని సవాలు చేస్తూనే ఇంది. ఎన్ని ఎత్తుగడలు వేసినా వారి గుండెల్లో దడ పుట్టిస్తూనే ఇంది.

ఈ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలోనే ఐదు గ్రామాలలో 'ప్రజాభిప్రాయ సేకరణ' జరిగింది. అందులో ఏ ఒక్క వ్యక్తి కూడా సెజ్ పట్ల సుముఖత చూపించలేదు. సెజ్ యాజమాన్యం ప్రజల్ని భయ భ్రాంతుల్ని చేసి ఎలా వశపరచుకుంటుందో దీనిని బట్టి తెలుస్తుంది. ఈ సంఘం నేతృత్వంలోనే న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తుంది.

మెజార్టీవర్గం ఈ రోజున పునరావాస ప్యాకేజిని ఒప్పుకొని సెజ్‌లకు ఆమోదం తెలపడం వెనుక బలమైన సామాజిక, ఆర్థిక రాజకీయ కారణాలు ఉన్నట్టే, బలమైన నాయకత్వ లోపం ఉన్నట్టు కన్పిస్తుంది. కాని మొన్న మొన్నటి వరకు తగాదాలు, తగవులు ఈ నాయకులు మాత్రమే తీర్చేవారు. అప్పుడు గ్రామ కట్టుబాటు ఉండేది. కాని ఇపుడు ఆ పరిస్థితులు లేవు. దగాపడిన దళిత వర్గం ఐక్యమై తమ నాయకత్వంలో సమస్యలు పరిష్కరించడానికి కాక పోరాటానికి నేతృత్వం వహించ గలగాలి. కులతత్వంతో దళారీవర్గంగా తయారైన వారిని ప్రజలు బహిష్కరించే స్థాయికి స్థానిక నాయకత్వం ఎదిగినప్పుడే ఇది సాధ్యం. దీనికి సెజ్ వ్యతిరేక ఉద్యమం కూడా ప్రధాన భూమిక పోషించాలి. ఇది సెజ్ వ్యతిరేక కమిటీ బాధ్యత కూడా కావాలి. అప్పుడే భూమిపై ఆధారపడ్డ దళితులు భూమిపై హక్కుగల రైతులతో సెజ్ వ్యతిరేక పోరాటాన్ని సవ్యమైన దిశలో కలిసికట్టుగా తీసుకెళ్ళగలరు.

అంబేద్కర్, పూలే, పెరియార్ అస్తిత్వ ఉద్యమాల అనుభవాలను క్రోడీకరిస్తూ విశాల ఐక్య పోరాటాల ద్వారా ఇతర పీడిత ప్రజలతో కలిసి సెజ్‌లను దళితులు ఎదుర్కోవాలి. లేనట్టయితే చరిత్రలో తాత్కాలిక ప్రయోజనాలకు బలయ్యే వర్గంగా మిగిలిపోతారు. అభివృద్ధి పేరిట పెట్టుబడిదారీ వర్గంతో మిలాఖత్ అయిన ప్రభుత్వం కూడా దళితుల పట్ల బాధ్యత వహించదు. కాబట్టి వీరు దీర్ఘకాలిక ప్రయోజనాలను కాపాడే శక్తులతో (సమూహాలతో) కలిసి పయనించవలసిన చారిత్రాత్మక బాధ్యత చైతన్యవంతులైన దళిత నాయకులపైన ఉంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో అభివృద్ధి పారిశ్రామికీకరణ పేరిట కోస్టల్ కారిడార్, సెజ్‌ల కోసం రాష్ట్రంలోని అడవులను, సముద్రాలను, భూములను బహుళజాతి బడా కంపెనీలకు అప్పగించే నిమిత్తం ఆదివాసుల్ని, మత్స్యకారుల్ని, దళితుల్ని, రైతుల్ని నిర్వాసితుల్ని చేస్తున్న ఈ ప్రక్రియను కేవలం నేరుగా బాధితులవుతున్న వారే ఎదుర్కోవాలా? ఎక్కడ చూసినా ప్రజలు తమ స్థాయిలో పోరాటాలు జరుపుతున్న మాట వాస్తవమే. కాని నందిగ్రాం, సింగూర్, లాల్‌గఢ్ ప్రజల చైతన్యం, పోరాటాల స్ఫూర్తి వీరికి ఎందుకు కొరవడింది? వీటి వెనుక ఉన్న బలమైన మేధావి వర్గం, ప్రజాస్వామిక వాదులు, పోరాట శక్తులు ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన ఆంధ్రప్రదేశ్‌లో కొరవడ్డాయా! ఎందుకు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అభివృద్ధి నమూనాను ప్రశ్నిస్తూ, స్వావలంబన నమూనా కోరుకుంటున్న ప్రజలకు ఆలంబన దిశగా బలమైన ఉద్యమాలు నిర్మించలేక పోతున్నాం? ఇది ప్రజా సంఘాల కర్తవ్యం కాదా? దేశ సార్వభౌమత్వానికి పెనుముప్పును తెచ్చే ప్రత్యేక ఆర్థిక మండలాలను వ్యతిరేకించే నైతిక బాధ్యత ప్రతి పౌరుడిది కాదా? ఒక్కసారి ఆలోచించాలి. దగాపడ్డ దళితుల్ని వర్గస్పృహతో నడిపించి ఉద్యమాలను నిర్మించే ఈ బాధ్యత విప్లవ ప్రజాస్వామిక శక్తులపై నే మరింత ఉంది.

(అయిపోయింది) వీ

తినే తిండీ, కట్టే బట్టా, వినోదంగా చూస్తున్న టి.వి. ఇలా వివిధ జీవన పార్శ్వాలలోకి చొచ్చుకు వస్తున్న మార్కెట్ విష సంస్కృతిని నిరంతరం చైతన్యంతో ఎదుర్కోవాలంటున్నారు **కడియాల సుబ్బనాచారి**

నేటి సమాజంలో యువతరం

దేశ సౌభాగ్యానికి విద్యార్థినీ విద్యార్థులు తలమానికం లాంటివారు. సమాజ ఉన్నతికి ఉపయోగపడే అలవాట్లు, ఇప్పటి నుండే నేర్చుకొనవలసినవారు. సమాజ భవిష్యత్తు వీరి మీదనే ఆధారపడి ఉంది. అయితే విద్యార్థినీ, విద్యార్థులలో ఈనాటి పోకడ ఏవిధంగా ఉందో, తలచుకుంటే గుండె నీరవుతోంది. హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు, అపహరణలు, అల్లరి చేయడాలు ఇవి సాధారణమయి పోతున్నాయి. బంగారు భవితను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణమేమిటి? దాని మూలాలు ఎక్కడ ఉన్నాయి అనేది ఆలోచించవలసిన విషయం. ఒక్క బాలురదే తప్పునిగాని, లేక బాలికలదే తప్పునిగాని, ఏకపక్షంగా నిర్ణయించడం సమంజసం కాదు. రెండు వైపుల నుంచి ఆలోచించాలి. పిల్లల పెంపకంలో మొట్టమొదటి బాధ్యత నిస్సందేహంగా తల్లిదండ్రులదే. రెండవది పాఠశాలలో ఉపాధ్యాయులు, తరువాత ప్రభుత్వ విధానాలు. స్వార్థమే పరమావధిగా, సమాజంలో డబ్బే ప్రధానంగా, విలాసాలలో మునిగి తేలడమే సుఖప్రదంగా భావించుకోవడం, పక్కవారి బాగోగులతో పనిలేదను కోవడం, కొత్తగా వచ్చే ప్రతి సంప్రదాయాన్ని, నవీనతగా భావించి, పాత సంప్రదాయాలను, అలవాట్లను, మూఢవిశ్వాసాలను, మొరటుతనమని భావించి, అనైతికమైన అలవాట్లకు అలవాటుపడి, గతంలో ఉన్న మంచిని పూర్తిగా విస్మరించిన దాని ఫలితమే ఇది.

ఈనాటి దుస్తులు, అంటే వస్త్రాలంకరణ గాని, భాషగాని, తనకు, తన కుటుంబానికి, తను జీవించే సమాజానికి గాని, ఏ మాత్రం ఉపయోగపడుతుందా అనేది ఆలోచించకుండా, పరాయీకరణకు అలవాటుపడి, అసలు మంచి జీవితం అంటే ఏమిటో, నీతిగా జీవించాలనే దానికి అర్థమే లేదు అన్నట్లుగా విచ్చలవిడి జీవితానికి అలవాటుపడి, బతుకులు భ్రష్టుపట్టించుకుంటున్నారు. ప్రతి విషయం లోనూ, కొన్ని నియమ నిబంధనలు, హద్దులున్నాయి. ఇది మితిమీరితే వచ్చే కష్ట నష్టాల గురించి అనేక కథలు మన సాహిత్యంలో, పురాణాల దగ్గర నుంచి వస్తూనే ఉన్నాయి. అవన్నీ, చాదస్తాలని కొట్టిపారేయడమే గానీ, వాటిలో నుండి ఉపయోగపడేదేదో స్వీకరించి, పనికిరాని చెత్తను వదలేయాలని మర్చిపోయి, ఎటువైపు పోతున్నారో కూడా తెలియకుండా వ్యవహరించడంలోనే ఇన్ని అనర్థకాలు ఒనగూడుతున్నాయి. స్నేహితుల మధ్యగాని, స్త్రీ-పురుషుల మధ్యగాని, ఉండవలసిన నియమాలు కొన్ని ఉన్నాయి. ఆ నియమాల్ని అతిక్రమిస్తే, వచ్చే విపరీత పరిణామాలు ఏమిటో కళ్లారా చూస్తున్నాం. కాని చూస్తూ కూడా మరలా వాటికే బానిసలైపోతున్నాం. డబ్బు సంపాదించుకోవడానికే విద్య అని, డబ్బుంటే అన్నీ ఉన్నట్లేనని, అంతవరకే దానికి ప్రాముఖ్యతను ఇచ్చి, తతిమ్మా విషయాల్ని మరచిపోతున్నారు.

మానవునికి తృప్తి ఎక్కడ. విద్యనార్జించడంలో తృప్తి ఉండరాదు గాని, డబ్బుకు తృప్తి కలిగి ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుంది. ధనాన్ని ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంతవరకే దానికి ప్రాముఖ్యత నివ్వాలిగాని, ఏం చేసైనా ధనాన్ని సంపాదించాలనుకోవడం చాలా తప్పని, దానిని ఎంతవరకు ఉపయోగించుకోవాలో తెలుసుకొని, మసలితే, ఈ హెచ్చు తగ్గులుండవు. ఈ విలాసాలు అనేవి మానవుడిని అధోగతికి నెడుతున్నాయని, మాటల తీరు అనేది వారికే కాదు, కుటుంబంలోనూ, బంధువుల మధ్య, స్నేహితుల మధ్య కూడా ఎంతో అవసరం. మాట్లాడే తీరును బట్టే కోపతాపాలు, మనస్పర్థలు చోటు చేసుకుంటాయనేది మనం వాడుకలో చూస్తూనే ఉన్నాం. మాటల తీరు ఎంత ముఖ్యమో, వేషధారణ గూడా అంతే ముఖ్యం. తోటి మనిషి ఉద్రేకాలకు లోనుకారాదు. ఆ విధంగా మన నడవడికగాని, వస్త్రాధారణ గాని ఉండడం మంచిది. ఈనాడు రెడీమేడ్ వస్తువులు పుష్కలంగా వస్తున్నాయి. ధరించే దుస్తుల దగ్గర నుండి తినే ఆహార పదార్థాల వరకు అన్నీ ముందుగానే తయారై వస్తున్నాయి. అవి మన ఆరోగ్యాన్ని ఏ విధంగా దెబ్బతీస్తున్నాయో గమనించండి. ఈ రెడీమేడ్ వస్తువుల వలన బాగుపడేది కోటీశ్వరులు. నష్టపడేది ప్రజలు. బయట తినే ఆహారం వలన ఆరోగ్యం చెడుతుంది. ధరించే వస్త్రాల వల్ల ఆరోగ్యమే కాకుండా మానసిక వైకల్యం కూడా ఏర్పడుతుంది. మనస్సు చాలా ప్రధానమైన అంగం. మనస్సును బట్టే నడత ఉంటుంది. నడత బట్టే మానవుడు, మానవుడిగా జీవించగలడు.

ప్రధానంగా నేటి సామాజిక స్వరూపం తెలుసుకుంటే గాని, వీటన్నిటికీ పరిష్కారం దొరకదు. పెట్టుబడిదారీ విధానానికి, మరొక ముద్దుపేరు మార్కెట్ ఆర్థిక విధానం. దీనికే సరళీకరణ, ప్రపంచీకరణ నామాంతరాలు. వీటి విధానాలు దొరికిన వరకు దోచుకోవడం. ఈ విధానాన్ని ఎదిరించకుండా వీటికి బానిసల్లాగా పడి ఉండాలంటే యువత మెదడు చైతన్యవంతంగా ఉండకూడదు. చైతన్యమైతే వారి దోపిడీకి అడ్డుపడతారు. అందుకని ఈ దోపిడీవర్గాలే కావాలని పైకి ఎన్ని మాటలు చెప్పినా, ఇటువంటి చెడు అలవాట్లకు గురి అయ్యేటట్లుగా యువతను

విద్య, ఉపాధి, తలసరి ఆదాయం వంటి వివిధ జీవన ప్రమాణాల సహకారంతో మన రాష్ట్రంలోని మానవాభివృద్ధిని వివరిస్తున్నారు **గుండేటి రమేశ్**

ఆంధ్రప్రదేశ్‌లో మానవాభివృద్ధి

ఒక దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని అంచనా వేయడంలో సాధారణంగా జాతీయాదాయం, తలసరి ఆదాయం కొలమానాలుగా ఉపయోగిస్తున్నారు. కాని ప్రముఖ ఆర్థికవేత్త అర్థశాస్త్రంలో నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అభిప్రాయం ప్రకారం దేశ ఆర్థికాభివృద్ధిని కొలుకోవడంలో జాతీయ తలసరి ఆదాయాలతోపాటు ప్రజలు జీవన ప్రమాణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం వలన మాత్రమే ఆర్థికాభివృద్ధిని పూర్తిస్థాయిలో అంచనా వేయవచ్చు. పై విధంగా అనేకమంది ఆర్థికవేత్తల అభిప్రాయాలు, సూచనలకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి డాక్టర్ మహబూబ్ ఉల్ హక్ పర్యవేక్షణలో 1990లో మానవాభివృద్ధి సూచిని (హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ - ఎచ్.డి.ఐ.) ప్రవేశపెట్టింది. ఈ సూచికలో ప్రధానంగా తలసరి స్థూల జాతీయోత్పత్తి, అక్షరాస్యత, ఆయుర్దాయం, పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్య సౌకర్యాల లభ్యత, తలసరి ఆహార వినియోగ స్థాయి, రాజకీయ పరిపాలనలో స్త్రీ–పురుష అసమానతలు మొదలైనవాటికి సంబంధించి రెండు వందల సూచికలను 33 పట్టికలలో రూపొందిస్తారు. తరువాత కాలంలో ఈ భావనకు అనుబంధంగా దేశపురోభివృద్ధిలో స్త్రీ, పురుష లింగాల మధ్య ఉండే అసమానతలను లెక్కించడానికి లింగ సంబంధిత అభివృద్ధి సూచీ (జెండర్ రిలేటెడ్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ - జి.డి.ఐ.)తో పాటు పరిపాలన రాజకీయ రంగంలో స్త్రీల భాగస్వామ్యాన్ని తెలుసుకోవడానికి లింగ సాధికారత కొలమానాన్ని (జెండర్ ఎంపవర్‌మెంట్ మెజర్స్ - జి.ఇ.ఎం.), పేదరిక స్థాయిని అంచనా వేయడానికి మానవ పేదరికపు సూచీ (హ్యూమన్ పావర్టీ ఇండెక్స్ - ఎచ్.పి.ఐ.) ని రూపొందించింది.

భారతదేశంలో కూడా 2001లో ప్రణాళిక సంఘం మొదట

తయారు చేస్తున్నాయి. వారి మైండ్‌ను మత్తులో ఉంచేందుకు ఒక సాధనంగా టి.వి. ఉపయోగించబడుతోంది. మనిషి విజ్ఞానాన్ని అందించే కార్యక్రమాలు ఏమైనా ఉంటున్నాయా? ఈ టి.వి.ని పెద్దవాళ్ల దగ్గరి నుంచి పాలుతాగే పిల్లవాళ్ల వరకు చూసి, తరించిపోతున్నారు. కనుక ప్రభుత్వ విధానాలు ఇవే అయినపుడు దేశం ఎట్లా బాగుపడుతుంది. ఇలాంటి చెడు పోకడలకు వ్యతిరేకంగా విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిదిద్దే కార్యక్రమం కూడా ప్రజాసంఘాల వారు తక్షణ సమస్యగా తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

మానవ మేధస్సు అనేది నేటి సాంఘిక వాతావరణాన్ని బట్టి ఉంటుంది. సాంఘిక మార్పు జరిగినపుడే మనస్సు, ఆలోచన, నడత కూడా మారతాయి. దీని గురించి ప్రత్యేకించి చెప్పినందువలన ప్రయోజనమేమిటి? సంఘ జీవనంలోనే నడత చూడాలనే వాదన కూడా ఒకటి ఉన్నది. ఇది కాదనలేని నిజం. అయితే మార్పుకోసం పోరాడే వారు భవిష్యత్ సమాజం కోసం ఎదురుచూస్తూ, చేతులు ముడుచుకొని చూస్తూండాలనేది ఒట్టి శుష్కప్రియత్వం. ప్రస్తుత పరిస్థితికి వ్యతిరేకంగానే గదా మనం పోరాడేది. పోరాటం చేయకుండా మార్పు జరగదు. పోరాటంలోనే మానవులు మారుతూ ఉంటారు. మారిన కొలది తమ ఆలోచనా విధానాన్ని అభివృద్ధి పరుచుకొంటారు. పరిస్థితులకు లోబడి ఉండడమంటే యథాతథస్థితిని కోరుకోవడమే. మారే ప్రయత్నంలోనే మానవులు విజ్ఞానవంతులు అవుతారు. ఆ విజ్ఞానం సమాజాభివృద్ధికి ఉపయోగపడుతుంది. చెడు నుంచి మంచికి ప్రయాణం అంటే ఇదే. కనుక మనం సమాజంలోని చెడు పోకడలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిందే. ప్రచారం చేస్తూ ఉండవలసిందే. క్రమానుగతంగా మార్పులు వస్తాయి. మంచి ప్రయత్నం ఎపుడూ వృథా కాదు. ఒక్కసారిగా సమాజం అంతా మారదు. ఒక్కసారి దెబ్బతింటే గాని, గుణపాఠం రాదు. దెబ్బలు తినగా తినగా గుణపాఠం నేర్చుకొంటారు. వాళ్ల పరిస్థితులే వాళ్లను మార్చే క్రమంలోకి నెడతాయి. మనం రమ్మన్నప్పుడు పోరాటాలు రావు. ప్రత్యేక సందర్భాలలోనే పోరాటాలు వస్తాయి.

మనకు స్వప్రయోజనం అంటూ లేదు. ప్రజల ప్రయోజనమే మన ప్రయోజనం. కాబట్టి ప్రజల సమస్యల నుంచి ఎపుడూ దూరం కారాదు. నీటిలో చేపలాగా మనం ప్రజల్లో ఉండడమంటే ఇదే. అది చిన్న సమస్యా, లేక పెద్ద సమస్యా అని చూడరాదు. దేనికి తగ్గ ప్రయత్నం దానికి చేయవలసిందే. అపుడే మనం ప్రజలకు దగ్గరవుతాం. నిలకడ మీదనే నిజం గ్రహిస్తారు. ఎవరు ప్రజలకు మిత్రులో, ఎవరు శత్రువులో గ్రహించవలసిన పరిస్థితిని కూడా ఆయా పరిస్థితులే కల్పిస్తాయి. ఏ మేరకు వీలైతే, ఆ మేరకు కృషి చేయవలసిందే. సామ్రాజ్యవాద పరిస్థితులలో సమాజం అస్తవ్యస్తమై, అన్ని రంగాలు భ్రష్టు పట్టాయి. సమాజంలోని చెడులన్నిటికీ కారణం ఏది, అనేది విడమర్చి చెప్పడంలోనే మన కర్తవ్యమున్నది. 'తినగ తినగ వేము తియ్యగనుండు' అన్న సామెత ప్రకారం చెప్పగా చెప్పగా ప్రతి విషయాన్ని అంటే మంచినీ, చెడునూ రెండింటినీ కూడా ప్రజలు గ్రహించ గలరు. అలా గ్రహించకపోతే ఇన్ని మార్పులు జరుగవు.

మానవ అభివృద్ధి నివేదికను రూపొందించిన తరువాత ప్రతి రాష్ట్రం తన స్వంత మానవాభివృద్ధి నివేదికను రూపొందించుకోవాలని సూచించింది. దీనికి ప్రతిస్పందించిన మధ్యప్రదేశ్ రాష్ట్రం మొదటిసారిగా మానవాభివృద్ధి నివేదికను తయారు చేసింది. తరువాత పంజాబ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ మొదలైన రాష్ట్రాలు తయారు చేసాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మానవాభివృద్ధి నివేదికను తయారు చేయాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించే బాధ్యతను పరిశోధనా రంగంలో ఎంతగానో అనుభవం పొందిన ఆర్థిక సామాజిక అధ్యయన సంస్థ సెస్ (సి.ఇ.ఎస్.ఎస్.)కు అప్పగించారు. ఈ సంస్థ జనాభా పెరుగుదల, శిశుమరణాలు, తలసరి ఆదాయం, అక్షరాస్యత, ఆయుఃప్రమాణం, వనరుల అందుబాటు, గృహనిర్మాణం, రక్షిత మంచినీరు, పట్టణీకరణ, విద్యుత్ సౌకర్యం, బాలకార్మిక వ్యవస్థ, ఆరోగ్య వసతి మొదలైన 70 అంశాలు ప్రాతిపదికన మానవాభివృద్ధి సూచికను రూపొందించింది. వాటిలోని కొన్ని ముఖ్యాంశాలు –

2001 మానవాభివృద్ధి నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ జనాభా పెరుగుదల రేటును నియంత్రించడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 1991 నాటికి జనాభా పెరుగుదల రేటు 24.2 శాతం కాగా, 2001 నాటికి 14.59 శాతానికి తగ్గింది.

1990–2000లో అక్షరాస్యతను పెంపొందించడానికి ప్రభుత్వం మంచి పనితీరును ప్రదర్శించినప్పటికి దేశంలో అక్షరాస్యత తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నమోదయింది. 2001 లెక్కల ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలన్నిట్లో అక్షరాస్యత పరంగా 28వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత 60.47 శాతంగా ఉంది. అక్షరాస్యతపరంగా రాష్ట్రంలో స్త్రీ–పురుషుల మధ్య వ్యత్యాసాలున్నాయి. అదే విధంగా ప్రాంతాలవారిగా పరిశీలిస్తే తేడాలు అధికంగా కనిపిస్తాయి. రాష్ట్రం మొత్తం మీద 399.34 లక్షల మంది అక్షరాస్యులుండగా వీరిలో 211.34 లక్షల మంది తెలంగాణ ప్రాంతంలో, 69.64 లక్షల మంది రాయలసీమలో, 133.18 లక్షల మంది దక్షిణకోస్తా ప్రాంతంలో ఉన్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే 2001 జనాభా లెక్కల ప్రకారం అక్షరాస్యతలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంటే, పశ్చిమ గోదావరి జిల్లా రెండవ స్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లా చివరి స్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో అక్షరాస్యత తక్కువగా ఉండటానికి మౌలిక సదుపాయాల కొరత, పేదరికం, తల్లిదండ్రుల్లో అక్షరాస్యత లేకపోవడం ప్రధాన కారణాలు అని 'విజన్–2020' గుర్తించింది.

జనాభా పెరుగుదలను అరికట్టడంలో స్వయం సహాయక బృందాల అభివృద్ధిలో రాష్ట్రం ప్రగతిని సాధించడం వల్ల 2004–05 నాటికి ఆంధ్రప్రదేశ్ పేదరికం 15 శాతం తగ్గింది. ఇది దేశ పేదరికం కంటే తక్కువ అని చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 2004–05 కు గాను మిక్స్‌డ్ రికార్డ్ పీరియడ్ (ఎం.ఆర్.పి.) ప్రకారం పేదరికం గ్రామాలలో 7.50 శాతం, పట్టణాలలో 20.7 శాతం. సగటున 11.10 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు.

శిశుమరణాల విషయంలో 17 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 11వ స్థానంలో ఉంది. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే చివరి స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో శిశు మరణాల రేటు 1991లో 73 శాతం ఉండగా, 2005 నాటికి అది 57కి తగ్గింది. ఇదే కాలంలో కేరళ శిశు మరణాల రేటు 16 నుంచి 14కు తగ్గింది. కేరళ కంటే మన రాష్ట్రంలో శిశుమరణాల రేటు (ఇన్ఫాంట్ మార్టాలిటీ రేట్ – ఐ.ఎం.ఆర్.) ఎక్కువగా ఉన్నప్పటికి జాతీయ సగటు 58 కంటె కొంచెం తక్కువగా ఉండడం గమనార్హం.

రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పరిశీలిస్తే బాగా తగ్గాయి. 1983–94 మధ్య ఉపాధి కల్పన రేటు 2.7 శాతం కాగా, 2004–05 నాటికి ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత ఉపాధి అవకాశాలు 0.95 శాతం తగ్గాయి. ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన తరువాత, ఉపాధి అవకాశాలతో పాటు, నిజవేతనాల స్థాయి కూడా తగ్గింది. 2004–05 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని కార్మికులను పరిశీలిస్తే 94 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయాలలో జాతీయ స్థాయి సరాసరితో రాష్ట్రం దగ్గరగా ఉన్నప్పటికీ మానవాభివృద్ధి సూచికలో, ఉపాధి అవకాశాల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ బాగా వెనుకబడి ఉంది.

రాష్ట్రంలో బాలకార్మిక సమస్య కూడా అధికంగా ఉంది. 1993–94లో 14.8 శాతం బాలకార్మికులు ఉండగా, 2004–05 నాటికి 6.6 శాతానికి తగ్గింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో బాలకార్మికులు అధికంగా ఉన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో బాలకార్మికులు రెండింతలున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశీలిస్తే బాలకార్మికులు వ్యవస్థ మరికాస్త ఎక్కువగా ఉంది.

2007–08 ఆర్థిక సర్వే ప్రకారం స్థిర ధరల వద్ద ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రు. 24,969 గా ఉంది. ఇదే కాలంలో దేశంలో రు. 24,256 తలసరి ఆదాయంతో రాష్ట్రం జాతీయ సగటు కంటే ముందుంది. ఆంధ్రప్రదేశ్ దేశ భౌగోళిక విస్తీర్ణంలో 8.37 శాతంతో దేశంలో 4వ అతిపెద్ద రాష్ట్రంగా ఉంది. 2006–07 నాటికి నికర సాగుభూమి 102.4 లక్షల హెక్టార్లతో మొత్తం రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 37 శాతం ఉంది. 2005–06లో గల 108 లక్షల హెక్టార్ల నికర సేద్య భూమి 2006–07 నాటికి తగ్గింది. జి.ఎస్.డి.పి. లో ప్రాథమిక రంగం వాటా గురించి ఈ పట్టికలో ఉంది.

1999–2000 ధరలలో జి.ఎస్.డి.పి.లో ప్రాథమిక రంగం వాటా (శాతంలో)

రంగం	2004–05 (ఆర్)	2007–08 (ఎ)
1. వ్యవసాయం అటవీ సంపద మత్స్య సంపద	26.13	24.32
1.1 ఎ) వ్యవసాయం	15.28	14.67
బి) పశు సంపద	7.51	6.77
1.2 అటవీ సంపద	0.81	0.66
1.3 చేపల పెంపకం	2.53	2.22
2. మైనింగ్, క్వారీయింగ్	3.01	3.93
ప్రాథమిక రంగం	29.14	28.25

పట్టికలోని గణాంక వివరాలను విశ్లేషిస్తే రాష్ట్ర ఆదాయంలో (జి.ఎస్.డి.పి.) 2004-05 నాటికి ప్రాథమిక రంగం వాటా 29.14 శాతం ఉండగా, 2007-08 ముందస్తు అంచనాలకు 28.2 శాతానికి తగ్గింది. జి.ఎస్.డి.పి. లో ప్రాథమిక రంగం వాటా 1955-56లో 65 శాతం ఉండేది. అది తగ్గుతూ వచ్చి 2007-08 నాటికి 28 శాతానికి చేరింది. జి.ఎస్.డి.పి.లో అధిక వాటాదారుగా ప్రస్తుతం తృతీయరంగం ఉంది. రాష్ట్ర ఆదాయానికి కేవలం వ్యవసాయం నుంచి వచ్చే వాటా సుమారుగా 1/4 వంతుగా ఉంది. 1970లో రాష్ట్రంలో హరిత విప్లవం ప్రభావం వల్ల వరిసాగులో అభివృద్ధి సంభవించింది. జాతీయ స్థాయితో పోలిస్తే జి.ఎస్.డి.పి. వాటాలో, ఉపాధి వాటాలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయరంగం వాటా ఎక్కువగా ఉంది. 1961లో ఉపాధిలో వ్యవసాయం వాటా 69 శాతం కాగా 2001 నాటికి 59 శాతానికి తగ్గింది. అయితే రాష్ట్రంలో వ్యవసాయేతర రంగంలో ఉపాధి అవకాశాలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. వ్యవసాయ పనివారిలో 60 శాతం మంది వ్యవసాయ శ్రామికులే. మిగిలిన వారు వ్యవసాయదారులు. మొత్తం వ్యవసాయ పనివారిలో వ్యవసాయదారుల శాతం ఉత్తర కోస్తా ఆంధ్రలో ఎక్కువగా ఉండగా, దక్షిణ కోస్తాలో తక్కువగా ఉన్నారు. దక్షిణ కోస్తాలో వ్యవసాయేతర రంగాలలో పనిచేసే వారి శాతం ఎక్కువ. రాష్ట్రంలో పెద్దతరహా, మధ్యతరహా భూకమతాల విస్తీర్ణం శాతం తగ్గుతూ వస్తోంది. మరోవైపు ఉపాంత చిన్న భూకమతాల విస్తీర్ణం శాతం పెరుగుతూ వస్తోంది. 2005-06 నాటికి ఉపాంత కమతాలు 61.6 శాతం ఉండగా, ఉపాంత చిన్న కమతాలు 80 శాతం పైనే ఉన్నాయి. మన రాష్ట్రంలో వ్యవసాయదారుల అనుపాతం నిరంతరం తగ్గుతూ వస్తోంది. వ్యవసాయ శ్రామికుల అనుపాతం పెరుగుతుండడం గమనించ దగ్గ విషయంగా వివరించవచ్చు. బీహార్ తర్వాత అత్యధిక వ్యవసాయ శ్రామికులున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల మధ్య వ్యవసాయ శ్రామికుల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంది. తూర్పు గోదావరిలో వ్యవసాయదారులు 11 శాతం ఉండగా వ్యవసాయ కూలీలు 51 శాతంగా ఉన్నారు. కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో వ్యవసాయ శ్రామికులెక్కువగా కేంద్రీకృతమై ఉన్నారు. ఇది భూమిని తిరిగి పునఃపంపిణీ చేసి, భూసంస్కరణలు అమలు చేయాల్సిన ఆవశ్యకతను ఎంతగానో సూచిస్తుంది.

పట్టికలో మానవాభివృద్ధి సూచికల్లో 11 జిల్లాలు బాగా వెనుకబడి ఉన్నాయి. తెలంగాణలో వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్; రాయలసీమలో కడప, కర్నూలు, అనంతపురం; కోస్తా ఆంధ్ర ప్రాంతంలో శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జిల్లాలు బాగా వెనుకబడి ఉన్నాయి. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక ఆర్థిక రంగాల్లో విద్య, ఆరోగ్యం, ఆదాయం మొదలైన విషయాల్లో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

జిల్లాల వారిగా మానవాభివృద్ధి సూచికలు

జిల్లా	ర్యాంకు		ఆదాయం	విద్య	ఆరోగ్యం
	1991	**2001**	**2002-03**	**2001**	**2001**
శ్రీకాకుళం	21	21	22	16	20
విజయనగరం	23	22	23	10	23
విశాఖపట్నం	15	11	1	18	19
తూర్పు గోదావరి	11	6	7	7	5
పశ్చిమ గోదావరి	7	4	6	2	6
కృష్ణా	2	2	8	3	2
గుంటూరు	3	5	9	9	3
ప్రకాశం	12	14	12	13	13
నెల్లూరు	4	8	10	6	9
చిత్తూరు	6	10	13	4	11
కడప	9	13	17	8	8
అనంతపురం	19	20	19	17	21
కర్నూలు	20	19	16	21	17
మహబూబ్‌నగర్	22	23	21	23	22
రంగారెడ్డి	5	3	3	5	7
హైదరాబాద్	1	1	2	1	1
మెదక్	13	12	4	22	14
నిజామాబాద్	14	16	14	19	10
ఆదిలాబాద్	16	17	15	20	16
కరీంనగర్	8	7	11	15	4
వరంగల్	18	15	18	11	15
ఖమ్మం	10	9	5	14	12
నల్గొండ	17	18	20	12	18

ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న జనాభా నాణ్యతను, శ్రామిక జనాభాకు సరైన విద్య, శిక్షణ, నైపుణ్యం పెంచడంతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం వల్ల రాష్ట్ర ఆర్థిక సామర్థ్యం పెరిగి ఆర్థికాభివృద్ధి శీఘ్రమవుతుంది. దీంతోపాటు మానవ వనరులలోని విద్య, సాంకేతిక విద్య, వ్యవసాయ విద్య మొదలైన వాటివల్ల వ్యవసాయం, తయారీ రంగం, బోధన, సహకార, బీమా రంగాల్లో నైపుణ్యాలు, ఉత్పత్తి స్థాయి పెరుగుతాయి. మానవ వనరుల వృద్ధి ద్వారా ఉత్పాదక వనరులు పెంచడంతోపాటు విదేశీ పెట్టుబడులను కూడా బాగా ఆకర్షించవచ్చు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విద్యా, శిక్షణా వృత్తి నైపుణ్యం ఉన్నవారు ఎక్కువ వేతనాలు పొందుతారు. దీని ద్వారా రాష్ట్రంలో పొదుపు, పెట్టుబడుల మూలధన సంచయనం పెరిగి పారిశ్రామికీకరణ జరుగుతుంది. మానవ వనరుల వృద్ధి వల్ల జీవన శైలిలో, సామాజిక దృక్పథాల్లో మార్పులు సంభవించి ఆధునిక దృక్పథాలు పెంపొందుతాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. వీ

గుజరాత్‌లో ముస్లింలపై జరిగిన మారణకాండకు నిరసనగా, మానవీయ స్పందనగా వచ్చిన సినిమాలను సాహిత్యాన్ని పరిచయం చేస్తున్నారు **పి.వి. రమణ**

రెండు సినిమాలు - ఒక నవల

లౌకిక ఐకమత్యంలోని మాధుర్యం, మతసామరస్యంలోని సొగసు, భారతీయ మానవతకు ప్రతీక అయిన సెక్యులరిజం ఇదే జాతికి నిర్విరామ కార్యక్రమం, నిరంతర సందేశం. ఈ సమున్నత విలువలను కాపాడుకునేందుకు పోరాడుదాం. విచ్ఛిన్నకరమైన భావజాలాన్ని నిర్మూలిద్దాం. గుజరాత్ ఒక దుర్ఘటన. ఒక దుశ్శాసనం. మన బహుముఖ సంస్కృతి, లౌకికవాద వారసత్వం. సామాజిక న్యాయం, ఉజ్వల ప్రజాస్వామ్యం విజయం సాధించేందుకు సమరం సాగిద్దాం. మన సమగ్రత, మన సౌభ్రాతృత్వం, దుర్మార్గానికి, రక్తపిపాస రాజకీయ పశుత్వానికి ఎట్టి పరిస్థితులలోనూ లొంగిపోయేందుకు వీలులేదు.

– జస్టిస్ పి.ఆర్. కృష్ణ అయ్యర్

గుజరాత్ మారణకాండకు మానవీయ స్పందనలో భాగంగా గొప్ప కవిత్వం, కథలు, వ్యాసాలు వచ్చాయి. ఆ ఆవేదనలోనే వచ్చిన రెండు సినిమాలనూ, ఒక నవలను పరిచయం చేసే చిన్న ప్రయత్నం ఇది. అవి రాహుల్ ధోలకియా దర్శకత్వం వహించిన ఫర్జానియా (హిందీ), నందితాదాస్ దర్శకత్వం వహించిన ఫిరాఖ్ (హిందీ), ఫైర్‌ప్రూఫ్ నవల (ఇంగ్లిష్ మూల రచయిత రాజ్‌కమల్ ఝా, తెలుగు అనువాదం – కస్తూరి).

ఫర్జానియా

2002 జనవరిలో దర్శకుడు రాహుల్ ధోలకియా తన మిత్రుడు దారామోడీ, అతని భార్య రూపా, కొడుకు అజర్, కుమార్తె బినైఫర్‌లతో అహ్మదాబాద్, గుల్బర్గ్ సొసైటీలో మకర సంక్రాంతి పండగ సందర్భంగా సంతోషంగా గడిపాడు. పిల్లల గాలిపటాల ఆటలలో పాలుపంచుకున్నాడు. తర్వాత కొద్ది రోజులలోనే జరిగిన మారణకాండలో మోడీ కుమారుడు అజర్ తప్పిపోయాడు. ఎంత వెతికినా కనపడలేదు. చనిపోయాడో, బతికున్నాడో ఇంతవరకు తెలియలేదు. జరిగిన విధ్వంసం, ఆ తల్లిదండ్రుల ఆవేదన, రాహుల్‌ను ఈ సినిమా తియ్యడానికి ప్రేరేపించాయి.

సూక్ష్మంగా సినిమా కథ : పార్సీ మతానికి చెందిన సైరస్ సినిమా ప్రొజక్షనిస్ట్‌గా పని చేస్తుంటాడు. ముస్లింలు ఎక్కువగా ఉన్న మహ్మద్ మాన్షన్‌లో అతని భార్య షెహనాజ్, కొడుకు ఫర్జాన్, కూతురు దిల్షాద్‌లతో సంతోషంగా జీవితం గడుపుతుంటాడు. అమెరికా నుండి గాంధీ మీద పరిశోధన చేయడానికి 'అలాన్', గాంధేయవాది రామానంద్ సహకారం కోసం అహ్మదాబాద్ వస్తాడు. అతనికి సైరస్‌తో స్నేహం ఏర్పడుతుంది. గోద్రా ఘటన తర్వాత ప్రారంభమైన దాడులలో అనేక మంది చనిపోతారు. ఫర్జాన్ ఏమయ్యాడో తెలియదు. ఖాన్ సాబ్‌ను కూడా చంపుతారు. అతని కొడుకు ఆసిఫ్, కోడలు నిఖత్ మిగుల్తారు. చివరకు విచారణ జరుగుతుంది. అందులో బాధితులు సాక్ష్యం చెబుతారు.

పదేళ్ల ఫర్జాన్ ఎప్పుడూ సంతోషంగా ఉంటాడు. చెల్లికి కథలు చెపుతాడు. ఒక గేయం కూడా రాస్తాడు.

'నాన్న చాలా పొడవు, బలవంతుడు
అమ్మ చాలా సున్నితం, పడిపోతే సహాయపడుతుంది
చెల్లెలు అల్లరి పిల్ల, తియ్యనిది
మరి నాన్న కాళ్లు వాసన వేస్తున్నాయి'

అంటూ పాడి అమ్మానాన్నలను అలరిస్తాడు. చెల్లికి అతని ప్రపంచం గురించి చెపుతాడు. 'తన ప్రపంచంలో ఇళ్లన్నీ 'చాకోలా'తో నిర్మించబడి పై కప్పులన్నీ డిజర్ట్‌లతో కప్పబడి ఉంటాయి. కొండలన్నీ ఐస్‌క్రీమ్‌లతో నిండి ఉంటాయి' అని చెబితే దిల్షాద్ అవి మనం తినవచ్చా అని అడుగుతుంది. 'ఓ అవన్నీ మనవే. హాయిగా తినవచ్చునని' చెపుతాడు. దిల్షాద్ రాఖీ తెచ్చి అన్నకు కట్టాలని ప్రయత్నిస్తే 'అది హిందువులు కట్టుకుంటారు' అంటాడు. 'నాకదేం తెలియదు. నన్ను నా జీవితాంతం నువ్వు కాపాడాలి' అని అంటుంది. 'సరే నిన్ను కాపాడుతాను' అంటూ నవ్వుతాడు.

బజార్లో పాకిస్తాన్ గెలిచిందని తెలిసి కొందరు ముస్లింలు బాణాసంచా కాలుస్తూ సంబరం చేసుకుంటూంటారు. అది చూసి దూరంగా ఉన్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు 'బ్లడీ ముస్లింస్' ఈ దేశంలో ఉంటూ పాకిస్తాన్‌ను పొగుడుతారా? మీకు అసలు బాణాసంచా చూపిస్తాం అంటూ మాప్ తీసుకొని, బెహ్రాంపురా, చమన్‌పురా, జువాపురాలకు గుర్తులు పెడ్తారు. గోద్రా ఘటనకు ముందే పథకాలు సిద్ధంగా ఉన్నాయన్న సత్యం అర్థం అవుతుంది.

ఫర్జాన్ స్కూల్లో టీచర్ పాఠం చెపుతూ '1947లో భారతదేశం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందింది. దేశం రెండుగా చీలిపోయి ప్రత్యేకంగా ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతం పాకిస్తాన్‌గానూ, హిందువులు ఎక్కువగా ఉన్న ప్రాంతం ఇండియా గానూ ఏర్పడ్డాయి. వేలాది హిందూ కుటుంబాలు పాకిస్తాన్ నుంచి బలవంతంగా

పంపబడ్డాయి. కొంతమంది ముస్లింలు కూడా ఇండియా వదిలి వెళ్లిపోయారు. కాని అధికశాతం మన మతాతీత, ప్రజాస్వామ్య భారతదేశంలో ఉండిపోయారు' అని వ్యగ్యంగా నవ్వుతూ చెబుతుంది.

27వ తేదీన ఉదయం స్కూలు అయిపోయి ఫర్జాన్ మిగతా పిల్లలతో తిరిగి వస్తుంటే దారిలో పోలీసులు, బజరంగ్‌దళ్ కార్యకర్తలు కలిసి ఆటోను ఆపుతారు. వీరిలో ఎవరైనా 'ముస్లిం పిల్లలు ఉన్నారా?' అని డ్రైవర్‌ను ప్రశ్నిస్తారు. అతను 'ఎవరూ లేరు. అందరూ హిందువుల పిల్లలే' అని చెపుతాడు. వాళ్లు ఫర్జాన్‌ను పట్టుకొని 'ఇతని సంగతేమిటి?' అని అడిగితే, 'వాళ్లు మన హిందువులకు తలనొప్పిలాంటి వారు సార్, అయినా వారు హిందువులే' అని చెప్పడం, పార్శీల పట్ల సమాజంలో ఉన్న వైఖరి తెలుస్తుంది.

సైరస్ అలాన్‌ను ఇండియా ఎలా ఉంది అని అడుగుతాడు. ప్రజలు మరీ ఎక్కువ గౌరవంగా చూస్తున్నారు అంటాడు. నీవు తెల్లవాడివి కాబట్టి అలా చూస్తున్నారు. నీ దగ్గర చాలా డబ్బు ఉండి ఉంటుందని వారి అభిప్రాయం అని సైరస్ అంటాడు. 'ఇక్కడ కూడా చాలా డబ్బు కుప్పలు కుప్పలుగా కనపడుతుందే' అని అలాన్ అంటే, 'డబ్బు ఉంది గాని అది కొద్దిమందికి మాత్రమే చెంది ఉంది' అని అంటాడు. దానికి 'సరిగ్గా మా అమెరికాలో పరిస్థితి కూడా అదే' అని అలాన్ అంటే, 'కనీసం కారణం లేకుండా అక్కడ ఒకరినొకరు చంపుకోరు' అని సైరస్ అంటాడు. 'హాస్యమాడుతున్నావా? భారత్ కంటే నేరాలలో మేం మూడు రెట్లు ఎక్కువ. బొంబాయిలో కన్న లాస్ ఎంజిల్స్‌లో ఎవర్నైనా సులభంగా కాల్చేయొచ్చు' అని అలాన్ చేప్తే, 'దానికి కారణం మీరు చూసే ఆ భయంకరమైన సినిమాలే' అని సైరస్ అంటాడు. ఇక్కడ భారత్, అమెరికా రెండు దేశాల సామాజిక స్థితి గురించి, ప్రత్యేకంగా అమెరికాలోని హింసాత్మక పరిస్థితి గురించి ఎత్తిచూపడం కనిపిస్తుంది.

స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తరువాత 'మనం హిందువులమా? పార్శీలమా?' అని తల్లిని ఫర్జాన్ ప్రశ్నిస్తాడు. దానికి ఆమె 'వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు పవిత్ర భూమి పర్షియా నుండి పెద్ద అందమైన ఓడలో భారత్‌లోని గుజరాత్‌కు వచ్చారు. వారు నివసించడానికి చోటు లేదని గుజరాత్ రాజు ఆందోళనపడి రాజగురువు సలహా అడిగితే అతను పెద్ద పళ్లెంలో పాలు తెప్పించి దానిలో కూడా చోటు లేదని అంటూ, ఒక చెంచాడు పంచదార దానిలో కలిపి పాలలో పంచదార కలిసిపోయినట్లు పార్శీలు కూడా భారతీయులతో కలిసిపోవాలని చెప్తాడు. దానితో మనం ఇక్కడ వారితో కలిసిపోయి ఈ సంస్కృతికి తీపినిచ్చిన వాళ్లం అయ్యాం. ఆనాటి నుంచి పార్శీలు, భారతీయులు హాయిగా కలిసి మెలిసి జీవిస్తున్నారు' అని భవిష్యత్ గురించి ఏ మత్రం బెంగలేకుండా ఎంతో హాయిగా చెబుతుంది.

అలాన్ సైరస్‌తో బలవంతంగా డ్రింక్ ఇచ్చి తాగించినపుడు 'జాగ్రత్త ఎక్కువయితే తిన్నగా శ్మశానానికి పోతావు' అంటాడు. దానికి సైరస్ 'మా పార్శీలకు శ్మశానం ఉండదు. పార్శీ చనిపోతే ఒక అగ్ని హోమం జరుగుతుంది. తరువాత శవాన్ని ఒక ఎత్తైన టవర్‌మీద వదిలి వచ్చేస్తాం. అక్కడ గద్దలు వచ్చి ఆ శవాన్ని తినేస్తాయి' అంటే దానికి అలాన్ హాస్యమాడుతున్నావా? అంటాడు. 'లేదు శరీరం తర్వాత కూడా ఇంకొకరికి ఉపయోగపడాలి. మట్టి నుంచి వచ్చిన మనం తిరిగి మట్టిలో కలిసిపోవాలి' అని పార్శీ వారి తాత్విక ధోరణిని సైరస్ వివరిస్తాడు.

భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తూ 'అలాన్' ఇంటికి వెళ్లి అతన్ని 'నీవు ఏ మతం వాడివి? ఏ కులం' అని అడుగుతారు. వాళ్ల ధోరణి అర్థం అయిపోయిన అలాన్ వ్యంగ్యంగా 'నాది సైతానుల జాతి. మనుష్యుల్ని తినే జాతి' అని జవాబు చెపుతాడు.

టివిలో ముఖ్యమంత్రి గోద్రా సంఘటనల మీద 'ఇటువంటివి ఏ మాత్రం సహించం. నేరస్తులను పూర్తిగా శిక్షిస్తాం. అంతేకాదు వారికి ఒక గుణపాఠం చెపుతాం. ఇక ఇలాంటివి భవిష్యత్‌లో చేయడానికి కలలో కూడా సాహసించలేరు. గుజరాత్ ప్రభుత్వం సామాన్య ప్రజలను రక్షిస్తుంది. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొనే వారిని ఎట్టి పరిస్థితులలోనూ వదిలిపెట్టం. అటువంటి నేరాలకు ఈ సమాజంలో చోటు లేదు. ఎవర్నీ వదిలేది లేదు' అని ప్రకటించడం అతనిలో గల విద్వేషాన్ని 'ఇక మీ ఇష్టం. మీరేం చేసినా ఎవ్వరు అడ్డు చెప్పరు' అని కార్యకర్తలకు హామీని ఇవ్వడం అనేది స్పష్టమవుతుంది.

(హిందువుల కోపాన్ని ఎవరూ ఆప వద్దని మోడి ఆదేశించినట్లుగా తనకు డి.జి.పి. కె. చక్రవర్తి చెప్పినట్లు అడిషనల్ డి.జి.పి. ఆర్.పి. శ్రీకుమార్ నానావతి కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ఉంది.)

ఇద్దరు పోలీసులు రోడ్డు మీద నడుచుకుంటూ వస్తూంటారు. వారిలో ఒకతను 'పరిస్థితి అంతా బాగుంది. ఎక్కడా గొడవలు లేవు' అంటాడు. దానికి రెండో అతను 'ఎలక్షన్‌లు దగ్గర వస్తున్నాయి. ఏవో గొడవలు ప్రారంభమవుతాయి' అంటే, జరిగే అల్లర్లు అన్నీ అధికార పీఠం కోసం ఎన్నికల ముందే జరగడం అన్న సత్యాన్ని వివరించడం కనిపిస్తుంది.

అలాన్ కారులో వెళ్తుంటే ఒకచోట భజరంగ్ దళ్ కార్యకర్తలు ఆయుధాలు రవాణా చేస్తుంటారు. అతన్ని చూసి ఆపేస్తారు.

సైరస్ కుటుంబం నివసిస్తున్న 'మహ్మద్ మాన్షన్' పై దాడులు జరుగుతాయి. కాలన్ తలుపులు మూసివేసినా పెద్ద దూలంతో తలుపులు బద్దలుకొట్టి లోపలికి వచ్చిన వేలాదిమంది కనపడిన వారందరినీ కత్తులతో నరికేస్తారు. ఇళ్లను తగలబెడతారు. పిల్లల్ని తీసుకొని పారిపోతున్న షెహనాజ్‌ను గుంపు తరుముతుంది. తప్పించుకొనే క్రమంలో ఫర్జాన్ తప్పిపోతాడు.

ముస్లిం స్త్రీ నిఖత్ భయంతో వణికిపోతూ వంటగదిలో కింద దాక్కుంటే తనని ఒక భజరంగ్‌దళ్ కార్యకర్త చూస్తాడు. ఆమె అతన్ని దీనంగా చేతులెత్తి రక్షించమని ప్రార్థిస్తుంది. ఒక్క క్షణం ఆలోచించి అతని వెనక వస్తున్న మిగతావారికి అక్కడ ఎవరు లేరని ఆమెను రక్షించడం, అంత దుర్మార్గపు పరిస్థితులలోనూ కూడా మానవత్వం అనేది మిగిలి ఉండటాన్ని, అలాగే గుంపులో ఉన్న మనుష్యులందరూ దుర్మార్గులు కానక్కర్లేదనే విషయాన్నీ నొక్కి చెప్పడం అభినందించాలి.

నిఖత్ భర్త ఆసిఫ్ తన వాళ్లనందర్నీ కోల్పోయినందున తిరిగి బదులు తీర్చుకోవాలనే కసితో ఆయుధాలను సేకరిస్తాడు. తనవారితో సమావేశంలో 'ఇది వాళ్ల భూమిలాగే మన భూమి కూడా. మా నాన్నను చంపడం నేను కళ్లారా చూశాను. ఆయన నాకు స్నేహితుడిలాంటి వాడు. ఇక్కడ మన వాళ్లను పొగొట్టుకోవడమొక్కటే కాదు. మన ఆత్మగౌరవాన్ని చంపారు. మన దేశంలోనే మనం క్షేమంగా ఉండగలమనే ఆశ చచ్చిపోయింది. మనం ఈ దేశానికి చెందినవారం కాదని వాళ్లు

అంటున్నారు. భారత్ వారి సొంతం అంటున్నారు. అకస్మాత్తుగా మనం బయటి వాళ్లమయిపోయాం. అల్లా ఆదేశం ప్రకారం నమ్మని వారిని మనం శిక్షించాలి' అని అంటుంటే, భర్త మాటలు విని నిఖత్ 'ఇది సరైన పనేనా' అని అడుగుతుంది. 'ఏది సరైన పని? వాళ్లు చేసింది సరైనదేనా? అయినా వారినెందుకు రక్షించాలని చూస్తున్నావు?' అని అడుగుతాడు. 'ఎందుకంటే నన్ను ఒక హిందువు రక్షించాడు కాబట్టి' అంటుంది. 'మరి ఆ హిందువులే మా నాన్నను దారుణంగా చంపారు. ఆయన 75 సంవత్సరాల ముసలివాడు. అలాంటి వాడు వాళ్లకు ఏం అపకారం చేయగలడు? వాళ్లకు శిక్షపడాలి. నువ్వు అడ్డు చెప్పొద్దు' అని అంటాడు. దానికి నిఖత్ 'మన వాళ్లను ఎవరు చంపారో వాళ్లనే నువ్వు చంపగలవా?' అని ప్రశ్నిస్తుంది. 'అది నాకనవసరం' అంటాడు భర్త. 'సరే నీకనవసరమే. అయితే చంపిన తరువాత ఏం జరుగుతుందో ఆలోచించావా? ఏమీ మారదు ఆసిఫ్. ఆలోచించు నువ్వు నిజంగా వాళ్లను శిక్షించాలనుకుంటే ఎవరైతే మారణకాండకు కారకులో వారిపై నీ కసి తీర్చుకో. కాని కత్తులతో కాదు' అని సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం చెపుతుంది.

ఇళ్లన్నీ ధ్వంసం కాబడి, నిలవనీడలేని సైరస్ కుటుంబానికి అలాన్ తన గదిలో ఆశ్రయమిస్తాడు. రోడ్డు మీద భజరంగ్‌దళ్ కార్యకర్తలు రాజకీయ నాయకుడి పోస్టర్లు అంటిస్తుంటే కోపంతో వాటిని చింపేస్తాడు. వారు అతన్ని చితకబాదుతారు. ఇంటికి తిరిగి వచ్చి థీసిస్ టైపు ప్రారంభిస్తాడు. 'ఇది అంతా గోద్రాలో జరిగిన దానికి ప్రతీకారం అంటున్నారు. అయితే ఇంత మందిని, ఇన్ని చోట్ల ఒకేసారి ఎలా సమీకరించగలిగారు? 24 గంటల్లోనే కత్తులు, కటార్లు, బల్లాలూ, త్రిశూలాలు, పైపు బాంబులు ఎక్కడ నుంచి వచ్చాయి? అందరి చేతుల్లోకి ఓటర్ల లిస్టులు ఎలా వచ్చాయి? వాటి వల్లనే ముస్లింలు ఎక్కడ నివసిస్తున్నారో గుర్తులు పెట్టగలిగారు. ముస్లిం వ్యాపారస్తుల పేర్లు లిస్టులో గుర్తింపు మార్కులు పెట్టారు. గోద్రా జరగకముందే హిందూ వ్యాపారులందరికీ పద్ధతి ప్రకారం కాషాయి జండాల్ని అన్ని ప్రాంతాలకు ఎలా పంపగలిగారు? నేను చెప్పగలను. అవి ప్రతీకార చర్యలు కావు. ఒక పథకం ప్రకారం కొనసాగించిన మారణకాండ ఇది' అని టైపు చేస్తుండగానే టివిలో 'మోడీ' లాంటి నాయకుడు 'నేరస్తులందర్నీ శిక్షించాలని నిర్ణయించాం. ఎవర్నీ వదిలేది లేదు' అంటూ ప్రకటన వస్తుంటుంది.

మారణకాండపై ఏర్పాటు చేసిన కమిషన్ ముందు అందరూ సాక్ష్యం చెపుతారు. పక్కనే ఉన్న పరిషత్, దళ్ కార్యకర్తలకు భయపడుతూ కొందరు ముస్లిం స్త్రీలు, పురుషులు 'చాలా చిన్న గుంపులే వచ్చాయనీ, పోలీసులు ఆ గుంపుల్ని చెదరగొట్టారనీ, తమను రక్షించారనీ చెపుతారు.'

చంపబోయిన గుంపుకి తను హిందువునని చెప్పుకొని ముస్లింల ఇళ్లను చూపించి వారి హత్యలకు కారకుడయిన బ్లాక్‌టికెట్లు అమ్మే చాగన్ తన దగ్గర పనిచేసే పేపర్‌బాయ్ తను చేసిన పనిని అస్యహించుకొని తన మీద దాడి చేస్తాడు. అప్పటి నుండి అంతర్మథనానికి గురైన చాగన్‌ను కమిషన్ సాక్ష్యం అడిగితే అప్పటి వరకు పడుతున్న మానసిక ఘర్షణను తట్టుకోలేక జరిగిన విషయం అంతా చెపుతాడు. 'ఆ రోజు గుంపు గుంపులుగా జనం వచ్చారు. వారి చేతుల్లో కత్తులు, త్రిశూలాలు ఉన్నాయి' అని చెపితే కమిషన్ 'మరి నువ్వే చేశావ్' అని అడిగితే 'నేనేం చేయగలను? వాళ్లు నన్ను చంపుతానని బెదిరించారు. అప్పుడు నేను హిందువునని చెప్పి తప్పించుకున్నాను. ముస్లింల ఇళ్లు చూపించమని అడిగితే కేవలం నా జీవితం కాపాడుకోవడానికి వాళ్ల ఇళ్లన్నీ చూపాను. వాళ్లందర్నీ చంపేశారు' అని చెపుతాడు. దానికి కమిషన్ 'నువ్వు ఆపడానికి ప్రయత్నించావా?' అని అడిగితే, 'ఎలా ఆపగలను. అసలా అవకాశమే లేదు. కల్పించుకుంటే వెంటనే పోలీసులు కాల్చేస్తారు. ముస్లిం స్త్రీలను రేప్ చేయడం చూశాను. పురుషుల్ని కిరాతకంగా చంపడం చూశాను. పోలీసులు వారికి సహాయపడ్డారు. నాకు ఇక ఇక్కడ ఉండే అర్హత లేదు. అసలు నాకు బతికి ఉండే అర్హత లేదు' అని ఏడుస్తూ ఆత్మప్రక్షాళన చేసుకున్న మనిషిలాగా బయటుకు వస్తుంటే అంతవరకు అతన్ని అస్యహించుకుంటూ అతనికి దూరంగా ఉంటున్న పేపర్‌బాయ్ పరుగున వచ్చి అతన్ని కౌగిలించుకుంటాడు. పక్కనే ఉన్న పోలీసు అధికారులందరు అతని వైపు కోపంగా చూస్తుంటారు.

ఒక ముస్లిం స్త్రీ పోలీసులు సహాయం అడిగితే గోద్రా రైలు విధ్వంసం ఫొటోతో ఉన్న వార్తా పత్రిక చూపిస్తూ 'దీని వల్లనే మేం మీకు సహాయం చేయడం లేదు. మీరు ఆ పని చేసి ఉండకపోతే మీకు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు, అని చెప్పారు' అని సాక్ష్యం చెపుతుంది. ఇంకొకామె 'మీరు సాక్ష్యం చెబితే చంపేస్తామని బెదిరించారు' అని చెపుతుంది. మరొకామె 'సహాయం పంపుతామని చెప్పారు. వెంటనే మరొక పెద్ద గుంపుని పంపారు. వాళ్లు మా వాళ్లను కిరాతకంగా చంపారు. అప్పుడు వాళ్లలో వాళ్లు నవ్వుకుంటున్నారు' అని చెపుతుంది.

ఒక ప్రఖ్యాత హాస్పిటల్ డాక్టర్ 'నా దగ్గర ఇరవై అంబులెన్స్‌లు ఉన్నాయి. నేను సహాయానికి బయల్దేరి రాబోతే పోలీసులు నన్ను వెళ్లకుండా ఆపేసారు. ఒక ఆఫీసరయితే నువ్వు హిందువుకి కావా? అని ప్రశ్నించాడని' చెబితే దానికి కమిషన్ 'మీరేం చెశారు' అని అడుగుతుంది. దానికి 'అవును నేను హిందువునే. కాని ఈరోజు నేను హిందువుగా పిలవబడడానికి సిగ్గుపడుతున్నాను' అని చెప్పానని చెపుతాడు.

ఒకామె 'నా కోడల్ని నా కళ్లముందే భయంకరంగా పాడుచేశారు. కత్తులతో ఆమె అవయవాల్లోగుచ్చారు. నవ్వారు. క్రూరంగా నవ్వారు' అని చెపుతుంది. ఒక హిందువు వచ్చి 'పోలీసులు చాలా చక్కగా పనిచేశారు. ప్రజలకు మంచి రక్షణ కల్పించారు' అని సాక్ష్యం చెపితే అది ఎంత అబద్ధమో అప్పటికే అర్థమయి ఓ కమిషన్ సభ్యుడు నవ్వుతాడు. 'మిమ్మల్ని ఇక్కడకు వచ్చి ఎవరు సాక్ష్యం చెప్పమన్నారు' అని అడిగితే, దానికి ఆయన 'మా ఏరియా పోలీసులు' అని చెప్పగానే అక్కడున్న ఉన్న జనం అంతా గొల్లున నవ్వగా పోలీసుల ముఖాలు అవమానంతో ఎరుపెక్కుతాయి.

చివరగా కమిషన్‌లో స్త్రీ సభ్యురాలు ఫిబ్రవరి 28న ఏం జరిగింది చెప్పగలరా? అని అడిగి ప్రశ్నకు షెహనాజ్ 'మా ఏరియాకు వచ్చిన పోలీసులు మొదట పరిస్థితులన్నీ అదుపులోనే ఉన్నాయి. మీరంతా క్షేమమని ప్రకటించారు. ఇలా పోలీసులు వెళ్లిపోయిన వెంటనే పెద్దజనం గుంపుగా వచ్చారు.' 'ఎంతమంది?' అన్న ప్రశ్నకు 'ఐదు వేల నుండి పదివేల వరకు ఉంటారు. అన్ని వైపుల నుంచి వచ్చారు. మాకు ఎటూ పారిపోవడానికి సాధ్యం కాలేదు. మమ్మల్ని మేం రక్షించుకోలేక పోయాం. మా దగ్గరేం ఆయుధాలు లేవు. మేం మధ్యతరగతి కుటుంబాల వాళ్లం.

వ్యక్తిగతమైనవని అనిపించే నమ్మకాలు సామూహికంగా ఎంత ప్రమాదకరంగా ఉంటాయో మతహింసాకాండ నుంచి గ్రహించ వచ్చని పేర్కొంటూ భౌతికవాద దృక్పథ అవసరాన్ని వివరిస్తున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

ఆలోచనలు, అవగాహన

చాలా ఏళ్ళక్రితం 'చందమామ'లో రక్షరేకు అనే ఒక కథ చదివాను. అందులో ఒక కుర్రవాడు పిరికివాడని గ్రహించిన సహ విద్యార్థులు వాణ్ణి ఎప్పుడూ కొట్టి ఏడిపిస్తూ ఉంటారు. రోజూ ఏడుస్తూ ఇంటికొచ్చే కొడుకుకు సాహసం నూరిపొయ్యటానికని వాడి తల్లి తమ వంశపు శౌర్యప్రతాపాలను గురించి గుర్తుచేసి వాడి చేతికొక తాతలనాటి రక్షరేకు కడుతుంది. దాన్ని ధరించినంతకాలమూ తననెవరూ ఓడించలేరని నమ్మిన కుర్రవాడు అకస్మాత్తుగా సాహసవంతుడైపోయి అందరినీ చితక బాదెయ్యగలుగుతాడు. నిజానికి ఆ రక్షరేకులో మహత్తు ఏమీలేదనీ, ధైర్యమనేది మనలో పుట్టుకు రావాలనీ కుర్రవాడు చాలారోజుల తరవాత గ్రహిస్తాడు. ఈ కథవల్ల రక్షరేకులవంటివి బూటకమని మనకు తెలుస్తుంది. అయినా వాటివల్ల కలిగే మంచిని నిరాకరించడం ఒక్కొక్కప్పుడు కష్టం. పై కథలో జరిగినదంతాకూడా మన మనసుల్లో ఉత్పన్నమైన భావాల ఫలితమే. విజ్ఞులైనవారికి ఎటువంటి 'రక్షరేకుల' అవసరమూ లేదని నా ఉద్దేశం. తమను తాము మభ్య పెట్టుకోవటానికో, ఇతరులను మభ్యపెట్టటానికో ఇలాంటివి పనికొస్తాయి కాని వాటిలో అతీంద్రియశక్తులేవీ లేవని మాత్రం గుర్తుంచుకోవాలి.

ఈనాడు ప్రపంచంలోనూ, విశ్వంలోనూ మన స్థాయి ఎటు

మేం రక్షణకు పోలీసులపైనే ఆధారపడ్డాం. కాని వాళ్లు ఆ పని చేయలేదు.' 'అయితే పోలీసులు వారితో కలిసి పోయారంటారా?' అన్న ప్రశ్నకు, 'అవును, అదిగో అక్కడ ఉన్న శంకర్ ఒక పోలీస్ అధికారి. మా ఆయనకు మంచి స్నేహితుడు కూడా. అతను కూడా ఈ దాడిలో పాల్గొన్నాడు. చంపడానికి ప్రయత్నించాడు. ఎందుకంటే మేం హిందువులం కాదు కాబట్టి. ఎక్కడ చూసినా రాక్షసత్వం. మొన్నటివరకు మా కోసం ఎప్పుడు తెరిచి ఉండే తలుపులు మా ముఖాల మీదే మూసేశారు. నేను ఏడ్చాను. అరిచాను. కనీసం పిల్లల్ని రక్షించమన్నాను. మా అబ్బాయి తప్పి పోయాడు. మేం బయటకు పారిపోయాం. అక్కడ కూడా రక్షణ లేదు. కనపడినవారిని బయటకు లాగి మరీ చంపుతున్నారు. ముక్కలు ముక్కలుగా నరికారు. అన్ని వయస్సు స్త్రీలను రేప్ చేశారు. ముసలివాళ్లు, వయస్సులో ఉన్నవాళ్లు, చివరకు చిన్నపిల్లల్ని కూడా వదల్లేదు (ఏడుస్తూ). వాళ్ల రొమ్ములు కోసి దూరంగా విసిరేసారు. కడుపులో ఉన్న పిల్లల్ని కూడా వదలలేదు. నా ఫర్జానా కోసం తిరిగాను. కాని దొరకలేదు' అని చెబుతుంది. 'నీ కొడుకు నీ బాధ్యత కాదా' అని ప్రశ్నిస్తే. 'బాధ్యత గురించి మీరు మాట్లాడొద్దు. ఇదంతా ప్రభుత్వం బాధ్యతే. మా కుటుంబాల్ని క్షేమంగా ఉండేటట్లు చూడాలి. కాని వాళ్లు ఆ పని చేయలేదు. చేయడంలో విఫలమయ్యారు' అని సూటిగా జవాబు చెపుతుంది.

మధ్యలో కలగజేసుకొని ఒక భజరంగ్‌దళ్ నాయకుడు పోలీసుల వైపు చూస్తూ 'వారి కుటుంబాలకు ఇవ్వాల్సిన పరిహారం ఇచ్చేసారు కదా. ఇంకేం కావాలి' అంటాడు. దానికి షెహనాజ్ కోపంతో 'పరిహారం గురించి మాట్లాడుతున్నారు. మీరిచ్చిన డబ్బు చనిపోయిన వాళ్లని తిరిగి తెచ్చి ఇవ్వగలదా? మనం ఇక్కడ కూర్చున్న కుర్చీ, టేబుల్, ఫర్నీచర్ గురించి మాట్లాడడం లేదు. మనం మాట్లాడుతుంది ప్రజల గురించి, వారి జీవితాల గురించి, వారు ప్రేమించిన వారి గురించి. డబ్బు వారిని కొనగలదా? జరిగిన రాక్షసత్వం మా కుటుంబాల్లో విపరీతమైన మార్పులు తెస్తున్నాయి. మా కుటుంబాల్లో మేం స్వేచ్ఛగా మాట్లాడుకోలేక పోతున్నాం. మా ఆయన పిచ్చివాడిలాగయిపోయారు. ప్రతిసారీ ఒక శవాన్ని చూపించి 'మీ అబ్బాయేనా?' అని అడుగుతారు. ఏం చెప్తాం? కాని అతని శరీరమైన దొరకాలి కదా? దిల్షాద్ రోజూ అన్నయ్య కోసం ఎదురు చూస్తుంటుంది. నా కూతురు ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. ఇదంతా చూసిన అమ్మాయి ఎలా ఉంటుందో? జీవితాంతం ఇలాంటి భూతాలతో పోరాడవలసిందేనా? నాకు నా పిల్లల రక్షణ కావాలి. మిగిలిన జీవితమంతా వారితోనే గడపాలి. నా ఫర్జాన్ నాకు కావాలి. అతన్ని పట్టుకొని ఆనందించాలి. తిండి తినిపించాలి. స్కూల్లో అతను తప్పు చేస్తే అతన్ని చీవాట్లు పెట్టాలి. అతని కోసం ఎంతకాలం అయినా ఎదురు చూడాలి, ఎదురు చూడాలి' అని చెప్పడంతో సినిమా ముగుస్తుంది. కాని నిజంగా ముగిసిందా?

ఇది సమకాలిక చరిత్రను రికార్డ్ చేసిన చిత్రం. రెండువైపులా మంచీ చెడూ ఉంటాయని, కాని అధికార రాజకీయాలు మతాన్ని ఆయుధంగా ఉపయోగించి సాధారణ మనుషులను రాక్షసులుగా మార్చే క్రమాన్ని కళా రూపంలో తెరకెక్కించిన దర్శకుడు రాహుల్ ధోలాకియాకు మనం కృతజ్ఞతలు తెలియజేయాలి. ఈ సినిమాలో నసీరుద్దీన్ షా, సారికలు అద్భుతంగా నటించారు.

(ఇంకా ఉంది) వీ

వంటిదో అందరికీ తెలుసు. రకరకాల జీవాలతో లుకలుకలాడే భూమిమీద మనంకూడా అన్నిటితోనూ సహజీవనం చేస్తున్నాం. ఎటొచ్చీ మనుషులకున్న భావనాపటిమ దృష్ట్యా తక్కిన ఏ ప్రాణికీ లేని శక్తులు మనకున్నాయి. పంటలను నాశనం చెయ్యప్రయత్నించే పక్షుల్లాగా మనం దిష్టిబొమ్మలను చూసి బెదరం. నిజమేమిటో, కనికట్టేమిటో పసికట్టగలం. సైన్సూ, టెక్నాలజీ ఊహించలేనంత స్థాయికి ఎదుగుతున్నాయి. అయినప్పటికీ చాలామందికి వాస్తవప్రపంచాన్ని గురించిన సరైన అవగాహన ఉన్నట్టుగా కనబడదు. మతాల పేరుతోనో, సంప్రదాయాల పేరుతోనో మధ్యయుగంలో జీవిస్తున్నవారే ఎక్కువ. ఎవరి నమ్మకాలు వారివి అని మర్యాదగా ఒప్పుకుంటాం కాని ప్రతి బుడబుక్కలవాడికీ దైవికశక్తులున్నాయని నమ్మేవారిని చూసి చాటుగా నవ్వుకోవడమూ కద్దు. ఈ నమ్మకాల్లో కొన్ని గుడ్డివనీ, తక్కినవి కొన్ని మాత్రం వివరించరాని, అతీంద్రియశక్తులకు సంబంధించినవనీ అనుకునేవారున్నారు. నా లెక్కన అన్నీ ఒకటే. అంతకన్నా ఇబ్బంది కలిగించే విషయమేమిటంటే వాటి గురించిన ప్రత్యేక జ్ఞానమేదో తమకుందని చెప్పుకునేవారికీ లోటులేదు. వివరించలేని సమస్యలు లేవనికాదు. ఈనాటి మిస్టరీయే రేపటి సైన్సు అవుతుంది. ప్రస్తుతం అర్థంకాని విషయాలను గురించి పరిశోధించవలసి ఉందని చెప్పటానికి నిజమైన శాస్త్రవేత్తలెవరూ సంకోచించరు. అన్నీ తమకే తెలిసినట్టు జ్ఞానోపదేశాలు చేసేవారే ప్రమాదకరంగా అనిపిస్తారు. వారిలో చాలామందికి సైన్స్ రంగంలో ప్రస్తుతం ఏం జరుగుతోందోకూడా తెలియదు.

అటువంటి భేషజాలకు పోకుండా ఆధునిక పరిశోధనలద్వారా బైటపడుతున్నవీ, అందరూ తెలుసుకోదగినవీ అనిపించిన కొన్ని విషయాలను చర్చించదలచుకున్నాను. ముఖ్యంగా మన జీవితాలను బలంగా తీర్చి దిద్దే ఆలోచనా ప్రపంచం గురించీ, మెదడును గురించీ గత పది, పదిహేనేళ్ళుగా విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయి. నేను శరీరశాస్త్రం వగైరాలేవీ చదువుకోలేదు. నా ఆసక్తికొద్దీ సేకరించిన వివరాలను పాఠకులతో పంచుకుందామనే ప్రయత్నించాను. మరొకటేమిటంటే ప్రత్యేకంగా ఏ సంస్కృతినీ కించపరిచే ఉద్దేశం నాకు లేదు. ప్రస్తుత కాలంలో హేతువాద, భౌతికవాద దృక్పథం మనకు అత్యవసరమైందని నా ఉద్దేశం. దీనితో అందరూ ఏకీభవించక పోవచ్చునని నాకు తెలుసు.

మన సాహిత్యంలో సామాజికసమస్యలను స్పృశించని రచన అంటూ ఉండదు. వీటిలో ఊహలకు సంబంధించిన సమస్యలుకూడా కలగలిసి ఉంటాయి. వ్యక్తిగతంగా నిరపాయకరంగా అనిపించే నమ్మకాలు సామూహికంగా ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తాయో రోజూ ప్రపంచమంతటా జరుగుతున్న మతహింస నిరూపిస్తూనే ఉంది. ఈ రోజుల్లో భూమి బల్లపరుపుగా ఉందనుకునే వాళ్ళను అజ్ఞానులు గానూ, కళ్ళకు కనబడేదంతటినీ సృష్టించిన భగవంతుడొకడు ఉన్నాడనుకునే వాళ్ళను జ్ఞానులుగానూ భావించడం మామూలు. భూమి గుండ్రంగా ఉందనటానికి చప్పున సాక్ష్యం దొరకదు గనక మొదటిరకం వాళ్ళ అమాయకత్వాన్ని అర్థంచేసుకోవచ్చు. ఆదిమానవుల్లో దేవుడి గురించిన భావనకూడా కొంత అమాయకత్వంవల్లనే మొదలైనప్పటికీ సమాజం పెరిగి పెద్దదై అందులో పరిణామాలు సంక్లిష్టం అవుతున్నకొద్దీ దేవుడూ, మంత్రతంత్రాల పేరుతో అధిక సంఖ్యాకులను మభ్యపెట్టి అణచి ఉంచడం కొన్ని వర్గాలకు అవసరమైంది. ఇది కొన్ని శతాబ్దాలుగా పెద్ద ఉద్యమంలాగా సాగుతూ శాఖోపశాఖలుగా ప్రపంచమంతటా విస్తరించి ఉంది. కోట్లాది జనం కిక్కిరిసి జీవిస్తున్న సమాజంలో ఒక్కొక్కరి మనసులోనూ కలిగే వేలకోట్లాది ఆలోచనలు సృష్టిస్తున్న గందరగోళం 'సృష్టిరచన'ను గురించిన ఈ అయోమయాన్ని బలపరుస్తూ వస్తోంది.

మరి భౌతికవాదం ఏమంటుంది? 'మట్టి'లోంచి పుట్టిన ప్రాణులు మట్టిలోనే కలిసిపోతాయన్నది నిజం. అసలీ మట్టి ఎక్కడిది? ఇది తెలియాలంటే భూమీ, ఇతర గ్రహాలూ ఎలా ఏర్పడ్డాయో తెలుసుకోవాలి. సూర్యుడిచుట్టూ తిరిగే గ్రహాల్లో సూర్యుడికి దగ్గరగా ఉండే నాలుగూ ఘనపదార్థాలతో రూపొందినవి. మిగిలినవి ముఖ్యంగా వాయువులతో కూడుకున్నవి. సూర్యుడితోబాటు ఇవన్నీ నాలుగున్నర కోట్ల సంవత్సరాల కిందట ఒకేసారిగా ఒక ధూళిమేఘంనుంచి ఉద్భవించాయి. ఈ ధూళి మేఘం మొదటినుంచీ ఉన్నదికాదు. అంతకు ముందే ఈ ప్రాంతంలో రూపొంది, సూపర్నోవాగా పెరిగి పెద్దదై పేలిపోయిన ఒక నక్షత్రంవల్ల ఈ ధూళిమేఘం ఏర్పడింది.

భూమిమీదా, మనవంటి ప్రాణుల శరీరాల్లోనూ ఉన్న పదార్థాలన్నీ 92 సహజ మూలకాలలోని కొన్నిటి కలయికవల్ల ఏర్పడ్డవే. వీటిలో హైడ్రొజెన్ తప్ప అంతకన్నా బరువైన మూలకాలేవీ విశ్వంలో తొలినుంచీ ఉండినవి కావు. తొలినుంచీ విశ్వమంతటా అతిపల్చగా వ్యాపించి ఉండే పదార్థం ఒక్క హైడ్రొజన్ మాత్రమే. తక్కినవన్నీ ఆ అణువులు కలిస్తేనే ఏర్పడ్డాయి. మన సౌరకుటుంబం ఏర్పడకముందు పుట్టి, నశించిపోయిన సూపర్నోవా నక్షత్రకేంద్రంలో అణు సంయోగం కారణంగా తేలికయిన హైడ్రొజన్ అణువులు కలిసి రకరకాల మూలకాలుగా ఏర్పడ్డాయి. నక్షత్రం పేలాక మిగిలిన ధూళిలోని ఆ మూలకాలే సిలికాన్, కాల్షియం మొదలైన పదార్థాలుగా భూమికీ, తక్కిన గ్రహాలకూ రూపాన్నిచ్చి, ఆ విధంగా మన శరీరాల్లోకికూడా వచ్చి చేరాయి.

ప్రాణులన్నిటిలోనూ ఉన్న జీవకణాల్లోకూడా ఈ మూలకాలే ఉంటాయి. కొన్ని నిష్పత్తుల్లో కలిసిన నిరింద్రియ (ఇనార్గానిక్) రసాయనపదార్థాలకు స్వయంపునరావృత్తి అయే గుణం ఉండడంవల్ల అవి జీవరసాయనపదార్థాలుగా రూపొందగలిగాయి. తొలి వృక్షజాతి కణాలూ, ఏకకణజీవులూ ఏర్పడ్డాక జీవపరిణామం అతిత్వరగా కొనసాగింది. అందులోని భాగమే మనిషి ఎదుగుదలా, మనిషి మెదడులో జరుగుతూ వచ్చిన మార్పులూను.

మనుషులంటే కేవలం 60-70 కిలోల రసాయనికపదార్థాలే అని అనుకోవడం కష్టం అనిపించ వచ్చు కాని మనకు భౌతిక రూపాన్నిచ్చినవి మాత్రం అవే. "నిర్జీవమైన" ఎలక్ట్రానిక్ పరికరాలతో తయారైన కంప్యూటర్ మనిషి మెదడుతో పోటీపడుతున్నట్టే, తనకు రూపాన్నిచ్చిన రసాయనాల కన్నా మనిషి ఉన్నతుడు అని ఎవరో రాశారు. కంప్యూటరే కాదు. ఆవిరి ఇంజన్ అయినా సరే, కొన్ని ప్రక్రియలవల్ల స్వయంచోదకశక్తిని పొందుతుంది. మనిషియొక్క నాడీవ్యవస్థకూడా అటువంటిదే. కదులుతున్న యంత్రాలవెనక అతీతశక్తులు ఉన్నాయను కోవడం ఎంత వెర్రితనమో మనిషిని గురించి అలా అనుకోవడమూ అంతటి వెర్రితనమే. వీ

*చరిత్రను ఒక మూసలోకి నెట్టే ప్రయత్నంగా కాక చారిత్రక దశలలో ఉత్పత్తి, దాని ఫలితంగా తలెత్తిన వైరుధ్యాలు, సంఘర్షణల ప్రాతిపదికగా చరిత్రను చూసే పద్ధతి శాస్త్రీయమైనదని, అనుసరించవలసిందని 1987లో **కె. బాలగోపాల్** రాసిన వ్యాసం ఆయన స్మృతిలో...*

చారిత్రక దృక్పథం

ఇంగ్లిష్‌లో హిస్టోరియోగ్రఫీ అనే మాట వాడతారు. హిస్టోరియోగ్రఫీ అంటే చరిత్రను గురించిన సిద్ధాంత దృక్పథం అని అర్థం. తెలుగులో చారిత్రక సిద్ధాంతం అని అనువదించుకోవచ్చు. ఇక్కడ చరిత్రను గురించిన సిద్ధాంత దృక్పథం అన్నప్పుడు రెండు అర్థాలు వస్తాయి. ఒకటి – చరిత్రను అర్థం చేసుకునే విధానాన్ని గురించిన సిద్ధాంత దృక్పథం అని, రెండోది అసలు చరిత్రను గురించిన దృక్పథం అని. చరిత్రను అర్థం చేసుకోవడం ఎట్లా అన్నది మొదటిదయితే చరిత్ర అంటే ఏమిటి అనేది రెండోది. ఈ రెండు ప్రశ్నలను విడదీయడం కష్టం కాబట్టి ఈ రెండు అర్థాలలోను చారిత్రక సిద్ధాంతం అనే మాటను వాడవచ్చును. ఇందులో రెండవదే – చరిత్ర అంటే ఏమిటనేదే – చారిత్రక సిద్ధాంతం అనే ప్రయోగానికి అసలైన అర్థం. అయితే విభిన్న చారిత్రక సిద్ధాంతాల మధ్య చర్చ తరచుగా చరిత్ర అధ్యయన పద్ధతిపరంగా సాగుతోంది. విషయం స్వభావానికీ, దాన్ని తెలుసుకునే పద్ధతికీ ఉండే గతితార్కిక సంబంధం ఇక్కడ సిద్ధాంత చర్చను మొదటి దాని మీద నుండి రెండవ దాని మీదకు తిప్పుతుంది.

రాజుల కృత్యాలు – అకృత్యాలతో సహా – చరిత్ర ముడి పదార్థం అనేది బహుశ అన్నిటికంటే మొదటపుట్టి ఇప్పటికి అన్నిటికంటే బలంగా నిలిచిపోయిన చారిత్రక సిద్ధాంతం. పాశ్చాత్య దేశాల ప్రాచీన చరిత్రకారులు (గ్రీస్, రోమ్ దేశాలకు చెందినవారు) ఈ రకమైన చరిత్ర రచన మొదలుపెట్టారు. అప్పటి నుండి, అసలు చరిత్ర రచన అంటూ జరిగిన దేశాలలో, కాలాలలో, ఈ రకమైన చరిత్రలు రాస్తూనే ఉన్నారు. ఈ రచనలు వాటంతటవే అర్థరహితమైనవి కానవసరం లేదు. వాటిలో ఆసక్తికరమైన విషయం లేనే లేదనడానికి అంతకంటే వీల్లేదు. రాజులు సర్వసత్తాక అధికారాలతో పరిపాలిస్తున్న కాలంలో కేవలం రాజుల చరిత్రే రాసినా చాలా విషయాలు చెప్పడం సాధ్యమవుతుంది. అయితే రాజులు ప్రవర్తనకుగల కారణాలు గుర్తించడంలోనే తేడాలుంటాయి. అక్కడే ఆ చరిత్ర రచన ఎంతవరకు అర్థవంతమవుతుందనేది తేలుతుంది. సాంప్రదాయక చారిత్రక సిద్ధాంతం చేసే పొరపాటు ఇక్కడే ఉంది. చరిత్రలో రాజులు కృత్యాకృత్యాలు ముఖ్య విషయమయితే, వాటికి ప్రోద్బలం లభించేది రాజుల వ్యక్తిత్వం నుండి, ఇష్టాయిష్టాల నుండి, కోరికల నుండి, కోపతాపాల నుండి. ఉదాహరణకు, అశోకుడు సాత్వికుడు కాబట్టి మౌర్య సామ్రాజ్యం పతనమైంది, సముద్రగుప్తుడి పరాక్రమం వలన గుప్త సామ్రాజ్యం దేశవ్యాప్తంగా నెలకొని ఉంది, ఔరంగజేబు మతోన్మాది కావడం వలన మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమయింది, నెహ్రూ ప్రజాస్వామికవాది కావడం వల్ల భారతదేశం మూడో ప్రపంచదేశాలలో ఏకైక పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా నిలిచింది – ఇత్యాది సిద్ధాంతాలు అందరికీ పరిచితమే. దీనిని విధాతల సిద్ధాంతం అనవచ్చును. ఈ సిద్ధాంతం అర్థమేమిటంటే ఆయా కాలాలలో ఆయా వ్యక్తులు కాక వేరేవాళ్లు ఉండి ఉంటే ఇవన్నీ జరగకపోయి ఉండేవని. మరొకరకంగా చెప్పాలంటే చరిత్రను నడిపించేది యాదృచ్ఛిక సంఘటనలు. దీనిని ఇ.ఎచ్.కార్ 'క్లియోపాత్రాస్ నోస్ థియరీ ఆఫ్ హిస్టరీ' అన్నాడు. క్లియోపాత్రా అందమైంది కాకపోతే రోమ్ చరిత్ర వేరే విధంగా ఉండేదని ఈ రకమైన సిద్ధాంతాల నుండి అర్థం చేసుకోవాలి. ఇట్లా చెపితే అపహాస్యంగా ఉంటుంది కాని, నిజానికి మన చరిత్ర పుస్తకాలలో ఒక చారిత్రక సిద్ధాంతమంటూ ఉంటే అది క్లియోపాత్రాస్ నోస్ లేక విధాతల సిద్ధాంతమే.

ఒక సమాజంలో ఒక కాలంలో ఫలానా చారిత్రక సిద్ధాంతం ప్రబలంగా ఉందంటే దానికి కారణం కూడా ఆ సమాజంలోనే దొరుకుతుంది. ప్రపంచంలోని అన్ని దేశాలు చాలాకాలంపాటు సర్వసత్తాక రాజ్యాధికారాల కింద బతికాయి. ఆధునిక ప్రజాస్వామ్యాలలో కూడా ప్రభుత్వాలు అడపాదడపా మారతాయేమో కాని రాజ్యాంగ యంత్రానికి ఉండే ఆధిపత్యం గతంలో కంటే ఎంత మాత్రం తక్కువేమీ కాదు. బహుశా రవాణా, ప్రసార సాధనాలు, ఆయుధాల సాంకేతిక పురోగమనం కారణంగా ఎక్కువయినయ్యేమో కూడా. నాగరికత పుట్టిన నాటినుండి కూడా రాజ్యాంగ యంత్రం సామాన్య మానవుడి కళ్లకు ఒక అద్భుతశక్తిగానే కనబడుతోంది. అది మార్క్స్ అన్నట్టు పరాయీకరణ ఫలితమే కావచ్చు. అంతిమ విశ్లేషణలో రాజ్యాంగ యంత్రం కూడా ఒక సామాజిక మానవ సంబంధమే. అయితే మానవులు కల్పించిన దేవుడిలాగ అది కూడా పరాయీకరణ చెంది మానవజీవితాన్ని శాసించే శక్తి అయింది. ఈ అద్భుతశక్తి పాలనలో జీవించే మానవులు తమ మనుగడకు అందులోని మార్పులకు గల కారణాలు ఆ అద్భుత శక్తిలోనే వెతకడం సహజం. ఆ శక్తిని తమ గుత్తలోకి తీసుకున్న రాజులు లేక ఇతర పాలకుల వ్యక్తిత్వాలలో ఇష్టాయిష్టాలలో లీలా విలాసాలలో తమ భాగ్యాన్ని దర్శించుకోవడం కూడా అంతే సహజం. ఈ విషయంలో రాజరికయుగపు చరిత్ర రచనకు, ఆధునిక చరిత్ర రచనకు తేడా లేదు.

అయితే ఆధునిక కాలంలో ఒక ముఖ్యమైన తేడా వస్తోంది.

భూస్వామ్య వ్యవస్థకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు గల తేడాలో ఇది ఒకటి. భూస్వామ్య యుగంలో రాజ్యాధికారం సమాజంలోని అన్ని రంగాలతోను కలగలసిపోయుంటుంది. సాహిత్యం రాజుల పోషణలో సాగుతుంది. సంగీతం, శిల్పం, నాట్యం అన్నికళలు అంతే. తత్వచింతన కూడా జరిగితే రాజాస్థానాలలో జరుగుతుంది. (మొట్టమొదటి వేదాంతి అయిన యాజ్ఞవల్క్యుడు జనకుని ఆస్థానంలో ఉండిన తాత్వికుడు) లేదా రాజ పోషణలో జరుగుతుంది. ఆర్థికరంగానికి కూడా స్వయం ప్రతిపత్తి చాలా తక్కువగా ఉంటుంది. భూమిశిస్తు నుండి వ్యాపార లావాదేవీల దాకా అన్నీ కూడా రాజ్యాధికార నియంత్రణలో సాగుతాయి. రాజ్యాధికారంతో ప్రత్యక్షంగా నిమిత్తంలేని సామాజిక జీవితం అనేది భూస్వామ్యయుగంలో ఉండదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ విషయం మారుతుంది. కళల నుండి ఆర్థికరంగం దాకా ఒక్కొక్కటీ రాజ్యాధికారం ప్రత్యక్ష నియంత్రణ నుండి విడివడి స్వయం ప్రతిపత్తిని సాధించుకుంటాయి. నిజానికి యూరప్‌లో పెట్టుబడిదారీవర్గం ఈ నియంత్రణను వదిలించుకోవడానికి జరిపిన పోరాటం అక్కడి బూర్జువా విప్లవాలలో ప్రధాన ఘట్టం. ఈ స్వయం ప్రతిపత్తి ఎంత సంపూర్ణమనేది పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత సంపూర్ణంగా ఎంత 'స్వచ్ఛంగా' అభివృద్ధి చెందింది అనేదాని మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు మన దేశంలో పెట్టుబడిదారీ సంబంధాల వ్యాప్తి అసంపూర్ణంగా ఉండిపోయింది. కాబట్టి అన్ని సామాజిక విషయాలలో రాజ్యాధికారం జోక్యం ఎంతో కొంత కొనసాగుతూనే ఉంది.

బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మాత్రం సామాజిక విషయాలు రాజ్యాధికారం నుండి స్వయం ప్రతిపత్తిని సాధించుకోవడం స్పష్టంగానే కనిపిస్తుంది. కళలను, సాహిత్యాన్ని ప్రభుత్వాలు పోషించవు. కళాకారులు తమ సామర్థ్యాన్ని బజారులో అమ్ముకుని ఆదాయం సంపాదించుకుంటారు. ఆర్థికరంగం ప్రత్యక్ష ప్రభుత్వ నియంత్రణలో సాగదు. లాభనష్టాల తక్కెడలో సమతుల్యాన్నో, అసమతుల్యాన్నో అదే వెతుక్కుంటుంది. తాత్వికులు రాజాస్థానాల నుండి బయటపడి, భూదానాలు లేకుండా, రచయితలుగా మేధావులుగా తమ సామర్థ్యాన్ని విక్రయించి బతుకుతారు. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యాధికారం నుండి విడివడిన ఒక పౌరసమాజం (సివిల్ సొసైటీ) ఏర్పడుతుంది. మార్క్సునుండి గ్రామ్‌షీ దాకా మార్క్సిస్టు తాత్వికులు పెట్టుబడిదారీ సమాజాన్ని అర్థం చేసుకునేటప్పుడు ఈ పౌరసమాజానికి ప్రాముఖ్యం ఇచ్చారు. భూస్వామ్య వ్యవస్థలో పౌరసమాజం రాజకీయ సమాజంలో కలిసిపోయి ఉంటుందని అది విడిపోయి స్వతంత్ర అస్తిత్వాన్ని నెలకొల్పడం ఆధుని సమాజ లక్షణమని హెగెల్ చేసిన సూత్రీకరణ ఇక్కడ మార్క్సిజం తనలో ఇముడ్చుకుంది.

వెంటనే కాకున్నా కొంతకాలానికి ఈ పౌరసమాజం ఆవిర్భావం చరిత్ర రచన మీద తన ప్రభావాన్ని వేసింది. చరిత్ర చెప్పడమంటే రాజకీయ చరిత్ర మాత్రమే కాదని, ఆర్థికరంగం, కళలు, సాహిత్యం, తత్వం మొదలైన విషయాల గురించి కూడా విడిగా చెప్పాలనే అభిప్రాయం బయలుదేరింది. దీని ప్రభావం మన చరిత్ర పుస్తకాల మీద స్పష్టంగానే కనబడుతుంది. ఈ మధ్య వచ్చే చరిత్ర పుస్తకాలలో – ఉదాహరణకు – కాకతీయుల యుగం అనే శీర్షికతో అధ్యాయం మొదలుపెట్టి మొదట రాజవంశం గురించి కొంత చెప్పి ఆ తరువాత రాజవంశం పాలనలో ఆర్థికరంగం ఎలా ఉండిందీ, కళలూ సాహిత్యం ఏ విధంగా విలసిల్లినాయి, మతంలో ఏ మార్పులు వచ్చాయి అనేవి ఒకదాని తరువాత ఒకటి ఏకరవుపెడతారు. ఆర్థికరంగాన్నయినా చారిత్రకంగా వివరించడానికి రాజవంశాల ప్రాతిపదికమీద చేసే అధ్యాయాల విభజన ఎంతవరకు అర్థవంతం అవుతుందనే అనుమానం ఈ పుస్తకాల రచయితలకు రాదు. కాలేజీ పాఠ్య పుస్తకాల నుండి కంభంపాటి సత్యనారాయణగారు మార్క్సిస్టు అధ్యయనం పేరున రాసిన 'ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర' దాకా ఇటువంటి పుస్తకాలు చాలానే ఉన్నాయి.

అయితే ఈ పాఠ్యపుస్తకాలకు రాజుల, రాజవంశాల చరిత్రలే చరిత్ర అనుకుని రాసేవాటికి ఒక విషయంలో తేడా లేదు. రెండూ కూడా విధాతల చరిత్రలే. ఇప్పుడు జరిగేదేమిటంటే విధాతల సంఖ్య పెరుగుతుంది. మౌర్య సామ్రాజ్యం ఘనతకు, పతనానికి అశోకుడిది ఒక్కడిదే బాధ్యత అయితే ఈ చరిత్ర పుస్తకాలలో ఆధునిక భారతదేశ ప్రగతికి (పతనాన్ని గురించి ఇప్పుడిప్పుడే రాయరు) నెహ్రూతోపాటు వివిధ సామాజిక రంగాలలోని ప్రముఖులు – హోమిబాబా, పి.సి. మహలనోబిస్, జస్టిస్ భగవతి, బహుశా సునీల్ గవాస్కర్ కూడా – బాధ్యులవుతారు. గొప్పవాళ్ల సామర్థ్యం చరిత్రను నడుపుతుంది. ఈ ప్రజాస్వామిక యుగంలో గొప్పవాళ్ల సంఖ్యమాత్రం పెరుగుతుంది.

విధాతల చరిత్రకు కనీసం ఒక సద్గుణం ఉంది. అది చరిత్ర అర్థరహితమైంది కాదని, దానికి ఒక స్వాభావికతమైన 'ధర్మం' ఉందని ఒప్పుకుంటుంది. సమర్థవంతమైన వ్యక్తుల కోర్కెలు చరిత్రను నడుపుతాయనేది కూడా ఒక చారిత్రక సిద్ధాంతమే, ఇంతకంటే అధ్వాన్నమయింది, అసలు చరిత్రకు మొత్తంగా ఒక అర్థమంటూ లేదని విభిన్న చారిత్రక సంఘటనలకు మాత్రమే అర్థముండగలదని భావించే దృక్పథం. చరిత్రకు అర్థం ఉందంటే అది చరిత్రకు లక్ష్యాలు, ఉద్దేశాలు అంటగట్టడం (టెలియొలోజీ) అవుతుందని, చరిత్రకే ఒక చైతన్యాన్ని ఆపాదించడం (రేఫై) చేయడం అవుతుందని ఒక వాదన ఉంది. ఈ విధంగా రాసేది చరిత్ర కాదు, చరిత్ర అభాస (హిస్టరిసైజం) అన్నారు. మరి చరిత్రకారుడి కర్తవ్యం ఏమిటంటే గతంలో జరిగిన అన్ని సంఘటనలు పోగుపెట్టడం. అట్లా పోగుపెట్టిన తరువాత వాటిలో దేనికైన ఏమైనా అర్థముంటే తెలుసుకోవచ్చును. అంటే ముందు విషయసేకరణ జరగాలి. ఆ తరువాత వీలయినమేరకు వ్యాఖ్యానం చేయాలి. అంతే తప్ప ముందే ఒక చారిత్రక సిద్ధాంతంతో మొదలు పెడితే సిద్ధాంత పరిమితుల వల్ల చరిత్రను చరిత్రకారుడు పాక్షికంగా మాత్రమే చూస్తాడు. విషయ సేకరణ అసమగ్రంగా ఉండిపోతుంది.

ఈ దృష్టితో (నిష్పాక్షికంగా 'అన్ని విషయాలను' ముందు సేకరించాలనే దృష్టితో) చరిత్ర రాయాలని ఎవరైనా ప్రయత్నిస్తే అది ఎంత అసాధ్యమో వెంటనే అర్థమవుతుంది. ఉదాహరణకు అక్బర్ పరిపాలనలో మొగలాయి సామ్రాజ్యం అంత వైభవంగా ఎందుకుండిందో ఒక చరిత్రకారుడు అధ్యయనం చెయ్యదలుచుకున్నాడనుకోండి. అతనిది

విధాతల చరిత్ర దృక్పథం అయితే తన దృష్టిని అక్బర్ వ్యక్తిత్వం మీద, లేదా అప్పటి మొగల్ సామ్రాజ్యం లోని ఇతర ప్రముఖుల వ్యక్తిత్వాల మీద, వాళ్ల ఆశలు, ఆశయాలు, ఆదర్శాల మీద, కొట్లాటల మీద, కలహాల మీద కేంద్రీకరిస్తాడు. ఆ దృష్టితో విషయ సేకరణ చేస్తాడు. తప్పో ఒప్పో ఒక నిర్ధారణకు వస్తాడు. ఉదాహరణకు అక్బర్ తన రాజ్య వ్యవహారాల నిర్వహణలో పాలక వర్గాలలోని హిందువులను, ముస్లింలను సమంగా ఆదరించాడని, చివరికి ఒక రాజపుత్ర స్త్రీని వివాహం సైతం చేసుకున్నాడని, ఈ దక్షతే ఆ కాలపు మొగలాయి ఘనతకు పునాది అని చిన్నప్పుడు అందరం చదువుకున్నాం. రాజ్యం ఘనతకు కారణం రాజు వ్యక్తిత్వంలో చూడాలి అనే చారిత్రక సిద్ధాంతం లేకపోతే ఈ అవగాహన పుట్టేదికాదు. ఏ సిద్ధాంతమూ లేకుండా 'అన్ని విషయాలు' ముందు సేకరించి ఆ తరువాతే వ్యాఖ్యానించాలని నిర్ణయించుకున్న చరిత్రకారుడు మాత్రం ఎప్పటికీ ఏ నిర్ధారణకూ రాడు. అన్ని విషయాలు అంటే ఎన్ని విషయాలు? అక్బర్ రాజకీయ దక్షత ఎంతటి విషయమో అతని నాలుగవ భార్యకు ఎంతమంది కొడుకులున్నారనేది కూడా అంతటి విషయమే. ఇట్లా ఎన్ని విషయాలు సేకరిస్తే విషయ సేకరణ పూర్తి కావాలి? ఇందులో రెండవది ముఖ్యమైన విషయం కాదంటారేమో అంటే ముఖ్యమైన విషయాలకు కానివాటికి తేడా చూడాలి. తేడా చూడగల గాలంటే ఒక విషయం ప్రాముఖ్యాన్ని నిర్ణయించే ప్రమాణం కావాలి. అంటే ఒక సిద్ధాంతం కావాలి. రాజులు చేపట్టే కార్యక్రమాలు చేసే పనులు చరిత్ర నడుపుతాయనుకునే చరిత్రకారుడికి అక్బర్ వ్యక్తిత్వం ముఖ్య విషయం అవుతుంది. చరిత్ర పాఠ్యపుస్తకాలలో ఈ దృక్పథమే ప్రబలంగా ఉంది. అట్లాకాక మొగల్ రాజరికానికి ఆర్థిక పునాది అయిన వ్యవసాయ రంగంలోని సంఘర్షణలు, ఆటుపోట్లు ఆ రాజరికం చరిత్రను నడిపించాయి అనుకునే చరిత్రకారుడికి అక్బర్ వ్యక్తిత్వం అప్రధానం అయిపోతుంది. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి, శిస్తు పరిమాణం, జాగీర్దారుల దోపిడీ, మన్సబ్‌ల అస్థిరత ముఖ్య విషయాలవుతాయి. ఇర్ఫాన్ హబీబ్ ఈ దృక్పథంతో మొగల్ సామ్రాజ్య చరిత్రను విశ్లేషించాడు. ఏ సిద్ధాంతమూ లేకుండా 'నిష్పాక్షికంగా' విషయ సేకరణ చేయదలుచుకున్న చరిత్రకారుడికి మాత్రం ఏది ముఖ్య విషయం, ఏది కాదు అనే వివక్ష ఉండదు. అతని విషయ సేకరణ ఎప్పటికీ అంతంకాదు.

అంటే ప్రతి చరిత్రకారుడికి ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా ఒక చారిత్రక సిద్ధాంతం ఉంటుంది. దాని వెలుగులో విషయ సేకరణ చేస్తాడు. సేకరించిన విషయాల మీద ఆధారపడి చరిత్రను వివరిస్తాడు. తాను సేకరించిన విషయాలు తన సిద్ధాంతం అసంపూర్ణంగా ఉన్నట్టు చూపితే అంతమేరకు సిద్ధాంతాన్ని సవరించుకుంటాడు. సవరించిన సిద్ధాంతం వెలుగులో కొత్తగా మళ్లీ విషయాలు సేకరిస్తాడు. ఈ విధంగా సిద్ధాంత అవగాహన, విషయ సేకరణ పరస్పర గతితార్కిక చర్యలో సాగుతాయి. అంతేగాని ముందు విషయ సేకరణ అంతా చేసేసి ఆ తరువాత సిద్ధాంత నిరూపణ ఏ చరిత్ర కారుడూ చేయడు. అంతేకాదు, సరైన సిద్ధాంతం లేకపోతే కొన్ని విషయాల మీదికి మనదృష్టి పోనుకూడా పోదు. చీకట్లో బయలు ప్రదేశంలో ఎన్నో వస్తువులుంటాయి. అయితే ఒక వస్తువు మీదికి మన చేతిలోని దీపాన్ని ప్రసరింపజేసినప్పుడే ఆ వస్తువు అక్కడున్నట్టు తెలుస్తుంది. లేకుంటే అది ఉన్న విషయం కూడా తెలియదు. అన్ని విషయాలు నిష్పాక్షికంగా సేకరించడమనేది అనంతమైన ప్రయాసే కాదు అసలు అసాధ్యం కూడా.

మరి ఒక్కొక్క చారిత్రక సిద్ధాంతం ఒక్కొక్క 'చరిత్ర'కు దారితీసే టట్టయితే నిజమైన చరిత్రంటూ ఏదీ లేదా అని అనుమానం వస్తుంది. ఒకవేళ ఉంటే దాన్ని ఎవరయినా ఎట్లా తెలుసుకుంటారు అనే ప్రశ్న కూడా వస్తుంది. ఈ ప్రశ్నకు మార్క్సిజం మాత్రమే సమగ్రమైన సమాధానాలు ఇవ్వగలదు.

నిజమైన రసాయనిక శాస్త్రం అంటూ ఏదీలేనట్టే 'నిజమయిన' చరిత్ర అనేది కూడా ఉండదు. అన్ని విజ్ఞాన శాస్త్ర విషయాల లాగ చరిత్ర గూడ అవిచ్ఛిన్నంగా సాగే పరిశోధనా ఫలితం. గతాన్ని గురించి మన అవగాహన మారుతూనే ఉంటుంది. ఒక చారిత్రక సిద్ధాంతం వెలుగులో మనం గతాన్ని పరిశీలిస్తాం. విషయ సేకరణ చేస్తాం. ఒక అవగాహన ఏర్పరచుకుంటాం. ఆ అవగాహన వల్ల మన చారిత్రక సిద్ధాంతం మరింత పురోగమిస్తుంది. కొత్త సిద్ధాంత విషయాలు తెలుస్తాయి. ఆ వెలుగులో గతాన్ని మరింత నిశితంగా పరిశీలిస్తాం. అంతేకాదు, సమకాలిక సామాజిక సంఘర్షణలు గూడ మన చారిత్రక సిద్ధాంతాలను ప్రభావితం చేస్తాయి. దక్షిణభారత దేశంలో బ్రాహ్మణాధిక్యానికి వ్యతిరేకంగా ఈ శతాబ్దంలో సాగిన ఉద్యమాలు మన చరిత్రను బ్రాహ్మణ అబ్రాహ్మణ సంఘర్షణల దృష్టితో చూడడం నేర్పాయి. దానితో శంబుకుడు, ఏకలవ్యుడు, చార్వాకుడు తదితరుల కథలు పరిశోధనా విషయాలయ్యాయి. బ్రాహ్మణ ఆధిక్యం స్వతంత్ర విషయం కాదు, భూస్వామ్య రాచరిక ఆధిపత్యంలో అంతర్భాగమేనని అర్థం చేసుకొన్నప్పుడు ఈ కథలు ఇంకొంచెంగా వివరంగా అవగాహన అవుతాయి. మనదేశంలో భూస్వామ్య వ్యవస్థ ఒక్క పూటలో ఏర్పడలేదనీ విడతలు విడతలుగా అటవికులను లొంగదీసుకునే క్రమంలో ఏర్పడిందనీ అర్థమయితే ఈ కథలు ఇంకా బాగా అర్థం అవుతాయి. ఉదాహరణకు ఏకలవ్యుడి విలువిద్యా నైపుణ్యాన్ని నాశనం చేసిన ద్రోణుడు గూడా అసలు ఆటవికుడేననీ మొదట నాగరిక సమాజం అతన్ని బ్రాహ్మణీకరించి స్వంతం చేసుకుని అతని చేతనే ఏకలవ్యుడి బొటన వేలు నరికించిందనీ అర్థం అవుతుంది.

'నిజమయిన' చరిత్ర అనే పదార్థం ఒకటి ఉండదుగాని నిజమయిన చారిత్రక సిద్ధాంతం ఉంటుంది. మార్క్సిజం దానిని చారిత్రక భౌతికవాదం అంటుంది. సామాజిక నిర్మాణంలోని సంఘర్షణలు చరిత్రను నడుపుతాయి. సామాజిక నిర్మాణానికి పునాది ఉత్పత్తి రంగం కాబట్టి చరిత్రను నడిపే సంఘర్షణలు సాధారణంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వర్గసంఘర్షణలు అయి ఉంటాయి. వ్యక్తుల ఆశలూ, ఆశయాలయినా సామర్థ్యం అసమర్థతలయినా ఈ సంఘర్షణ నేపథ్యంలోనే అర్థవంతమవుతాయి. అంతేతప్ప వీటిని చరిత్ర చోదక శక్తులుగా భావించడం తప్పు. మార్క్సిస్టు చరిత్ర రచన ఈ చారిత్రక సిద్ధాంతం వెలుగులో విషయ సేకరణ చేస్తుంది. రాజుల వ్యక్తిత్వాల గురించి కాక సామాజిక నిర్మాణంలోని వైరుధ్యాల గురించి, వాటి నుండి పుట్టే సంఘర్షణల గురించి సమాచారాన్ని సేకరిస్తుంది. అయితే విభిన్న

సమాజాలకు ఈ చారిత్రక సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా అన్వయింప జేసినప్పుడే దాని అర్థం కూడా పూర్తిగా అవగతం కాగలదు – చారిత్రక భౌతికవాదం అనేది చారిత్రక సిద్ధాంతం మూల సూత్రాలను మాత్రమే అందించగలదు. అన్వయంలోనే దాని వివరణ పూర్తిగా అర్థం అవుతుంది. ఆ అన్వయానికి ప్రేరణ నిష్పాక్షికమయిన విషయ సేకరణ నుండి రాదు; సమకాలిక సామాజిక సంఘర్షణల నుండి, భవిష్యత్తును గురించి అవి ఆవిష్కరించే ఆదర్శాల నుండి వస్తుంది. ఉదాహరణకు భారతదేశ చరిత్రను రైతాంగ పోరాటాల దృష్టితో చూడాలనే ఆలోచన నక్సల్బరీతో ప్రారంభమయిన రైతాంగ పోరాటాలతోనే వచ్చింది. అంతవరకు చరిత్ర పరిశోధనలో రైతాంగ పోరాటాల గురించి పట్టించుకున్న వాళ్లు లేకపోలేదు గాని, ఒక పోకడగా మాత్రం ఈ దశలోనే ప్రారంభం అయింది. ఈ మధ్యకాలంలో స్త్రీల హక్కుల గురించి పట్టింపు పెరుగుతున్న కారణంగా బహుశా పురుష సామ్య సామాజిక వ్యవస్థ నుండి పుట్టే అణచివేత, సంఘర్షణల దృష్టితో చరిత్రను చూసే అలవాటు ఇక మీదట పెరగవచ్చును. అప్పుడు ఇంతవరకు ఎవరికీ అందని 'విషయాలు' వెలుగులోకి రావచ్చును. అదే విధంగా కాంగ్రెస్ నుండి కమ్యూనిస్టు పార్టీల దాకా అన్ని రాజకీయ పక్షాలూ రాజకీయంగా విఫలమయ్యాయన్న అభిప్రాయం ఈ మధ్యకాలంలో బలపడడంతో గతకాలపు ఉద్యమాలలో గూడా నాయకుల ఊహలూ ఎత్తుగడలూ నిర్మాణ దక్షతా కాక ప్రజలు ఎందుకు పాల్గొన్నారు, ఏ విధంగా నిర్మాణంలోకి వచ్చారు అనే విషయాలు పరిశోధకులను ఆకర్షిస్తున్నాయి. దీనితో గూడ సంతాల్ నుండి వర్లీ దాకా అన్ని రైతాంగ, గిరిజన పోరాటాల గురించి కొత్త విషయాలు చాలా తెలుస్తున్నాయి. వర్తమాన సామాజిక సంఘర్షణలో ఈ ఉద్యమాలూ పోరాటాలూ వైఫల్యాలూ ముందుకు రాకపోతే గతానికి సంబంధించిన ఆ 'విషయాలు' ఎప్పటికీ మరుగున ఉండిపోయేవేమో!

ఈ చారిత్రక సిద్ధాంతాన్ని చరిత్ర రచనలో అన్వయింప జేసేటప్పుడు ఒక పొరపాటు తరచుగా జరుగుతుంటుంది. ఒక చారిత్రక దశలో ఉత్పత్తి రంగం స్వభావం ఏ విధంగా ఉండింది, దాని ఫలితంగా సామాజిక నిర్మాణంలో ఎటువంటి వైరుధ్యాలు ఉన్నాయి, అవి ఎటువంటి సంఘర్షణలకు దారితీశాయి, అవి పరిశోధించడం పోయి చరిత్రలో ఏయే దశలు, ఏయే వైరుధ్యాలు, ఏయే సంఘర్షణలు ఉండాలో ముందే నిర్ణయించి ఒక మూస తయారు చేసి ఆ మూసలోకి చరిత్రను బలవంతంగా నెట్టే ప్రయత్నం చేయవచ్చు. మార్క్సిజాన్ని ఆమోదించిన చరిత్రకారులు మొదట్లో ఈ పనిచేశారు కూడ. అయితే కోశాంబి రచనల ఫలితంగా ఈ మూస రచనా పద్ధతి నుండి భారతదేశంలో మార్క్సిస్టు చరిత్ర రచన విముక్తమయింది. వేరే అన్ని పరిశోధనా రంగాల కంటే చరిత్ర రచనలో మార్క్సిస్టులు ఇవ్వాళ మన దేశంలో బలమయిన స్థానాన్ని సంపాదించుకున్నారు.

*(**సమీక్ష** ప్రారంభ సంచిక, మే 1987 నుంచి)* వీ

(...29వ పేజీ తరువాయి)

గురవుతూనే ఉన్నారు. పేద ప్రజలకు అడవులు, భూమి, నీళ్లు, పచ్చిక బయళ్లు, చెరువులు, ఉమ్మడి వనరులపై ఉన్న పరిమిత, కొద్దిపాటి హక్కులు కూడా రద్దయిపోతున్నాయి. ప్రభుత్వం ఒక విధానంగా తీసుకు వస్తున్న ప్రత్యేక ఆర్థిక మండలాలు, మైనింగ్ ప్రాజెక్టులు, పారిశ్రామికాభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదలైనవన్నీ వారిని బతుకు నుంచి దూరం చేస్తున్నాయి. బడా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చడంలో భాగంగానే ఖనిజ సంపదలతో నిండిన అడవులు, భూములు, నీళ్లు ఉన్న ప్రాంతాలలోనే మిలిటరీ దాడులకు వ్యూహాలు రూపొందిస్తున్నారు. నిస్సహాయతలో విస్థాపనకు గురవుతున్న స్థానిక ప్రజలు ప్రతిఘటిస్తున్నా, తమ నేల కోసం పోరాడుతున్నా ప్రభుత్వ అండదండలతో కార్పొరేట్ కంపెనీలు ఈ ప్రాంతాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి. ప్రజా పోరాటాలను అణచివేయడానికి మాత్రమే ఈ చర్య దోహదపడుతుందని మేం ఆందోళన చెందుతున్నాం. ఈ రకమైన చర్యలు సామాజిక అంతరాలను పెంచి, వెనుకబాటును కొనసాగించి, వ్యవస్థీకృత హింసను పెంచేదిగానే ఉంటుంది.

శాంతియుత పద్ధతుల్లో తమ నిరసనను తెలుపుతున్న పేద ప్రజానీకం, అణగారిన ప్రజలు ఈ హక్కుల హననానికి వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసే క్రమం మరింత అశాంతికి లోనయి ఉద్రిక్త రాజకీయ హింసకు దారితీస్తుంది. సమస్యల పరిష్కారం కోసం ఆ సమస్యల సామాజిక మూలాల్లోకి చూడకుండా మిలిటరీ దాడికి పూనుకోవడం పరిస్థితిని మరింత జటిలం చేస్తుంది. ప్రభుత్వ వైఖరి పేదరికాన్ని నిర్మూలించడం కాకుండా పేదలను నిర్మూలించేదిగా కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా వారిని తీవ్రమైన దాస్యంలోకి నెట్టే ఇటువంటి చర్యలు ప్రజాస్వామిక స్ఫూర్తికి విఘాతం. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి అణచివేతల అనుభవాల నుంచి పాఠాలు తీసుకుంటే మిలిటరీ చర్యలతో స్వల్ప కాలికమైన విజయం కూడా దక్కకపోగా ప్రజలు తీవ్రమైన కష్టాల పాలయ్యారు.

భారత ప్రభుత్వాన్ని ఈ ప్రాంతాల నుండి వెంటనే తన సైన్యాలను ఉపసంహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఇటువంటి మిలిటరీ చర్యలు అంతర్యుద్ధానికి దారితీస్తాయనీ, పేదలు, అణగారిన వర్గాల కష్టాలు పెరిగి, బడావ్యాపారులు, కార్పొరేట్ కంపెనీలు వారి వనరులను దోచుకు పోవడానికే ఈ చర్యలు ఉపయోగపడతాయనీ తెలియజేస్తున్నాం.

ఈ సందర్భంగా ప్రజాస్వామిక ఆకాంక్ష కలిగిన మేధావులందరినీ కూడా ఈ చర్యలను ఖండించమని కోరుతున్నాం అంటూ ఒక ప్రకటనలో అరుంధతీ రాయ్, అమిత్ భాదురి, సందీప్ పాండే, కొలిన్ గొన్‌సాల్వేజ్, దీపాంకర్ భట్టాచార్య, సుమంత బెనర్జీ, మహమూద్ మమ్దానీ, మీరా నాయర్, ఆభా సుర్, జ్ఞానేంద్ర పాండే, నోమ్ చామ్‌స్కీ, డేవిడ్ హార్వే, మైఖెల్ లెబోవిట్జ్, జాన్ బెలామి ఫోస్టర్, జేమ్స్ సి స్కాట్ వంటి ప్రముఖులతో పాటు మొత్తం 137 మంది ప్రజాస్వామిక వాదులు ఈ లేఖలో విజ్ఞప్తి చేశారు.

(తెలుగు అనువాదం : **డి.వి. రామకృష్ణా రావు**) వీ

మణిపూర్ మహిళల ప్రతిఘటన

జూలై 23న జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మణిపూర్‌లోని క్యాంగెయి పట్టణంలో అక్టోబర్ 4న మహిళలు భారీ సంఖ్యలో టార్చ్‌లైట్ ప్రదర్శన నిర్వహించారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లకు బాధ్యత వహిస్తూ మణిపూర్ ముఖ్యమంత్రి ఒక్రం ఇబొబి రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసు బలగాలు వారిని మణిపూర్ యూనివర్సిటీ గేట్ దగ్గర నిర్బంధించాయి. మణిపూర్‌లో కాంగ్రెస్ మద్దతుతో వచ్చిన ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు, రాజకీయ హత్యలు చేయిస్తోందనీ, ఆందోళన నిర్వహిస్తున్న అపున్బ లుప్ అనే సంస్థ తెలిపింది.

చర్చలకు సిద్ధం

కాశ్మీర్ సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు ఏ రాజకీయ అభిప్రాయాలు ఉన్నవారితోనైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర హోంశాఖ మంత్రి పి.చిదంబరం చెప్పారు. ఈ చర్చలు సార్వజనీనంగా ఉంటాయని చెప్పారు. కాశ్మీర్‌ను రాజకీయ సమస్యగా పేర్కొన్న హురియత్ దీనిని చర్చల ద్వారానే పరిష్కరించాల్సి ఉందని, చర్చలకు సానుకూలంగా స్పందించింది. ఈ చర్చలు నిర్మాణాత్మక పద్ధతిలో సాగుతాయన్న ఆశాభావాన్ని హురియత్ నేత మిర్వాయిజ్ ఒమర్ ఫరూఖ్ చెప్పారు. నేషనల్ కాన్ఫరెన్స్, పి.డి.పి., కాంగ్రెస్ వంటి పార్టీలతో పాటు చిన్న పార్టీలతోనూ చర్చలు జరుపుతామని తెలిపారు.

మావోయిస్టు నేతల అరెస్ట్

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కోబడ్ గాంధీ(63)ని ఢిల్లీ పోలీసులు సెప్టెంబర్ 21న అరెస్ట్ చేశారు. 22న ఢిల్లీ తీస్ హజారీ కోర్టులో చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్‌ను అక్టోబర్ 6 వరకు పొడిగించారు. కోర్టు ఆదేశాల మేరకు గాంధీని తీహార్ జైలుకు తరలించారు. మావోయిస్ట్ పార్టీ కేంద్ర నాయకత్వంలో వచ్చే పత్రికలు అత్యధికకాలం ఆయన సంపాదకత్వంలోనే వచ్చాయని, విప్లవ మేధావిగా, సిద్ధాంతకర్తగా దేశంలోనే గాక విదేశాలలోని ఉద్యమ సంస్థలతో సంబంధాలను నెరిపారని తెలుస్తోంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎన్. రవిశర్మ, ఆయన సహచరి బి. అనురాధలను అక్టోబర్ 14న అరెస్టు చేసినట్లు జార్ఖండ్ పోలీసులు ధృవీకరించారు.

భారతీయుల్లో రెండే జాతులు

భారత ప్రజల చారిత్రక మూలాలను ఆధునిక జన్యు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో శోధించే విధానంపై భారత్-అమెరికా శాస్త్రవేత్తలు గత పదేళ్లుగా పరిశోధనలు జరుపుతున్నారు. సి.సి.ఎం.బి. హైదరాబాద్ నేతృత్వంలో జరుగుతున్న ఈ పరిశోధనల్లో అమెరికాలోని హార్వర్డ్ ఇన్‌స్టిట్యూట్, మాంచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు పాలుపంచుకున్నారు. ఆ పరిశోధన వివరాలను శాస్త్రవేత్తలు లాల్జీ సింగ్, కుమారసామి తంగరాజులు సెప్టెంబర్ 24న మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆర్యులు, ద్రావిడులు ఒకే సంతతికి చెందిన వారని, కొందరు ప్రాచీనులు వ్యవసాయం బాధ్యతలు తీసుకున్నారని, మిగిలినవారు సహాయకులుగా మిగిలిపోయారని, వ్యవసాయంలోకి రానివారు గిరిజనులుగా మిగిలిపోయారని, వ్యవసాయ ఆధారంగానే కులాలు ఏర్పడి ఉంటాయని' ఇలా పలు అంశాలపై తమ విశ్లేషణలు అందించారు.

బాణాసంచా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

తమిళనాడు పళ్లిపట్టులోని ఆనంద్‌కుమార్ ఫైర్‌వర్క్స్ టపాకాయల గోడౌన్‌లో అక్టోబర్ 16న అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో ముప్పై రెండు మంది చనిపోయారు. అధికారుల నిర్లక్ష్యం, అవినీతితో అనుమతులు లేని గోడౌన్‌లో భారీగా టపాకాయల నిల్వలు ఉంచారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి టపాకాయలు తక్కువ ధరకు దొరుకుతాయని జనం అధికసంఖ్యలో వచ్చారు. అక్టోబర్ 16న సాయంత్రం ఏడుగంటల సమయంలో గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. గోడౌన్ లోపలున్న జనం టపాకాయలు తీసుకొని పారిపోతారని నిర్వాహకులు గోడౌన్‌కున్న ఒకే ఒక్క దారినీ మూసేశారు. దీంతో మంటలు అంటుకొని 32 మంది సజీవ దహనమయ్యారు.

ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె

గురుగావ్‌లో ఆటోమొబైల్ విడిభాగాల తయారీ ఫ్యాక్టరీ రికోలో గత నెల రోజులుగా నడుస్తున్న కార్మికుల సమ్మెలో కార్మికుల మధ్య ఘర్షణ చెలరేగింది. సమ్మె చేస్తున్న వారు దాన్ని వ్యతిరేకిస్తున్న వారి మధ్య ఈ ఘర్షణలో ఒకరు మృతిచెందారు. దీంతో అది సామూహిక సమ్మెకు దారి తీసింది. హర్యానాలోని సుమారు 60 ఫ్యాక్టరీలకు చెందిన లక్ష మంది కార్మికులు అక్టోబర్ 20న తమ తమ ఫ్యాక్టరీల ముందు బైఠాయింపు సమ్మె చేసి 8వ నెంబర్ జాతీయ రహదారిలో రాకపోకలను స్తంభింపజేశారు.

గిరిజన నేత ఛత్రధర్ మహతో అరెస్ట్

గిరిజన నేత ఛత్రధర్ మహతోను సెప్టెంబర్ 26న పోలీసులు అరెస్టు చేశారు. ఇంటర్వ్యూ కావాలంటూ పాత్రికేయులుగా వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందం అరెస్ట్ చేసింది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని లాల్‌గఢ్ ప్రాంతంలో పోలీసు అత్యాచారాలపై ఏర్పడిన ప్రజా సంఘం (పీపుల్స్ కమిటీ అగెనెస్ట్ పోలీస్ అట్రాసిటీస్ - పిసిఎపిఎ) పేరుతో ఉద్యమిస్తున్న గిరిజనులకు ఛత్రధర్ మహతో నేతృత్వం వహిస్తున్నారు.

కర్నాటకలో వరద

కర్ణాటకలో అక్టోబర్ 1,2 తేదీల్లో కురిసిన వర్షాలతో కృష్ణా, తుంగభద్రల వరద నీరు కొన్ని వేల మంది నిరాశ్రయులను చేసింది. వరద తాకిడి వల్ల వంద మందికి పైగా మృతి చెందారు. మరో 30 మంది జాడ తెలియలేదు. రాయచూరు, బాగల్‌కోట్, బళ్లారి, బీజాపూర్, గుల్బర్గా, గదర్, బీదర్, కొప్పళ్ జిల్లాల్లో ప్రాణనష్టం సంభవించింది. సుమారు 59 వేల ఇళ్లు నేలకూలాయి. ఒక్క బీజాపూర్ జిల్లాలోనే 30 మంది మరణించారు. వీ

చైనా విముక్తికి 60 ఏళ్లు

జన చైనా విముక్తి పొంది 1 అక్టోబర్ 2009 నాటికి అరవై ఏళ్లు నిండాయి. బీజింగ్‌లోని తియనాన్మెన్ స్క్వేర్ వద్ద వేడుకలు జరుపుకుంది. ఈ సందర్భంగా చైనాలో సంస్కరణలు కొనసాగిస్తామంటూనే, సామ్యవాదమే చైనాకు రక్ష అని చైనా అధ్యక్షుడు హు జింటావో పునరుద్ఘాటించారు. సంస్కరణల బాట పట్టిన తర్వాత 1978 నుంచి చైనా ఆర్థిక శక్తిగా గణనీయంగా బలపడింది. వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక రంగం, అక్షరాస్యతలో ఎంతో పరిణతి చెందింది. ఈ ఆరు దశాబ్దాలలో చైనా ఎంతో పురోగతి సాధించి, ప్రపంచంలోనే తృతీయశక్తిగా ఎదిగింది.

మానవాభివృద్ధి సూచి

యూనైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యు.ఎన్.డి.పి.) 2007-08 సంవత్సరానికి తయారు చేసిన మానవాభివృద్ధి సూచిలో భారతదేశం 134వ స్థానంలో ఉంది. ఈ సూచిలో మొత్తం 182 దేశాలు ఉన్నాయి. చైనా తరువాత ఆర్థికంగా ఎదుగుతున్న భారతదేశం సామాన్య ప్రజలకు కనీస అవసరాలు కూడా సమకూర్చలేకపోతోంది. పేదరికం, అక్షరాస్యత, లింగ ప్రాతిపదికన ఈ సూచి తయారు చేస్తుంది. ఈ సూచిలో నార్వే అగ్రస్థానంలో ఉంది. అమెరికా 13, బ్రిటన్ 21, జర్మనీ 22వ స్థానాలలో ఉన్నాయి. భారత పొరుగు దేశాలయిన చైనా 92, శ్రీలంక 102, పాకిస్తాన్ 141 స్థానాలలో ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం ప్రపంచంలోని 6.7 బిలియన్ జనాభాలో ఒక బిలియన్ జనాభా వలస పోతున్నారనీ, అందులో సగం వరకు మహిళలు ఉన్నారనీ తెలిపింది.

ఆకలి కేకలు

ప్రపంచంలో ఆకలితో అలమటించే వారు విపరీతంగా పెరిగిపోతున్నారు. 102 కోట్ల మందికి పైగా ఆకలితో విలవిలలాడుతున్నారు. వీరిలో వర్ధమాన దేశాల ప్రజలే అధికంగా ఉన్నారని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ.) తన 'వార్షిక ఆకలి నివేదిక - 2009'లో పేర్కొంది. తీవ్రమైన ఆహార కొరతకు ప్రపంచ ఆర్థిక సంక్షోభం తోడవడంతో వివిధ దేశాలనుంచి అందే ఆహార సహాయం బాగా తగ్గిపోయిందని తెలిపింది. అత్యధిక సంపన్న దేశమైన అమెరికాలోనూ 1.5 కోట్ల మంది పస్తులుంటున్నారని తెలిపింది. అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఎఫ్.ఎ.ఒ. ఈ నివేదికను విడుదల చేసింది.

ప్రపంచంలో ముస్లిం జనాభా

ప్రపంచంలో ముస్లిం జనాభా 157 కోట్లకు చేరిందని ది ప్యూ ఫోరం ఆన్ రెలిజియన్ అండ్ పబ్లిక్ లైఫ్ అనే సంస్థ జరిపిన ఒక సర్వేలో తేలింది. ఈ సర్వే ప్రకారం ముస్లిం దేశమైన లెబనాన్‌లో కంటే కూడా జర్మనీలోనే ఎక్కువ మంది ముస్లింలు ఉన్నారనీ, అలాగే సిరియాలో కంటే చైనాలో ఎక్కువ మంది ముస్లింలు ఉన్నారనీ తెలిపింది. ప్రపంచంలో అత్యధిక జనాభాను కలిగిన మతం క్రైస్తవ మతం. సుమారు 210 నుంచి 220 కోట్ల మంది ఈ మతాన్ని అనుసరిస్తున్నారు. దాని తర్వాత ఇస్లాం మతం రెండోస్థానంలో ఉంది. మొత్తం ముస్లింలలో 60 శాతం మంది ఆసియాలోనే ఉన్నారని నివేదిక తెలిపింది. ముస్లింలను మైనారిటీలుగా పరిగణిస్తున్న ఐదు దేశాల్లో (భారత్, ఇథియోపియా, చైనా, రష్యా, టాంజానియాలో) ప్రపంచ ముస్లింలలో మూడవ వంతు మంది ఉన్నారని తెలిపింది.

ఇండోనేషియాలో భారీ భూకంపం

ఇండోనేషియాలో సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీలలో సంభవించిన భూకంపంలో పదకొండు వందల మందికి పైగా మృతి చెందారు. రెండు వేలమందికి పైగా గాయపడ్డారు. సమత్రా దీవిలోని పడాంగ్ నగరానికి సమీపంలో సముద్ర గర్భాన సెప్టెంబర్ 30న సంభవించిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 7.6 గా నమోదయింది. మరోమారు అక్టోబర్ 1న మళ్లీ సంభవించిన భూకంపం 6.8గా నమోదయింది. కొండ చరియలు విరిగి పడి గ్రామాలకు గ్రామాలే భూస్థాపితం అయ్యాయి. ప్రాణనష్టం, ఆస్తి నష్టం భారీగా సంభవించింది. దాదాపు వెయ్యి మందికి పైగా మరణించారు.

రామకృష్ణన్‌కు నోబెల్ పురస్కారం

అమెరికాలో స్థిరపడ్డ భారతీయ శాస్త్రవేత్త వెంకటరామన్ రామకృష్ణన్‌కు ఈ ఏడాది రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఇజ్రాయిలీ శాస్త్రవేత్త అడా ఈ యోనాత్, అమెరికా శాస్త్రవేత్త థామ్ ఈ స్టీట్జ్‌లతో కలిసి ఆయన ఈ బహుమతికి ఎంపికయ్యారు. రామకృష్ణన్ తమిళనాడులోని చిదంబరంలో 1952లో జన్మించారు. రైబోజోమ్ నిర్మాణం, పనితీరుపై జరిపిన పరిశోధనలకు గుర్తింపుగా నోబెల్ అకాడమీ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలకు బహుమతి ప్రకటించింది.

పాకిస్తాన్‌లో పేలుళ్లు

పాకిస్తాన్‌లోని ముఖ్య పట్టణాలు బాంబు పేలుళ్లు, ఆత్మాహుతి దాడులతో భీతిల్లిపోయ్యాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లలో తాలిబన్ దళాలు భారీ బాంబుదాడులకు పాల్పడుతున్నాయి. ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. బస్సులలో, ప్రభుత్వ కార్యాలయాలపై, పోలీసు స్టేషన్‌లపై, సైనికస్థావరాలపై, హోటళ్లపై దాడులతో పాకిస్తాన్‌లో భయానక యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. తాలిబన్‌లపై పాకిస్తాన్ సైనికులు జరుపుతున్న అణచివేతలకు నిరసనగా ఈ దాడులు జరుపుతున్నామని తాలిబన్ నేతలు హెచ్చరిస్తున్నారు. ఈ దాడులలో దాదాపు వందమందికి పైగా చనిపోయారు. ఇందులో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు.

ఫిలిప్పీన్స్‌లో తుపాను

ఫిలిప్పీన్స్‌లో తుపాను బీభత్సం సృష్టించింది. సెప్టెంబర్ నెలాఖరులో, అక్టోబర్ మొదటివారంలో వచ్చిన 'కెత్సెనా', 'పర్మా' తుపానులు ఫిలిప్పీన్స్‌ని అతలాకుతలం చేసాయి. 200 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న పెనుగాలులతో చాలాచోట్ల భారీ వృక్షాలు, ఇళ్లు కూలిపోయాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 సెప్టెంబర్ 2009 నుండి 20 అక్టోబర్ 2009 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1650)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	15	–	18	28	9	9	5	2	5	4	–	1	5	19	36	–	–	–	3	4
హైదరాబాద్	–	–	–	6	10	–	1	–	3	4	10	11	1	–	27	15	–	–	–	5	–
కరీంనగర్	3	14	1	29	55	28	52	14	1	8	8	4	33	11	33	30	–	2	–	5	10
ఖమ్మం	–	6	–	10	8	9	16	16	–	1	10	3	2	3	29	9	–	1	–	–	1
మెదక్		వివరాలు అందలేదు																			
నిజామాబాద్	–	2	–	14	21	4	2	7	–	1	2	2	–	1	10	18	–	–	–	–	–
రంగారెడ్డి		వివరాలు అందలేదు																			
వరంగల్	–	4	–	13	10	21	25	11	8	7	2	8	–	6	15	12	–	–	–	–	1
అనంతపురం		వివరాలు అందలేదు																			
చిత్తూరు	–	1	–	1	5	9	8	–	–	3	8	–	6	–	31	–	–	–	–	–	–
కడప	–	5	–	–	20	–	3	–	–	8	–	3	6	–	20	10	–	–	–	–	–
కర్నూలు	–	6	–	16	20	5	5	3	2	8	2	3	5	7	19	36	–	–	–	6	50
తూర్పు గోదావరి		వివరాలు అందలేదు																			
గుంటూరు	–	2	–	6	12	1	2	1	–	1	6	5	–	8	24	19	–	–	–	5	–
కృష్ణా	–	4	–	12	4	6	2	3	–	–	3	9	2	4	25	6	–	–	–	–	18
ప్రకాశం	–	1	–	6	8	1	3	–	1	7	–	–	7	5	17	10	–	–	–	–	–
శ్రీకాకుళం	–	2	1	4	3	3	5	–	1	–	3	3	–	1	12	3	–	–	–	–	2
విశాఖపట్నం		వివరాలు అందలేదు																			
విజయనగరం	–	2	–	3	9	–	2	–	–	–	2	1	2	4	25	13	–	–	–	–	–
మొత్తం	**3**	**64**	**2**	**138**	**213**	**96**	**135**	**60**	**18**	**53**	**60**	**52**	**65**	**55**	**306**	**217**	**–**	**3**	**–**	**24**	**86**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – ఎం. ఆదిశేషయ్య; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; ప్రకాశం – కె. మల్లికార్జున్; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. రమణ; విజయనగరం – డి. సుధాకర్

వీక్షణం మీరు చదువుతున్నారా?వెంటనే చందాదారులు కండి !
మీరు చందాదారులేనా? కనీసం మరొకరి చందా చేర్పించండి!

మీ గ్రంథాలయానికి, కార్యాలయానికి, మీకు తెలిసిన ప్రజాసంఘాలకు
వీక్షణం ను పరిచయం చేయండి, వీక్షణం మీ పత్రిక, ప్రజల పత్రిక
నాలుగు కాలాలు నడిచేలా చూసే బాధ్యత మీదే

మీరు తప్పనిసరిగా తెలుసుకోవలసిన సమస్త సామాజిక, రాజకీయార్థిక
విషయాలను సమగ్రంగా, స్పష్టంగా వివరిస్తాయి **వీక్షణం** వ్యాసాలు

విడి ప్రతి కేవలం రు.10 మాత్రమే

చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
మూడు సంవత్సరాల చందా	రు. 350
ఐదు సంవత్సరాల చందా	రు. 550
పది సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

Veekshanam Telugu Monthly Journal of Political Economy and Society - 100 - November 2009
• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/10/2009 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao